సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22+4 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 5

శుక్రవారం 28-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



ఆఫీసులో అమ్మ... ఇంట్లో బిడ్డ

ఇటీవల కాలంలో ఉద్యోగం చేసే అమ్మల శాతం పెరుగుతోంది. అదే సమయంలో పిల్లల పెంపకం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకుంటున్నామా అనే ఆందోళనా పెరుగుతోంది. కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను నేటి తల్లులు ఎలా సమతుల్యతను సాధించాలో నిపుణులు సూచిస్తున్నారు.

– ఫ్యామిలీలో



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22+4 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 5

శుక్రవారం 28-3-2025

డిజిటల్ లోయల్లో టీనేజ్ పిల్లలు



తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతుంటారు. పిల్లలు చదువులతో కష్టపడాలి వాస్తవంగా. కాని వారికి సోషల్ మీడియాలోని చెత్తా చెదారం, తప్పుడు సమాచారం, ఉద్రిక్త ఆకర్షణలు, హింసాత్మక భావజాలాలు... ఇవి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. ఇటీవల వచ్చిన 'అడోలసెన్స్' వెబ్‌సిరీస్ మీద సర్వత్రా చర్చ జరుగుతున్నది. ఇది హెచ్చరిక అంటున్నారు. ఈ సిరీస్ మనల్ని ఎలా నిద్ర లేపుతున్నది?

- ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


Godrej
Jersey
గట్టి పెరుగు
100% గృహిణులు అంగీకరించారు
తాజా పాల నుండి తయారుచేయబడినది
Godrej
Jersey
CURD
Everyday thick & tasty curd
మరిన్ని వివరాల కొరకు అసలైన ప్యాక్‌ని రిఫర్ చేయుండి. | సృజనాత్మక చిత్రీకరణ. ఉత్పాదన స్వభావం కారణంగా అసలైన ఉత్పాదన వేరేగా ఉండవచ్చును. | కాపీరైట్© మరియు అన్ని హక్కులు క్రీమ్‌లైన్ డైరీ ప్రొడక్ట్స్ లిమిటెడ్ 2025 ద్వారా అరక్షణ చేసుకోబడ్డాయి.
లిమిటెడ్ 2025 ద్వారా అరక్షణ చేసుకోబడ్డాయి. | హైదరాబాద్ లోని100% గృహిణులు ఇలా అన్నారు- గోద్రెజ్ జెర్సీ పెరుగు గట్టి పెరుగు అని, ఒక బాహ్య ఏజెన్సీ ద్వారా -100 ఇళ్ళ నమూనా సైజుతో వివిధ్న ప్రాంతాల నుండి మరియు
సామాజిక-ఆర్థిక వర్గాల నుండి సేకరించబడిన ప్రతిస్పందనలపై ఆధారపడి ఈ విషయం తెలియజేయబడుతున్నది.

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22+4 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 5

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



మరో టారిఫ్ బాంబు

తమ దేశంలోకి దిగుమతి అయ్యే అన్ని రకాల కార్లపైనా సుంకాలను 25 శాతానికి పెంచేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు.

వివరాలు 6లో ▸



పుతిన్ త్వరలోనే చనిపోతారు

రష్యా అధ్యక్షుడు పుతిన్ తొందరలోనే చనిపోతారంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన ప్రకటన చేశారు.

వివరాలు 6లో ▸



పరిమితులు మించి అప్పులు.. అనుమతులు లేని ఖర్చులు

- జీఎస్‌డీపీ పరిమితిని మించిన ద్రవ్యలోటు..నికర అప్పులు
- నికర అప్పులు మంచిది కాదు. 100 శాతం రిస్క్
- ఎలాంటి అనుమతులు లేకుండా రూ.19 వేల కోట్లకు పైగా ఖర్చు
- జీఎస్‌డీపీ వృద్ధికి తగినట్టు మూలధన వ్యయం జరగలేదు
- ఏడాదిలో 145 రోజులు ఓడీ.. 176 రోజులు వేస్ అండ్ మీన్స్‌కు
- 2023–24 ఆర్థిక సంవత్సరం రాబడులు, ఖర్చులపై కాగ్ నివేదిక
- అసెంబ్లీ ముందుంచిన డిప్యూటీ సీఎం భట్టి

7లో

ఢీ అంటే ఢీ

మేం కక్ష పూరితంగా వ్యవహరిస్తే కేసీఆర్ కుటుంబం అసెంబ్లీలో కాదు.. జైల్లో ఉండేది

మీ ప్రభుత్వం కన్నా మెరుగ్గా రుణమాఫీ చేసి చూపించాం



మీరు ఏం చేయాలని అనుకుంటున్నారో చేసుకోండి ఏం ఫరక్ పడదు

100% రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా



అసెంబ్లీలో సీఎం రేవంత్, కేటీఆర్ మధ్య మాటల తూటాలు

ఆరోపణలు.. ప్రత్యారోపణలు.. సవాళ్లు..ప్రతి సవాళ్లు

ద్రవ్య వినిమయ బిల్లుపై అట్టుడికిన అసెంబ్లీ

సాక్షి, హైదరాబాద్: ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీ రామారావు మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. సవాళ్లు, ప్రతిసవాళ్లు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, వ్యక్తిగత విమర్శలతో గురువారం శాసనసభ అట్టుడికింది. బిల్లుపై చర్చ ప్రారంభంలో కేటీఆర్ మాట్లాడుతూ తొలుత కేంద్రంపై ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ సర్కారు ఏ ఒక్క ఎన్నికల హామీ నిలబెట్టుకోలేదని, కక్షపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ వైఖరి వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఈ దశలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని కేటీఆర్ విమర్శలను తిప్పికొట్టారు. 'మేం కక్ష పూరితంగా వ్యవహరిస్తే కేసీఆర్ కుటుంబం అసెంబ్లీలో కాదు.. జైల్లో ఉండేది' అని సీఎం అంటే..

మిగతా 2వ పేజీలో ▶

జనాభా ఆధారంగా డీలిమిటేషన్ వద్దు


- ఆ విధానంతో దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం
- సీట్ల సంఖ్య పెంచకుండానే పునర్విభజన చేయాలి
- ఇందిర, వాజ్‌పేయి విధానాన్ని అనుసరించాలి
- కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర శాసనసభ విజ్ఞప్తి
- అసెంబ్లీలో సీఎం తీర్మానం.. ఏకగ్రీవంగా ఆమోదం
- తెలంగాణ, ఏపీలో అసెంబ్లీ సీట్లు ఎందుకు పెంచరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

8లో

క్లుప్తంగా...

ఎమ్మెల్యేల హక్కులు కాపాడతా..

స్పీకర్ ప్రసాద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల హక్కులను కాపాడేందుకు తప్పకుండా కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చారు. దేవాదుల మూడో దశ ప్రారంభోత్సవానికి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధికారులు ఆహ్వానించలేదని గురువారం అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలకు ఆదేశించాలని వినతి పత్రం సమర్పించారు. దేవాదుల ఆయకట్టులో 40 శాతం తన నియోజకవర్గంలోనే ఉన్నా ఆహ్వానించలేదని పల్లా రాజేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు.

వైఎస్సార్ మహనీయుడు: అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: మైనారిటీ ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇప్పించిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కొనియాడారు. ఉమ్మడి ఏపీలో కళాశాలల్లో చదివే మైనారిటీ ముస్లిం విద్యార్థులకు రూ. 20, రూ. 50, రూ. 100 మాత్రమే స్కాలర్‌షిప్‌లు అందుతున్నాయంటూ నాటి సీఎం వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్తే ఆయన వెంటనే అధికారులను పిలిచి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇచ్చిన విధంగానే మైనారిటీ విద్యార్థులకు కూడా స్కాలర్‌షిప్‌లు ఇప్పించారని గుర్తుచేశారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు మైనారిటీ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చేవారన్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం నాటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేదని.. వాటిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పునరుద్ధరించాలని గురువారం అసెంబ్లీలో కోరారు.

రాష్ట్ర అప్పులపై స్పష్టత ఏదీ?: మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి ఎన్ని అప్పులు ఉన్నాయో కూడా ప్రభుత్వం వద్ద స్పష్టత లేదని.. అప్పులపై రోజుకో లెక్క చెబుతోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి రూ. 8,19,150 కోట్లు అప్పులు ఉన్నాయని చెప్పారని.. అంత అప్పు ఉన్నట్లు ప్రభుత్వం ఇప్పటివరకు చెప్పలేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పులపై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలుకు రూ. 1.32 లక్షల కోట్లు అవసరమని.. అంత మొత్తం ఎక్కడి నుంచి తెస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

హామీలన్నీ అమలు చేయాలి: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో 70 శాతం అమలు చేసిందని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు చెప్పారు. మిగతా 30 శాతం హామీలను కూడా అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకొనే మార్గాలను అన్వేషించాలని, ఇప్పుడు వచ్చే ఆదాయం హామీల అమలుకు సరిపోదన్నారు. ఐఏఎస్ అధికారులు మూడేసి కార్లు వాడుతున్నారని.. ఇలాంటి దుబారా తగ్గించుకోవాలన్నారు. ప్రభుత్వానికి గుదిబండగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టును నిలిపేసి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు.



నేను యాక్సిడెంటల్ పొలిటీషియన్‌ను కాను



సాక్షి, హైదరాబాద్: 'నేను యాక్సిడెంటల్‌గా వచ్చిన రాజకీయ నాయకుడిని కాదు. చాలా ఆలోచించి..అణగారిన వర్గాల కోసం రాజకీయాల్లోకి వచ్చా. ఫ్యూడల్ వ్యవస్థలో భావ దారిద్ర్యం, అణిచివేతలో కూరుకుపోయిన వారిని బయట పడేయాలని, సమసమాజ స్థాపనతోనే అభివృద్ధి జరుగుతుందని, అది చట్టసభల ద్వారానే సాధ్యమని నమ్మి రాజకీయాల్లోకి వచ్చా'అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ద్రవ్య వినిమయ బిల్లుపై గురువారం శాసనసభలో జరిగిన చర్చలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సుదీర్ఘ చర్చలు, ప్రసంగాల అనంతరం శాసనసభతోపాటు శాసన మండలి కూడా ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలిపాయి. అంతకు ముందు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

వ్యక్తిగత స్వార్థం కోసం రాలేదు

ప్రజల జీవన విధానం బాగుపడాలని ఆశించాను. మీలాగా దుర్బుద్ధితో, వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయాల్లోకి రాలేదు. ఈ సమాజంలో కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ పరిష్కారం కాలేదు. ఆ సమస్యను మా సీఎం, యావత్ కేబినెట్ పరిష్కరించింది. బయట చాలా మాట్లాడుతున్నారు అంటూ..వాటిని సభలో ప్రస్తావిస్తున్నారు. మేం మాట్లాడడం మొదలుపెడితే.. మీ కన్నా ఎక్కువ మాట్లాడగలం. గంజాయి రాజు, లిక్కర్ రాణి అని బయట చాలా మాట్లాడుతున్నారు. అవి సభలో మేము మాట్లాడటం సభ్యత కాదు. అలా మాట్లాడే వారిని నేను నిలువరిస్తున్నా. పదేళ్ల ఆర్థికశాఖలో జరిగిన ఆర్థిక విధ్వంసం మొత్తం తవ్వితీస్తా. ఉన్న విషయాలు సభలో రాష్ట్ర ప్రజల ముందు పెట్టి వివరిస్తా.

పదేళ్లలో రూ.70,474 కోట్ల బడ్జెట్ కేటాయింపులు ఖర్చు చేయలేదు

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళ,శిశు సంక్షేమం కోసం వెచ్చించిన బడ్జెట్ కేటాయింపుల నుంచి రూ.70,474 కోట్లు ఖర్చు చేయలేదు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.50 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పి ఏమీ చేయలేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే సంక్షేమం కోసం మొట్టమొదటిసారి రికార్డు స్థాయిలో కేటాయింపులు చేశాం. మూడు లక్షల 4 వేల కోట్ల బడ్జెట్లో 1,44,156 కోట్లు సంక్షేమానికి కేటాయించాం. రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి పోయారు. ఉద్యోగుల బకాయిలు కాకుండా 40 వేల కోట్లు పెండింగ్‌లో పెట్టారు. రూ.1,59,940 లక్షల కోట్ల పనులు మంజూరు చేసి పోయారు. ఉద్యోగులు రిటైర్ అయితే భారం మీపై పడుతుందని వారి ఉద్యోగ విరమణ వయసును మూడు సంవత్సరాలు పెంచారు. మొత్తం బకాయిలు రూ.25వేల కోట్లు ఉంటే, అందులో రూ.16 వేల కోట్లు క్లియర్ చేశాం.

చట్టసభల ద్వారానే సమ సమాజస్థాపన సాధ్యమని రాజకీయాల్లోకి వచ్చా

- గాంజా రాజా, లిక్కర్ రాణి అని అంటుంటే నేనే నిలువరిస్తున్నా..
- ఆర్థికశాఖలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని తవ్వితీస్తా
- ద్రవ్య వినిమయ బిల్లుపై సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ద్రవ్య వినిమయ బిల్లుకు ఉభయసభల ఆమోదం

రూ.లక్ష కోట్ల అప్పును చెల్లిస్తున్నాం

రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చి లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. మీరు తెచ్చిన అప్పులకు పదేళ్ల తర్వాత చెల్లింపులు ప్రారంభం అయ్యాయి. ఆ లక్షల కోట్లు అప్పు, పెండింగ్ బిల్లులు, రీపేమెంట్ భారం మా ప్రభుత్వం పైపడింది. వాటిని చెల్లించే పనిలో ఉన్నాం. నిరుద్యోగుల సమస్యలను అర్థం చేసుకున్న మేము రూ. 6,000 కోట్లతో స్వయం ఉపాధి పథకాలు ప్రవేశపెట్టాం. బ్యాంకు లింకేజీతో కలిపి ఈఏడాది రూ.9,000 కోట్లతో స్వయం ఉపాధి పథకాలు నిరుద్యోగులకు అందించబోతున్నాం. మీరు శాంక్షన్ లెటర్లు ఇస్తే.. రాష్ట్ర బిడ్డల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విదేశాల్లో వారు ఇబ్బందులు పడొద్దని మేము రూ.169 కోట్లు విడుదల చేశాం. ఏడాది ఈ సంఖ్యను మరింత పెంచుతున్నాం'అని భట్టి వివరించారు.

అన్నీ కోతలే: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం హామీలకు, కేటాయించిన నిధులకు కోతలు పెడుతూ తమను విమర్శిస్తుందని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. 'రైతు భరోసాకు రూ.15 వేల కోట్లు కేటాయించి కేవలం రూ.4500 కోట్లు ఖర్చు పెట్టారు. రుణమాఫీకి బడ్జెట్లో రూ.31 వేల కోట్లు ఇస్తామని చెప్పి, రూ.20 వేల కోట్లు మాత్రమే ఇచ్చారు. ఫసల్ బీమాకు రూ.1300 కోట్లు పెట్టామని బడ్జెట్లో చెప్పారు, ఒక్క రూపాయి ఇవ్వలేదు. గత బడ్జెట్లో రూ.23 వేల కోట్లు కోత పెట్టి రైతుల ఉసురు పోసుకున్నారు. ఈ లెక్కన ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు కోత పెడతారన్నమాట. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4 లక్షల 50 వేల ఇళ్లు కడతామని గత బడ్జెట్లో చెప్పారు. రూ.22,500 కోట్లలో ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. దీనిని బట్టి చూస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ. 22,500 కోట్లు నష్టం చేశారు. మైనారిటీలకు రూ.3,000 కోట్ల బడ్జెట్ పెట్టారు..ఇచ్చింది రూ.1100 కోట్లు మాత్రమే. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లో కూడా 60 శాతం మించి ఖర్చు పెట్టలేదు. వానాకాలం ఇవ్వాల్సిన రైతుబంధు రూ. 8 వేల కోట్లు ఎగ్గొట్టారు. యాసంగిలో రూ. 8వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటే రూ.3,500 కోట్లు ఇచ్చారు. అంటే రూ. 12 వేల కోట్ల రూపాయల రైతుభరోసా ఎగ్గొట్టారు.. అవే డబ్బులు రుణమాఫీలో కలిపారు. కాంగ్రెస్ పాలనలో అప్పులు కట్టడానికి రూ. 88,564 కోట్లు ఖర్చు పెట్టామని 7:44 నిమిషాలకు చెప్పారు. ముఖ్యమంత్రి ఇదే విషయమై 3.58 నిమిషాలకు ఇదే అసెంబ్లీలో 1,53,359 కోట్లు అప్పులు, మిత్తీల కింద చెల్లించామని చెప్పారు. అంటే నాలుగు గంటల్లోనే ఎంత మారిపోయింది. సీఎం బురిడీ కొట్టించి కార్పొరేషన్ అప్పులు కూడా కలిపి చెప్పారు' అని హరీశ్ వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్, బీజేపీ అన్యాయంపై అసెంబ్లీలో ఎలుగెత్తాం


తెలంగాణకు బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాన్ని అసెంబ్లీ వేదికగా తాము ఎత్తి చూపగలిగామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం రాత్రి ఆయన మాట్లాడారు. శాసనసభలో కాంగ్రెస్ చేస్తున్న గోబెల్స్ ప్రచారం బట్టబయలైందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక బీఆర్‌ఎస్ పాలనలో అప్పులపై దుష్ప్రచారం చేస్తూ తప్పించుకోవాలని సీఎం రేవంత్ ప్రయత్నించారన్నారు. బడ్జెట్ సమావేశాలను బీఆర్‌ఎస్ అద్భుతంగా ఉపయోగించుకుందని, కాంగ్రెస్ తప్పిదాలు, వైఫల్యాలను ఎండగట్టామన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీశామన్నారు. సుప్రీంకోర్టులో ఉన్న ఫిరాయింపుల అంశాన్ని సీఎం సభలో ప్రస్తావించారని.. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాంగ్రెస్-బీజేపీ నేతల బంధం ఈ సమావేశాల్లో బయటపడిందని.. చెరో 8 ఎంపీ సీట్లు గెలిచినా తెలంగాణకు అన్యాయం చేశాయని మండిపడ్డారు.

ఢీ అంటే ఢీ

▶ మొదటి పేజీ తరువాయి

'మీరు ఏం చేయాలనుకుంటున్నారో చేసుకోండి. ఏం ఫరక్ పడదు' అంటూ కేటీఆర్ స్పందించారు. 'ఏం చేసినా పెద్దాయన (కేసీఆర్) ఆయన సీటు ఇవ్వడు..' అని ముఖ్యమంత్రి అంటే.. 'రేవంత్‌లో అపరిచితుడు ఉన్నాడు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణను బీఆర్‌ఎస్ అప్పుల రాష్ట్రంగా మార్చిందని రేవంత్ విమర్శించారు. ఆ తర్వాత మాట్లాడిన కేటీఆర్ అదే స్థాయిలో సీఎంపై ధ్వజమెత్తారు. పదేళ్ళ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కన్నా మెరుగైన రైతు రుణమాఫీ చేశామన్న రేవంత్ వ్యాఖ్యలను ఖండించారు. ఏ ఊర్లోనైనా రుణమాఫీ వంద శాతం జరిగిందని నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. కేటీఆర్ ప్రసంగానికి అధికార పక్ష సభ్యులు అనేకసార్లు అడ్డుపడ్డారు. దీనిపై ప్రధాన ప్రతిపక్షం అభ్యంతరాలు లేవనెత్తడంతో ఇరు పక్షాల మధ్య వాగ్వాదం చోటు చేసకుంది. కేటీఆర్, సీఎం పరస్పర వ్యక్తిగత, రాజకీయ విమర్శలతో సభ వేడెక్కింది. విపక్షం ఆరోపణలకు సీఎం సుదీర్ఘ వివరణ ఇచ్చారు.

కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు: రేవంత్



'రైతుల రూ.లక్ష లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.16,143 కోట్లే మాఫీ చేసింది. మొదటి ఐదేళ్లల్లో వడ్డీ తీసివేస్తే జరిగిన రుణమాఫీ రూ.13,514 కోట్లు మాత్రమే. రెండోసారి నాలుగేళ్ళల్లో ఒక్క రూపాయి కూడా చేయలేదు. ఆఖరి ఏడాది 21,35,557 మంది రైతులకు రూ.11,909 కోట్లు మాత్రమే మాఫీ చేశారు. కానీ మేం రుణమాఫీ చేసి చూపించాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే రూ.20,616.89 కోట్లు మాఫీ చేశాం. ఎన్నికల నిబంధనతో వారు రైతుబంధు ఇవ్వకపోతే..మేము వచ్చాక ఇచ్చాం. వరి వేస్తే ఉరి అని రైతులకు చెప్పి, కేసీఆర్ కుటుంబసభ్యుల ఫామ్‌హౌస్‌ల్లో పండిన వడ్లను క్వింటాల్‌కు రూ.4,500 చొప్పున కావేరి సీడ్స్‌కు అమ్ముకున్నారు. వారు పదేళ్లలో చేయలేని పనులు మేము చేస్తే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు..' అంటూ రేవంత్ ఫైర్ అయ్యారు.

అప్పుల రాష్ట్రంగా మార్చారు..: 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసింది. 2014 నాటికి 16 మంది ముఖ్యమంత్రులు చేసిన అప్పు రూ.90,160 కోట్లయితే, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రూ. 6,69,257 కోట్లు అప్పు చేశారు. వాళ్ళు పెట్టిన రూ.40,154 కోట్ల బకాయిలు కలిపితే, మొత్తం అప్పు రూ.7,19,151 కోట్లు. మేము అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో రూ.1,58,041 కోట్లు అప్పు చేశాం. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పులకు అసలు, వడ్డీ కలిపి రూ.1,53,359 కోట్లు చెల్లించాం. ఇవి తీసేస్తే మేము చేసిన అప్పు రూ.4,682 కోట్లు మాత్రమే. విపక్షం అబద్ధాల పునాదులపై వెళ్తే లాభం లేదు. ఇప్పటికే కూలిపోయింది. ఇప్పటికైనా మర్యాదగా ఉండాలి..' అని సీఎం ధ్వజమెత్తారు.

ఫామ్‌హౌస్‌ల కోసం ప్రాజెక్టులు కట్టారు..

'బీఆర్‌ఎస్ నేతల ఫామ్‌హౌస్‌ల కోసమే ప్రాజెక్టులు కట్టారు. ప్రతి ప్రాజెక్టు పక్కన వందల ఎకరాలు కొన్నారు. కొండపోచమ్మ నుంచి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు కాల్వలు తీసి నీళ్ళు తీసుకెళ్ళారా లేదా? చెప్పాలి. రంగనాయక సాగర్ దగ్గర హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్ ఉందా లేదా? దీనిపై కాంగ్రెసేతర శాసనసభ్యులతో కమిటీకి సిద్ధమా? మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం కడితే కుప్పకూలిపోతుందని ఇంజనీర్లు చెప్పినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కమిషన్ నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులను జైలుకు పంపుతాం. కాళేశ్వరంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సభ ముందు పెడతాం. కాళేశ్వరం లేకున్నా వ్యవసాయానికి నీళ్ళిచ్చు. లగచర్లలో అధికారులను చంపమని విపక్షం రెచ్చగొట్టింది..' అని సీఎం ఆరోపించారు.

పెద్దాయనకు ప్రమాదం తెచ్చేలా ఉన్నారు..

'పెద్దాయన (కేసీఆర్) సీటు కోసం కుటుంబంలోని ఇద్దరూ ఆశ పడుతున్నారు. కానీ పెద్దమనిషి వదిలేట్లు లేడు. వీపు చింతపండు అవుతుందని పెద్దాయనే చెప్పాడు. పెద్దమనిషి ఉంటేనే బాగుంటుందని మేము అనుకుంటున్నాం. ఆయన వందేళ్ళు ఉండాలని, ప్రతిపక్షంలో ఉంటూ మంచి సలహాలు ఇవ్వాలని కోరుకుంటున్నాం. కానీ వీళ్ళిద్దరూ పోటీ పడి పెద్దాయనకు ప్రమాదం తెచ్చేలా ఉన్నారు. ఆయనకు రక్షణ కల్పించాలి. 'ఈ సందర్భంగా నేపాల్ యువరాజు దీపేంద్ర అధికారం కోసం కుటుంబాన్ని ఏకే 47 తుపాకీతో కాల్చిన ఉదంతాన్ని ప్రస్తావించారు) మీరు జాతిపిత అని చెబుతున్న కేసీఆర్‌ను కామారెడ్డిలో బండకేసి కొట్టారు..' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

ఫామ్‌హౌస్ ఫొటోలు పత్రికలకిచ్చానని కేసులు పెట్టారు

తీవ్రవాదులు, నక్సల్స్ ఉండే డిటెన్షన్ సెల్‌లో ఉంచారు: రేవంత్



సాక్షి, హైదరాబాద్: 'కేటీఆర్ ఫామ్‌హౌస్‌ను ఎవరో డ్రోన్‌తో చిత్రీకరించి నాకు ఫొటోలు ఇస్తే.. నేను వాటిని పత్రికలకు పంపిస్తే అక్రమ కేసులు పెట్టారు. అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. కానీ నేను అప్పుడు పార్లమెంట్ సభ్యుడిని. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నా. నన్ను అరెస్టు చేసి నక్సల్స్, తీవ్రవాదులును నిర్బంధించే డిటెన్షన్ సెల్‌లో ఉంచారు. మరో ఖైదీ కానీ, మరొక వ్యక్తి కానీ కనిపించని విధంగా కక్షసాధింపుగా ఆ గది కేటాయించారు. రాత్రిళ్లు పడుకోవడానికి కూడా సరిపోని గది అది. అందులోనే చిన్న బాత్‌రూమ్. బయటకు కనపడేలా ఉంటుంది. రాత్రి ఎలాగోలా పడుకుందామని అనుకున్నా. లైట్ ఆఫ్ చేశారు కాదు. ఏమిటంటే పైనుంచి ఆర్డర్ అనేవారు. ఆ ట్యూబ్‌లైట్ చుట్టూ పురుగులు.. వాటి కోసం వచ్చే 30 బల్లులు. ప్రతిరోజూ నిద్ర లేకుండానే గడిపా. ఉదయం పూట బయటకు వదిలినప్పుడు చెట్ల కింద పడుకున్నా. 16 రోజులు అలా నిర్బంధంలో ఉంచారు. నా కూతురు పెళ్లి పత్రిక రాసుకునే కార్యక్రమానికి కూడా వెళ్లడానికి వీల్లేదంటూ ఢిల్లీ నుంచి లాయర్‌ను తీసుకునివచ్చి వాదించారు. కోర్టు కండిషనల్ బెయిల్ ఇవ్వడంతో నేరుగా కార్యక్రమానికి వెళ్లి తిరిగి జైలుకు వచ్చా. ఇప్పుడు ఆ కోపాన్ని దిగమింగుకుని రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తున్నా. అంతకంతకు దేవుడే చూసుకుంటాడని అనుకున్నా. సరిగ్గా నేను ప్రమాణ స్వీకారం చేసే రోజునే నాపై కక్ష చూపించిన వాళ్లు ఆసుపత్రిపాలయ్యారు. కక్ష సాధింపు ఎవరిది? మీదా? నాదా?. ఆ కుటుంబానికి చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తానంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూడా నేను అమలు చేయలేదు..' అంటూ సీఎం వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

డ్రోన్ ఎగరేసి ఆడోళ్ల ఫొటోలు తీస్తారా?

మీ భార్యాపిల్లల ఫొటోలు తీస్తే ఊరుకుంటారా?: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'సీఎం ఇంటి మీదకు డ్రోన్ పంపిస్తే ఆయన ఊరుకుంటాడా? ఆయన భార్యా పిల్లలను ఇష్టం వచ్చినట్టు ఫొటోలు తీస్తామంటే ఊరుకుంటాడా? మీకే భార్యా పిల్లలు ఉన్నారా? వేరే వాళ్లకు లేరా? వాళ్లకు కుటుంబాలు ఉండవా? లేని రంకులు అంటగట్టిం ఆనాడు ఇష్టమున్నట్టు మాట్లాడినప్పుడుం నీతులు గుర్తుకు రాలేదా? మా ఇంట్లో పిల్లల్ని తిట్టింది ఈ కాంగ్రెస్ నేతలు కాదా? మా ఇంట్లోని మైనర్ పిల్లల్ని పట్టుకొని బూతులు మాట్లాడింది ముఖ్యమంత్రి కాదా?..' అని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను జైల్లో పెట్టించారంటూ సీఎం చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. 'మా ఇంటి మీదకు డ్రోన్ ఎగరేసి ఇంటివాళ్ల ఫొటోలు తీయటం సరైన పనేనా అన్నది సీఎం చెప్పాలి. రేవంత్‌రెడ్డిని ప్రభుత్వం జైల్లో పెట్టలేదు. కోర్టులు రిమాండ్ చేశాయి. నేను కూడా తెలంగాణ ఉద్యమంలో వరంగల్ జైల్లో ఉన్నా. అయినా రేవంత్‌రెడ్డి స్వాతంత్ర్యం కోసం పోరాడాడా? ఏం గొప్ప పని చేసి జైలుకెళ్లాడు? సీఎం ఏమనుకున్నా మాకు ఫరక్ పడదు. ఏం చేసినా ఫరక్ పడదు. పదవి, అధికారం శాశ్వతం అని సీఎం అనుకుంటున్నారు కానీ అవి ఏవీ శాశ్వతం కాదు. ముఖ్యమంత్రికి అపరిమిత అధికారాలు ఉండవు. ఆయన ఎవరినీ జైలుకు పంపలేరు. కోర్టులు మాత్రమే ఆ పని చేయగలవు. రేవంత్ తిట్లన్నీ మాకు దీవెనలే.ం ఆయనకు తుపాకుల గురించి బాగా తెల్సుం. తెలంగాణపై గన్ను ఎక్కుపెట్టిన రైఫిల్‌రెడ్డి రేవంత్‌రెడ్డి. తెలంగాణ జాతి పిత ముమ్మాటికీ కేసీఆరే. తెలంగాణ బూతు పిత రేవంత్‌రెడ్డే..' అని కేటీఆర్ అన్నారు

చట్టసభలకు ఎన్నిక అద్భుత అవకాశం

మండలి చైర్మన్ 'గుత్తా'



ఎమ్మెల్సీల వీడ్కోలు కార్యక్రమంలో సీఎం రేవంత్, మండలి చైర్మన్ గుత్తా, డిప్యూటీ చైర్మన్ బండ, దామోదర, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, సత్యవతి, మధుసూదనాచారి, నర్సిరెడ్డి, ఎగ్గె మల్లేషం, శేరి సుభాశ్‌రెడ్డి, ప్రభాకర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: చట్టసభలకు ఎన్నికవ్వడం అద్భుతమైన అవకాశమని, అలాంటి అదృష్టం అందరికీ రాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పదవీ విరమణ చేస్తున్న తొమ్మిది మంది ఎమ్మెల్సీలకు గురువారం సాయంత్రం మండలి ఆవరణలో వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పదవీ విరమణ చేస్తున్న సభ్యులు టి.జీవన్ రెడ్డి, మహమ్మద్ మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, ఎమ్మెస్ ప్రభాకర్ రావు, ఎగ్గే మల్లేశం, అలుగుబెల్లి నర్సిరెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, కూర రఘోత్తమ రెడ్డి, మీర్జా రియజుల్ హాసన్ ఎఫండిలను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందుతున్న తొమ్మిది మంది సభ్యులు ప్రజలకు ఎన్నో సేవలందించారని అభినందించారు. కార్యక్రమంలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

జీవితకాలం ప్రజాక్షేత్రంలో..


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

- నేను ఎమ్మెల్సీ అవుతానని కలలో కూడా అనుకోలేదు: ఎగ్గె మల్లేశం
- తెలంగాణ వాదం బలంగా వినిపించే వాళ్లం: ఎంఎస్ ప్రభాకర్
- మండలిలో అనుభవాలు పంచుకున్న పదవీకాలం పూర్తయిన ఎమ్మెల్సీలు

సాక్షి, హైదరాబాద్: శాసన మండలిలో పదవీ కాలం పూర్తయిన ఎమ్మెల్సీలు గురువారం సభలో తమ అనుభవాలను పంచుకున్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ, తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎమ్మెల్సీగా పనిచేసిన కాలమే ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ పదవి నుంచి తప్పుకుంటున్నా.. జీవితకాలం ప్రజాక్షేత్రంలోనే కొనసాగుతానన్నారు. మరో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ, తనకు 15 ఏళ్లపాటు సుదీర్ఘంగా ఎమ్మెల్సీగా పనిచేసే అవకాశం దక్కిందన్నారు. తొలిసారి ఎమ్మెల్సీగా అయిన తర్వాత 2010లో సభలో తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించేవారమని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం మాట్లాడుతూ, తాను ఎమ్మెల్సీ అవుతానని కలలో కూడా అనుకోలేదని, ఆ అవకాశం కల్పించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. రాజకీయాల్లో సేవ చేశానే తప్ప..డబ్బు సంపాదించుకోలేదన్నారు. మరోసారి ఎమ్మెల్సీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

తీన్మార్ మల్లన్నకు మండలి చైర్మన్ గుత్తా వార్నింగ్

ఇష్టానుసారంగా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవు



సాక్షి, హైదరాబాద్: సభలో ఉన్న సభ్యుల పేర్లను ప్రస్తావిస్తూ ఆరోపణలు చేయడం సరికాదని, సభ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి.. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను హెచ్చరించారు. బుధవారం మండలిలో ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావులను ఉద్దేశించి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని చేసిన వ్యాఖ్యలను గురువారం మండలిలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ప్రస్తావించారు. తాము నిబంధనలకు లోబడే తమ విద్యాసంస్థల్లో ఫీజులు తీసుకుంటున్నామని, ప్రభుత్వ భూములు తీసుకోలేదని, ఎవరి దగ్గరా చందాలు తీసుకోలేదని, ప్రతిపైసాకి జవాబుదారీతనం ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలుగజేసుకునేందుకు ప్రయత్నించగా చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి వారించారు. కాసేపు సభ్యుల మధ్య వాగ్వాదంతో గందరగోళం చోటు చేసుకుంది. తీన్మార్ మల్లన్న స్పందిస్తూ..మీరు చర్యలు తీసుకోవాలనుకుంటే తీసుకోండి ఎలాంటి అభ్యంతరం లేదు అని అన్నారు. అంతకుముందు పలువురు సభ్యులు స్పెషల్ మెన్షన్ కింద పలు అంశాలు లేవనెత్తారు. వీటన్నింటిపైనా చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు

రేవంత్‌కు ఇంత ఫ్రస్టేషన్ ఎందుకో తెలియడం లేదు

- ఆయన ఎంత ఎక్కువ మాట్లాడితే అంత మంచిది
- కాంగ్రెస్‌కు ఓటేసేందుకు మరో 20 ఏళ్లు జనం భయపడతారు
- ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు. పదవిలోకి వచ్చిన తర్వాత రేవంత్‌కు ఇంత ఫ్రస్టేషన్ ఎందుకో తెలియడం లేదు. ఆయన వల్ల కాంగ్రెస్‌కు ఓటు వేద్దామనుకునేవారు భయపడే పరిస్థితి నెలకొంది. రేవంత్ ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో, తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేసినా వచ్చిన ఫలితం ఏమిటో ప్రజలకు తెలుసు. రేవంత్‌రెడ్డి ఎంత ఎక్కువ మాట్లాడితే అంత మంచిది, ఆయన మాటలతో కాంగ్రెస్‌కు ఓటేసేందుకు మరో 20 ఏళ్లు జనం భయపడతారు..'అని కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై బీఆర్‌ఎస్ పక్షాన చర్చను ప్రారంభించిన ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు.

అప్పులు, అబద్ధాల్లో తెలంగాణ రైజింగ్

'పాత కాంగ్రెస్ నేతలను ఖతం చేసి పదవి లాక్కున్న వ్యక్తి రేవంత్‌రెడ్డి. అప్పుల్లో, అబద్ధాల్లో, క్రైం రేట్‌లో, అన్నదాతలు, నేతన్నల ఆత్మహత్యల్లో తెలంగాణ ఈజీ రైజింగ్. ప్రభుత్వం దివాలా తీసిందని, అప్పే పుట్టడం లేదని బయట చెప్తూ, సభలో మాత్రం మేము 1.58 లక్షల కోట్ల అప్పు తెచ్చినట్టు రొమ్ము విరుచుకొని చెప్తున్నారు. ఐదు గ్యారంటీలు అమలు చేశామని, సంక్షేమం అద్భుతంగా ఉందని అంటూనే.. మరోవైపు రూ.71 వేల కోట్ల ఆదాయం తగ్గిందంటూ విరుద్ధ ప్రకటన చేశారు. ఇదేం గందరగోళమో ఆయనే చెప్పాలి. ఉద్యోగుల డీఏలకు, ఆరు గ్యారెంటీల అమలుకు, తులం బంగారానికి పైసలు లేవని చెప్పే సీఎం.. హెచ్‌ఎండీఏలో రూ.20 వేల కోట్లతో, జీహెచ్‌ఎంసీలో రూ.7 వేల కోట్లతో, వాటర్ వర్క్స్‌లో రూ.14 వేల కోట్లతో, కొడంగల్ లిఫ్ట్ కోసం రూ.4,400 కోట్లతో టెండర్లు ఎలా పిలిచారో, ఫ్యూచర్ సిటీలో రోడ్ల కోసం రూ.5 వేల కోట్లు ఎలా వస్తున్నాయో, రూ.లక్షన్నర కోట్ల మూసీ సుందరీకరణ ఎలా సాధ్యమో, నిధులెక్కడివో వెల్లడించాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రేవంత్ రోల్డ్‌గోల్డ్ అని తేలింది

'ముఖ్యమంత్రి నియోజకవర్గానికి గానీ, నా నియోజకవర్గానికి గానీ వెళ్లి రైతులతో మాట్లాడి, వంద శాతం రుణమాఫీ అయిందేమో అడుగుదాం. అయిందన్న సమాధానం వస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. సీఎంకు ఇది నా సవాల్. దీనికి ఆయన సిద్ధమో కాదో చెప్పాలి. వందో రోజుల్లో హామీల అమలు అని చెప్పి ఆశపెట్టారు. అవి చూసి రేవంత్‌ను జనం గోల్డ్ అనుకున్నారు. కానీ ఆయన రోల్డ్‌గోల్డని తేలింది. లంకెబిందెలు దొరికేదాకా జనం ఎదురు చూడాల్సిందేనా?.

రాష్ట్రానికి వచ్చింది గుండు సున్నానే కదా..

గతంలో కొత్తగా ఏర్పడిన మూడు రాష్ట్రాలు ఇప్పటివరకు బాలారిష్టాల నుంచి బయటకు రాలేదు. కానీ ఏర్పడిన దశాబ్దంలోనే తెలంగాణ మెరుపు వేగంతో దూసుకుపోయింది. అధికారంలో ఎవరున్నా తెలంగాణకు మేలు జరగాలి.. తెలంగాణ ప్రజలు బాగుండాలన్నదే మా పార్టీ లక్ష్యం. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించనేలేదు. రాష్ట్రంలో బీజేపీ గెలిస్తేనే నిధులిస్తామన్న తరహాలో వ్యవహరిస్తున్నారు. దీన్ని కూడా బడ్జెట్ ప్రసంగంలో ఖండించలేదు. రాష్ట్రాలు లేకుండా కేంద్రమెక్కడిది. అందుకే కేంద్రం ఓ మిథ్య అని దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అనేవారు. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో మాకు సున్నా ఫలితాలే వచ్చాయి. మరి కాంగ్రెస్, బీజేపీలకు ఎనిమిది మంది చొప్పున ఎంపీలున్నా కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చింది గుండు సున్నానే కదా. మన డబ్బుల్ని పన్నుల రూపంలో తీసుకుంటూ మనకు మాత్రం తిరిగి ఏమీ ఇవ్వడం లేదు.

హామీల అమల్లో పూర్తిగా విఫలం

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కాళేశ్వరం కూలిపోయిందని చెప్పే ముఖ్యమంత్రి, ఆ ప్రాజెక్టులో భాగమైన కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెస్తామని చెబుతారు. కాళేశ్వరం కూలిపోతే కొండపోచమ్మ సాగర్ ఎక్కడిది? మల్లన్న సాగర్, గంధమల్ల, బస్వాపూర్ ఎక్కడివి? నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో, ప్రజాపాలనలో అంతే ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉంది..'అని కేటీఆర్ అన్నారు.



అర్ధరాత్రి విద్యుత్ కట్ చేయం

- తప్పుడు ఎస్ఎంఎస్‌లు, కాల్స్‌ని నమ్మి మోసపోవద్దు
- బ్యాంకు ఖాతాలు, డెబిట్ కార్డుల వివరాలు ఇవ్వొద్దు
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ




సాక్షి, హైదరాబాద్: విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించకపోతే రాత్రిపూట విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని బెదిరిస్తూ వచ్చే ఎస్ఎంఎస్‌లు, ఫోన్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ వినియోగ దారులకు సూచించారు. ఈ తరహా మోసగాళ్లు తమను తక్షణమే సంప్రదించాలని ఒక ఫోన్ నంబర్ ఇస్తున్నారని, ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే బ్యాంకు ఖాతాలు, డెబిట్ కార్డుల వివరాలను అడిగి తీసుకుని నగదు విత్‌డ్రా చేసి మోసం చేస్తున్నారని ఆయన అప్రమత్తం చేశారు. పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఇలాంటి మోసపూరిత ఎస్ఎంఎస్‌లు, కాల్స్ అందుకోవడంతో గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తాము వినియోగదారులను వారి బ్యాంకు ఖాతాలు, డెబిట్ కార్డుల వివరాలను అడగమని, వెబ్‌లింక్‌లను పంపించమన్నారు. తాము పంపే సందేశాల్లో సర్వీస్ నంబర్, వినియోగదారుడి పేరు, బిల్లు బకాయిల మొత్తం, చివరి గడువుతో పాటు టీజీఎస్పీడీసీఎల్ పేరు ఉంటుందన్నారు. వినియోగదారులు సంస్థ వెబ్‌సైట్ www.tgsouthernpower.org లేదా టీజీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల బకాయిల సమాచారాన్ని పొందవచ్చు అన్నారు.



అభివృద్ధి పనులకు అటవీభూముల మళ్లింపు

సాక్షి, హైదరాబాద్: వివిధ జిల్లాల్లో అభివృద్ధిపనులు, ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు, ఇతర అవసరాల కోసం అటవీభూమిని మళ్లిస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ డివిజన్‌లో టీ–ఫైబర్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేసేందుకు 3.85 హెక్టార్లు, మెదక్ జిల్లాలోని మెదక్ డివిజన్‌లో కూడా ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేసేందుకు 2.72 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించారు. అదేవిధంగా మెదక్ జిల్లాలోనే రామాయంపేట రేంజ్‌లో బోనాల నుంచి శివాయపల్లె రోడ్డు వరకు స్టీల్ గ్యాస్ పైప్‌లైన్ కోసం 0.047 హెక్టార్లు, ములుగు జిల్లా తాడ్వాయి అటవీ డివిజన్‌లోని కొత్తూరు మొట్లగూడెం గ్రామం వద్ద 4జీ బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్ ఏర్పాటుకు 0.020 హెక్టార్ల అటవీభూమిని మళ్లిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే ములుగుజిల్లా మంగపేట రిజర్వ్‌ఫారెస్ట్ పరిధిలోని నర్సయ్యగూడెం గ్రామం వద్ద బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్ కోసం 0.020 హెక్టార్లు, ఇదేజిల్లాలో ములుగు అటవీ డివిజన్‌లోని బండ్లపాడు గ్రామంలో కూడా బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్ ఏర్పాటు కోసం 0.020 హెక్టార్ల అటవీభూమిని మళ్లిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.





నా ప్రభువుకు ఆకాశంలోను మరియు భూమిలోను పలుకబడే ప్రతిమాట తెలుసు. మరియు ఆయన సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 28 మార్చి 2025

బంగ్లాతో మళ్లీ చెలిమి!

నిరుడు ఆగస్టులో జరిగిన తిరుగుబాటులో అప్పటి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పదవి కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నప్పటినుంచీ భారత–బంగ్లాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో తొలిసారి ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్‌కు లేఖ రాయటం ఆహ్వానించదగ్గ పరిణామం. బంగ్లా జాతీయ దినోత్సవం సందర్భంగా త్యాగాల పునాదులపై నిర్మితమైన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు. పదిహేనేళ్లు పాలించిన హసీనా మత ఛాందసుల్ని అదుపులో పెట్టడంలో సాధించిన విజయాలు ప్రశంసనీయమైనా, రిగ్గింగ్‌తో విజయాన్ని చేజిక్కించుకోవటం, విపక్ష నేతలను ఏళ్ల తరబడి జైళ్లపాలు చేయటం వంటి ధోరణుల్ని ఎవరూ జీర్ణించుకోలేక పోయారు. తిరుగుబాటు జరిగాక, జనం పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయింది. హసీనా పార్టీ అవామీ లీగ్ నేతలపైనా, కార్యకర్తలపైనా దాడులతో పాటు ఆ పార్టీకి మద్దతు పలికారంటూ పలువురి ఆస్తుల్ని ధ్వంసం చేయటం మితిమీరింది. ఈ అరాచకం ఆపకపోగా అంతా సవ్యంగా ఉందంటూ యూనుస్ దబాయింపులకు దిగారు. మతఛాందసులది పైచేయి అయి మహిళలపైనా, మైనారిటీ హిందూ వర్గంపైనా దాడులకు పూనుకుంటున్నా... వివిధ ప్రాంతాల్లో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు బాగా పెరిగినా అదంతా తప్పుడు ప్రచారమని కొట్టిపారేశారు. గత డిసెంబర్‌లో ఆ దేశాన్ని సందర్శించిన మన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి ఈ నేరాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను బంగ్లా విదేశాంగ సలహాదారు మహమ్మద్ తౌహిద్ హుస్సేన్‌కు అందజేశారు.

భౌగోళిక రాజకీయ కోణంలో బంగ్లాదేశ్‌తో చెలిమి భారత్‌కు చాలా అవసరం. అది చిన్న దేశమే అయినా దానితో మనకు 4,096 కిలోమీటర్ల మేర సరిహద్దువుంది. ఇందులో నదీ పరీవాహక ప్రాంతం వేయి కిలోమీటర్లపైన ఉంటుంది. తాగునీటికైనా, సాగునీటికైనా తీస్తా నదీజలాలు ఆ దేశానికి ప్రాణప్రదమైనవి. ఆ నది ప్రవహించే 315 కిలోమీటర్లలోనూ 130 కిలోమీటర్లు బంగ్లాదేశ్ భూభాగంలోనే ఉంటుంది. పశ్చిమబెంగాల్‌లోని గజల్‌డోబా బరాజ్ వల్ల భారీ మొత్తం జలాలు ఆ రాష్ట్రానికే పోతాయని, తమకు మిగిలేది అతి తక్కువని బంగ్లా వాదిస్తోంది. ఆ జలాల్లో తమకు 50 శాతం వాటా ఇవ్వాలని కోరుకుంటోంది. చివరకు కనీసం తొలి దశలో 25 శాతం ఇస్తే చాలని రాజీకొచ్చింది కూడా. కానీ మమత అందుకు కూడా ససేమిరా అన్నారు. వాస్తవానికి 2011లో నాటి యూపీఏ ప్రధాని మన్మోహన్ సింగ్ తీస్తా నదీజలాల పంపకంపై బంగ్లాతో సూత్రప్రాయంగా అంగీకారానికొచ్చారు. ఒప్పందం రూపొందింది. కానీ అప్పుడు కూడా పశ్చిమ బెంగాల్ సీఎంగా వున్న మమతా బెనర్జీ యూపీఏ భాగస్వామి కావటం, ఆ ఒప్పందానికి ఆమె ససేమిరా అనటంతో చివరి నిమిషంలో ఆగిపోయింది. ఫెనీ జలాల విషయంలోనూ ఇలాంటి పీటముడే పడింది. నదీజలాల అంశం తప్ప ఇతరేతర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు బాగుండేవి.

భారత్ పెద్దన్న పాత్ర పోషిస్తున్నదని, తమ ప్రయోజనాలను బేఖాతరు చేస్తున్నదని బంగ్లా ప్రజానీకంలో చాన్నాళ్ల నుంచి అసంతృప్తి వుంది. దానికితోడు హసీనాకు భారత్ గట్టి మద్దతుదారుగా ఉండటంవల్లే ఆమె ఇష్టారాజ్యం సాగిందని, లక్షలాదిమంది తమ కార్యకర్తలను జైళ్లలో పెట్టారని విపక్షాల ఆరోపణ. ఈశాన్య భారత్‌లో తరచు హింసాత్మక చర్యలకు పాల్పడుతూ బంగ్లాదేశ్ శిబిరాల్లో తలదాచుకునే మిలిటెంట్లను ఆమె హయాంలో భారత్‌కు అప్పగించేవారు. ఇది కూడా అక్కడి ఛాందసవాదులకు మింగుడుపడలేదు. అయినా ఇరు దేశాలూ ఉమ్మడిగా ఎదుర్కొనాల్సిన సమస్యలూ ఉన్నాయి. ఉదాహరణకు టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మించతలపెట్టిన మెడాగ్ జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్దది కాబోతోంది. అది మనతోపాటు బంగ్లాదేశ్ ప్రయోజనాలకు కూడా ముప్పు కలిగిస్తుంది. బంగ్లా సాగు అవసరాల్లో 55 శాతం బ్రహ్మపుత్ర నదీజలాలు తీరుస్తాయి. చైనాలోని టిబెట్‌లో యార్లుంగ్ సాంగ్పోగా మొదలై మన దేశంలో ప్రవేశించేసరికి బ్రహ్మపుత్ర అయి, బంగ్లాలో అది జమునా నదిగా మారుతుంది. ప్రస్తుత బంగ్లా వాటా జలాల్లో 5 శాతం తగ్గినా సాగు ఉత్పత్తులు 15 శాతం పడిపోతాయని మూడేళ్ల క్రితం బంగ్లా పర్యావరణ శాఖ అంచనా వేసింది. బరాజ్ నిర్మిస్తున్న ప్రాంతం భూకంపాలపరంగా ప్రమాదకరమైనది. భూ అంతర్భాగంలోని టిబెట్ పలక చురుగ్గా ఉండటమే ఇందుకు కారణం. దీనిపై ఇప్పటికే మన దేశం చైనాకు ఆందోళనను తెలియజేయగా, బంగ్లాదేశ్ సైతం ఆ బరాజ్ ప్రభావంపై రూపొందించిన నివేదికలు తమకందించాలని ఆ దేశానికి లేఖ రాసింది.

బంగ్లా విముక్తి దినోత్సవంపై ప్రస్తుత పాలకులకు అంత పట్టింపు లేదు. హసీనా పతనానికి దారితీసిన ఉద్యమానికి నాయకత్వం వహించి, ప్రస్తుత ప్రభుత్వంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న విద్యార్థులు తమది తటస్థ దేశంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఆ ఆశయంతో గణతాంత్రిక్ ఛాత్ర సంగ్సద్ (ప్రజాతంత్ర విద్యార్థి మండలి) పేరిట గత నెలలో పార్టీ స్థాపించారు. అయితే ఛాందసవాదులు దీన్ని ఎంతవరకూ సాగనిస్తారో తెలియదు. దేశాన్ని మళ్లీ తూర్పు పాకిస్తాన్‌గా మార్చాలని వారు తహతహలాడుతున్నారు. ఇస్లామిక్ సంప్రదాయాలను అమలు చేయాలని చూస్తున్నారు. వచ్చే నెల 2 నుంచి 4 వరకూ బ్యాంకాక్‌లో జరగబోయే బంగాళాఖాత దేశాల ఆర్థిక సహకార సంఘం బిమ్‌స్టెక్ సమావేశం సందర్భంగా మోదీతో భేటీకి బంగ్లా ఆసక్తి చూపుతోంది. తాజా పరిణామంతో అది సాకారమైతే మళ్లీ ఇరు దేశాల స్నేహసంబంధాలూ పట్టాలెక్కుతాయి.


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.7.12 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.9.46 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.28 నుండి 9.16 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.19 వరకు, **అమృత ఘడియలు:** ప.2.05 నుండి 3.38 వరకు.

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కదిలిన డొంక

సందర్భం



పి. వేణుగోపాల్ రెడ్డి

తీగలాగితే డొంక కదిలింది అన్నట్టుగా ఒక న్యాయమూర్తి ఇంట్లో దొరికిన నోట్ల కట్టలు మొత్తం న్యాయవ్యవస్థను కుదిపేస్తున్నవి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. న్యాయమూర్తి ఇంటికి పరుగున వచ్చిన అగ్నిమాపక సిబ్బందికి దగ్ధమవుతున్నవి భిన్నంగా కనిపించాయి. తమ బాధ్యతగా మంటలు ఆపి పై అధికారులకు ఎటువంటి సమాచారం ఇచ్చారో తెలియదు! కానీ మూడు రోజుల తర్వాత గానీ మీడియాలో ఈ వార్త రాలేదు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉపాధ్యాయ దగ్గరకు చేరిన వీడియోలు సుప్రీంకోర్టు వెబ్ సైట్లో అప్లోడ్ కాకపోయి వుంటే కరెన్సీ తగలబడటం అనేది బయటకు వచ్చేది కాదు. తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా... జస్టిస్ యశ్వంత్ వర్మపై చర్యలు ప్రకటించారు. అయితే ఆ చర్యలే ఇప్పుడు ప్రశ్నలు ఎదుర్కొంటున్నాయి.

న్యాయమూర్తులకు భిన్న న్యాయమా?

ఒక సాదాసీదా ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో లక్ష కరెన్సీ దొరికితే ఆ వివరాలను మీడియాకి ఇచ్చి, ఆ ఉద్యోగి ఫొటోలు విడుదల చేసే పోలీసులు జస్టిస్ యశ్వంత్ వర్మ పట్ల ఎందుకు ఉదాసీనంగా వ్యవహరించారు? దాదాపు 15 కోట్ల విలువ ఉన్న కరెన్సీ ఒక న్యాయమూర్తి ఇంట్లో లభిస్తే న్యాయవ్యవస్థ తీసుకున్న చర్య ఆ న్యాయమూర్తిని మరో హైకోర్టుకు బదిలీ చేయడమా? ఒక కేసులో విచారణ సక్రమంగా జరగదని న్యాయస్థానాలు భావించినప్పుడు నిష్పక్ష విచారణకు సీబీఐకి కేసును బదిలీ చేస్తాయి కదా. మరి ఆ కరెన్సీ విషయం నిగ్గు తేల్చమని సీబీఐని ఎందుకు ఆదేశించలేదు?

కరెన్సీతో కూడిన కేసు కాబట్టి ఈడీను ఆ కేసు తీసుకోమని ఎందుకు అడగలేదు? స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థతో దర్యాప్తు చేస్తే గాని నిజాలు బయటకు రావని పలు సందర్భాలలో వ్యాఖ్యానించిన న్యాయవ్యవస్థ ఈ విషయంలో అంతర్గత విచారణకు ఆదేశించడం ఏమిటి? ఒక న్యాయమూర్తి మీద ఆరోపణలు వస్తే మరో ముగ్గురు న్యాయమూర్తుల కమిటీ వేయడం సబబా? ఆ న్యాయమూర్తి మీడియా ముందుకు వచ్చి 'ఆ కరెన్సీ నోట్లు నావి కావు, అక్కడికి ఎలా వచ్చాయో నాకు తెలియదు' అనీ నోట్ల కట్టలను చూపుతుంటే ఆయన మీద ఆంక్ష విధించలేదు. కేసు గురించి బహిరంగంగా మాట్లాడటానికి వీలు లేదనే నిబంధన సామాన్య నిందితుడి మీద విధించడం న్యాయస్థానాలు చేస్తుంటాయి. కానీ అది ఢిల్లీ న్యాయమూర్తికి వర్తింప చేయలేదు. 'నా పరువుకు భంగం కలిగించే కుట్రలో భాగంగా ఎవరో ఆ కరెన్సీ నోట్లు తెచ్చి నా ఇంట్లో పెట్టారు' అని సదరు న్యాయమూర్తి అంటున్నారు.



న్యాయవాది మాథ్యూస్ నెడుంపర పరిశోధన ప్రకారం, హైకోర్టు స్థాయిలో 50 శాతం న్యాయమూర్తులు, సుప్రీం కోర్టు స్థాయిలో 33 శాతం న్యాయమూర్తులు గతంలో న్యాయమూర్తులుగా పనిచేసిన వారికి దగ్గరి బంధువులు.

మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ ఇటీవల చెన్నైలో చేసిన ప్రసంగంలో 'న్యాయ వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం సడలుతోంది' అన్నారు. మరో సమావేశంలో మరో మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కూడా 'న్యాయవ్యవస్థలో అంతా సక్రమంగా ఉందనలేం' అన్నారు. ఆ ఇద్దరు న్యాయమూర్తుల నోటి వెంట వచ్చిన మరో పదం భారతీయ న్యాయ వ్యవస్థలో 'అంకుల్ జడ్జి సింద్రోమ్' నెలకొన్నది అనేది. న్యాయవ్యవస్థలో బంధుప్రీతి పెరిగిందని, వారసులు జడ్జిలు అవుతున్నారనే విషయం ముంబైకి చెందిన న్యాయవాది మాథ్యూస్ నెడుంపర సాక్ష్యాలతో సహా ఒక నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించారు. ఆయన పరిశోధనలో హైకోర్టు స్థాయిలో 50 శాతం న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు స్థాయిలో 33 శాతం న్యాయమూర్తులు గతంలో న్యాయమూర్తులుగా పనిచేసిన వారికి దగ్గర బంధువులు.

కొలీజియం ఉండటం సబబా?

న్యాయవ్యవస్థలో బంధు ప్రీతి పెరగడానికి కారణం ప్రపంచంలో మరే దేశంలో లేనటువంటి కొలీజియం వ్యవస్థ. ప్రజాస్వామ్య దేశాలన్నింటిలో న్యాయమూర్తులు నియామకం ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు చేస్తాయి. మనదేశంలో కూడా రాజ్యాంగం ఆ విధానాన్ని అనుసరించింది. అయితే మధ్యలో న్యాయమూర్తులు ఆ విధానాన్ని హైజాక్ చేశారు. కొలీజియం వ్యవస్థను స్థాపించారు. ఈ కొలీజియంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా మరో నలుగురు న్యాయమూర్తులు సభ్యులు. హైకోర్టు స్థాయిలోనూ అటువంటి కొలీజియం ఉంటుంది. ఈ కొలీజియం న్యాయమూర్తుల నియామకాలను చేపడుతుంది. వారు సిఫార్సు చేసిన వారిని కేంద్ర ప్రభుత్వం నియమించాలి.


ఎన్డీయే ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయ వ్యవస్థ సంస్కరణ కోసం రాజ్యాంగాన్ని సవరించి 'నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్మెంట్ కమిషన్' (ఎన్‌జేఏసీ) చట్టం చేసింది. దీని ద్వారా న్యాయమూర్తుల నియామకం ప్రభుత్వం ద్వారా జరిగేందుకు వీలు కల్పించింది. అయితే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసి, కొలీజియం ద్వారానే నియామకాల విధానం కొనసాగిస్తామన్నది. న్యాయమూర్తులు న్యాయమూర్తులను నియమించే విధానం మరెక్కడా లేదు. ఆ హక్కును ఐఏఎస్ అధికారులు, సీనియర్ ఐఏఎస్ అధికారులకు కోర్టు ఇస్తుందా? ప్రతి వ్యవస్థలో సీనియర్స్ తమ తర్వాతి స్థానాల వారిని నియమించడం సబబా!

గతంలో కొలీజియం వ్యవస్థను సవాలు చేసిన న్యాయవాది మాథ్యూస్ నెడుంపర. ఆయన తన పిటీషన్‌లో వేసిన ప్రశ్నలు – ఇంతవరకు ఆ కరెన్సీని ఎందుకు భద్రపరచి, తగలబడిన వస్తువుల జాబితా తయారు చేయలేదు? ఎవరిని అరెస్టు ఎందుకు చేయలేదు? క్రిమినల్ చట్టాలను ఎందుకు అమలు చేయడం లేదు? ఈ కేసు వివరాలను ఎందుకు బయటకు రానివ్వడం లేదు? ఉపరాష్ట్రపతి జగదీశ్ ధన్కడ్ ఎన్‌జేఏసీ చట్టాన్ని తిరిగి తీసుకురావాల్సిన అవసరం గురించి ప్రతిపక్ష నేతలతో చర్చించారు. ఇకముందైనా కొలీజియం వ్యవస్థలోని లోపాలను సుప్రీంకోర్టు వదులుకుంటుందా? పారదర్శకత, జవాబుదారీతనం న్యాయవ్యవస్థ ప్రదర్శిస్తుందా?

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు । pvg2020@gmail.com

సమీక్ష ఎలా?

సందర్భం



ఎన్. వేణుగోపాల్

ఢిల్లీ హైకోర్టు 'న్యాయమూర్తి' జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం జరగగా, ఆ మంటలను చల్లార్చడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి ఒక గదిలో తగలబడిపోయిన నోట్ల కట్టల బస్తాలు కనిపించాయి. ఆ సమయానికి న్యాయమూర్తి, ఆయన భార్య ఇంట్లో లేరు. వారి కూతురు, న్యాయమూర్తి తల్లి మాత్రమే ఉన్నారు. విషయం ఢిల్లీ పోలీసులకు చేరింది. ఢిల్లీ పోలీసు కమిషనర్ ఆ వీడియోలను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపారు. కొన్ని రోజులు ఆలస్యంగానైనా ఆ ఉదంతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దాకా చేరి, మరొక రకం అగ్నిమాపక చర్యలు ప్రారంభమయ్యాయి. కొలీజియం సూచనపై వివాదాస్పద న్యాయమూర్తిని వెంటనే అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ ఈ బదిలీని తాము వ్యతిరేకిస్తున్నామని, అవినీతిపరులకు ఆశ్రయం కలిగించడానికి మా హైకోర్టు చెత్తబుట్ట కాదని తీవ్రమైన పదజాలంతో స్పందించింది. కొలీజియం నిర్ణయానికి వ్యతిరేకంగా నిరవధిక సమ్మె ప్రారంభించింది.

ఈలోగా సుప్రీంకోర్టు జస్టిస్ యశ్వంత్ వర్మతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి, ఆ ఉత్తరాలు, వీడియోలు, ఫొటోలు అన్నీ తన వెబ్ సైట్ మీద బహిరంగంగా పెట్టింది. ఆ డబ్బు 15 కోట్ల నుంచి 50 కోట్ల రూపాయల వరకు ఉంటుందని వదంతులున్నాయి. కార్పొరేట్ కంపెనీల ఆదాయపు పన్ను, జీఎస్టీ వగైరా కేసులను విచారించే కీలక మైన బాధ్యతలలో ఉన్నారు గనుక అది ఆ కంపెనీల నుంచి అందిన అవినీతి సొమ్ము కావచ్చుననే అనుమానాలున్నాయి. కొన్ని వేల రూపాయలో, లక్షల రూపాయలో లెక్క చూపని ధనం ఉన్నందుకే ముప్పుతిప్పలు పెట్టే ఐటీ, ఈడీ, సీబీఐ వంటి సంస్థలున్న చోట ఇంత పెద్ద మొత్తం డబ్బు గురించి కఠినమైన శిక్షలకు దారి తీసే విచారణ జరగవలసే ఉంటుంది.

తొలగింపు 'సాధ్యమే'నా?

భారత రాజ్యాంగం అధికరణాలు 124, 218, న్యాయమూర్తుల విచారణ చట్టం, 1968 ప్రకారం ఒక న్యాయమూర్తి మీద విచారణ జరపడం, తొలగించడం అసాధ్యం కాదు గాని కష్టసాధ్యం. ఆరోపణలు (చట్టం 'దుష్ప్రవర్తన, అసమర్థత'లను మాత్రమే గుర్తించింది, అవినీతి అనే మాటే లేదు!) ఎదుర్కొంటున్న న్యాయమూర్తిని తొలగించాలని 100 మంది లోక్‌సభ సభ్యులు గాని, 50 మంది రాజ్యసభ సభ్యులు గాని పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెట్టాలి. ఆ తీర్మానాన్ని అనుమతిస్తే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియమిస్తారు. ఆ కమిటీ ఆ ఆరోపణలు నిజమని తేల్చితే తొలగింపు తీర్మానం ముందుకు కదులుతుంది. సభలోని మొత్తం సభ్యులలో సగం కన్న ఎక్కువ మంది, లేదా హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆమోదిస్తేనే ఆ తీర్మానం నెగ్గి, రాష్ట్రపతి దగ్గరికి వెళుతుంది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను తొలగించే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉంది.

న్యాయ వ్యవస్థకు శాసన నిర్మాణ, అధికార వ్యవస్థల మీద అదుపు ఉండటం సదుద్దేశంతోనే కావచ్చు. కానీ కంచే చేను మేసినట్టు, ఆ న్యాయ వ్యవస్థే అన్యాయ వ్యవస్థగా మారిపోతే, దాన్ని అదుపులో పెట్టేదెవరు?

ఈ ప్రక్రియ అంతా చూస్తే, సాధారణ పౌరులకు వర్తించే నిబంధనలు న్యాయమూర్తులకు వర్తించవని తేలుతుంది. భారత పౌరులమైన మనందరమూ రాజ్యాంగం ఎదుట సమానులమే గాని, న్యాయమూర్తులు మాత్రం ఎక్కువ సమానం! ఒకే రకమైన నేరం చేసినా కులాన్ని బట్టి శిక్ష లేక పోవడమో, తీవ్రమైన శిక్ష ఉండటమో నిర్దేశించిన మనుస్మృతి లాగానే, భారత న్యాయమూర్తులకు కూడా మినహాయింపులు ఉన్నాయి!

భావజాలాల మీద చర్చ వద్దా?

ఈ దొరికిపోయిన అవినీతి వ్యవహారం మీదనైనా కాస్త చర్చ మొదలయింది గాని, న్యాయమూర్తులలో ఉన్న తప్పుడు భావజాలాల మీద, అందువల్ల వెలువడుతున్న తీర్పుల మీద చర్చ కూడా లేదు. ఇటీవల అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ ఒక మతతత్త్వ సంస్థ సభకు హాజరై ముస్లింలకు వ్యతిరేకంగా ద్వేష ఉపన్యాసం చేశారు. న్యాయవ్యవస్థలోని ఉన్నతాధికార పీఠం అయిన కొలీజియం సంజాయిషీ అడిగితే, తన ఉపన్యాసానికి కట్టుబడి ఉన్నానని నొక్కి చెప్పారు. మరొక అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా తన ముందుకు ఒక మైనర్ బాలికపై అత్యాచార యత్నం కేసు వస్తే, దుండగులు ఆ బాలిక రొమ్ములను పిసికారని, ఆ బాలిక పైజామా బొందు తెంచివేశారని ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాలు చూపినప్పటికీ, దాన్ని అత్యాచార యత్న నేరంగా చూడలేమని ప్రకటించారు. ఆ అన్యాయమైన తీర్పు మీద సమీక్ష జరపాలని దాఖలైన పిటిషన్‌ను వినడానికే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా త్రివేదీ సోమవారం నాడు నిరాకరించారు. ఆ అనుచిత ప్రవర్తనను, సుప్రీంకోర్టే మంగళవారం నాడు సవరించుకుంది. అలహాబాద్ హైకోర్టు తీర్పును సమీక్షించాలని సుమోటో నిర్ణయం తీసుకుని, జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ ఎ.జి.మసీహ్ ధర్మాసనానికి అప్పగించింది.

శాసన నిర్మాణ వ్యవస్థ, అధికార వ్యవస్థ, న్యాయ వ్యవస్థ అనే మూడు అంగాలలో న్యాయవ్యవస్థ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర అధికారంతో మిగిలిన రెండు అంగాల పనితీరును కూడా సమీక్షించే ఉన్నతాధికారం కలిగి ఉంటుందని రాజనీతిశాస్త్రం పాఠాలు చెపుతుంది. రాజ్యాంగాన్ని, చట్టాలను వివరించే, వ్యాఖ్యానించే, సవరించే విస్తృతాధికారం ఉన్న న్యాయ వ్యవస్థకు సమాజం మొత్తం మీద, ప్రత్యేకించి శాసన నిర్మాణ, అధికార వ్యవస్థల మీద అదుపు ఉండటం సదుద్దేశంతోనే కావచ్చు. కాని కంచే చేను మేసినట్టు, ఆ న్యాయ వ్యవస్థే అన్యాయ, అవినీతి వ్యవస్థగా మారిపోతే, దాన్ని అదుపులో పెట్టేదెవరు? సమీక్షకులను సమీక్షించే వారెవరు? రాజ్యాంగమూ, చట్టమూ ఇచ్చిన ప్రత్యేక రక్షణలు, సబ్ జుడిస్ (న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా ఆ వ్యాజ్యం మీద మాట్లాడగూడదు), కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్ (న్యాయస్థానం పట్ల ధిక్కార భావన) వంటి అవరోధాలతో, న్యాయస్థానాల మీద నోరెత్తడానికి ప్రజలు భయపడే పరిస్థితి కల్పిస్తే దిక్కెవరు?

న్యాయస్థానాలను మించినది సమాజం. న్యాయవ్యవస్థ తప్పులను నిలదీయ వలసిందీ, న్యాయ వ్యవస్థను కూడా సాధారణ పౌరుల లాగే ప్రజాక్షేత్రంలో చర్చకూ విచారణకూ గురిచేసి, జవాబుదారీతనాన్ని స్థాపించవలసిందీ సమాజమే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలి!

ప్రజలు ప్రతి నిత్యం ఎదుర్కొనే సమస్యల్లో ఆరోగ్యానికి సంబంధించినవి ప్రధానమైనవి. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం బాగుపడేది. కానీ పాలకులు ఈ సంగతిని విస్మరించి ప్రభుత్వ ఆస్పత్రులను నిర్లక్ష్యం చేస్తూ ఉండడంతో జనం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వారి ధనదాహానికి బలికావలసి వస్తోంది. ఈ ఆస్పత్రులకు చెల్లించే అధిక బిల్లుల కారణంగా మధ్యతరగతి కుటుంబాలవారు మూడు నుంచి నాలుగు శాతం వరకూ పేదలుగా మారుతున్నారని తాజా 'గృహ వినియోగ సర్వే' తెలిపింది.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలనీ, ప్రైవేట్ (కార్పొరేట్) ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాలు గత నాలుగు నెలలుగా సర్వేలు, ఆందోళనలూ చేపట్టాయి. ఈ సర్వేలో వెలుగులోకి వచ్చిన అంశాలపై మార్చి 28న (నేడు) బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చర్చ జరుగుతుంది. దీనికి అందరూ ఆహ్వానితులే.

– కె.ఎస్. ప్రదీప్ । (పీవైఎల్),
డి. స్వరూప । (పీఓడబ్ల్యూ) తెలంగాణ

కేంద్రం సముచితంగా వ్యవహరించాలి!

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

జనసంఖ్య ప్రాతిపదికగా నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరుగుతుందనే ప్రకటనపై పార్లమెంట్‌లోనూ, బయటా దక్షిణాది రాష్ట్రాల వారు ప్రకంపనలు పుట్టిస్తున్నారు. ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ నియోజకవర్గాలు లభించే అవకాశం ఉండడంతో పార్లమెంట్‌లో తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుంది. అదే సమయంలో జనాభా ఎక్కువ ఉన్న ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పెరుగుతుంది. ఇందువల్ల అధికారం, పరిపాలన, అభివృద్ధి వంటి అంశాల్లో దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందనీ, ఫలితంగా దక్షిణాదిలో అస్తిత్వ సంక్షోభం రాజుకుంటుందనేది నిపుణుల మాట.

కుటుంబ నియంత్రణ నిక్కచ్చిగా పాటించడం వలన దక్షిణ భారత జనాభా ఉత్తర భారత జనాభా కంటే బాగా తగ్గిన సంగతి తెలిసిందే. నిజానికి దక్షిణ భారతం ప్రకృతి వనరులూ, మానవ వనరుల పరంగా ఉత్తరాదికన్నా శక్తిమంతంగా ఉంది. దీని అంతటికీ కారణం శతాబ్దాలుగా బౌద్ధ జీవన సాంస్కృతిక వికాసమేనని చెప్పక తప్పదు. ఉత్తర భారతంతో పోల్చినప్పుడు, దక్షిణ భారతం అహింసాత్మకంగా ఉంది. శాంతియుతంగా వుంది. విద్యాపరంగా బలంగా ఉంది. అక్షరాస్యతలో ముందు ఉంది. స్త్రీ విద్యలో ముందు ఉంది. చరిత్ర, సంస్కృతులను పరిశీలించినా దక్షిణాదికి ప్రత్యేక స్థానం ఉన్నట్లు స్పష్టమవుతుంది.

రక్తపాత రహిత కుల నిర్మూలన ఉద్యమం కొనసాగుతోందిక్కడ. అతి ప్రాచీన భాషలు మాట్లాడే ఆదివాసీలు ఎందరో ఇక్కడ ఉన్నారు. శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, చోళులు, విజయనగరరాజులు... ఇలా ఎందరో రాజులు, చక్రవర్తులు ఈ నేల సుభిక్షం కావడానికి తమ యుద్ధనైపుణ్యాన్నీ, పాలనా చాతుర్యాన్నీ ప్రదర్శించారు.

ఈ రోజు ఢిల్లీ వాయు కాలుష్యంతో ఆక్సిజన్ లేక జీవన సంక్షోభంలో వుంది. దానికి ప్రత్యామ్నాయ రాజధాని వంటి హైదరాబాద్ దక్షిణాది నగరమే కదా. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ ఆనాడే హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేసుకోమని చెప్పారు. హైదరాబాద్ ఇటు దక్షిణాది వారికి, అటు ఉత్తరాది వారికి, పశ్చిమ భారతానికీ సెంటర్‌గా ఉంటుందని కూడా ఆయన చెప్పారు.



చెన్నైలో డీలిమిటేషన్‌పై జరిగిన సమావేశం

విద్య, సాంకేతిక రంగాల్లో దక్షిణ భారతదేశం ఇప్పటికే ముందు ఉంది. ఐటీ, సాఫ్ట్‌వేర్, సాంకేతిక ఉత్పత్తుల ఎగుమతుల్లో దక్షిణాది రాష్ట్రాలే ముందున్నాయి. అలాగే ప్రపంచంలోని ప్రఖ్యాత సంస్థల్లో మన తెలుగువారితోపాటు మిగతా దాక్షిణాత్యులే ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్న సంగతీ తెలిసిందే. అరకొరగా ఉన్న వనరుల నుంచే ఈ స్థాయికి చేరారు మనవారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యపై కేంద్ర పెత్తనాన్ని పెంచే ప్రతిపాదన ముందుకు వచ్చింది. వర్సిటీలు, కళాశాలల్లో అధ్యాపకులు, బోధనా సిబ్బంది నియామకం, పదోన్నతికి కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు 'మార్గదర్శకాలు–2025' పేరిట విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల ఒక ముసాయిదాను విడుదల చేసింది. అందులోని అంశాలు బాగా వివాదాస్పదమవుతున్నాయి. ఇప్పటిదాకా విశ్వవిద్యాలయాల అధిపతులైన ఉపకులపతుల నియామకం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలో ఉంది. నూతన ముసాయిదా ప్రకారం ఆ అధికారం ఛాన్స్‌లర్లుగా ఉన్న గవర్నర్ల చేతుల్లోకి వెళ్తుంది. ఈ మార్పును బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. తమిళనాడు, కేరళ వంటివి నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ చట్ట సభల్లో తీర్మానం కూడా చేశాయి. వైస్ ఛాన్స్‌లర్ల నియామక ప్రక్రియను కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకోవడాన్ని అవి వ్యతిరేకిస్తున్నాయి. కేంద్ర చర్యలతో ఉన్నత విద్యపై తమ పట్టును పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని ఆ యా రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర– రాష్ట్ర సంబంధాలు బలహీనమవ్వడం గమనార్హం.

ఈ పరిస్థితుల్లో డీలిమిటేషన్ అంశం ముందుకు రావడంతో దక్షిణాది రాష్ట్రాలు కేంద్రంతో అమీ తుమీ తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నిరసన గళాన్ని వినిపించడంలో ముందున్నారు. ఆయన చెన్నైలో ఏర్పాటు చేసిన సమావేశానికి దక్షిణ భారతానికి చెందిన బీజేపీయేతర పార్టీలు చాలావరకూ హాజరయ్యాయి. ఈ విషయంలో అన్నీ ఒకే విధమైన నిరసనను వ్యక్తం చేయడం స్వాగతించవలసిన విషయం. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి ఎటువంటి నష్టం రాదని కేంద్ర పాలకులు అంటున్నా... అది ఎలాగో ఇంతవరకూ వివరించలేదు. కేంద్రం సముచితంగా వ్యవహరించకపోతే దేశంలో అశాంతి రేగే ప్రమాదాన్ని చెన్నై సమావేశ ధోరణి చూస్తే అర్థమవుతుంది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు
మొబైల్: 98497 41695

ఫిత్రా పరమార్థం

పవిత్ర రమజాన్ నెల చివరిలో ఆచరించబడే ఒకానొక సత్కార్యం 'ఫిత్రా'. ఫిత్రా అన్న పదం ఇఫ్తార్ నుండి వచ్చింది. ఫిత్ర్ అంటే అర్థం ఉపవాస విరమణ అని! 'సదఖయే ఫిత్ర్' అంటే రోజా విరమణకు సంబంధించిన దానం అని అర్థం. రోజాలు విధిగా నిర్ణయించిన నాటి నుండే ఫిత్రాలు కూడా తప్పనిసరిగా చెల్లించాలని ప్రవక్త (స) వారు ఆదేశించారు. ఆ కాలంలో ప్రజలు ముఖ్య ఆహారంగా వినియోగించే పదార్థాలనే పరిగణన లోకి తీసుకొని ఫిత్రాలు చెల్లించేవారు. హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (ర) ఇలా చెప్పారు: 'ప్రవక్తవారి కాలంలో మేము ఈదుల్ ఫిత్ర్ (పండుగ) దానంగా ఒక 'సా' పరిమాణమంత పదార్థాలను ఇచ్చే వాళ్ళం. ఆ కాలంలో యవలు, ఎండుద్రాక్ష, ఖర్జూరం, జున్ను తదితరాలు ముఖ్య ఆహార పదార్థాలుగా ఉండేవి.' (సహీహ్ బుఖారీ, హ.నెం. 1510, సహీ ముస్లిం హ. నెం 985) 'సా' అంటే పావుతక్కువ రెండు శేర్లు. మారిన కాలాన్ని, నేటి పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ఆహార పదార్థాలు, వస్త్రాలు, నగదు.... ఏ రూపంలో అయినా సరే ఫిత్రాలు చెల్లించవచ్చు. ఫిత్రాలవల్ల రెండు రకాల లాభాలున్నాయి. ఒకటి: రోజాలను ఎంత నిష్ఠగా పాటించినా, మానవ సహజ బలహీనతల వల్ల ఏవో చిన్నచిన్న పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి. వాటికి పరిహారంగా ఈ ఫిత్రాలు ఉపయోగపడతాయి. వీటివల్ల రోజాలు పవిత్రతను, పరిపూర్ణతను సంతరించుకొని స్వీకార భాగ్యానికి నోచుకుంటాయి. రెండు: ఫిత్రాల వల్ల సమాజంలోని పేద, బలహీన వర్గాలకు కాస్తంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. తద్వారా వారు కూడా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోగలుగుతారు.



అందుకే ఫిత్రాలను ఉపవాసులకే పరిమితం చేయకుండా, ఈ పరిధిని విస్తరించారు. అంటే ఉపవాసం ఉన్నా లేకపోయినా అందరూ ఫిత్రా చెల్లించాలి. కుటుంబంలో ఎంతమంది ఉంటే, వారందరి తరఫున కుటుంబ యజమాని ఫిత్రా చెల్లించాలి. పండుగ సంతోషంలో అందరినీ భాగస్వాములను చేయడమే దీని అసలు ఉద్దేశం.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్

‘దేవాదుల’ నీటి విడుదల

- దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద మోటార్‌ను ఆన్ చేసిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి
- ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద చీర, సారె సమర్పణ



ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద నీటికి సారె సమర్పిస్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు తదితరులు

ధర్మసాగర్/హసన్‌పర్తి: ఎట్టకేలకు దేవన్నపేటలోని పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి మంత్రులు నీటిని విడుదల చేశారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని పంప్‌హౌస్ నుంచి 3వ ఫేజ్ పైప్‌లైన్ మోటార్‌ను ప్రారంభించడానికి వారం రోజుల క్రితం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాగా, సాంకేతిక సమస్యతో మోటార్లు ఆన్ కాని విషయం తెలిసిందే. మరమ్మతుల అనంతరం రెండు రోజుల క్రితం కూడా మళ్లీ ట్రయన్‌రన్ చేయగా, గేట్‌వాల్వ్‌లు పడిపోయాయి. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశారు. దీంతో గురువారం తెల్లవారు జామున ట్రయల్ రన్ సక్సెస్ అయ్యింది. సాయంత్రం మంత్రులిద్దరూ దేవన్నపేటలోని పంప్‌హౌస్ వచ్చారు. అయితే మళ్లీ సాంకేతిక సమస్య తలెత్తడంతో అరగంట పాటు ఆగాల్సి వచ్చింది. టెక్నీషియన్‌లు సమస్యను పరిష్కరించిన తర్వాత మంత్రులు మోటార్లు ఆన్ చేశారు.

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం : మంత్రి ఉత్తమ్

రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దేవన్నపేటలోని పంప్‌హౌస్ నుంచి 3వ ఫేజ్ పైప్‌లైన్ మోటార్‌ను గురువారం సాయంత్రం ఆయన ఆన్ చేసి ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ వద్ద నీటిలో పూలు, చీర, సారె వదిలారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం డిసెంబర్‌లోపు అన్ని పనులు పూర్తి చేసి సాగునీటిని అందిస్తామన్నారు. అందులో భాగంగా ఈ రోజు ఒక పంప్ ఆన్ చేసి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని,. రెండవ మోటారును కూడా 15 రోజుల్లో ఆన్ చేస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కేంద్ర నిధులు అందించాలని కోరుతూ కేంద్రజలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన విషయాన్ని గుర్తు చేశారు. దేవన్నపేట వద్ద పంప్‌హౌస్‌ను అద్భుతమైన డిజైన్‌తో రూపొందించామని, 144.50 మీటర్ల లోతులో 25.50 మీటర్ల వెడల్పుతో నిర్మించిన ఈ పంప్‌హౌస్‌లో మూడు 31 మెగావాట్ల సింక్రోనస్ మోటార్లు అమర్చామని చెప్పారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టును నేడు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వమే 3వ దశ పనులు పూర్తి చేసి మోటార్లను ఆన్ చేసిందన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు మంత్రి ఉత్తమ్ అధికారులను పరుగులు పెట్టించి టెక్నికల్‌గా ఎన్ని ఆటంకాలు ఎదురైనా, వాటిని అధిగమించి ఒక మోటార్‌ను ఆన్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ అశోక్‌కుమార్, ఎస్‌ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

8 మందికి రిమాండ్.. పరారీలో ముగ్గురు

- గణిత ప్రశ్నపత్రంలో ఐదు ప్రశ్నల లీకేజీ కేసు వ్యవహారం



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా జుక్కల్ పరీక్ష కేంద్రంలో పదో తరగతి గణిత ప్రశ్నపత్రంలోని 5 ప్రశ్నలు బయటకు రావడం, సోషల్ మీడియాలో వైరల్ అయిన వ్యవహారంలో పోలీసులు మొత్తం 11 మందిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో ముగ్గురు విద్యార్థులు, నలుగురు మీడియా ప్రతినిధులు, మరో నలుగురు వ్యక్తులు ఉన్నారు. ఇప్పటివరకు ఇద్దరు మైనర్లు సహా మొత్తం 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని.. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర వెల్లడించారు. పరారీలో ఉన్న ఒక మైనర్ బాలుడు, ఇద్దరు మీడియా ప్రతినిధుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

పేపరు లీకేజీపై ప్రశ్నిస్తే కేసులా?

- బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: పేపరు లీకేజీపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా? అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. దళిత, గిరిజన సమస్యలపై పోరాటం చేస్తున్న కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఎలా నమోదు చేశారని గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ‘కేటీఆర్‌పై కేసు ఎందుకు? బీఆర్ఎస్ పార్టీ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినందుకా? అడగకుండా సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టినందుకా? వేలాది మంది దళితులకు దళిత బంధు పథకం అమలు చేసినందుకా? దళిత–గిరిజనుల కోసం గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు స్థాపించినందుకా? విద్యార్థులకు కోడింగ్ నేర్పించి విదేశాలకు పంపినందుకా?’.. అని ఆయన నిలదీశారు. కేటీఆర్, క్రిశాంక్, దిలీప్ కొణతంపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు.

భవనం కూలిన ఘటనలో ఒకరి మృతి

- ఆస్పత్రికి తరలించిన కాసేపటికే మృతిచెందిన కార్మికుడు
- మరో కార్మికుడి ఆచూకీ కోసం కొనసాగుతున్న సహాయక చర్యలు



పొక్లెయిన్‌తో శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది

భద్రాచలం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో జరిగిన బహుళ అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి రెస్క్యూ టీం తీవ్రంగా శ్రమించి శిథిలాల నుంచి బయటకు తీసుకొచ్చిన కార్మికుడు చల్లా కామేశ్వరరావు (48).. ఆస్పత్రికి తరలించిన కాసేపటికే మృతి చెందాడు. తల, ఉదర భాగం మినహా నడుం కింది భాగంలో అవయవాలన్నీ శిథిలాల కింద నలిగిపోవడంతో ప్రాణాలు వదిలాడు. మరో కార్మికుడు పడిసర ఉపేందర్ ఆచూకీ కోసం శిథిలాల కింద సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నా యి. కూలిన ఐదు స్లాబులను క్రేన్‌లతో డ్రిల్ చేస్తూ, కట్టర్‌లు, గ్యాస్ వెల్డింగ్‌తో ఇనుమును తొలగిస్తున్నారు. అయితే ఉపేందర్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు బ్రిడ్జి సెంటర్‌లో, ఘటనాస్థలం వద్ద ఆందోళన చేశారు. సహాయక చర్యల్లో ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కుటుంబ సభ్యులకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహాయక చర్యలను భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పర్యవేక్షిస్తున్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు ‘ఎంఎంటీఎస్’ అనుమానితులు

సికింద్రాబాద్: ఎంఎంటీఎస్ రైల్లో ఈ నెల 22న ఓ యువతిపై జరిగిన అత్యాచార యత్నం కేసులో పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అత్యాచార యత్నం నుంచి తప్పించుకొనే క్రమంలో రైల్లోంచి దూకడంతో తీవ్రంగా గాయపడిన బాధితురాలికి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పలు శస్త్ర చికిత్సలు జరగడంతో ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. ఈ నేపథ్యంలో నిందితుడిని గుర్తించే ప్రయత్నంలో పలువురు పాత నేరస్తుల ఫొటోలను పోలీసులు బాధితురాలికి చూపించారు. అందులో నుంచి రెండు ఫొటోల్లోని వ్యక్తులను అనుమానితులుగా ఆమె పేర్కొంది. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

రామోజీ ఫిలిం సిటీ ఆక్రమించిన స్థలాలకు విముక్తి కల్పించండి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విజ్ఞప్తి



రామోజీ ఫిలిం సిటీ ఆక్రమించిన పేదల ఇళ్ల స్థలాలకు విముక్తి కల్పించాలని కోరుతూ సీపీ సుధీర్‌బాబుకు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: రామోజీ ఫిలిం సిటీ ఆక్రమించిన పేదల ఇంటి స్థలాలను విడిపించి, బాధితులకు న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పోలీసు శాఖను కోరారు. ఈమేరకు ఆయన పార్టీ రాష్ట్ర నాయకుడు డీజీ నర్సింహారావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామేలుతో కలసి గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2007లో అప్పటి ప్రభుత్వం 60 గజాల చొప్పున పేదలకు పంపిణీ చేసిన భూములను రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం ఆక్రమించిందని తెలిపారు. ఈ విషయమై అనేకసార్లు ఆందోళనలు చేయగా దిగివచ్చిన ఫిలిం సిటీ నిర్వాహకులు.. మరోచోట 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకూ ఆ హామీ నెరవేరలేదని చెప్పారు. దీనిని నిరసిస్తూ బుధవారం చలో రామోజీ ఫిలింసిటీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఇదిలా ఉండగా బుధవారం ఫిలిం సిటీ ముట్టడి సందర్భంగా సీపీఎం నాయకుల అరెస్టులను నిరసిస్తూ గురువారం రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు.

336 గజాల ప్లాటుకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రూ.104 కోట్లు

- నారాయణ పేట జిల్లాలో విచిత్రం

కోస్గి: ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పిస్తూ అమలుచేస్తున్న ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) గందరగోళంగా మారింది. 336 గజాల ప్లాటుకు ఏకంగా రూ.104 కోట్ల ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు విధించటంతో సదరు ప్లాటు యజమాని బిక్క మొహం వేశాడు. నారాయణపేట జిల్లా గుండుమాల్ మండలం భోగారం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి తన ప్లాటు క్రమబద్ధీకరణ కోసం గతంలో రూ.1,000 ఫీజు చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నాడు. గురువారం తన ప్లాటుకు సంబంధించిన ఫీజు వివరాలు తెలుసుకునేందుకు కోస్గిలోని ఓ ఆన్‌లైన్ కేంద్రానికి వెళ్లాడు. అయితే 336.9 గజాల ప్లాటుకు రూ.104,35,19,683 ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలని ఆన్‌లైన్‌లో చూపడంతో అవాక్కయ్యాడు. ఆన్‌లైన్‌లో చూపిన వివరాల మేరకు 336.9 గజాల ప్లాటుకు సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన మార్కెట్ విలువ రూ. 2,21,22,016 కుగాను రెగ్యులరైజ్ చార్జీలు రూ.1,12,676,14 ఉండగా.. 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీ రూ.104.34 కోట్లు చూపించారు. ఈ విషయంపై ఎంపీడీఓ శ్రీధర్‌ను వివరణ కోరగా.. సదరు ప్లాటు యజమాని వివరాలు సేకరించి జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు.

ఆ ప్లాటుకు తగ్గిన ఎల్‌ఆర్‌ఎస్ రుసుము!

- రూ.27.33 కోట్ల నుంచి రూ.30 వేలకు తగ్గిన ఫీజు

జడ్చర్ల: జడ్చర్లలోని ఓ ప్లాటుకు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము రూ.27.33 కోట్లుగా నిర్ణయించటంపై గురువారం మీడియాలో వచ్చిన కథనాలపై మున్సిపల్ అధికారులు స్పందించారు. సంబంధిత దరఖాస్తును మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి పరిశీలించి సరిచేశారు. కిష్టారెడ్డి నగర్‌లోని సర్వే నంబర్ 108లో కే.ఝాన్సీకి చెందిన 200 చదరపు గజాల ప్లాటుకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఏకంగా రూ.27,33,42,785గా నిర్ణయించిన విషయం విదితమే. ఈ విషయాన్ని మీడియా వెలుగులోకి తేవటంతో అధికారులు తప్పును సరిదిద్దారు. ఆ ప్లాటుకు రూ.30,034లను ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుగా నిర్ణయించారు. అలాగే తప్పుగా చూపిన ప్లాటు విస్తీర్ణాన్ని కూడా సరిచేశారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో రికార్డుస్థాయి యూరియా సరఫరా

- రైలు మార్గాల ద్వారా మార్కెట్‌కు 400 రేకుల యూరియా



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు

ఫెర్టిలైజర్ సిటీ (రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం ఎరువుల కర్మాగారం మరో రికార్డ్ సాధించింది. కర్మాగారం నుంచి బుధవారం రాత్రి 400 రేకుల యూరియాను మార్కెట్‌కు సరఫరా చేశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజహంస, అధికారులు యూరియా రవాణా గూడ్స్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 11.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేశారు. ఉత్పత్తి, రవాణాకు సహకరించిన కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ, ఇండియన్ రైల్వే అధికారులు, రాష్ట్ర, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు సీజీఎం ధన్యవాదాలు తెలిపారు.

మక్కకు మద్దతేదీ?

- మొక్కజొన్నకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,225
- చాలా ప్రాంతాల్లో రూ.2 వేలకు కాస్త ఎక్కువగా మాత్రమే చెల్లిస్తున్న వ్యాపారులు
- రైతుల ఆందోళనలతో రంగంలోకి ప్రభుత్వం
- ఉగాది నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మక్కలు పండించిన రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,225 కాగా.. మార్కెట్‌లోకి వచ్చిన పంటకు తొలుత రూ.2,300కు పైగా ధర పలికినప్పటికీ, చాలా ప్రాంతాల్లో ప్రస్తుతం రూ.2,000కు కాస్త ఎక్కువగా మాత్రమే ధర పలుకుతోంది. జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లో మక్కలకు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కకపోవడంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న సేకరించాలని నిర్ణయించింది. ఉగాది తరువాత వీటిని ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. మక్కను సమర్థవంతంగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

22.91 ఎల్ఎంటీల దిగుబడి అంచనా

రాష్ట్రంలో ఈసారి మొక్కజొన్న సాగు గతంలో ఎన్నడూ లేనంత గణనీయంగా పెరిగింది. యాసంగిలో సాధారణ మొక్కజొన్న సాగు 5.89 లక్షల ఎకరాలు కాగా, గత సంవత్సరం 6.64 లక్షల ఎకరాల మేర సాగయింది. కానీ ఈసారి దాదాపు 2 లక్షల ఎకరాలు అధికంగా 8.83 లక్షల ఎకరాల మేర సాగయింది. నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో ఈ పంట ఎక్కువగా సాగైంది. దీంతో 22.91 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీల) మేర ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటికే కోతలు మొదలు కాగా, ప్రైవేటు వ్యాపారులు, దళారులు, కోళ్ల పరిశ్రమకు చెందిన వారు కొనుగోళ్లు సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) దక్కడం లేదు. చాలా జిల్లాల్లో రూ.2,000 నుంచి రూ.2,150 వరకు మాత్రమే ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొన్ని జిల్లాల్లో రైతులు ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలంటూ ఆందోళనలకు దిగారు.

320 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో మార్క్‌ఫెడ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. మొక్కజొన్న పంట విస్తీర్ణం ఆధారంగా ఆయా జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత ఏడాది 309 కేంద్రాలు ఏర్పాటు చేయగా, కేవలం 2.67 ఎల్ఎంటీల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. ప్రైవేటు వ్యాపారులు ఎంఎస్‌పీ కన్నా ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేయడంతో మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మక్కలు రాలేదు. కానీ ఈసారి పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ఎక్కువ మక్కలను సేకరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 320 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. అత్యధికంగా నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ఇవి ఏర్పాటు కాబోతున్నాయి.

కడావర్ డాగ్స్‌తో మరోసారి గాలింపు

- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలు



సొరంగంలోనికి వెళుతున్న కడావర్ డాగ్స్ బృందం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో గల్లంతైన వారి జాడ తెలుసుకునేందుకు గురువారం మధ్యాహ్నం మరోసారి కడావర్ డాగ్స్‌ను తీసుకెళ్లి ప్రమాదస్థలంలో గాలింపు చర్యలు చేపట్టారు. గతంలో సొరంగం ఎండ్ ఫేస్ చివరలో ఈ డాగ్స్‌తో గాలించారు. ఇప్పుడు వెనుకవైపు 160 మీటర్ల దూరంలో మట్టిలో కూరుకుపోయిన మృతదేహాల వాసనలను గుర్తించేందుకు మరోసారి డాగ్స్‌ను టన్నెల్‌లోనికి తీసుకెళ్లారు. మొత్తం 13.940 కి.మీ వరకు తవ్విన సొరంగంలో 13.500 వరకు లోకోట్రెన్ వెళ్లగలుగుతోంది. అక్కడి నుంచి 250 మీటర్ల వరకూ పేరుకుపోయిన మట్టి, శిథిలాల్లో సుమారు 60 మీటర్ల మేరకు మట్టిని తొలగించగలిగారు. ఇందుకోసం నాలుగు ఎస్కవేటర్లు పని చేస్తున్నాయి. ప్రత్యేక అధికారి శివశంకర్ నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు సహాయక బృందాల నిపుణులతో కలసి సమీక్షిస్తున్నారు.

భారీగా కొనసాగుతున్న నీటి ఊట..

సొరంగంలో ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతంతో నిమిషానికి 3,900 లీటర్ల నీరు ఊరుతోంది. భారీ ఎత్తున వస్తున్న నీటిని సొరంగం నుంచి బయటకు తరలించేందుకు ప్రతీ 2.5 కి.మీ. పాయింట్‌లో ఒకటి చొప్పున 150 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న మోటార్లను వినియోగిస్తున్నారు. అడ్డుగా ఉన్న టీబీఎం భాగాలను గ్యాస్‌కట్టర్లతో కట్ చేస్తూ లోకోట్రెన్ ద్వారా బయటకు తరలిస్తున్నారు.

స్వగ్రామానికి చేరిన మనోజ్‌కుమార్ మృతదేహం

జేపీ కంపెనీకి చెందిన ప్రాజెక్ట్ ఇంజినీర్ మనోజ్‌కుమార్(50) మృతదేహం ప్రత్యేక అంబులెన్స్‌లో గురువారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉన్నవ్ జిల్లాలోని ఆయన స్వగ్రామమైన బంగార్మావ్ చేరుకుంది. మనోజ్‌కుమార్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అధికారులు అందజేశారు.

మరో టారిఫ్ బాంబు

కార్లపై 25 శాతం: ట్రంప్

- విడి భాగాలు, ట్రక్కులపైనా
- భగ్గుమన్న ప్రపంచ దేశాలు
- మాపై ప్రత్యక్ష దాడే: కెనడా
- తీవ్రంగా ఖండించిన ఈయూ
- డబ్ల్యూటీఓకు ఫిర్యాదు: బ్రెజిల్
- భారత్‌పైనా గణనీయ ప్రభావం


ట్రంప్

వాషింగ్టన్/టొరంటో/ఫ్రాంక్‌ఫర్ట్/టోక్యో: ప్రపంచ దేశాలతో టారిఫ్‌ల యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తారస్థాయికి తీసుకెళ్తున్నారు. తమ దేశంలోకి దిగుమతయ్యే అన్నిరకాల కార్లపైనా సుంకాలను ఏకాయెకి 25 శాతానికి పెంచేస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఇది కార్ల విడిభాగాలతో పాటు తేలికపాటి ట్రక్కులకు కూడా వర్తించనుంది. ''కొత్త టారిఫ్‌లు ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి వస్తాయి. ఇది శాశ్వత నిర్ణయం. దీనిపై వెనక్కు తగ్గేదే లేదు'' అని ట్రంప్ బుధవారం ప్రకటించారు. ''సుంకాలు వద్దనుకునే తయారీ కంపెనీలు అమెరికాలోనే కార్లను తయారు చేసుకుంటే సరి! పైసా కూడా పన్ను కట్టాల్సిన పనుండదు!'' అంటూ హితవు పలికారు! భారత్‌తో పాటు పలు దేశాలపై ప్రకటించిన పరస్పర సుంకాలు కూడా ఏప్రిల్ 2 నుంచే అమల్లోకి వస్తాయని ట్రంప్ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే. దాన్ని 'విముక్తి దినం'గా అభివర్ణించారు. ఒకట్రెండు రోజుల్లో మరిన్ని కఠిన వాణిజ్య నిర్ణయాలు కూడా ప్రకటించనున్నారు. కార్లపై సుంకాల పెంపుపై ప్రపంచ దేశాలు భగ్గుమన్నాయి. కెనడా, మెక్సికో, చైనా, బ్రెజిల్, జపాన్‌తో పాటు పలు యూరప్ దేశాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించాయి. దీన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్‌చేశాయి. లేదంటే తగిన ప్రతి చర్య తప్పదని హెచ్చరించాయి. ట్రంప్ నిర్ణయం ప్రభావం భారత్‌పైనా పడనుంది. టాటా మోటార్స్, ఐషర్ మోటార్స్ వంటి ఆటో దిగ్గజాలు తీవ్రంగా ప్రభావితం కానున్నాయి.

త్వరలో ప్రతీకార చర్యలు: కెనడా

ట్రంప్ ప్రకటించిన కార్ల సుంకాలను కెనడాపై ప్రత్యక్ష దాడిగా ప్రధాని మార్క్ కార్నీ అభివర్ణించారు. దీనిబారి నుంచి తమ దేశాన్ని, కార్ల పరిశ్రమను, కంపెనీలను, కార్మికులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుని తీరతామని ప్రకటించారు. దీనికి తప్పకుండా ప్రతీకార చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వాటిపై నిర్ణయం తీసుకునేందుకు 'అమెరికాతో సంబంధాలపై కేబినెట్ కమిటీ'తో కార్నీ గురువారం అవ్యతసరంగా సమావేశం కానున్నారు. ఇందుకోసం ఎన్నికల ప్రచారం నుంచి ఆయన ఉన్నపళాన ఒట్టావా చేరుకున్నారు. ట్రంప్ టారిఫ్‌ల బారినుంచి దేశీయ ఆటో పరిశ్రమను కాపాడేందుకు కెనడా ఇప్పటికే 140 కోట్ల డాలర్ల నిధిని ఏర్పాటు చేసింది. అమెరికాకు కెనడా ఎగుమతుల్లో ఆటో ఉత్పత్తులది రెండో స్థానం.

అమెరికాపైనా ప్రభావం

ట్రంప్ కార్ల టారిఫ్ నిర్ణయం ప్రభావం అమెరికాపైనా గట్టిగానే పడనుంది. ముఖ్యంగా డెట్రాయిట్ వంటి కార్ల పరిశ్రమ కేంద్రాలకు ఇది కోలుకోలేని దెబ్బే కానుంది. అక్కడి నుంచి ఒక్క కెనడాకే 40 శాతం కార్లు ఎగుమతి అవుతాయి. ఇతర దేశాలన్నీ అమెరికాపై విధించబోయే ప్రతీకార సుంకాలు దేశీయ కార్ల పరిశ్రమ నడ్డి విరవడం ఖాయమని ఆ రంగ నిపుణులు చెబుతున్నారు. ''కార్ల కంపెనీలు తయారీ యూనిట్లు అమెరికా బయటికి తరలి వేలాది మంది ఉపాధి కోల్పోవచ్చు. సరిహద్దులకు రెండు వైపులా చాలా కార్ల కంపెనీలు మూతబడటం ఖాయం. ఏప్రిల్ 2 అమెరికాకు విముక్తి దినమని ట్రంప్ అనుకుంటున్నారు. కానీ నిజానికి అది ఆ దేశం పాలిట వినాశ దినం కాబోతోంది'' అని కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ గవర్నర్ డౌగ్ ఫోర్డ్ చెప్పారు.

2024లో అమెరికా దిగుమతి చేసుకున్న కార్లు, ట్రక్కులు దాదాపు 80 లక్షలు
వాటి విలువ 24,000 కోట్ల డాలర్లు

యూరప్ ఆందోళన

ఆర్థిక మందగమనంతో ఇప్పటికే సతమతమవుతున్న యూరప్ కార్ల పరిశ్రమపై ట్రంప్ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది. బీఎండబ్ల్యూ, ఫోక్స్‌వాగన్, మెర్సిడెజ్–బెంజ్, వోల్వో, స్టెలాంటిస్ వంటి యూరప్ తయారీ కార్ల ధరలు అమెరికాలో భారీగా పెరగనున్నాయి. ట్రంప్ చర్యను అక్కడి కార్ల దిగ్గజాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది అమెరికాపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని యూరప్ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం హెచ్చరించింది. అందుకు తగ్గట్టుగానే ట్రంప్ ప్రకటన తర్వాత ఫోర్డ్, జనరల్ మోటార్స్ వంటి అమెరికా కార్ల తయారీ దిగ్గజాల షేర్ల ధరలు పతనమయ్యాయి. యూరప్ ఆటో పరిశ్రమకు అమెరికాయే అతి పెద్ద దిగుమతిదారు. 2023లో అక్కడి నుంచి అమెరికాకు 560 కోట్ల యూరోల విలువైన వాహనాలు, విడిభాగాలు ఎగుమతయ్యాయి. ఇటలీ, జర్మనీ కార్ల ఎగుమతుల్లో 30 శాతం వాటా అమెరికాదే. అమెరికా కార్ల ఎగుమతుల్లో యూరప్ వాటా కేవలం 2 శాతమే. జపాన్ కార్లకు అమెరికాయే అతి పెద్ద దిగుమతిదారు. దాంతో ట్రంప్ నిర్ణయం గురువారం జపాన్ పార్లమెంటును కుదిపేసింది. ప్రధాని షిగెరు ఇషిబా దీనిపై సభలో ప్రకటన చేశారు. తాజా నిర్ణయం నుంచి తమను మినహాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా కూడా ట్రంప్ నిర్ణయంపై మండిపడ్డారు. స్వేచ్ఛా వాణిజ్య విలువలకు ఇష్టానికి తూట్లు పొడవడం ద్వారా ట్రంప్ సర్కారు దారుణంగా ప్రవర్తిస్తోందంటూ తూర్పారబట్టారు. ''ట్రంప్ తాను ప్రపంచానికే అధ్యక్షుడినని భావిస్తున్నారు. ఈ మతిలేని నిర్ణయాలు అంతిమంగా అమెరికాతో పాటు ఎవరికీ మంచి చేయవు'' అని హెచ్చరించారు. అమెరికా టారిఫ్‌లపై ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు.

శ్వేతసౌధంలో చిరు చొరబాటు

- ఫెన్సింగ్ చువ్వల మధ్యల్లోంచి వైట్‌హౌస్ గార్డెన్‌లోకి వచ్చిన చిన్నారి
- ఎత్తుకెళ్లి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ ప్రచారం చేస్తున్న వేళ కాల్పుల ఘటనతో ఉలిక్కిపడిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆనాటి నుంచి అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ ఏజెంట్లకు బుధవారం ఒక చిన్నారి కాస్తంత పనిచెప్పాడు. తల్లిదండ్రులతో కలిసి వాషింగ్టన్ డీసీలో అధ్యక్షుని అధికార నివాసం వైట్‌హౌస్ ఉన్న ప్రాంతానికి వచ్చాడు. రోడ్డుకు, శ్వేతసౌధానికి మధ్య గోడ కాకుండా కేవలం నిలువెత్తు ఇనుప చువ్వల ఫెన్సింగ్ మాత్రమే ఉంటుంది. హఠాత్తుగా రోడ్డు మీద నుంచి ఆ ఫెన్సింగ్ చువ్వల సందుల్లోంచి సులభంగా దూరిపోయి వైట్‌హౌస్ గార్డెన్‌లోకి వచ్చి అంతా కలియ తిరగడం మొదలెట్టాడు. ఇది చూసి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు చకచకా వచ్చేసి చిన్నారిని ఎత్తుకుని తీసుకెళ్లారు. బయటివైపు పిల్లాడి కోసం చూస్తున్న తల్లిదండ్రులకు అప్పగించారు. ఉత్తరం వైపు పచ్చికబయళ్ల వద్ద బుధవారం సాయంత్రం 6.30 గంటలకు ఈ ఘటన జరిగిందని సీక్రెట్ సర్వీస్ అధికార ప్రతినిధి ఆంటోనీ గుగెల్మీ చెప్పారు. నీలం రంగు హూడీ చొక్కా వేసుకున్న చిన్నారిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ ఎత్తుకునిరావడం, పిల్లాడు అతని గడ్డంతో ఆడుకుంటున్న దృశ్యాలున్న వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతోంది. '' ఎంతోమంది నిరసనకారులు ఆ ఫెన్సింగ్ దాటేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. కానీ ఈ పిల్లాడు రెప్పపాటులో ఫెన్సింగ్ దాటేశాడు'' అని ఒక నెటిజన్ కామెంట్ చేశాడు. '' వైట్‌హౌస్‌లో ఈజీగా వెళ్లిపోయానని భవిష్యత్తులో చెప్పుకోవడానికి ఆ పిల్లాడికి ఇది ఒక చిరస్మరణీయ ఘటనగా నిలిచిపోతుంది'' అని మరో నెటిజన్ వ్యాఖ్యానించారు. '' అతను ఒకవేళ ఎలాన్ మస్క్ డజను మంది సంతానంలో ఒకరై ఉంటారు. తండ్రి ఆఫీస్ ఇదేననుకుని వచ్చాడేమో'' అని మరొకరు ట్వీట్‌చేశారు.

పుతిన్ త్వరలో చనిపోతారు

జెలెన్‌స్కీ సంచలన ప్రకటన

కీవ్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోగ్యంపై వదంతుల నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సంచలన ప్రకటన చేశారు. ఆయన తొందరలోనే చనిపోతారని వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య యుద్ధం అప్పుడే ముగుస్తుందన్నారు. పారిస్‌లో ఓ ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో బుధవారం భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాంతి ప్రయత్నాలు జరుగుతున్నా రష్యా మాత్రం సంఘర్షణను ఇంకా లాగుతోందని ఆరోపించారు. ''యుద్ధం కొనసాగాలని రష్యా కోరుకుంటోంది. యుద్ధాన్ని ముగించేలా దానిపై ఒత్తిడి తేవాల్సిన అవసరముంది'' అన్నారు. పుతిన్ ఆరోగ్యంపై కొన్ని నెలలుగా ఊహాగానాలు, వదంతులు వినిపిస్తున్నాయి. ఆయన ఎడ తెరిపి లేకుండా దగ్గుతున్న వీడియోలు, చేతులు, కాళ్లు అసంకల్పితంగా కదలడం వంటివి పుకార్లకు మరింత బలం చేకూర్చాయి. 2022లో రష్యా మాజీ రక్షణ మంత్రి సెర్గీ షొయిగుతో భేటీ సందర్భంగా పుతిన్ టేబుల్ పట్టుకొని కుర్చీలో కూర్చున్న వీడియో వైరలైంది. ఆయన పార్కిన్సన్, కేన్సర్‌తో పోరాడుతున్నట్టు కొన్ని నివేదికలు కూడా వచ్చాయి. క్రెమ్లిన్ మాత్రం ఈ వార్తలను ఖండించింది.

వసుధైక కుటుంబం ఎక్కడ: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దేశంలో కుటుంబ వ్యవస్థ క్రమంగా విచ్ఛిన్నమై పోతోందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. ప్రపంచమంతా ఒక్కటే కుటుంబం (వసుధైక కుటుంబం) అని భావించడం భారతీయ సంప్రదాయమని పేర్కొంది. ప్రస్తుతం ఆ భావన ఎక్కడా కనిపించడం లేదని, ఒక్కరే ఒక కుటుంబం అనే పరిస్థితి వచ్చిందని వెల్లడించింది. దగ్గరి కుటుంబ సభ్యులను సైతం కలిపి ఉంచలేకపోతున్నామని తెలియజేసింది. తమ ఇంటిని, ఆస్తులను ఆక్రమించుకొని, తమను వేధిస్తున్న కుమారుడిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టితో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కుటుంబం అనే భావన కనుమరుగైపోతోందని విచారం వ్యక్తంచేసింది. తల్లిదండ్రులతో పిల్లలను ఒక్కటిగా కలిపి ఉంచడం అసాధ్యంగా మారుతోందని తెలియజేసింది. ఈ కేసులో కుమారుడిని ఇంటి నుంచి బయటకు పంపించాల్సిన అవసరం లేదని భావిస్తున్నామని స్పష్టం చేసింది. తల్లిదండ్రుల జీవనానికి అవసరమైన ఖర్చులు ఇవ్వాలని కుమారుడిని ధర్మాసనం ఆదేశించింది.

ఎట్టకేలకు కశ్మీర్ లోయలో రైలు సేవలు

- ఏప్రిల్ 19న కట్రా– శ్రీనగర్ రైలు సేవలు ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రఖ్యాత చినాబ్ నది వంతెనను సందర్శించనున్న మోదీ

శ్రీనగర్: పర్వతమయ కశ్మీర్ లోయలో వచ్చే నెలలో రైలు పట్టాలపై పరుగులు పెట్టనుంది. ఏప్రిల్ 19వ తేదీన కట్రా–శ్రీనగర్ రైలు సేవలను ప్రధాని మోదీ ప్రారంభించే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు గురువారం వెల్లడించాయి. నూతన రైలు సర్వీస్ ప్రారంభోత్సవాన్ని చిరస్మరణీయంగా మార్చేందుకు కొత్త మార్గంలో వందేభారత్ రైలును నడపాలని అధికారులు నిర్ణయించారు. నూతన సర్వీస్‌ను ప్రధాని మోదీ స్వయంగా వచ్చి పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. అంతకుముందు చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైలు వంతెనను మోదీ పరిశీలించనున్నారు. తర్వాత కట్రాలో రైలు సేవలను ప్రారంభించి అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి జితేందర్ సింగ్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, స్థానిక బీజేపీ నేతలు తదితరులు పాల్గొంటారు. రైలును కొంతకాలం కట్రా, శ్రీనగర్/బారాముల్లా స్టేషన్ల మధ్య నడుపుతారు. జమ్మూ రైల్వేస్టేషన్ విస్తరణ పనులు పూర్తయ్యాక ఆగస్టు నెల నుంచి జమ్మూ దాకా ఈ రైలు సేవలను విస్తరిస్తారు. అప్పటి నుంచి రైలు సేవలు జమ్మూ–శ్రీనగర్/బారాముల్లా మార్గంలో కొనసాగనున్నాయి. ఇంతవరకు ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు నేరుగా ఒక్క రైలు సర్వీస్ కూడా లేదు. దశాబ్దాలుగా కశ్మీర్ లోయ ప్రాంతం భారత్‌తో రైలు మార్గాన అనుసంధానమై లేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు గరిష్టంగా సంగల్దాన్–బారాముల్లా సెక్షన్ దాకా మాత్రమే రాగలవు. సుదూర సర్వీస్ రైళ్లు అయితే కట్రా వరకే రాగలవు. తాజా విస్తరణతో కశ్మీర్ లోయ ప్రాంతవాసులు కూడా తొలిసారిగా రైలు సేవలను అందుకోనున్నారు.

2,000 వీసా అపాయింట్‌మెంట్లు రద్దు

- 'బాట్స్' సాయంతో వీటిని మోసపూరితంగా బుక్ చేశారు
- ఇలాంటి మోసాలను సహించబోమన్న అమెరికా ఎంబసీ

న్యూఢిల్లీ: భారత్‌లో 2,000 వీసా అపాయింట్‌మెంట్లను అమెరికా దౌత్యకార్యాలయం రద్దుచేసింది. 'బాట్స్' సాయంతో మోసపూరితంగా ఈ అపాయింట్‌మెంట్లను ఏజెంట్లు బుక్‌చేశారని అమెరికా ఎంబసీ ఒక ప్రకటనలో పేర్కొంది. '' అక్రమ పద్ధతిలో వీసా అపాయింట్‌మెంట్లను సాధించిన 2,000 మందికి సంబంధించిన షెడ్యూలింగ్‌ను రద్దుచేస్తున్నాం. ఇలాంటి చట్టవ్యతిరేక ధోరణిని అమెరికా ప్రభుత్వం ఏమాత్రం సహించబోదు'' అని భారత్‌లోని అమెరికా దౌత్యకార్యాలయం గురువారం 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌చేసింది. అమెరికాలో విద్య, ఉద్యోగం, వ్యాపారం, పర్యటనల నిమిత్తం పలు రకాల వీసాల కోసం లక్షలాది మంది భారతీయులు ఏటా సొంతంగా దరఖాస్తు చేసుకుంటారు. దీంతో ఈ వీసా దరఖాస్తుల అపాయింట్‌మెంట్ స్లాట్లు వెంటనే బుక్‌కావు. ఒకవేళ బుక్ అయినా మనకు సమీప తేదీల్లో కాకుండా చాలా రోజుల తర్వాత తేదీలకే బుక్ అవుతాయి. దీంతో నిరీక్షణ కాలం విపరీతంగా పెరిగిపోతుంది. అత్యవసరంగా వీసా అపాయింట్‌మెంట్ కావాల్సిన వారి కోసం కొందరు ప్రైవేట్ ఏజెంట్లు రంగంలోకి దిగుతారు. అధునాతన సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల(బాట్స్) ద్వారా వేలాదిగా స్లాట్లను బుక్‌చేసి ఇతరులెవరూ బుక్ చేసుకోకుండా ఇంటర్వ్యూ తేదీలను బ్లాక్ చేస్తారు. దీంతో ఇతర సాధారణ భారతీయ అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని స్లాట్ కోసం ఎంతగా ప్రయత్నించినా బుకింగ్ కావు. అయితే అత్యవసరమున్న అభ్యర్థులు గనక భారీ మొత్తంతో తమ వద్దకు వస్తే ఏజెంట్లు గతంలో బ్లాక్‌చేసిన ఇంటర్వ్యూ స్లాట్‌ను వీళ్లకు అప్పగిస్తారు. ఈ అనైతిక విధానాన్ని గుర్తించిన ఎంబసీ అధికారులు తాజాగా ఇలాంటి 2,000 అపాయింట్‌మెంట్లను రద్దుచేశారు.

యశ్వంత్ వర్మ బదిలీని ఉపసంహరించుకోవాలి


సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు బార్ అసోసియేషన్ల వినతి

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి కొలీజియం చేసిన సిఫార్సును వెనక్కి తీసుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు బార్ అసోసియేషన్లు విజ్ఞప్తి చేశాయి. ఆరు హైకోర్టు బార్ అసోసియేషన్ల ప్రతినిధులు గురువారం జస్టిస్ సంజీవ్ ఖన్నాతోపాటు కొలీజియం సభ్యులతో సమావేశమయ్యారు. పలు డిమాండ్లను ప్రస్తావించారు. యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు దొరికిన నేపథ్యంలో ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సింది పోయి మరో కోర్టుకు బదిలీ చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. తమ డిమాండ్లను కచ్చితంగా పరిశీలిస్తామంటూ జస్టిస్ సంజీవ్ ఖన్నా హామీ ఇచ్చారని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ చెప్పారు.

భారతదేశం ధర్మశాల కాదు

విధ్వంసం సృష్టించడానికి వస్తే కఠినంగా వ్యవహరిస్తాం

- లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ
- ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు–2025కి ఆమోదం


అమిత్ షా

న్యూఢిల్లీ: భారతదేశం ధర్మశాల కాదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు. దేశానికి ముప్పు కలిగించేవారు ఇక్కడికి వచ్చి తిష్ట వేస్తామంటే సహించబోమని హెచ్చరించారు. విదేశాల నుంచి పర్యాటకులుగా లేదా విద్య, వైద్యం, వ్యాపారం, పరిశోధనల కోసం ఎవరైనా వస్తామంటే సాదరంగా ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కానీ, దేశంలో విధ్వంసం సృష్టించడానికి వచ్చేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. దేశంలోకి అక్రమంగా చొరబడేవారిపై కన్నేసి ఉంచుతామన్నారు. కీలకమైన ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు–2025 గురువారం లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. ప్రమాదకరమైన ఉద్దేశాలతో దేశానికి వచ్చేవారిని కచ్చితంగా అడ్డుకుంటామని తెలిపారు. అందరికీ ఆశ్రయం ఇవ్వడానికి ఇది ధర్మశాల కాదన్నారు. జాతీయ భద్రతకు ముప్పుగా మారిన వారిని అనుమతించబోమన్నారు. దేశ అభివృద్ధిలో భాగస్వాములుగా మారడానికి వచ్చేవారిని స్వాగతిస్తామన్నారు. ప్రతిపాదిత ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టంతో దేశ భద్రత మరింత పటిష్టంగా మారుతుందని అమిత్ షా వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థకు, వ్యాపార రంగానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. మన దేశాన్ని సందర్శించే ప్రతి ఒక్కరి సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఈ చట్టం అవసరమని తెలియజేశారు.

బెంగాల్‌పై ధ్వజం

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అక్రమ చొరబాటుదార్లను ముద్దు చేస్తోందని అమిత్ షా ధ్వజమెత్తారు. చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించినవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. బెంగాల్ ప్రభుత్వం భూమిని అప్పగించకపోవడం వల్ల భారత్–బంగ్లాదేశ్ సరిహద్దులో 450 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణం నిలిచిపోయిందని చెప్పారు. అక్కడ కంచె నిర్మించడానికి ప్రయత్నాలు జరిగినప్పుడల్లా తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు అలజడి సృష్టిస్తున్నారని, మతపరమైన నినాదాలు చేస్తున్నారని విమర్శించారు. చొరబాటుదార్లపై తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రేమాభిమానాలు ప్రదర్శిస్తుండడం వల్లే కంచె నిర్మాణం పెండింగ్‌లో ఉండిపోయిందని అన్నారు.

ఏమిటీ బిల్లు?

- ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ బిల్లు–2025 ప్రకారం.. నకిలీ పాస్‌పోర్టు లేదా నకిలీ వీసాతో ఇండియాలోకి ప్రవేశించినా, ఇక్కడ నివసిస్తున్నా, బయటకు వెళ్లిపోయేందుకు ప్రయత్నించినా ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల దాకా జరిమానా విధించవచ్చు.
- తమ వద్ద బస చేస్తున్న విదేశీయుల వివరాలను హోటళ్లు తప్పనిసరిగా ప్రభుత్వానికి అందజేయాలి. విద్యా సంస్థలు, హాస్పిటళ్లు, నర్సింగ్ హోమ్‌లలో కూడా విదేశీయులు ఉంటే ఆ సమాచారాన్ని యాజమాన్యాలు ప్రభుత్వానికి తెలియపర్చాలి.
- చెల్లుబాటు అయ్యే పాసుపోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్ లేకుండా ఇండియాలోకి ప్రవేశిస్తే ఐదేళ్ల దాకా జైలు శిక్ష లేదా రూ.5 లక్షల దాకా జరిమానా విధించవచ్చు. ఒక్కోసారి ఈ రెండు శిక్షలు కలిపి విధించవచ్చు.

రన్యా రావుకు నో బెయిల్

బనశంకరి: బంగారం స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి హర్షవర్ధిని రన్యా అలియాస్ రన్యా రావుకు సెషన్స్ కోర్టు బెయిల్‌కు నిరాకరించింది. విదేశాల్లో బంగారం కొనుగోళ్ల కోసం హవాలా మార్గంలో డబ్బు తరలించినట్లు రన్యా రావు అంగీకరించిందని కోర్టుకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) లాయర్ మధు రావు తెలిపారు. ఈ కేసులో ఆర్థిక అవకతవకలను వెలికి తీసేందుకు జ్యుడీషియల్ దర్యాప్తు చేపట్టారన్నారు. కేసులో రెండో నిందితుడిగా ఉన్న రన్యా రావు సన్నిహితుడు తరుణ్ రాజ్‌ను కూడా అధికారులు ప్రశ్నిస్తున్నారు. రన్యారావు దొంగచాటుగా తీసుకువచ్చిన బంగారాన్ని బెంగళూరుకు చెందిన సాహిల్ జైన్ అనే వ్యాపారికి అప్పగించినట్లు తేలడంతో బుధవారం డీఆర్ఐ అధికారులు అతడిని అరెస్ట్ చేశారు. దీంతో, ఈ కేసులో ఇప్పటి వరకు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లయింది. రన్య మొత్తం 26సార్లు దుబాయ్‌కి వెళ్లివచ్చిందని, ఉదయం వెళ్లి తిరిగి అదే రోజు సాయంత్రం తిరిగి వచ్చేదని లాయర్ మధు రావు చెప్పారు. తనిఖీలను తప్పించుకునేందుకు సవతి తండ్రి, డీజీపీ ర్యాంకు అధికారి రామచంద్రరావు పలుకుబడిని వాడుకుందన్నారు. మార్చి 3వ తేదీన దుబాయ్ నుంచి వచ్చిన రన్య వద్ద డీఆర్ఐ అధికారులు రూ.12.56 కోట్ల బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం తెలిసిందే.

కశ్మీర్‌లో భీకర ఎన్‌కౌంటర్ ముగ్గురు పోలీసులు మృత్యువాత

- ఇద్దరికి గాయాలు
- ఇద్దరు ముష్కరులు సైతం హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో చోటుచేసుకున్న భీకర ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పోలీసులు వీరమరణం పొందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు కూడా హతమయ్యారు. పాక్ భూభాగం నుంచి దొంగచాటుగా చొరబడిన ఐదుగురు ఉగ్రవాదుల ఏరివేతకు చేపట్టిన కార్డన్ ఆపరేషన్ సుదీర్ఘ ఎదురు కాల్పులకు దారి తీసింది. రాజ్‌బాగ్ ప్రాంతంలోని జఖోలె గ్రామం వద్ద గురువారం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆదివారం సాయంత్రం కథువా జిల్లా హిరానగర్ సెక్టార్‌లో జమ్మూకశ్మీర్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ)కి ఎదురుపడ్డ ఉగ్రవాదుల గ్రూపు తప్పించుకుపోయింది. ఘటనాప్రాంతంలో ఎం4 కార్బైన్ తపాకులు నాలుగు, గ్రనేడ్లు 2, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ఒకటి, ఐఈడీ సామగ్రి అక్కడ లభించాయి. శనివారం వీరు లోయమార్గం గుండా, లేదా కొత్తగా నిర్మించిన సొరంగం గుండా చొరబడి ఉంటారని భావిస్తున్నారు. అప్పటి నుంచి డ్రోన్లు, హెలికాప్టర్లు, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, జాగిలాలతో వేటాడుతూనే ఉన్న ఎస్ఓజీ అక్కడికి 30 కిలోమీటర్ల దూరంలో గురువారం వారి జాడను పసిగట్టింది. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఎదురుకాల్పుల్లో తుపాకీ కాల్పులు, బాంబు పేలుళ్లతో సుఫైన్ గ్రామ సమీప దట్టమైన అటవీ ప్రాంతం దద్దరిల్లుతోంది. పోలీసులకు తోడు ఆర్మీ, సీఆర్‌పీఎఫ్‌ను కూడా ఉన్నతాధికారులు అక్కడికి తరలించారు.

రణరంగంగా మారిన భువనేశ్వర్

భువనేశ్వర్: ఒడిశాలో బీజేపీ అధికారంలో వచ్చాక మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని నిరసిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టిన ర్యాలీతో గురువారం భువనేశ్వర్ రణరంగంగా మారింది. అసెంబ్లీ దిశగా దూసుకొస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను మహాత్మా గాంధీ మార్గ్‌లో అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. బారికేడ్లను దాటుకుని వస్తున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులపైకి వారు రాళ్లు రువ్వారు. కుర్చీలను, బాటిళ్లను విసిరేశారు. ఒక పోలీసు వాహనానికి నిప్పుపెట్టేందుకు యత్నించారు. ఘటనలో 15 మంది పోలీసులతోపాటు ఒక టీవీ రిపోర్టర్ తలకు గాయాలయ్యాయి. దీంతో, పోలీసులు లాఠీచార్జి చేయడంతో 10 మంది వరకు గాయపడ్డారు. క్షతగాత్రులంతా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని డీసీపీ జగ్‌మోహన్ మీనా చెప్పారు.

30న నాగపూర్‌కు మోదీ

నాగపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 30వ తేదీన మహారాష్ట్రలోని నాగపూర్‌లో పర్యటించనున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవర్ స్మారకాన్ని ఆయన సందర్శిస్తారు. అలాగే మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. హెడ్గేవర్‌తోపాటు ఆర్ఎస్ఎస్ రెండో సర్‌సంఘ్‌చాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ స్మారకాలను నాగపూర్‌లో రేషిమ్ బాగ్ ప్రాంతంలోని డాక్టర్ హెడ్గేవర్ స్మృతి మందిర్‌లో నిర్మించారు. ఇరువురు నేతల స్మారకాలను ప్రధాని మోదీ సందర్శించి, నివాళులర్పిస్తారని మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే గురువారం వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1956లో వేలాది మంది దళితులతో కలిసి బౌద్ధ దీక్ష స్వీకరించిన పవిత్ర స్థలమైన దీక్షాభూమిని, సోలార్ ఎక్స్‌ప్లోజివ్స్ ప్లాంట్‌ను కూడా మోదీ సందర్శిస్తారని తెలిపారు.

6న పంబన్ వంతెన జాతికి అంకితం

శ్రీరామనవమి సందర్భంగా మోదీ ఏప్రిల్ 6వ తేదీన తమిళనాడులో రామేశ్వరంలోని రామనాథ స్వామి మందిరాన్ని దర్శించుకోనున్నారు. అలాగే నూతనంగా నిర్మించిన పంబన్ రైల్వే వంతెనను లాంఛనంగా ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. ఇది ఆసియా ఖండంలోనే మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జి కావడం విశేషం. 2.5 కిలోమీటర్ల పొడవైన ఈ వంతెన ప్రధాన భూభాగాన్ని రామేశ్వరం దీవితో అనుసంధానిస్తుంది. గతంలో ఇక్కడున్న పాత వంతెనపై రైలు ప్రయాణానికి 30 నిమిషాల సమయం పట్టేది. కొత్త వంతెనతో కేవలం 5 నిమిషాల్లోనే రామేశ్వరం దీవికి చేరుకోవచ్చు.

భారత్‌కు పుతిన్

త్వరలో తేదీల ఖరారు

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ''గతేడాది ప్రధాని నరేంద్ర మోదీ మాస్కో పర్యటన సందర్భంగా పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించారు. అందుకు పుతిన్ అంగీకరించారు. ఆ మేరకు పర్యటనకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి'' అని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ప్రకటించారు. గురువారం రష్యా అంతర్జాతీయ వ్యవహారాల మండలి ఏర్పాటు చేసిన 'రష్యా, భారత్: నూతన ద్వైపాక్షిక అజెండా దిశగా' అనే సదస్సునుద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ''గతేడాది మోదీ ప్రధానిగా తిరిగి ఎన్నికయ్యాక తొలి విదేశీ పర్యటనకు రష్యా వచ్చారు. తద్వారా ప్రపంచమంతటికీ శక్తిమంతమైన సందేశమిచ్చారు. ఇప్పుడిక మా వంతు'' అని పేర్కొన్నారు. ''భారత్‌తో రష్యా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసుకుంటోంది. ఇరుదేశాల నడుమ ఆదినుంచీ అత్యంత సన్నిహిత బంధం కొనసాగుతూ వస్తోంది'' అన్నారు. పుతిన్ భారత పర్యటన తేదీలను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. 2022లో ఉక్రెయిన్‌తో యుద్ధానికి తెర తీశాక పుతిన్‌కు ఇదే తొలి భారత పర్యటన కానుంది. ఉక్రెయిన్ యుద్ధంతో పాటు అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తలెత్తిన భౌగోళిక, రాజకీయ సంక్షోభంపై ఇరువురు నేతలు చర్చించే అవకాశం ఉంది. ఉక్రెయిన్ వివాదంపై ఇండియా తటస్థ వైఖరిని కొనసాగిస్తోంది. ఇది యుద్ధాల యుగం కాదని ప్రధాని మోదీ పుతిన్‌కు పదేపదే చెప్పినప్పటికీ.. రష్యాను ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాలకు భారత్ దూరంగా ఉంది.

పరిమితులు మించి అప్పులు.. అనుమతుల్లేని ఖర్చులు!

జీఎస్‌డీపీ పరిమితిని మించిన ద్రవ్యలోటు..నికర అప్పులు



- నికర అప్పులు మంచిది కాదు.. 100% రిస్క్
- ఎలాంటి అనుమతులు లేకుండా రూ.19 వేల కోట్లకు పైగా ఖర్చు
- జీఎస్‌డీపీ వృద్ధికి తగినట్టు మూలధన వ్యయం జరగలేదు
- ఏడాదిలో 145 రోజులు ఓడీ..176 రోజులు వేస్ అండ్ మీన్స్‌కు
- 2023-24 ఆర్థిక సంవత్సరం రాబడులు, ఖర్చులపై కాగ్ నివేదిక
- అసెంబ్లీ ముందుంచిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: ఎఫ్ఆర్‌బీఎం పరిమితులు మించి అప్పులు, అనుమతులు లేకుండానే ఖర్చులతో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక అభిప్రాయపడింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) పరిమితిని మించిన ద్రవ్యలోటు నమోదయిందని తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కాగ్ నివేదికను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీ ముందుంచారు. రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ రాబడులు, సొంత పన్నుల ఆదాయం, ఖర్చులు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చులు, ఖజానా నిర్వహణ, కేంద్రం నుంచి అందిన ఆర్థిక సాయం, అప్పులు, చెల్లింపులు, పలు ప్రభుత్వ పనులకు చేసిన ఖర్చులు, మూలధన వ్యయం జరిగిన తీరు, శాఖల వారీగా పలు పద్దుల కింద జరిగిన ఖర్చులు, అందుకు తగిన రాబడుల వివరాలను నివేదిక వెల్లడించింది. నివేదికలోని ముఖ్యాంశాలివే..

- ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం జీఎస్‌డీపీలో 3 శాతానికి మించి ద్రవ్యలోటు ఉండకూడదు. కానీ 2023-24లో రూ.49.978 కోట్ల ద్రవ్యలోటు (జీఎస్‌డీపీలో 3.3%) నమోదైంది.
- జీఎస్‌డీపీలో 33.10 శాతం మించి నికర అప్పులు ఉండకూడదు. కానీ రూ.5,17,659 కోట్లు (జీఎస్‌డీపీలో 34.47 శాతం) అప్పులున్నాయి. అయితే ఆఫ్ బడ్జెట్ కింద తీసుకున్న రూ.1.20 లక్షల కోట్లు మినహాయిస్తే ఇది 26.41 శాతం మాత్రమే. అయితే ఆఫ్ బడ్జెట్ అప్పులు మంచిది కాదని, 100 శాతం రిస్క్‌తో కూడుకున్నవని కాగ్ పేర్కొంది.
- రెవెన్యూ రాబడుల్లో 41 శాతం అనివార్య ఖర్చులకు వినియోగం అవుతోంది. రూ.1,69,293 కోట్ల రెవెన్యూ రాబడుల్లో వేతనాల కింద, రూ.27,981 కోట్లు, అప్పులకు వడ్డీల చెల్లింపుల కోసం రూ.27,981 కోట్లు, పింఛన్ల కోసం రూ.16,385 కోట్లు ఖర్చు చేశారు.
- మొత్తం రాబడుల్లో 62 శాతం పన్ను ఆదాయం రూపంలో వచ్చాయి. 19 శాతం అప్పులు, 11 శాతం పన్నేతర ఆదాయం రూపంలో సమకూరాయి.
- అంతకుముందు ఏడాది కంటే 2023-24లో రూ.9,943 కోట్ల మేర సొంత పన్నుల ఆదాయం పెరిగింది. ఇది జీఎస్‌డీపీలో 7.4 శాతం.
- కేంద్ర పన్నుల్లో వాటా రూ.8,923 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.4,265 కోట్లు పెరగగా, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ.3,245 కోట్లు తగ్గింది.
- ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి (2024 మార్చి 31 నాటికి) రెవెన్యూ మిగులు రూ. 779 కోట్లుగా నమోదయింది.
- జీఎస్‌డీపీకి తగినట్టు మూల ధన వ్యయం జరగలేదు. రూ.43,918 కోట్లు (జీఎస్‌డీపీలో 2.92 శాతం) మాత్రమే మూలధన వ్యయం కింద ఖర్చయింది.
- గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద కేంద్రం ఇచ్చే నిధుల్లో 60 శాతం కేంద్ర ప్రాయోజిత పథకాలకే ఖర్చయ్యాయి. మొత్తం రూ.9,934 కోట్లు వస్తే అందులో రూ.5,967 కోట్లు ప్రాయోజిత పథకాలకు ఖర్చు పెట్టారు. ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు రూ.2,924 కోట్లు, నిధుల బదిలీ కింద రూ.1,043 కోట్లు వచ్చాయి.
- ఈ సంవత్సరంలో రూ.49,618 కోట్ల రుణాలను 7.32 శాతం నుంచి 7.75 శాతం మధ్య వడ్డీతో సమకూర్చుకున్నారు. వీటికి తోడు ఎల్ఐసీ, జీఐసీ, నాబార్డుల నుంచి మరో రూ.910 కోట్లు సమీకరించారు.
- ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ వ్యయ అంచనా రూ.2,34,531 కోట్లు కాగా, ఖర్చయింది రూ.1,68,514 కోట్లు మాత్రమే. వ్యయ అంచనాకు, ఖర్చుకు రూ.66,017 కోట్ల (28 శాతం) వ్యత్యాసం ఉంది. రూ.19 వేల కోట్లకు పైగా ఎలాంటి అనుమతులు లేకుండానే ఖర్చు పెట్టారు. అనుమతుల్లేకుండానే కొత్తగా పద్దులు తెరిచి వాటి ద్వారా నిధులు బదిలీ చేశారు.
- పంచాయతీ రాజ్, పట్టణ స్థానిక సంస్థలకు అంతకు ముందు ఏడాది కంటే తక్కువ ఖర్చు చేశారు. 2022-23లో పంచాయతీరాజ్ సంస్థలకు రూ.11,127 కోట్లు ఖర్చు పెట్టగా, 2023-24లో రూ.10,075 కోట్లు మాత్రమే (9 శాతం తక్కువ)గా ఖర్చు పెట్టారు. పట్టణ స్థానిక సంస్థలకు అంతకు ముందు ఏడాది రూ.4,110 కోట్లు వెచ్చించగా, 2023-24లో రూ. 3,615 కోట్లు (12 శాతం తక్కువ) ఖర్చు పెట్టారు.

కేవలం 17 రోజులే అడ్వాన్సులకు దూరం!

రాష్ట్ర ఖజానా నిర్వహణ కోసం ఎప్పటిలాగే 2023-24లో కూడా రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)పైనే ప్రభుత్వం ఎక్కువగా ఆధారపడింది. ఈ ఏడాదిలో కేవలం 17 రోజులు మాత్రమే ఆర్‌బీఐ నుంచి ఎలాంటి అడ్వాన్సులు తీసుకోకుండా ప్రభుత్వ ఖజానా కనీస నగదు నిల్వను ఉంచగలిగింది. 28 రోజుల పాటు స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్)ని వినియోగించుకుంది. ఈ పరిమితి ముగిసిన తర్వాత 176 రోజుల పాటు వేస్ అండ్ మీన్స్‌కు వెళ్లింది. ఈ రెండు పరిమితులు కూడా ముగిసిన తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో 145 రోజుల పాటు ఓవర్‌డ్రాఫ్ట్ (ఓడీ)కి వెళ్లాల్సి వచ్చింది.

2023-24లో ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కింద కేంద్రం ఇచ్చిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద చేసిన ఖర్చుల వివరాలు (రూ.కోట్లలో)

పథకం	కేంద్రం బడ్జెట్ అంచనా	ఖర్చు	రాష్ట్రం బడ్జెట్ అంచనా	ఖర్చు
సమగ్ర శిక్ష అభియాన్	1562	1221	765	964
ఉపాధి హామీ	1584	1544	478	346
ఎన్‌హెచ్ఆర్ఎం	798	316	712	808
అంగన్‌వాడీ	808	495	629	266
పీఎం సడక్	602	461	345	173
స్మార్ట్ సిటీస్	373	190	391	285
రోడ్ ఇన్‌ఫ్రా	661	367	-	-
ఆవాస్ యోజన	499	0.79	330	0.79
పీఎం పోషణ్	229	88	215	134
ఆయుష్మాన్ భారత్	35	23	95	55
పీఎం శ్రీ	291	28	194	39
వాటర్ షెడ్	60	38	40	25
అర్బన్ రీజువనేషన్	235	48	216	40
మొత్తం	10,741	5,524	5,575	3,582

(నోట్: పైన పేర్కొన్నవే కాక మరికొన్ని ప్రాయోజిత పథకాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా కలిపి మొత్తం కేంద్ర వాటా, రాష్ట్ర వాటాలను పేర్కొనడం జరిగింది.)

మన అప్పు ఎంత వడ్డీకంటే..!

అప్పు మొత్తం (రూ. కోట్లలో)	వడ్డీ (శాతం)
2,000	5-5.99
46,799	6-6.99
2,03,840	7-7.99
56,988	8-8.99
4,917	9-9.99

2024 మార్చి 31 వరకు ఏ కార్పొరేషన్ అప్పుకు ప్రభుత్వం ఎంత గ్యారంటీ ఉందంటే..

రంగం	ప్రభుత్వ గ్యారంటీ అప్పు
విద్యుత్	40,640
సహకారం	5,660
నీటిపారుదల	82,540
రోడ్లు, భవనాలు	3,890
అర్బన్ డెవలప్‌మెంట్, హౌసింగ్	13,573
మౌలిక సదుపాయాలు	276
ఇతరములు	73,515

భద్రాద్రి రాములోరికి పోచంపల్లి పట్టువస్త్రాలు



భద్రాద్రి సీతారాముల వారికి పట్టు వస్త్రాలను నేస్తున్న పోచంపల్లి చేనేత కళాకారులు

భూదాన్‌పోచంపల్లి: భద్రాద్రి సీతారాముల కల్యాణానికి పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలు తయారవుతున్నాయి. ఎస్ఎస్ జయరాజ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు కడవేరు చంద్రశేఖర్, ఆడెపు అంజనేయులు, ఇంజమూరి యాదగిరి, దోర్నాల శ్రీనాథ్‌లు భద్రాచలంలోని భక్తరామదాసు ధ్యాన నిలయంలో ఏర్పాటు చేసిన మగ్గాలపై పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరలు, పట్టు పంచెలు నేస్తున్నారు. భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి ఈ నెల 25న మగ్గానికి పూజలు నిర్వహించారు.

సీతమ్మకు నిమ్మపండు రంగు పట్టు చీరలు..

శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారామచంద్రస్వామి కల్యాణానికి పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇందులో సీతమ్మ వారి కల్యాణానికి, పట్టాభిషేకం రోజు అలంకరించేందుకు ఎరుపురంగు బార్డర్, నిమ్మపండు రంగులో రెండు చీరలను నేస్తున్నారు. శ్రీరాముడితో పాటు, లక్ష్మణ స్వామి, ఆంజనేయస్వామికి సమర్పించేందుకు తెలుపు, క్రీమ్ కలర్ జరీ పేట్ డిజైన్‌తో మొత్తం 6 పట్టు పంచెలను నేస్తున్నారు. పోచంపల్లికి చెందిన నలుగురు చేనేత కళాకారులు ఎంతో నియమనిష్టలతో మగ్గాలపై వస్త్రాలను తయారు చేస్తున్నారు. ఏప్రిల్ 4 వరకు పట్టు వస్త్రాలను నేయడం పూర్తిచేసి.. 5న దేవస్థానం ఈవోకు అందజేస్తారు. అనంతరం వీటిని కల్యాణం, పట్టాభిషేకం రోజు సీతారాముల వారికి అలంకరించనున్నారు. ఈ వస్త్రాలను నేసే భాగ్యం కలగడం తమ అదృష్టంగా భావిస్తున్నామని కళాకారులు చెప్పారు.

బిల్లులు చెల్లించమంటే ముందస్తు అరెస్టులా?

సర్పంచుల సంఘాల ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం చేపట్టిన చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన సందర్భంగా తమను, ఇతర నేతలను ముందస్తు అరెస్ట్ చేయడం దారుణమని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇదేనా మీరు చెప్పే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ 'అని వారు విమర్శించారు. అప్పులుచేసి ఊరిని బాగు చేసినా బిల్లులు ఇవ్వకుండా అడుగడుగునా అరెస్టులతో అవమానించడం ఏమిటని వారు ఓ ప్రకటనలో ప్రశ్నించారు.

రైతులు కాదు..ఉద్యోగులే ప్రభుత్వానికి భారం!

- 8వ వేతన సంఘంలోనైనా ఈ అసమతుల్యతను సరిదిద్దాలి
- సుప్రసిద్ధ స్వతంత్ర విధాన విశ్లేషకుడు డాక్టర్ దేవేంద్రశర్మ డిమాండ్



దేవేంద్ర శర్మ

సాక్షి, హైదరాబాద్: 'ప్రపంచ దేశాల్లో ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కన్నా భారతీయ ఉద్యోగుల జీతాలు 8 రెట్లు ఎక్కువగా ఉన్నాయని ప్రపంచ బ్యాంక్ లెక్కగట్టింది. భారత ప్రభుత్వానికి ఉద్యోగుల జీతాలు, పింఛన్లే పెను ఆర్థికభారంగా మారాయి. పాలకులు, ఆర్థికవేత్తలు ఊదరగొడుతున్నట్టు రైతులకు ఇస్తున్న అతి తక్కువ సబ్సిడీలు ప్రభుత్వానికి భారం కాదు'అని సుప్రసిద్ధ స్వతంత్ర విధాన విశ్లేషకుడు డాక్టర్ దేవేంద్రశర్మ స్పష్టం చేశారు. గురువారం సెస్ ఆడిటోరియంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన వ్యవసాయ సదస్సులో దేవేంద్రశర్మ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు అతి తక్కువ అయినా, ప్రచారం అందుకు భిన్నంగా చేస్తున్నారని తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత, విదర్భకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయదారుడు సుభాష్ శర్మ మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయంతోపాటు ప్రకృతి వ్యవసాయాన్ని కూడా క్లైమెట్ చేంజ్ దెబ్బతీస్తోందన్నారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జీవీ రామాంజనేయులు, యూకేకి చెందిన ఎడిన్‌బర యూనివర్సిటీ ప్రొఫెసర్ లిండ్సే జాక్స్ తదితరులు పాల్గొన్నారు.

మాకూ కావాలి మిర్చి బోర్డు

దేశంలోనే మిర్చిసాగులో తెలంగాణకు రెండోస్థానం

- రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మంలోనే అత్యధిక సాగు
- ఖమ్మంలో బోర్డు ఏర్పాటుకు రైతుల సంఘాల ఆందోళన
- నిర్ణీత ధర లేక నష్టపోతున్న రైతులు



ఖమ్మంలో సాగైన మిర్చి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మిర్చికి ధర గిట్టుబాటు కాక ఏటేటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆయా మార్కెట్లలో వ్యాపారులు నిర్ణయించిందే ధర అవుతోంది.టపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కూడా ప్రోత్సాహకాలు లేవు. దీంతో మద్దతు ధర, ప్రభుత్వ చేయూత కోసం మిర్చి బోర్డును ఖమ్మంలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. దేశవ్యాప్తంగా మిర్చిసాగులో ఏపీ మొదటిస్థానంలో ఉండగా, తెలంగాణ రెండోస్థానంలో ఉంది. ఏటా సగటున రాష్ట్రంలో 7 లక్షల టన్నుల మిర్చి దిగుబడి వస్తుండగా.. సాగు విస్తీర్ణంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదటిస్థానంలో ఉండగా, మహబూబాబాద్, జోగుళాంబ గద్వాల, సూర్యాపేట, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సాగు ఎక్కువగా ఉంది. 2024- 25 వానాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 2,31,812 ఎకరాల్లో మిర్చి సాగైతే నల్లి తెగులు, ఎర్ర తెగులుతో దిగుబడి తగ్గడమే కాక క్వింటాల్‌కు రూ.13 వేల నుంచి రూ.16వేల వరకే ధర పలికింది.

బోర్డు ఏర్పాటుతో ఎన్నో లాభాలు

ఏపీలోని గుంటూరులో 2021 సెప్టెంబర్‌లో మిర్చి ప్రాంతీయ బోర్డు ఏర్పాటు చేశారు. తెలంగాణలో మిర్చి బోర్డు ఏర్పాటైతే నిర్ణయించే ధర కన్నా తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేసే అవకాశముండదు. కేంద్రం నుంచి రైతులకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్, ఇతర పనిముట్లకు సాయం అందుతుంది. శాస్త్రీయ, సాంకేతిక, ఆర్థిక పరిశోధనల ద్వారా మెరుగైన ఉత్పత్తి పద్ధతుల అభివృద్ధి, అమలుకు అవకాశం ఏర్పడడంతోపాటు అధిక, మెరుగైన, నాణ్యమైన దిగుబడి పొందేలా రైతులకు సూచనలు అందుతాయి. ఖమ్మం జిల్లాలోనే మిర్చి ఎక్కువగా పండుతున్నందున ఇక్కడే బోర్డు ఏర్పాటు చేయాలని ఇటీవల రైతు సంఘాలు ఆందోళన చేశాయి.


కొబ్బరికీ కావాలి

కొబ్బరి తోటల సాగు విస్తీర్ణం ఏటేటా రాష్ట్రంలో పెరుగుతోంది.కొబ్బరి అభివృద్ధి జాతీయ బోర్డు కొచ్చిలో, రీజినల్ కార్యాలయం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడులో ఉంది. తెలంగాణలోని అశ్వారావుపేటలోనూ రీజినల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని 2023-24లో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ద్వారా ఉద్యానశాఖ ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదు. అశ్వారావుపేటలో 1991లోనే 48ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి విత్తనోత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ కేరళ, ఆంధ్రా ప్రాంతానికి చెందిన 9 రకాల నాటు, హైబ్రిడ్ వంగడాలను ఉత్పత్తి చేస్తారు.

ఆయా జిల్లాలో సాగు ఇలా...


2022 వరకు 2వేల ఎకరాల్లో సాగు ఉండగా, ప్రస్తుతం 3,341 ఎకరాలకు చేరింది. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,769 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 765, రంగారెడ్డి జిల్లాలో 123 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 79 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 76 ఎకరాలు, మెదక్ జిల్లాలో 66 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 42 ఎకరాల్లో పంట సాగు చేశారు. ఏపీ నుంచి వచ్చే దళారులకు కొబ్బరి రైతులు తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. దీంతో కొబ్బరి బోండాం, కాయకు రూ.15కు మించి ధర రావడం లేదు.

బోర్డు వస్తే ధరలు తగ్గవు



మిర్చి ధర ఓసారి బాగా, ఇంకోసారి పతనం కావడం ఆనవాయితీగా మారింది. ధరలు తగ్గకుండా ఉండాలంటే మిర్చి బోర్డు ఏర్పాటు అవశ్యం. బోర్డు ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వానికి ధరను సిఫారసు చేసి రైతులు నష్టపోకుండా చూస్తుంది.
– కాంపాటి శ్రీనివాసరావు, ఎదుళ్లచెరువు

బోర్డు ఏర్పాటుతోనే మద్దతు ధర



కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు కలుగుతుంది. కాయకు రూ.10-రూ.15, బోండాకు రూ.15 వరకు ధర వస్తోంది. అదే కొబ్బరిబోర్డు ఏర్పాటైతే వారే మద్దతు ధర నిర్ణయించి ఎగుమతి చేస్తారు. తద్వారా మంచి ధర వస్తుంది.
– కొక్కెరపాటి పుల్లయ్య, కొబ్బరి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

క్లుప్తంగా...

వ్యవసాయ బిల్లులను మొదట వ్యతిరేకించింది మేమే

బీఆర్‌ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ బిల్లులను మొట్టమొదట బీఆర్‌ఎస్ వ్యతిరేకించిందని పార్టీ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. పంజాబ్, హరియాణాల్లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు.. అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా ఆర్థిక సాయం అందజేశారని గుర్తు చేశారు. లోక్‌సభలో గురువారం ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చల్లో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్‌లీడర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలను పరిగణనలోకి తీసుకున్నప్పుడే 16వ ఆర్థిక సంఘం లక్ష్యాలు నెరవేరుతాయని ఆర్థిక మంత్రికి సూచించారు.

డీలిమిటేషన్‌పై చర్చ అవసరమా?

బీజేపీ ఎమ్మెల్యేలు శంకర్, సూర్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ సమస్యలు లేనట్లు.. డీలిమిటేషన్‌పై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్చ పెట్టిందని, దీనిపై మాట్లాడేందుకు మాత్రం అవకాశం ఇవ్వలేదని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ దక్షిణాది రాష్ట్రాలకు ఏదో అన్యాయం చేస్తున్నట్లు.. తమిళనాడు సీఎం స్టాలిన్ సమావేశం ఏర్పాటు చేస్తే.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కలిసి వెళ్లాయని ధ్వజమెత్తారు. ప్రజల్లో స్టాలిన్‌పై వ్యతిరేకత ఉందని, వచ్చే ఏడాది ఎన్నికలు ఉన్నందున చర్చ పెట్టారన్నారు. బీజేపీకి అన్ని రాష్ట్రాలు సమానమేనని, ఏ రాష్ట్రానికి అన్యాయం చేయదని స్పష్టం చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ విష పూరిత ప్రచారం చేసే పని పెట్టుకుందని ఆరోపించారు. పునర్విభజనపై కాకుండా.. ప్రతి సమస్యపై కాంగ్రెస్ పార్టీ చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు.

రోహింగ్యాల అడ్డా హైదరాబాద్

- సదాశివ్‌పేట్‌లో 20 మంది బంగ్లా దేశీయుల అరెస్ట్
- లోక్‌సభలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆందోళన



సాక్షి, న్యూఢిల్లీ: రోహింగ్యాలకు హైదరాబాద్ అడ్డాగా మారిందని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. రోహింగ్యాల సమస్య దక్షిణాది రాష్ట్రాలకూ విస్తరించిందని గుర్తు చేశారు. హైదరాబాద్ మహా నగరంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాల వల్ల శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభలో గురువారం ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్–2025 బిల్లుపై చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలోని చిన్న పట్టణం సదాశివ్‌పేట్‌లో ఈ ఏడాది జనవరిలో 20 మంది బంగ్లా దేశీయులను అరెస్టు చేశారని వెల్లడించారు. కేరళలో కూడా ఇదే పరిస్థితి ఉందని గుర్తు చేశారు.

గ్యారంటీలిచ్చి.. మరిచారు

కాంగ్రెస్‌పై బీజేపీ నేత పొంగులేటి విమర్శలు



సాక్షి, న్యూఢిల్లీ: ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చిన తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అమలు చేయడం లేదని బీజేపీ సీనియర్ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు బీజేపీని ఆశీర్వదిస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. మహిళలు, నిరుద్యోగులు, యువతకు న్యాయం చేయకుండా సొంత ఎజెండాతో చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశాలు నిర్వహిస్తున్నారని, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. డీలిమిటేషన్ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోతుందని సమావేశాలు ఏర్పాటు చేసి.. ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు తీసుకొచ్చేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

42% బీసీ రిజర్వేషన్ల అమలుకు జోక్యం చేసుకోండి

రాహుల్ గాంధీకి వకుళాభరణం లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు జోక్యం చేసుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక లేఖను ఢిల్లీలోని ఏఐసీసీ, రాహుల్ గాంధీ కార్యాలయాలకు పంపించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ 42% బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించినా.. పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి సలహాలు అందించాలని, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, స్పష్టమైన కార్యాచరణతో రిజర్వేషన్ల అమలు జరిగేలా చూడాలని ఆయన రాహుల్ గాంధీని కోరారు.

జనాభా ఆధారంగా డీలిమిటేషన్ వద్దు



ఆ విధానంతో దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం

- సీట్ల సంఖ్య పెంచకుండానే పునర్విభజన చేయాలి
- ఇందిర, వాజ్‌పేయి విధానాన్ని అనుసరించాలి
- కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర శాసనసభ విజ్ఞప్తి
- అసెంబ్లీలో సీఎం తీర్మానం.. ఏకగ్రీవంగా ఆమోదం
- జనాభా ఆధారంగా విభజిస్తే దక్షిణాది ప్రాతినిధ్యం 19 శాతానికి తగ్గుతుంది
- అప్పుడు దక్షిణాది ప్రమేయం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం
- తెలంగాణ, ఏపీలో అసెంబ్లీ సీట్లు ఎందుకు పెంచరు?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంటు స్థానాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపట్టరాదంటూ సీఎం గురువారం శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టారు. సీఎం ప్రసంగం అనంతరం ఈ తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు స్పీకర్ ప్రకటించారు. తీర్మానంపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ప్రధాన మంత్రులు ఇందిరాగాంధీ, వాజ్‌పేయి జనాభా లెక్కన కాకుండా, ఉన్న 543 పార్లమెంటు సీట్లనే కొనసాగిస్తూ పునర్విభజన చేశారని గుర్తు చేశారు. అదే విధానాన్ని ఇప్పుడు కూడా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్‌పై పలు వివరాలను సీఎం సభ ముందుంచారు.

సంప్రదింపుల తర్వాతే ముందుకెళ్లాలి

ఎవరినీ సంప్రదించకుండా కేంద్రం ఇష్టారీతిగా డీలిమిటేషన్‌ను చేపట్టడం మంచిది కాదని సీఎం అన్నారు. 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దిశగా కేంద్రం చేస్తున్న ప్రయత్నాలు, అనుసరించబోయే విధానాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు లేకుండా జరుగుతున్న తీరుపై సభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు, భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపుల తర్వాతే పునర్విభజన ప్రక్రియ చేపట్టాలని ఈ సభ కోరుతోంది. కేంద్ర లక్ష్యాలకు అనుగుణంగా జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలకు పునర్విభజన ప్రక్రియ శాపంగా మారకూడదు. అందుకే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు జనాభా ఒక్కటే ప్రామాణికం కాకూడదు. ప్రస్తుతం ఉన్న పార్లమెంటు సీట్ల సంఖ్యను యథాతథంగా కొనసాగించాలి. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఇప్పుడున్న నియోజకవర్గాల సరిహద్దుల మార్పులు చేర్పులు చేపట్టాలి. తాజా జనాభా లెక్కలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ సీట్లను పెంచి మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో నిర్దేశించిన మేరకు 119 అసెంబ్లీ స్థానాలను 153కు తక్షణమే పెంచాలని ఈ సభ తీర్మానిస్తోంది. అందుకే అవసరమైన మేరకు రాజ్యాంగ సవరణలు చేపట్టాలని ఈ సభ కేంద్రాన్ని కోరుతోంది' అని సీఎం తెలిపారు.

గత విధానాలకు విరుద్ధంగా మోదీ చర్యలు

గతంలో నాలుగుమార్లు పార్లమెంటు స్థానాల పునర్విభజన జరిగినప్పుడు అనుసరించిన విధివిధానాలనే రాజ్యాంగంలో పొందుపర్చారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ అందుకు విరుద్ధంగా వెళ్తున్నారని విమర్శించారు. '1971 జనాభా లెక్కల తర్వాత పునర్విభజన ప్రతిపాదన వచ్చినప్పుడు నాటి ప్రధాని ఇందిరాగాంధీ.. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే రాష్ట్రాల మధ్య అంతరం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల మధ్య సహృద్భావ వాతావరణం చెడిపోతుందని భావించి.. 25 ఏళ్లపాటు పాతవాటినే కొనసాగించాలని నిర్ణయించారు. ఆ సంఖ్య ప్రకారమే వాటి పునర్విభజన చేయాలని చట్టాన్ని సవరించారు. 543 స్థానాలకుగాను దక్షిణాది 6 రాష్ట్రాల్లో ఉన్న 130 నియోజకవర్గాలను పునర్విభజించారు. 2006 తర్వాత జరిగిన పునర్విభజనలో నాటి ఉమ్మడి రాష్ట్రంలో 42 నియోజకవర్గాలను ఎస్సీ, ఎస్టీ జనాభా ఆధారంగా మొత్తం సంఖ్య పెరగకుండా పునర్వి భజించారు. 2002 జనాభా లెక్కల తర్వాత నాటి ప్రధాని వాజ్‌పేయి కూడా ఇందిరాగాంధీ విధానాన్నే అనుసరించి మరో 25 ఏళ్లపాటు అదే సంఖ్య కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ ప్రస్తుత ప్రధాని మోదీ మాత్రం అందుకు భిన్నంగా పనిచేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళన తెలిపేందుకు ఇటీవల తమిళనాడు సీఎం స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాల సీఎంలు, ప్రజా ప్రతినిధులతో చెన్నైలో సమావేశం నిర్వహించారు. కానీ, కేంద్రం అలాంటి నిర్ణయమే తీసుకోలేదని కొందరు కేంద్ర మంత్రులు అంటున్నారు. వారి మాటలు అర్ధసత్యమేనని నేను చెప్తున్నా'అని పేర్కొన్నారు.

దక్షిణాది ప్రమేయం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వం..

కేంద్ర ప్రభుత్వం విధించిన జనాభా లక్ష్యాలను దక్షిణాది రాష్ట్రాలు పకడ్బందీగా అమలుచేస్తే.. ఉత్తరాది రాష్ట్రాలు విఫలమయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'దక్షిణాదిలో జనన మరణాల మధ్య అంతరం 1.8 శాతం మాత్రమే ఉంది. 543 ఎంపీ సీట్లలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతం. ప్రస్తుత జనాభా ఆధారంగా పునర్విభజన జరిగితే అది 19 శాతానికి తగ్గుతుంది. అప్పుడు దక్షిణాది ప్రమేయం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఏర్పడుతుంది. ఇది దక్షిణాదికి క్షేమకరం కాదు. అందుకే రాజకీయాలకు అతీతంగా మనం గళం విప్పాలి. రాష్ట్రంలో భట్టి విక్రమార్క, కేకే, జానారెడ్డిల ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి, ఉమ్మడి మాటగా కేంద్రానికి వినిపించాలని నిర్ణయించారు. అందులో భాగంగా సభలో ఈ తీర్మానం ప్రవేశపెడుతున్నాం.

తెలుగు రాష్ట్రాలపై వివక్ష

తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు 153కు, ఏపీలో 225కు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచినా.. కేంద్రం దాన్ని అమలు చేయలేదు. ఈ విషయాన్ని నేను పార్లమెంటులో ప్రస్తావించినప్పుడు 2026లో జనాభా లెక్కల తర్వాతే అది సాధ్యమని బదులిచ్చింది. కానీ, కేంద్రంలోని ప్రధాన పార్టీ తన ప్రయోజనాల కోసం జమ్మూకశ్మీర్, సిక్కింలో అసెంబ్లీ స్థానాల పునర్విభజన ప్రక్రియ చేపట్టింది. ఇది ద్వంద్వ వైఖరి కాదా? పార్లమెంటులో 24 శాతం ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు.. పన్నుల రూపంలో జీడీపీకి 36 శాతం సమకూరుస్తున్నాయి. కానీ తిరిగి కేంద్రం నుంచి మనకు వస్తోంది చాలా తక్కువ. కేంద్రానికి మనం రూపాయి చెల్లిస్తే.. తిరిగి వస్తోంది 42 పైసలు మాత్రమే. అదే బిహార్ ఒక రూపాయి చెల్లిస్తే.. తిరిగి ఆ రాష్ట్రానికి కేంద్రం రూ.6.06 అందిస్తోంది. ఉత్తరప్రదేశ్‌కు రూ.2.73, మధ్యప్రదేశ్‌కు రూ.1.70 చొప్పున అందిస్తోంది. ఇంతకాలం ఆర్థిక ప్రయోజనాలను వదులుకున్నా, ఇప్పుడు రాజకీయ ప్రాతినిధ్యాన్ని వదులుకునేందుకు మనం సిద్ధంగా లేము. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పక్షాలు కలిసికట్టుగా పోరాట ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. త్వరలో అన్ని దక్షిణాది రాష్ట్రాల పార్టీలతో హైదరాబాద్‌లో ఓ సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అందులో భాగస్వాములు కావాలి'అని సీఎం పిలుపునిచ్చారు. ఈ తీర్మానంపై సీఎం మాట్లాడిన తర్వాత ఇతర పక్షాల అభిప్రాయాన్ని తీసుకోకుండానే, సభ ఏకగ్రీవంగా ఆమోదించిందని స్పీకర్ ప్రకటించారు.

తీర్మానం చేసి ఐక్యతను చాటాం..

పోరాటం చాలా మిగిలే ఉంది

- లోక్‌సభ నియోజకవర్గాల డీలిమిటేషన్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్
- ఇది ప్రారంభం మాత్రమే: తమిళనాడు సీఎం స్టాలిన్ రీట్వీట్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంలో తమ రాజకీయ ఆత్మగౌరవం దెబ్బతినకుండా, చట్టబద్ధమైన హక్కులకు భంగం వాటిల్లకుండా కేంద్రం ముందుకెళ్లాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి ఐక్యతను చాటామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'వేదికగా గురువారం ట్వీట్ చేశారు. పక్షపాతంతో కూడిన వివక్షా పూరిత డీలిమిటేషన్ కారణంగా ఆర్థిక పరపతి గల రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతింటాయని, ఇలాంటి ప్రక్రియను అనుమతించేది లేదని తెలంగాణ ప్రజలతోపాటు దక్షిణ భారతంలోని ఇతర రాష్ట్రాలు ఐక్యంగా ఉన్నాయని తెలిపారు. తమ హక్కులను హరించే అన్ని ప్రయత్నాలకు వ్యతిరేకంగా తాము పోరాడుతామని, మొదటి రంగంలో గెలిచామని, పోరాటం ఇంకా చాలా మిగిలే ఉందని సీఎం రేవంత్ ఆ ట్వీట్‌లో వెల్లడించారు.

ఆ ప్రయత్నాలను నిరోధిస్తాం: రేవంత్‌రెడ్డి చేసిన ట్వీట్‌కు తమిళనాడు సీఎం స్టాలిన్ స్పందించారు. ఈ మేరకు ఆయన రేవంత్ ట్వీట్‌కు రీట్వీట్ చేశారు. 'తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ అడుగు ముందుకేశారు. నిష్పాక్షిక పునర్విభజనను డిమాండ్ చేయడం ద్వారా ఈ తీర్మానం చరిత్రలో నిలిచిపోతుంది. తమిళనాడు చేసిన ప్రయత్నానికి కొనసాగింపుగా న్యాయంగా, సమానత్వంతో, సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా కేంద్రం ముందుకెళ్లాలని తీర్మానించడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే అన్ని ప్రయత్నాలను ఐక్యంగా నిరోధిస్తామని చాటి చెప్పారు. ఇది ప్రారంభం మాత్రమే. త్వరలో హైదరాబాద్‌లో జరిగే జేఏసీ రెండో సమావేశం ద్వారా మరిన్ని రాష్ట్రాలు ముందుకొస్తాయి. దేశ భవిష్యత్‌ను అన్యాయంగా తీర్చిదిద్దే ప్రయత్నాలను నిరోధిస్తాం'అని ఆ ట్వీట్‌లో తమిళనాడు సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు.

భూమి వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ
- ప్రభుత్వ నిర్ణయం జీవ వైవిధ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పని ఆవేదన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలనుకుంటున్న రంగారెడ్డి జిల్లాలోని కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమి వేలం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమికి ఆనుకుని ఉన్న ప్రాంతంలో 734 వృక్ష జాతులు, 220 పక్షి జాతులతో సహా నెమళ్లు, వలస పక్షులు, మచ్చల జింకలు, నాలుగు కొమ్ముల జింకలు, అడవి పందులు, కొండ చిలువలు, భారతీయ నక్షత్ర తాబేళ్ల వంటి వైవిధ్యభరితమైన జీవజాతులు, మష్రూమ్ రాక్స్, సరస్సులు ఉన్నాయని ప్రముఖులు చెబుతున్నారని అన్నారు. అలాగే.. ఈ భూమి నగరానికి ఊపిరులూదే ఒక ఆక్సిజన్ వనరుగా ఉందని, అలాంటి భూమిని కాంక్రీట్ నిర్మాణాలతో నింపేస్తే, భూమిలో నీటివనరులు తగ్గిపోయి, ఆయా జీవజాతులకు నష్టం జరిగి, పర్యావరణానికి, నగరానికి పెద్దఎత్తున ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. 'మనం బతకడానికి, మన సోకులకు ప్రభుత్వ భూములు అమ్మొద్దు, ఒకవేళ ప్రభుత్వ భూములను అమ్మితే భవిష్యత్తులో ప్రజల అవసరం కోసం ఏదైనా నిర్మించాలన్నా, ప్రభుత్వ ఆసుపత్రులు కానీ, విద్యాలయాలు కానీ, చివరకు చచ్చిపోతే శ్మశానాలకు కూడా భూమి లేని పరిస్థితి ఉంటుంది'అని రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చెప్పిన మాటలను లేఖలో గుర్తుచేశారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం, 1972 నిబంధనల ప్రకారం ఇప్పుడు వేలం వేయాలని నిర్ణయం తీసుకున్న 400 ఎకరాల భూమిని, దానిని ఆనుకుని ఉన్న 800 ఎకరాల భూమిని కలిపి జాతీయ ఉద్యానవనంగా ప్రకటించే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలని లేఖలో కిషన్‌రెడ్డి కోరారు.


అమెరికా సుంకాలతో భారత ఫార్మాకు తీవ్ర నష్టం

రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ పార్థసారథి రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: అమెరికా ప్రభుత్వం విధించనున్న ప్రతిపాదిత సుంకాలతో భారత ఫార్మా పరిశ్రమకు తీవ్ర ఆర్థిక నష్టాలను కలిగించే అవకాశాలున్నాయని బీఆర్‌ఎస్ ఎంపీ బండి పార్థసారథి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ అమెరికా ప్రతిపాదించిన టారిఫ్ ఎప్పుడైనా అమల్లోకి రావొచ్చన్నారు. దీనివల్ల మన దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన పరిశ్రమను తీవ్రంగా ప్రభావితం చేయవచ్చన్నారు. దీనివల్ల 2023–24 నాటికి 30 లక్షలకు పైగా భారతీయుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లనుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదిలో భారత దేశం అమెరికాకు సుమారు 9 బిలియన్ డాలర్ల విలువైన (రూ.74 వేల కోట్లు) ఔషధ ఉత్పత్తులను ఎగుమతి చేసిందని వివరించారు. ఈ ఎగుమతులు మరింత వేగంగా పెరుగుతున్న సమయంలో.. పన్నుల పెంపు ఆందోళన కలిగించే అంశమన్నారు. భారత ఔషధ ఎగుమతుల్లో అమెరికా వాటా దాదాపు 31 శాతంగా ఉందని తెలిపారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎంపీ పార్థసారథి రెడ్డి కోరారు.

గజేంద్ర సింగ్‌తో 'ఈటల' భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ అయ్యారు. బీజేపీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణతో పాటు.. రామాయణం, మహాభారతం, ఇతిహాసాలపై సినిమా, సీరియల్స్ నిర్మాణ బృందంతో కలిసి కేంద్రమంత్రిని గురువారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సినిమా, సీరియల్స్ దూరదర్శన్ చానల్స్‌లో ప్రసారమయ్యేలా చొరవ తీసుకోవాలని షెకావత్‌ను 'ఈటల'కోరారు.

ప్రతి గ్రామంలో రుణమాఫీ జాబితాలు

- రైతు భరోసా లబ్ధిదారుల వివరాలు కూడా..
- మండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో ఎలాంటి కోతలు విధించలేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని.. ప్రతి గ్యారెంటీని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని వెల్లడించారు. ద్రవ్య వినిమయ బిల్లుపై శాసనమండలిలో జరిగిన చర్చలో ఆయన సమాధానం ఇచ్చారు. సభ్యులు జీవన్ రెడ్డి, తాతామధు లేవనెత్తిన అంశాలపై స్పందిస్తూ ప్రతి గ్రామంలో రుణమాఫీ లబ్ధిదారుల జాబితాలను మూడు చోట్ల ప్రదర్శిస్తామన్నారు. అలాగే రైతు భరోసా లబ్ధిదారుల వివరాలు కూడా ప్రదర్శించేలా ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో బడ్జెట్‌ను అడ్డగోలుగా పెంచుకుంటూ పోయారని, కానీ తాము వాస్తవ ఆధారిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టామంటూ కార్యక్రమాలు, శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులను చదివి వినిపించారు. అనంతరం ద్రవ్య వినియమ బిల్లును మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తర్వాత నిరవధికంగా వాయిదా పడింది. ఈ సమావేశాల్లో భాగంగా మండలి 8 రోజులపాటు సమావేశమైంది. మొత్తం 51 గంటల 9 నిమిషాలపాటు కొనసాగింది. సభ్యులు మొత్తం 130 ప్రసంగాలు చేయగా 12 బిల్లులకు ఆమోదం తెలిపింది. ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

'జీరో అవర్'ను ప్రహసనంగా మార్చొద్దు

రాతపూర్వక సమాధానాలు సభ్యులకు పంపాలి: హరీశ్‌రావు

- అందరికీ అవకాశాలు ఇచ్చేలా సభ నడుపుతున్నాం: మంత్రి శ్రీధర్‌బాబు
- 15 నెలల్లో వేసిన ప్రశ్నలకు రాతపూర్వక సమాధానాలు: స్పీకర్ ప్రసాద్‌కుమార్





సాక్షి, హైదరాబాద్: శాసనసభ సమావేశాల్లో 'ప్రశ్నోత్తరాలు'తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉన్నా.. బడ్జెట్ భేటీలో కేవలం ఒక రోజుకు మాత్రమే పరిమితం చేశారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సభలో గురువారం జరిగిన 'జీరో అవర్'లో హరీశ్‌రావు ఈ అంశాన్ని ప్రస్తావించారు. జీరో అవర్‌ను తాము స్వాగతిస్తున్నా, అయితే దానిని ప్రహసనంగా మార్చొద్దని కోరారు. జీరో అవర్‌లో సభ్యులు ప్రస్తావించే అంశాలకు రాతపూర్వక సమాధానాలు సంబంధిత ప్రభుత్వ విభాగం ద్వారా పంపించేలా ఆదేశాలు జారీ చేయాలని హరీశ్‌రావు కోరారు. సభా సమయం వృథా కావొద్దనే ఉద్దేశంతోపాటు పద్దులపై లోతుగా చర్చించేందుకు ప్రశ్నోత్తరాలను రద్దు చేసినట్టు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సమాధానం ఇచ్చారు. గత 15 నెలల కాలంలో జీరో అవర్‌లో సభ్యులు వేసిన ప్రశ్నలకు రాతపూర్వక సమాధానాలు ఇవ్వాలని తాను సీఎస్ ఆదేశించినట్టు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

- సభ జరుగుతున్న సమయంలోనే బీఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్ అనుమతి లేకుండా లాబీలో నినాదాలు చేశారని.. అసెంబ్లీ ప్రవేశద్వారం వద్ద బైఠాయించారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అసెంబ్లీ గౌరవాన్ని పెంచేలా సభ్యులు నడుచుకోవాలని స్పీకర్ ఆదేశించారు.
- రెండుగంటల పాటు సాగిన జీరో అవర్‌లో 52 మంది సభ్యులకు స్పీకర్ అవకాశం ఇచ్చారు.
- నిజామ్ షుగర్స్‌ను తిరిగి తెరిచి కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఉప్పల్ ఫ్లైఓవర్ పనులతో సంబంధం లేకుండా దిగువ భాగంలో తారు రోడ్డు వేయాలని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కోరారు.
- రాజలింగం హత్యపై విచారణ జరపాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, జంటనగరాల్లో చిరు వ్యాపారుల ఇబ్బందులను తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రస్తావించారు.
- వడ్డీ వ్యాపారులపై కేసుల నమోదుపై కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రస్తావించారు.
- రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌పై ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఆర్టీసీలో యూనియన్ల ఏర్పాటుపై కూనంనేని సాంబశివరావు, ఘనపూర్ ఆనకట్ట ఎత్తు పెంపుతో భూమి కోల్పోయిన వారికి పరిహారంపై సునీతా లక్ష్మారెడ్డి, తాండూరులో మైనారిటీ పాలిటెక్నిక్ కాలేజీపై మనోహర్‌రెడ్డి ప్రశ్నించారు.
- జీరో అవర్‌లో సమాధానాలు ఇచ్చే క్రమంలో బోధన్ ఎమ్మెల్యేను మంత్రి పొన్నం ప్రభాకర్ 'గౌరవ మంత్రి'అని సంబోధించడంతో సభ్యులందరూ బిగ్గరగా నవ్వారు.
- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జీరో అవర్‌లో రెండు ప్రశ్నలు అడిగే అవకాశం తనకు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వానికి రూ.1100 కోట్లు లాభం వచ్చే ముచ్చట చెప్తానని చమత్కరించారు. స్పీకర్ అవకాశం ఇవ్వడంతో తన నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయొద్దని కోరారు. రెండో ప్రశ్నను అడిగే క్రమంలో స్పీకర్ మైక్ కట్ చేశారు.

12 బిల్లులు.. 3 తీర్మానాలు

వేడిగా మొదలై.. వాడీగా ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

- ద్రవ్య వినిమయ బిల్లుల ఆమోదం తర్వాత నిరవధిక వాయిదా
- మూడు కీలక తీర్మానాలు ఆమోదించిన సభ

సాక్షి, హైదరాబాద్: వాడీవేడిగా సాగిన తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాలు 11 రోజులు కొనసాగాయి. 2025–26 వార్షిక బడ్జెట్‌కు సంబంధించి రెండు ద్రవ్య వినిమయ బిల్లులు ఆమోదించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ఈ నెల 12న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. 13, 15 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించి సభ ఆమోదించింది. 19న వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సభలో ప్రవేశ పెట్టారు. 21న బడ్జెట్‌పై సాధారణ చర్చ, 22 నుంచి 26 వరకు బడ్జెట్ పద్దులపై చర్చ జరిగింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో ఆయనను బడ్జెట్ సమావేశాలు ముగిసేంత వరకు స్పీకర్ సస్పెండ్ చేశారు.

శాసనసభ జరిగిన తీరు	
అసెంబ్లీ జరిగిన రోజులు	11
అసెంబ్లీ పనిచేసిన గంటలు	97.32
సభ్యులు చేసిన ప్రసంగాల సంఖ్య	146
ప్రభుత్వ తీర్మాణాలు	3
ఆమోదించిన బిల్లులు	12

సభలో బలాలు..

పార్టీ	సభ్యుల సంఖ్య
కాంగ్రెస్	65
బీఆర్‌ఎస్	38
బీజేపీ	8
ఎంఐఎం	7
సీపీఐ	1
మొత్తం	119

అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు

1. బీసీ, ఎస్సీ, ఎస్టీ (రిజర్వేషన్‌ఆఫ్ సీట్స్ ఇన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ అపాయింట్‌మెంట్స్ ఆర్ పోస్ట్స్ ఇన్‌ది సర్వీసెస్ అండర్ ది స్టేట్) బిల్లు.
2. బీసీ (రిజర్వేషన్ ఆఫ్ సీ ట్స్ ఇన్ రూరల్ అండ్ అర్బ న్ లోకల్ బాడీస్) బిల్లు.
3. ఎస్సీ (రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్స్) బిల్లు.
4. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ (సవరణ) బిల్లు (పేరు మార్పు).
5. చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ (అమెండ్‌మెంట్) బిల్లు.
6. మున్సిపాలిటీల (సవరణ) బిల్లు.
7. పంచాయతీరాజ్ (సవరణ) బిల్లు.
8. అడ్వొకేట్స్ వెల్ఫేర్ ఫండ్ (సవరణ) బిల్లు.
9. అడ్వొకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ (సవరణ) బిల్లు.
10. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ (రద్దు) బిల్లులు.

11,12. రెండు తెలంగాణ అప్రాప్రియేషన్ బిల్లులు.



రైల్వే మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

జర్నలిస్టులకు రైల్వే రాయితీ పునరుద్ధరించండి

రాజ్యసభలో కేంద్రాన్ని కోరిన బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు

సాక్షి, న్యూఢిల్లీ: కరోనా సమయంలో రైల్వేలో తొలగించిన జర్నలిస్టుల రాయితీ పథకాన్ని పునరుద్ధరించాలని బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులలో చాలా వరకు మధ్యతరగతి ఆదాయ వర్గాలకు చెందిన వారేనని, తమ విధి నిర్వహణలో భాగంగా ప్రతినిత్యం రైళ్లలో ప్రయాణాలు చేస్తుంటారన్నారు. రాజ్యసభలో గురువారం ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, కోవిడ్ కారణంగా ఎత్తేసిన రాయితీ పథకాన్ని తిరిగి ప్రవేశపెడుతూ వారిపై ఆర్థిక భారం పడకుండా చూడాల్సిందిగా రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు. రాజ్యసభలో మాట్లాడిన తర్వాత ఎంపీ వద్దిరాజు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు.



వసతులపై మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న పంచాక్షరి

నైపుణ్యాలతోనే ఆర్థిక స్వావలంబన

మహిళా ఖైదీలకు టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ సభ్యకార్యదర్శి పంచాక్షరి సూచన

సాక్షి, హైదరాబాద్: మహిళా ఖైదీలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, భవిష్యత్‌లో ఆర్థిక స్వావలంబనకు అది దోహదం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ(టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ) సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి సూచించారు. హైదరాబాద్ చంచల్‌గూడలోని మహిళా ప్రత్యేక జైలును గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆహారం, ఇతర వసతులు, ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట గది, ఖైదీల గదులు, జైలు ప్రాంగణాన్ని పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో జైలు పరిసరాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీలతో సంభాషించారు. సమస్యలను, ఇబ్బందులను ధైర్యంగా చెప్పవచ్చని సూచించారు. ఖైదీలు, విచారణ ఖైదీలకు ఉండే చట్టపరమైన హక్కులపై వారికి అవగాహన కల్పించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. జైలులో నేర్పే ఉపాధి అవకాశాలను ఉత్సాహంగా నేర్చుకోవాలని, అది జైలు నుంచి విడుదలయ్యాక ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ ఏవో కళార్చన, మహిళా జైలు సూపరింటెండెంట్ టి.వెంకటలక్ష్మి, డిప్యూటీ జైలర్లు పాల్గొన్నారు.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం ; 28 ; మార్చి ; 2025



గుడ్ మార్నింగ్.. సెహ్రీ..
నగరవాసులు సంప్రదాయ ఆహార సంస్కృతిలో మమేకమైపోయే సమయం రంజాన్. ఈ సీజన్‌లో ఆస్వాదించే వాటిలో హలీమ్, ఇఫ్తార్‌లే కాదు సెహ్రీ కూడా ఒకటి. - సిటీప్లస్‌లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్రవారం	శనివారం
సా. 6.34 గం.	ఉ. 4.51 గం.

గరిష్టం/కనిష్టం
38.0/24.0

వాతావరణం
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

హైడ్రా కమిషనర్ రంగనాథ్



తొండుపల్లిలోని ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

శంషాబాద్: ప్రభుత్వ భూముల పరిరక్షణకు రానున్న రోజుల్లో మరింత పకడ్బందీ చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని తొండుపల్లి చెరువు సమీపంలో ఉన్న సర్వేనంబర్లు 108, 109లలోని భూములను ఆయన పరిశీలించారు. సంబంధిత భూములు కబ్జాకు గురవుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ రవీందర్ దత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూముల్లో మట్టితో నింపే ప్రయత్నం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. కోర్టు వివాదాలు లేని భూములను వెంటనే ఫెన్సింగ్ వేసి కబ్జాలు కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ప్రతి ప్రభుత్వ భూమిని శాటిలైట్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. శ్మశాన వాటిక భూముల్లో హోర్డింగులు వేసి వాటి ద్వారా సొమ్ము చేసుకుంటున్న వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నమోదు చేస్తున్న కేసులన్నీ త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంతే..

రాయితీ వినియోగించుకుంది 5,505 మంది మాత్రమే

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు 1,07,865 మంది కాగా.. వీరిలో ఇప్పటి వరకు కేవలం 5,505 మంది మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీని వినియోగించుకున్నారు. తద్వారా జీహెచ్‌ఎంసీకి రూ.69.62 కోట్లు సమకూరాయి. మొత్తం దరఖాస్తుదారుల్లో 58,523 మందికి ఆటోమేటిక్‌గా ఫీజు లెటర్స్ జారీ కాగా, వారిలో కేవలం 5,505 మంది మాత్రమే 25 శాతం ఫీజు రాయితీని వినియోగించుకున్నారు. వీరిలో 40 మందికి ప్రొసీడింగ్స్ జారీ అయినట్లు సమాచారం. మరో నాలుగు రోజుల్లో గడువు ముగుస్తుందని, మిగతా వారు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ సూచించింది.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏఈ



లంచం డబ్బులతో సురేందర్‌రెడ్డి

దుండిగల్: విద్యుత్ కేబుల్ లైన్ మార్చడానికి లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ ఏఈని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని డీపోచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న సురేందర్‌రెడ్డి 11కేవీ విద్యుత్ లైన్ మార్చడానికి, ఓ భవనానికి కేబుల్ లైన్ వేయడానికి సదరు భవన యజమాని నుంచి రూ.30 వేలు డిమాండ్ చేశాడు. ఈ విషయమై సదరు భవన యజమాని ఏసీబీ అధికారులను సంప్రదించారు. అధికారులు సూచించిన విధంగా గురువారం ఏఈ సుందర్‌రెడ్డికి ఆయన కార్యాలయంలో నగదు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు.



ప్రేక్షకులతో కిక్కిరిసిన ఉప్పల్ స్టేడియం





సన్‌రైజర్స్ జెండాతో నటుడు సాయికుమార్

అదే జోష్..

ఉప్పల్ స్టేడియంలో గురువారం రెండో ఐపీఎల్ మ్యాచ్‌కు క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సన్‌రైజర్స్ బ్యాటింగ్ అని తెలియగానే స్టేడియం మొత్తం హోరెత్తిపోయింది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఆకట్టుకోకపోయినా... క్రీజ్‌లో ఉన్నంత సేపు హెడ్ తన మెరుపు షాట్లతో అలరించాడు. ప్రేక్షకులు అతని ఇన్నింగ్స్‌ను పూర్తిగా ఎంజాయ్ చేశారు. క్లాసెన్ దురదృష్టవశాత్తూ రనౌట్ అయినప్పుడు మైదానాన్ని ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. రైజర్స్ ఇన్నింగ్స్‌లో కొద్దిసేపు పరుగులు రాక స్తబ్దత కనిపించినా... అనికేత్ అనూహ్య సిక్స్‌లు స్టాండ్స్‌లో మళ్లీ ఉత్సాహాన్ని రేపాయి. దానిని కమిన్స్ కూడా కొనసాగించడంతో గ్రౌండ్ ఊగిపోయింది. ఐపీఎల్ పట్ల ఆసక్తి తగ్గలేదని ఫ్యాన్స్ నిరూపించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు సంగీత దర్శకుడు తమన్ నిర్వహించిన మ్యూజిక్ ప్రోగ్రాం అదనపు ఆకర్షణగా నిలిచింది. డ్యాన్సర్ల అడుగులకు స్టాండ్స్‌లో ఫ్యాన్స్ కూడా జత కలిపారు. – సాక్షి, హైదరాబాద్



మ్యాచ్‌ను వీక్షిస్తున్న నటుడు వెంకటేశ్



సీఎం రేవంత్‌రెడ్డి కూతురు చప్పట్లు



మైదానంలో సినీ సంగీత దర్శకుడు తమన్ సందడి

ఈ లైన్.. ఫైన్!

ఓహెచ్ లైన్ల స్థానంలో ఇక యూజీ కేబుళ్లు

- ఆసక్తిగల ఏజెన్సీల నుంచి డీపీఆర్‌ల ఆహ్వానం
- గ్రేటర్‌లో 900 కిలోమీటర్ల ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లు
- అండర్ గ్రౌండ్ కేబుల్స్‌కు రూ.520 కోట్లు అవసరం
- డిస్కంకు నేడు డీపీఆర్‌లు సమర్పించనున్న ఏజెన్సీలు

సాక్షి, సిటీబ్యూరో:

ఇళ్లపై వేలాడుతూ ప్రమాదకరంగా మారిన ఓవర్‌హెడ్ (ఓహెచ్) విద్యుత్ లైన్ల స్థానంలో అండర్ గ్రౌండ్ (యూజీ) కేబుల్స్ వేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తయారు చేసి సమర్పించాల్సిందిగా కోరుతూ డిస్కం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఆరు ప్రముఖ అధ్యయన సంస్థలు ఇందుకు ముందుకు వచ్చినట్లు తెలిసింది. 900 కిలోమీటర్ల ఓహెచ్ లైన్ల స్థానంలో యూజీ కేబుళ్లను వేసేందుకు రూ.520 కోట్ల వరకు ఖర్చు అవుతున్నట్లు అంచనా. ఆయా ఏజెన్సీలు రూపొందించిన నివేదికను శుక్రవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు సమర్పించనున్నాయి.

ఓవర్‌హెడ్ లైన్ రహిత నగరంగా..

- గ్రేటర్‌లో ప్రస్తుతం 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 52 లక్షలకుపైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ప్రతిరోజూ గరిష్ట విద్యుత్ డిమాండ్ 60 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. వచ్చే వేసవిలో విద్యుత్ డిమాండ్ 100 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం లేకపోలేదు. పాతబస్తీ సహా ప్రధాన బస్తీల్లో ఇప్పటికీ నిజాం కాలం నాటి ఓవర్‌హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి.
- చిన్నపాటి ఈదురుగాలితో కూడిన వర్షానికే తెగిపడుతున్నాయి. విద్యుత్ అంతరాయాలతో పాటు అనేక మంది మృత్యువాతకు కారణమవుతున్నాయి. లైన్ల కింద అనేక చోట్ల భారీ భవంతులు వెలిశాయి. ఇంటిపై దుస్తులను ఆరవేసేందుకు వెళ్లిన మహిళలు, పతంగ్‌లను ఎగరేసేందుకు వెళ్లిన పిల్లలు ఓవర్‌హెడ్ లైన్‌కు అనుకుని విద్యుత్ షాక్‌తో మృతి చెందుతున్న ఘటనలు సైతం విదితమే. ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో యూజీ కేబుళ్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపర్చవచ్చని డిస్కం భావిస్తోంది. హైదరాబాద్‌ను ఓవర్‌హెడ్ లైన్ రహిత నగరంగా అంతర్జాతీయ పటంలో చూపించవచ్చని యోచిస్తోంది.



ప్రాధాన్య క్రమంలో పనులు..

- హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రమాదకరంగా మారిన బహిరంగ విద్యుత్‌లైన్ల (ఓవర్‌హెడ్)ను తొలగించి, వాటిస్థానంలో అండర్ గ్రౌండ్ (యూజీ) కేబుళ్లను వేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఇప్పటికే సుమారు 900 కిలోమీటర్ల ఓవర్ హెడ్ (ఓహెచ్) లైన్లు ఉన్నట్లు గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ కేబుళ్ల ఏర్పాటుకు రూ.520 కోట్లకు పైగా ఖర్చు కానుందని అంచనా వేసింది. డీపీఆర్ సమర్పించిన ఏజెన్సీలకే పనులను అప్పగించాలని యోచిస్తోంది.
- గ్రేటర్ మొత్తంగా ఒకే సమయంలో కాకుండా ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టనున్నట్లు రెండు రోజుల క్రితం అసెంబ్లీలో విద్యుత్ శాఖ మంత్రి ప్రకటించడం తెలిసిందే. పేదలు ఎక్కువగా నివసించే నందినగర్, వారాసిగూడ, రాంనగర్, చిలకలగూడ, ఎన్టీఆర్ నగర్, ఇందిరా పార్కు, అశోక్‌నగర్, పద్మారావునగర్, గాంధీనగర్, ఖైరతాబాద్, నాంపల్లి, రాజేంద్రనగర్, బోరబండ, శ్రీరామ్‌నగర్, లెనిన్‌నగర్, మన్సూరాబాద్, నాగోలు, అడ్డగుట్ట, మెహిదీపట్నం, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన లైన్లను మార్చే అవకాశం ఉంది.

జీహెచ్‌ఎంసీ పరిధిలో విద్యుత్ నెట్‌వర్క్ ఇలా..

33/11కేవీ సబ్‌స్టేషన్లు	498
33కేవీ యూజీ కేబుల్	1,280 కి.మీ
33కేవీ ఓవర్‌హెడ్ లైన్స్	3,725 కి.మీ
11 కేవీ ఓవర్‌హెడ్ లైన్స్	21,643 కి.మీ
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,022
11కేవీ యూజీ కేబుల్	957
డీటీఆర్‌లు	1,50,992
ఇంటర్మీడియట్ స్తంభాలు	58,271

జీహెచ్‌ఎంసీలో 50 మందిపై వేటు

రిటైరయ్యాక కొనసాగుతున్న అధికారులు ఇక ఇళ్లకే

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ అధికారం, ఉద్యోగం నుంచి రిటైరయ్యాక సైతం వివిధ పేర్లతో మున్సిపల్ పరిపాలన శాఖలోని వివిధ విభాగాల్లో కొనసాగుతున్న వారిని వెంటనే పంపించాల్సిందిగా తాజాగా వెలువడిన ఉత్తర్వుతో జీహెచ్‌ఎంసీలోని దాదాపు యాభై మంది ఇక ఇళ్లకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. జీహెచ్‌ఎంసీలో ఇలా కొనసాగుతున్న వారిలో అడిషనల్ డైరెక్టర్, డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ సిటీప్లానర్, సూపరింటెండెంట్, ఆర్‌డీఓ, ఈఈ, సూపరింటెండెంట్‌ల స్థాయిల నుంచి దిగువ స్థాయిల వరకు ఉన్నారు. వీరు రీఅపాయింట్‌మెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ల పేరిట తిరిగి జీహెచ్‌ఎంసీలోనే కొనసాగుతున్నారు. కొందరు కొన్ని 'కీ'లక స్థానాల్లో ఉండి చక్రం తిప్పుతున్న వారు సైతం ఉన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం మేరకు వారి గడువు 2024లోనే ముగిసిపోవాల్సి ఉండగా, చాలామంది ఇప్పటికీ కొనసాగుతున్నారు. కొందరిని మాత్రం గడువు ముగిసిన వెంటనే ఉండటానికి వీల్లేదంటూ పంపించిన సంబంధిత అధికారులు.. చాలామంది ఇంకా కొనసాగుతున్నా పట్టించుకోలేదు. దీన్ని టాప్ ప్రయారిటీగా పేర్కొంటూ వెంటనే పంపించాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేయడంతో వీరు ఇక ఇళ్లకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది.

30న 'సాక్షి' ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం



నిజాంపేట్: బాచుపల్లి, క్రాంతినగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రముఖ మీడియా సంస్థ 'సాక్షి' ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు సాక్షి– ఉగాది పంచాంగ శ్రవణం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల 30న బాచుపల్లి, క్రాంతినగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రఖ్యాత నర్తకి యామినిరెడ్డి బృందం కళాత్మక కూచిపూడి నృత్యం, సిద్ధాంతి చక్రవర్తులు శ్రీవత్సాచార్యుల పంచాంగ పఠనం, ఆధ్యాత్మిక ప్రసంగాలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రముఖ సంస్థ భారతీ సిమెంట్స్ ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

నగరంలో మరో 13 ఎక్సైజ్ ఠాణాలు

వచ్చే నెల 1 నుంచి కార్యకలాపాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కొత్తగా మరో 13 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు కానున్నాయి. వచ్చే నెల నుంచి ఇవి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. వాస్తవానికి ఐదేళ్ల క్రితమే కొత్త స్టేషన్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినప్పటికీ అమలుకు నోచుకోలేదు. తాజాగా ఈ ప్రతిపాదనలను పరిశీలించిన ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆమోదముద్ర వేశారు. హైదరాబాద్ ఎక్సైజ్ డివిజన్‌లో కొత్తగా బంజారాహిల్స్ ఆబ్కారీ స్టేషన్ ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్ దీని పరిధిలోకి రానున్నాయి. సికింద్రాబాద్ డివిజన్‌లో మారేడుపల్లి, చిక్కడపల్లి ఎక్సైజ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. మారేడుపల్లి స్టేషన్ పరిధిలో గోపాలపురం, మహంకాళి, మోండా మార్కెట్, మారేడపల్లి, తుకారాం గేట్ రానున్నాయి. చిక్కడపల్లి పరిధిలో గాంధీనగర్, దోమలగూడ, చిక్కడపల్లి ప్రాంతాలు ఉంటాయి. శంషాబాద్ లో కొత్తగా గండిపేట్, కొండాపూర్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. కొండాపూర్ పరిధిలో కొండాపూర్‌తో పాటు మాదాపూర్ ప్రాంతాన్ని చేర్చారు. గండిపేట్ పరిధిలో గండిపేట్ మండలం ఉంటుంది. సరూర్‌నగర్ పరిధిలో మీర్‌పేట్ స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీతో పాటు మరో రెండు డివిజన్లు ఉంటాయి. పెద్ద అంబర్‌పేట్ స్టేషన్ పరిధిలో బీఎన్‌రెడ్డి నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలు ఉంటాయి. మేడ్చల్‌లో కొంపల్లి, కూకట్‌పల్లి స్టేషన్‌లను కొత్తగా ఏర్పాటు చేశారు. కొంపల్లి స్టేషన్ పరిధిలో 129వ వార్డు, నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలను చేర్చారు. కూకట్‌పల్లిలో 114, 122, 123, 124వ వార్డులను చేర్చారు. మల్కాజిగిరిలో కాప్రా, నాచారం, అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్లు కొత్తగా రానున్నాయి. కాప్రా పరిధిలోకి కాప్రా మున్సిపాలిటీ, ఏఎస్‌రావునగర్ తదితర ప్రాంతాలు, నాచారం పరిధిలో 4వ వార్డు, మౌలాలి హౌసింగ్‌బోర్డు కాలనీ, నాచారం, చిలుకానగర్, హబ్సిగూడ తదితర ప్రాంతాలు ఉంటాయి. అల్వాల్ స్టేషన్‌లో పరిధిలో అల్వాల్ మాత్రమే ఉంటుంది. కొత్తగా ఏర్పాటు కానున్న ఎక్సైజ్ స్టేషన్‌లకు బంజారాహిల్స్, చిక్కడపల్లి, గండిపేట్, కొండాపూర్, పెద్ద అంబర్‌పేట్ కూకట్‌పల్లిలో అద్దె భవనాలను గుర్తించారు. అద్దె భవనాలు లభించని మిగతా స్టేషన్‌లు.. మారేడుపల్లి, మీర్‌పేట్, కొంపల్లి, కాప్రా, నాచారం, అల్వాల్ స్టేషన్‌లు ప్రస్తుతం ఉన్న పాత స్టేషన్‌లలోనే కొనసాగుతాయి.

'ఆర్డర్ల బాధితుడి'కి నగదు రిఫండ్



సాక్షి, సిటీబ్యూరో: నగర వ్యాపారిని ఫోన్ ద్వారా సంప్రదించి, భారీ ఆర్డర్ల పేరుతో ఎర వేసి, మోసం చేసి, రూ.9.5 లక్షలు కాజేసిన కేసులో ఆ మొత్తాన్ని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు రిఫండ్ చేయించారు. దీనికి సంబంధించిన డీడీని అదనపు సీపీ పి.విశ్వప్రసాద్ బుధవారం బాధితుడికి అందజేశారు. ఇంటర్‌నెట్ ద్వారా నగర వ్యాపారి ఫోన్ నెంబర్ సంగ్రహించిన సైబర్ నేరగాళ్లు ఆయన ఉత్పత్తులకు ఉత్తరాదిలో మార్కెటింగ్ చేస్తామని నమ్మించారు. దీనికోసం తమ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని, దేశ, విదేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నట్లు నకిలీ ఈ-మెయిల్స్ సృష్టించారు. సరుకు సరఫరాకు ముందు తమకు రూ.9.5 లక్షల చెల్లించాలని చెప్పిన సైబర్ నేరగాళ్లు ఆ మొత్తం తమ ఖాతాల్లో వేయించుకుని మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నమోదైన కేసును ఏసీపీ ఆర్‌జీ శివమారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాద్‌రావు దర్యాప్తు చేశారు. కీలక నిందితులు అమర్‌నాథ్ సింగ్, రణ్‌వీర్ సింగ్‌లను అరెస్టు చేసి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాలతో ఆ ఇద్దరూ బాధితుడి నుంచి కాజేసిన మొత్తం తిరిగి ఇచ్చేందుకు అంగీకరించారు. దీనికి సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్‌ను పోలీసుల ద్వారా బాధితుడికి అందజేశారు.

మెట్రో రెండో దశపై కేంద్రం నజర్

- డీపీఆర్‌లపై స్పష్టత
- ఢిల్లీలో ఎన్వీఎస్ రెడ్డి పర్యటన
- సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చలు
- రెండోదశ మొదటి 5 కారిడార్‌లలో 76.4 కిలోమీటర్లు
- నార్త్, ఫ్యూచర్‌సిటీలపై వచ్చే నెలలో డీపీఆర్‌లు



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండో దశ ప్రాజెక్టుపైన కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రెండో దశలో ప్రతిపాదించిన మొదటి 5 కారిడార్‌ల డీపీఆర్‌లపైన సంబంధిత మంత్రిత్వ శాఖల అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో పాటు అధికారుల బృందం రెండు రోజుల క్రితం ఢిల్లీలో పర్యటించింది. డీపీఆర్‌లలోని సాంకేతిక అంశాలపైన చర్చలు జరిగినట్లు తెలిసింది. వివిధ మార్గాల్లో చేపట్టనున్న కారిడార్‌లపై కేంద్ర అధికారులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకే హెచ్‌ఏంఆర్‌ఎల్ అధికారులతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. మెట్రో రెండో దశలో ప్రభుత్వం మొదట 76.4 కిలోమీటర్లతో 5 కారిడార్‌ల నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 5 కారిడార్‌లపైన హెచ్‌ఏఎంఆర్‌ఎల్ సమగ్రమైన ప్రాజెక్టు నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి అందజేసింది. కేంద్రం నుంచి ఆమోదం లభిస్తే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. సుమారు రూ.24 వేల కోట్ల అంచనాలతో రెండో దశలో మొదటి 5 కారిడార్‌లను ప్రతిపాదించారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టు డీపీఆర్‌లలో సాంకేతిక అంశాలపైన చర్చలు సాధారణమైన అంశమేనని, కేంద్ర కేబినెట్ దీనిపైన దృష్టి సారించినప్పుడే కీలకమైన ముందడుగు పడ్డట్లుగా భావించాలని హెచ్‌ఏఎంఆర్‌ఎల్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

ఏప్రిల్‌లో నార్త్, ఫ్యూచర్ సిటీల డీపీఆర్‌లు..

మరోవైపు నార్త్‌సిటీలో ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు ప్రతిపాదించిన రెండు కారిడార్‌లతో పాటు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో రెండో దశ 'బి' విభాగంలో ప్రతిపాదించిన కారిడార్‌లకే ఏప్రిల్‌లో డీపీఆర్‌లను ఖరారు చేసి రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెలాఖరుకే అందజేయాల్సి ఉండగా ప్రాజెక్టుపైన సర్వేలు, అధ్యయనాల దృష్ట్యా ఏప్రిల్‌లో డీపీఆర్‌లు పూర్తి చేసే అవకాశం ఉంది.' బి' విభాగంలో ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్లు, శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు 22 కిలోమీటర్లు, ఫ్యూచర్‌సిటీ కారిడార్ 41 కిలోమీటర్ల చొప్పున నిర్మించనున్న సంగతి తెలిసిందే. రెండో దశలో రెండు విభాగాలుగా మొత్తం 8 కారిడార్‌లలో 190.4 కిలోమీటర్ల వరకు మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఉగాది టు ఉగాది డైరీ ఆవిష్కరణ

సుల్తాన్‌బజార్: దేవాదాయ శాఖలో కారుణ్య నియామకాల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు అర్చక ఉద్యోగ జేఏసీ, ఉద్యోగుల సంఘం నాయకులు గంగు ఉపేంద్ర శర్మ, కాండూరి కృష్ణమాచార్యులు తెలిపారు. గురువారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపేంద్ర శర్మ, కృష్ణమాచారి తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో కలిశారు. అర్చక ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాల కింద నియమితులైనవారిని క్రమబద్ధీకరించాలని సీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉగాది టు ఉగాది డైరీని రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అదేవిధంగా కృష్ణమాచారి గీసిన రేవంత్‌రెడ్డి చిత్రాన్ని ముఖ్యమంత్రికి బహూకరించారు. కార్యక్రమంలో పరశురామ్ రవీంద్రాచార్యులు, బద్రినాథాచార్యులు, అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ, బండారు జగపతి తదితరులు పాల్గొన్నారు.


ఉగాది టు ఉగాది డైరీని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

'డిజిటల్ అరెస్టు' కేసులో నిందితుల అరెస్టు

చిక్కిన వారిలో ఇద్దరు ఫిజియోథెరపిస్టులు

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు పేరుతో నేరాలకు పాల్పడే ఉత్తరాది వారికి తమ బ్యాంక్ ఖాతాలు అందిస్తూ సహకరిస్తున్న ముగ్గురు గుంటూరు వాసులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు ఫిజియోథెరపిస్టులు ఉన్నట్లు డీసీపీ దార కవిత వెల్లడించారు. నగరానికి చెందిన సాయి రాజ్‌కు సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. ఆయన పేరుతో తెరిచిన బ్యాంకు ఖాతా ద్వారా ముంబై కేంద్రంగా అక్రమ లావాదేవీలు జరిగినట్లు చెప్పి డిజిటల్ అరెస్టు చేశారు. ఆపై అతడి నుంచి రూ.3.57 లక్షలు వివిధ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయించుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్ నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేసింది. బాధితుడి నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకున్న ఖాతాల్లో గుంటూరుకు చెందిన ఫిజియోథెరపిస్టు శ్రీనివాసరావు ఖాతా కూడా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా... మరో ఫిజియోథెరపిస్టు ఎల్.జీవన్‌కుమార్ కోరడంతో తన ఖాతా ఇచ్చినట్లు అంగీకరించాడు. ఇతడినీ పట్టుకున్న పోలీసులు వివిధ కోణాల్లో ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌కు చెందిన రితిక అనే మహిళ గుంటూరుకు చెందిన వ్యాపారి టి.రఘువీర్ ద్వారా తనను సంప్రదించినట్లు జీవన్ వెల్లడించాడు. తన ఖాతాలో పడిన మొత్తం నుంచి తాను పది శాతం, జీవన్, రఘువీర్ ఐదు శాతం చొప్పున తీసుకుంటారని, మిగిలిన మొత్తాన్ని రితికకు అందిస్తామని చెప్పాడు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు పరారీలో ఉన్న రితిక మినహా మిగిలిన ముగ్గురినీ అరెస్టు చేశారు. వీరిపై దేశవ్యాప్తంగా 13 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. అలాగే... స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో నగర వాసి నుంచి రూ.6.2 లక్షలు కాజేసిన కేసులో గుజరాత్‌కు చెందిన అకౌంట్‌హోల్డర్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అహ్మదాబాద్‌కు చెందిన లలిత్ కుమార్ జైస్వాల్ కీలక సైబర్ నేరగాళ్లతో చేయి కలిపాడు. కమీషన్ తీసుకుంటూ తన బ్యాంకు ఖాతాను వారికి అందించాడు. దీంతో పోలీసులు ఇతడిని అరెస్టు చేశారు.

డ్రగ్స్, గంజాయి స్వాధీనం

శ్రీనగర్‌కాలనీ: ఎస్టీఎఫ్ పోలీసులు గురువారం వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి డ్రగ్స్, గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ సమీపంలో కొందరు యువకులు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ బీ టీమ్ సీఐ భిక్షారెడ్డి నేతృత్వంలో దాడి చేసి ఎస్‌కే అహ్మద్ రహీమ్, మహ్మద్ ఫక్రుద్దీన్ అనే యువకులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.78 గ్రాముల ఎండిఎంఏ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సౌదీఅరేబియాకు చెందిన సఫార్, బెంగళూరుకు చెందిన సప్లయర్ ఇబ్రహీం జహీర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.



ధూల్‌పేటలో....
లోయర్ ధూల్‌పేటలో జుంగూర్ బస్తీలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ బీ టీమ్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 1.3కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కునాల్‌సింగ్, వినోద్‌సింగ్, హేమబాయిలను అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అనికేష్‌సింగ్, ఆర్తిబాయి, నరేన్, గణేష్‌సింగ్ పరారీలో ఉన్నారని వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు బాలరాజు, సంధ్య, కానిస్టేబుళ్లు యాదగిరి, అనీఫ్, నితిన్, మహేశ్వర్, శ్రీనివాసరెడ్డి, కౌసిక్ పాల్గొన్నారు.

ఓటీఎస్ గడువు 4 రోజులే

- ఆస్తిపన్ను చెల్లించండి.. నగరాభివృద్ధికి తోడ్పడండి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)త్వరలోనే ముగియనుండటంతో లక్ష్యాల సాధనకు వసూళ్ల కార్యక్రమాలు ముమ్మరం చేసిన జీహెచ్‌ఎంసీ.. ఉన్న అన్ని అవకాశాలనూ వినియోగించుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీనిచ్చే వన్‌టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) గడువు కూడా ఈ నెల 31వ తేదీనే ముగిసిపోనుండటంతో, ఉన్న నాలుగు రోజుల గడువులోగా బకాయిలు సహా అసలు చెల్లించాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. ఆస్తిపన్ను చెల్లింపులకు జీహెచ్‌ఎంసీ పోర్టల్ నుంచి, మై జీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా ఆన్‌లైన్ సదుపాయంతో పాటు మీ-సేవ కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిళ్ల కార్యాలయాల్లోని సిటిజెన్ సర్వీస్ సెంటర్లలో (సీఎస్‌సీ) చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రజల సదుపాయార్థం సీఎస్‌సీలు ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు. ఇళ్ల వద్దకు వచ్చే బిల్ కలెక్టర్లకు సైతం ఆస్తిపన్ను చెల్లించవచ్చని, చెల్లించిన సొమ్ముకు రాయితీతో కూడిన రసీదులను పొందాలని సూచించారు. ఆస్తిపన్ను చెల్లించడం ద్వారా ప్రజలు తమవంతుగా నగరాభివృద్ధికి తోడ్పడినవారవుతారని ఆయన పేర్కొన్నారు.

డెయిరీ పేరుతో బురిడీ

- పెట్టుబడులు ఆకర్షించి.. బిచాణా ఎత్తేసి
- రూ.15 కోట్లు టోకరా
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ఆలస్యంగా వెలుగులోకి..

మొయినాబాద్: డెయిరీ ఫాంలో పెట్టుబడులు పెడితే ప్రతి నెల కచ్చితమైన లాభాలు ఉంటాయని ప్రకటన ఇచ్చాడు.. పెట్టుబడులు ఆకర్షించి రూ.15 కోట్లు రాబట్టాడు.. ఆ తర్వాత బిచాణా ఎత్తేశాడు.. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలివీ.. నగరానికి చెందిన వ్యాపారులు శ్రీనివాస్‌రావు, కోటేశ్వరరావు 2019లో అజీజ్‌నగర్ రెవెన్యూలో 15 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారు. అందులో కూరగాయలు, పూల తోటలతోపాటు డెయిరీ ఏర్పాటు చేస్తామని లీజు పత్రాల్లో రాసుకున్నారు. వారు లీజుకు తీసుకున్న భూమిలో కోటేశ్వరరావు బంధువైన వేముల సుబ్బారావు 2021లో కొండపల్లి డెయిరీ ఫాం పేరుతో డెయిరీ ఏర్పాటు చేశాడు. సుమారు 400 గేదెలతో డెయిరీని నడుపుతూ పాల ఉత్పత్తులు చేసేవారు. రెండేళ్ల క్రితం అతను తమ డెయిరీలో పెట్టుబడులు పెడితే ప్రతి నెల కచ్చితమైన లాభాలు ఉంటాయని పేపర్‌లో ప్రకటన ఇచ్చాడు. ఇది చూసిన కొంత మంది పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారు. రూ.15 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటి నుంచి కొనసాగిన డెయిరీని పది రోజుల క్రితం సుబ్బారావు మూసివేశాడు. అందులోని గేదెలను రాత్రికి రాత్రే తరలించాడు. దీంతో రూ.3 కోట్లు పెట్టుబడి పెట్టిన సాయి హరీష్ అనే వ్యక్తి ఈ నెల 17న మొయినాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. అనంతరం మరో ఎనిమిది మంది బాధితులు వేముల సుబ్బారావు, అతని భార్య కుమారి పెట్టుబడుల పేరుతో తమను మోసం చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పెద్ద మొత్తంలో ఆర్థిక నేరం జరిగినందున కేసును సైబరాబాద్ కమిషనరేట్‌లోని ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అల్మాస్‌గూడలో హైడ్రా పంజా

- రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ స్టేడియం కూల్చివేత
- మూసిన మూడు రోడ్లు, పార్కు స్థలానికి విముక్తి
- హైడ్రా సీఐపై దాడికి భూ యజమానుల యత్నం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో హైడ్రా పంజా విసిరింది. రోడ్లను ఆక్రమించి నిర్మించిన బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని నేలమట్టం చేసి కాలనీవాసులకు విముక్తి కల్పించింది. వివరాలు ఇలా ఉన్నాయి. అల్మాస్‌గూడలో బోయపల్లి కుటుంబీకులు 1982లో జీపీ లే అవుట్ చేశారు. కాలనీకి బోయపల్లి ఎన్‌క్లేవ్ అని పేరుపెట్టారు. సర్వే నంబర్ 39,40,41,42,44లో 5.7 ఎకరాల లే అవుట్ ఉండగా అందులో మూడు రోడ్లు, 236 గజాల పార్కు స్థలం చూపించి ప్లాట్లు విక్రయించారు. భూ యజమానులు మూడు లింక్ రోడ్లతో పాటు పార్కు జాగా ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ఆక్రమించిన రోడ్ల స్థానంలో బాక్స్ క్రికెట్ స్టేడియం నిర్మించారు. దీనిపై కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో రెండు రోజుల క్రితం హైడ్రా అధికారులు లే అవుట్‌ను పరిశీలించి కబ్జాను నిర్ధారించారు. గురువారం హైడ్రా సీఐ తిరుమలేశ్ నేతృత్వంలో 40 మందికి పైగా సిబ్బంది యంత్రాలతో అక్కడికి చేరుకున్నారు.


బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని చదును చేస్తున్న హైడ్రా సిబ్బంది

హైడ్రా సీఐపై దాడికి యత్నం

బాక్స్ క్రికెట్ స్టేడియాన్ని కూల్చివేస్తుండగా భూమికి సంబంధించిన వ్యక్తులు అడ్డుకునే యత్నం చేశారు. హైడ్రా సీఐ తిరుమలేశ్‌తో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో దాడికి యత్నించారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అదే రీతిలో సీఐ బదులివ్వడంతో భూ యజమానులు వెనక్కి తగ్గారు. హైడ్రా సిబ్బంది వెంటనే జేసీబీతో క్రికెట్ స్టేడియాన్ని ధ్వంసం చేసి చదును చేశారు. లేఅవుట్‌లో చూపించిన పార్కు స్థలంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఇది పార్కు స్థలం అంటూ బోర్డు పాతించారు. దాడికి యత్నించిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ తిరుమలేశ్ తెలిపారు. అనంతరం కాలనీవాసులు సీఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.


హైడ్రా సీఐపై దాడికి యత్నిస్తున్న దృశ్యం

24 గంటల్లో వాటర్ ట్యాంకర్ల డెలివరీ

సాక్షి,సిటీబ్యూరో: వాటర్ ట్యాంకర్లను పెండెన్సీ లేకుండా 24 గంటల్లో డెలివరీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు జలమండలి ఒక ప్రకటనలో వెల్లడించింది. వాటర్ ట్యాంకర్ల పెండెన్సీపై 'సాక్షి' లో గురువారం ప్రచురితమైన ''ట్యాంకర్.. ఫికర్!'' కథనంపై స్పందించిన జలమండలి వివరణ ఇచ్చింది. ఈ నెల 25,26 తేదీల్లో బుకింగ్ జరిగిన ట్యాంకర్లను ఎలాంటి పెండెన్సీ లేకుండా 24 పని గంటల్లోనే క్లియర్ చేసినట్లు పేర్కొంది. మొత్తం ఫిల్లింగ్ స్టేషన్లలో రోజువారీగా సగటున 9049 నుంచి 9080 వరకు ట్యాంకర్ల బుకింగ్ జరుగుతుందని, అందులో 86 నుంచి 112 వరకు బుకింగ్ లు మాత్రమే వివిధ కారణాలతో పెండింగ్ పడుతున్నట్లు తెలిపింది. ట్యాంకర్ల డిమాండ్ దృష్ట్యా డెలివరీలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పసికందును కన్నతల్లే చంపేసింది

మైలార్‌దేవ్‌పల్లి: నీళ్ల బకెట్‌లో పడి 14 రోజుల పసికందు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే చిన్నారిని తల్లే నీటి బకెట్‌లో వేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మైలార్‌దేవపల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ గురువారం వివరాలు వెల్లడించారు. తమిళనాడు ప్రాంతానికి ముదిలాని మణి, ఆరోగ్య విజ్జి(30) భార్యాభర్తలు అలీనగర్‌లోని ఓ కంపెనీలో పని చేస్తూ అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు, 14 రోజుల కుమార్తె ఉన్నారు. మణికి రెండు కిడ్నీలు పాడైపోవడంతో అతడి చికిత్స కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. దీంతో గత కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో పాప జన్మించడంతో ఆమె పోషణ విషయమై ఆరోగ్య విజ్జి ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 25న భర్త పనికి వెళ్లిన సమయంలో విజ్జి తన కుమార్తెను బాత్‌రూమ్‌లోని నీటి బకెట్‌లో పడేసి హత్య చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించింది. గురువారం నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఓపెన్‌టాప్ జీపులో వెళ్తూ పిస్టల్ తిప్పుతూ..

న్యూసెన్స్‌కు పాల్పడిన యువకులపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఓపెన్ టాప్ జీపులో వెళుతూ.. గాలిలో పిస్టల్ తిప్పుతూ న్యూసెన్స్‌కు పాల్పడిన యువకులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లోని సెర్వి హోటల్ సమీపంలో కొందరు యువకులు నెంబర్ ప్లేట్ లేని ఓపెన్ టాప్ జీపులో వెళ్తున్నారు. వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వెళ్లడంతో పాటు ఓ యువకుడు పిస్టల్‌ను గాలిలో తిప్పుతూ వెళ్తున్నాడు. ఇన్‌స్టాగాంలో ఈ వీడియో వైరల్ అయ్యింది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ శ్రీకాంత్ అధికార ట్యాబ్‌లో ఈ వీడియోతో కూడిన ఇన్‌స్టాగాం లింక్‌ను గమనించాడు. దీనిపై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయుధాల చట్టం ఉల్లంఘించి పిస్టల్‌ను గాలిలో తిప్పుతూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేశారని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి దూకి నవ వధువు ఆత్మహత్య


సౌజన్య (ఫైల్)

ముషీరాబాద్: భర్త, అత్తింటి వేధింపులు తాళలేక ఓ నవ వధువు భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భోలక్ పూర్ లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భోలక్‌పూర్‌కు చెందిన సౌజన్యకు మూసాపేటకు చెందిన జిమ్ నిర్వాకుడు శబరీష్ యాదవ్‌తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. అయితే సౌజన్యకు గుండెలో రంధ్రం ఉందని, చెప్పకుండా పెళ్లి చేశారని ఆమె భర్త, అతడి కుటుంబ సభ్యులు సౌజన్యను తరచూ వేధిస్తున్నారు. ఈ విషయం దాచినందుకు అదనపు కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నారు. పలుమార్లు ఆమెను పుట్టింటికి పంపారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి అత్తింటికి వెళ్లిన సౌజన్యను తమ ఇంటికి రావొద్దంటూ అక్కడినుంచి వెల్లగొట్టారు. దీంతో మనస్తాపం చెందిన సౌజన్య పుట్టింటికి వచ్చి మూడంతస్తుల భవనం పైనుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికి మృతి చెందినట్లు ముషీరాబాద్ పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి పుష్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ దారుణ హత్య

సనత్‌నగర్: గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లగొండకు చెందిన నాగరాజు బతుకుదెరువు నిమిత్తం కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చాడు. అయితే భార్యతో గొడవల కారణంగా ఆమెను వదిలేసి ఒక్కడే ఉంటున్నాడు. కూలీగా పని చేస్తూ పుట్‌పాత్‌లపై నిద్రించేవాడు. ఈ నేపథ్యంలో అతడికి ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేసుకునే మహిళతో పరిచయం ఏర్పడింది. బుధవారం రాత్రి ఇద్దరూ కలిసి భరత్‌నగర్ బ్రిడ్జి కిందికి వెళ్లి ఏకాంతంగా గడిపారు. అనంతరం నాగరాజు ఆమెను తీవ్రంగా కొట్టడంతో అక్కడికక్కడే మరణించింది. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సనత్‌నగర్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు నాగరాజును అరెస్టు చేశారు. అయితే మృతురాలి వివరాలు తెలియరాలేదు. ఆమె సంబంధీకులు ఎవరైనా ఉంటే సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు

ఇటీవల జరిగిన సంఘటనల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం

- డ్రైవర్లకు కౌన్సెలింగ్
- నిర్లక్ష్యంగా నడిపితే ట్యాంకర్ సీజ్ చేస్తామని హెచ్చరిక
- జలమండలి డివిజన్– 6 పరిధిలో 179 ట్యాంకర్లు

బంజారాహిల్స్: మూడు రోజుల క్రితం పంజగుట్టలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని వెనుక నుంచి వేగంతో వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాటర్ ట్యాంకర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లనే ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వారం రోజుల క్రితం ఎల్బీనగర్ నుంచి కూకట్‌పల్లి వైపు ఓ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంతో దూసుకుపోతుండడంతో పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. సదరు వాటర్‌ట్యాంకర్ డ్రైవర్ పీకల దాకా మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లుగా ఈ పరీక్షల్లో తేలింది.



వాటర్ ట్యాంకర్ డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



ట్యాంకర్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

ట్యాంకర్ డ్రైవర్లపై ప్రత్యేక దృష్టి..

ఇటీవల జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ పోలీసులు వాటర్ ట్యాంకర్ డ్రైవర్లపై దృష్టిపెట్టారు. తరచూ జరుగుతున్న వాటర్ ట్యాంకర్ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ర్యాండమ్‌గా డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ వాటర్ సెక్షన్ రిజర్వాయర్ వెంకటగిరిలో ఉండగా, ఇక్కడ ఉన్న 41 మంది ట్యాంకర్ డ్రైవర్లకు పోలీసులు డ్రంకన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించారు. అంతేకాకుండా వీరందరికీ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ.ప్రవీణ్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. వాటర్ ట్యాంకర్‌కు సంబంధించిన పత్రాలన్నీ ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, మద్యం సేవించి పట్టుబడ్డా ట్యాంకర్లను సీజ్ చేయడంతో పాటు డ్రైవర్‌పై క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు.

డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ ప్రక్రియ నిత్యం కొనసాగుతుంది..

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో బంజారాహిల్స్, తట్టిఖానా, సోమాజిగూడ, వెంకటగిరి, ఎర్రగడ్డ, ఎస్సార్‌నగర్, ఫతేనగర్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 179 వాటర్ ట్యాంకర్లు ఉన్నాయి. వీటి ద్వారా ఆయా ప్రాంతాల్లో ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్, ట్రాఫిక్ పోలీసులు తమ పరిధిలోని వాటర్ రిజర్వాయర్ ఫిల్లింగ్ పాయింట్ల వద్ద ట్యాంకర్ డ్రైవర్లకు డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడమే కాకుండా వారికి కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ నిత్యం కొనసాగుతుందని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా తెలిపారు. ట్యాంకర్లు వెళ్లేటప్పుడు ఏమాత్రం నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడిపినా ట్రాఫిక్ పోలీసులు ఆపి డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తారని ఆయన వెల్లడించారు.

వాటర్ ట్యాంకర్లపై విచారణ చేపట్టాం..

ఇటీవల పంజగుట్టలో వాటర్ ట్యాంకర్ ఢీకొని ఒకరు మృతి చెందడం, మరొకరు మద్యం సేవించి పట్టుబడడాన్ని తీవ్రంగా పరిగణించాం. ఈ రెండు సంఘటనలపై విచారణ చేపట్టాం. అయితే ఈ రెండూ ప్రైవేటు ట్యాంకర్లు అని తేలింది. జలమండలి డివిజన్-6 పరిధిలో నీళ్ల సరఫరా చేసే ట్యాంకర్లకు వీరికి సంబంధం లేదు. ఈ విషయాన్ని పోలీసులకు కూడా తెలియజేశాం. మేము కూడా రోజూ ట్యాంకర్ డ్రైవర్లకు జాగ్రత్తలు చెబుతుంటాం. ఆర్టీఏ, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని చెబుతున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ ట్యాంకర్‌ను బ్లాక్ లిస్ట్‌లో చేర్చుతాం. మా పరిధిలో నడుస్తున్న 179 మంది ట్యాంకర్ డ్రైవర్లకు ప్రతిరోజూ హెచ్చరికలు చేస్తున్నాం.

– హరిశంకర్, జీఎం, జలమండలి డివిజన్-6

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనకై ఏప్రిల్ 2న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నాకు యావత్ బీసీ సమాజం తరలిరావాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నా పోస్టర్‌ను ఆయన బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసి దాన్ని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగే మహాధర్నాకు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ హాజరుకానున్నట్లు బీసీలకు రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ కట్టుబడి ఉన్నారని బీసీ ప్రధానమంత్రి అని చెప్పుకునే మోదీ బిల్లును ఆమోదింపచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశంగౌడ్, జాతీయ ఓబీసీ జాక్ చైర్మన్ సరికొండ రామకృష్ణం రాజు, దేశగోని సాంబశివగౌడ్, రామకోటి, శివకుమార్, సౌజన్య, బెక్కం వెంకట్, అనంతుల రామ్మూర్తి గౌడ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని లేక్ వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆయన ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్‌గౌడ్, వనం సంగీతా శ్రీనివాస్ యాదవ్, రాములు చౌహాన్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నగదుతో పాటు బైక్ చోరీ

ఫిలింనగర్: బైక్‌లో రూ.50 వేలు భద్రపరిచి మరిచిపోయి ఇంట్లోకి వెళ్లిన ఓ ఈవెంట్ మేనేజర్ బైక్ చోరీకి గురైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. షేక్‌పేట సమీపంలోని ఫాల్కన్ వ్యాలీ ఆర్కిడ్ ఎన్‌క్లేవ్‌లో నివసించే మహ్మద్ జహూర్ ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 10:45 గంటల ప్రాంతంలో తన బైక్‌ను ఎప్పటిలాగే ఇంటి ముందు పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లిపోయాడు. అయితే బైక్ డిక్కీలో ఈవెంట్‌కు సంబంధించిన రూ.50 వేల నగదు భద్రపరిచిన విషయం మరిచిపోయాడు. తెల్లవారుజామున లేచి చూసేసరికి పార్కింగ్ స్థలంలో బైక్ కనిపించలేదు. దీంతో ఆయన తన బైక్ చోరీకి గురైందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి

సనత్‌నగర్: మెరుగైన వైద్యం కోసం అవసరమైన ఆర్థిక సహాయం పొందడానికి ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో గురువారం అమీర్‌పేట, రాంగోపాల్‌పేట డివిజన్లకు చెందిన 9 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3.32 లక్షల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక సమస్యల కారణంగా వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, సంతోష్ మణికుమార్, అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, హరిసింగ్, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ సర్కిల్‌లో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



బంజారాహిల్స్: ఖైరతాబాద్ సర్కిల్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీలో కలిసి వినతి పత్రం అందజేశారు.

ప్రైవేటు బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య



శశికళ (ఫైల్)

సనత్‌నగర్: ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్న ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన పి.నర్సింహుడు కుమార్తె పెరుమాళ్ల శశికళ (24) కూకట్‌పల్లిలోని ఉజ్జీవన్ స్మాల ఫైనాన్స్ బ్యాంక్‌లో పనిచేస్తోంది. మధురానగర్‌లోని మరో స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసే రమాదేవితో కలిసి ఎస్సార్‌నగర్‌లోని ఓ గదిలో అద్దెకు ఉంటోంది. రోజూ మాదిరిగా గురువారం ఉదయం రమాదేవి విధులకు వెళ్లగా గదిలో శశికళ ఒక్కరే ఉంది. ఇదిలా ఉండగా శశికళ మిత్రుడు రమాదేవికి ఫోన్ చేసి శశికళ బాధపడుతూ తనకు ఫోన్ చేసిందని, గదికి వెళ్లి చూడాల్సిందిగా చెప్పాడు. దీంతో రమాదేవి హుటాహుటిన గదికి వచ్చి చూడగా లోపలి నుంచి గడియ పెట్టుకుని సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. రమాదేవి పోలీసులకు ఇవ్వడంతో పోలీసులు శశికళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



పంజగుట్ట చౌరస్తాలో అవగాహన కలిగిస్తున్న జుడియో ఉద్యోగులు

బంజారాహిల్స్: ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెద్ద ఎత్తున చోటుచేసుకుంటున్నాయి. నిర్లక్ష్య డ్రైవింగ్‌తో పాటు మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ ధరించకపోవడం ఇందుకు కారణాలుగా గత పది రోజుల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు కళ్లకు కట్టాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని పంజగుట్ట హైదరాబాద్ సెంట్రల్‌లో ఉన్న జుడియో ఉద్యోగులు సామాజిక బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కలిగించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఈ ఉద్యోగులను అభినందించారు. వాహనదారులకు అవగాహన కలిగించేందుకు సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దంటూ మద్యం సేవించి వాహనాలు నడపరాదంటూ ఎర్రటి ఎండలో గంటల తరబడి నిలబడి ప్రచారం కల్పించడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఉద్యోగులందరూ తాము రూల్స్ పాటిస్తూ మిగతా వారిని కూడా అప్రమత్తం చేయాలని కోరారు.

'ముఫకంజా'లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందుకు హాజరైన అతిథులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని గులాం అహ్మద్ హాల్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఐక్యతను పెంపొందించేలా నిర్వహించిన ఈ విందుకు హైదరాబాద్‌లోని టర్కీ కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఒకన్, వి.హనుమంతరావు, చింతల రామచంద్రారెడ్డి, షబ్బీర్ అలీ, ఐఏఎస్ అధికారి జయేష్‌రంజన్, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, ఐపీఎస్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. సుల్తాన్-ఉల్-ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావీద్ వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బోర్డు సభ్యులు డాక్టర్ మీర్ అక్బర్ అలీఖాన్, ఆమేర్‌జావీద్, ఇబ్రహీం అలీ సిద్ధిఖ్, అఖిల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డీ సిల్టింగ్ పనులు



ఖైరతాబాద్‌లో వరద నీటి కాల్వల్లో వ్యర్థాలు వెలికితీస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: వర్షాకాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారులు వేసవి నుంచే నాలాలు, వరద నీటి కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను, పూడికను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. రెండు వారాల క్రితం మొదలైన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖైరతాబాద్ డివిజన్‌లో 40 శాతం మేర పనులు పూర్తి కాగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్లలో కొన్ని చోట్ల ఇంకా పనులు మొదలు కాలేదు. ఫిలింనగర్ కొత్త చెరువు వద్ద నాలాలో భారీ ఎత్తున వ్యర్థాలతో పాటు పూడిక పేరుకుపోవడంతో గత కొన్ని రోజుల నుంచి స్థానికంగా ఉన్న బస్తీల్లో నాలా నుంచి మురుగు బయటికి తన్నుకొస్తూ స్థానికంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. అధికారులు పనులను వేగవంతం చేసి పూడిక వ్యర్థాలను తొలగించాలంటూ స్థానికులు కోరుతున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో రెండు ద్విచక్ర వాహనాలు మాయం

వెంగళరావునగర్: హాస్టల్ ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఆర్‌నగర్ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేసుకుంటున్న పి.గణేష్‌కుమార్ ఈనెల 24న తిరుపతి వెళ్తూ వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీ హాస్టల్‌లో ఉంటున్న అతని స్నేహితుడు రమేష్‌ను కలిసి తన వాహనాన్ని హాస్టల్ ముందు పార్కింగ్ చేశాడు. 25న ఉదయం రమేష్ హాస్టల్ బయటకు వచ్చి చూడగా గణేష్ వాహనం కనిపించలేదు. దీంతో రమేష్ ఈ విషయాన్ని గణేష్‌కు తెలిపాడు. ఇదిలా ఉండగా కార్మికనగర్‌కు చెందిన జి.పవన్ కుక్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 26న ఉదయం వెంగళరావునగర్‌లోని క్యాటరింగ్ చేసే గేటు బయట తన బావకు చెందిన ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి తిరిగి రాత్రి బయటకు వచ్చి బోరబండలోని తన స్నేహితుని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నాడు. తిరిగి గురువారం తెల్లవారుజామున తన వాహనం కోసం వెంగళరావునగర్ క్యాటరింగ్ సెంటర్‌కు రాగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. ఈ రెండు ఘటనల్లో తమ ద్విచక్ర వాహనాల కోసం బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రంజని తెలుగు సాహితీ సమితి ఉగాది సంచిక ఆవిష్కరణ



ఉగాది సంచిక ఆవిష్కరణలో వక్తలు

ఖైరతాబాద్: ఏజీ కార్యాలయంలో గురువారం రంజని తెలుగు సాహితీ సమితి ఆరుబయట రంగస్థలంలో ఉగాది సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ మాటల రచయిత, నటుడు పరుచూరి వెంకటేశ్వర రావు ముఖ్యఅతిథిగా హాజరై రంజని ఉగాది సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా తెలుగు భాషకు సేవ చేస్తున్న రంజని అద్భుతమన్నారు. ఎన్నో పాత జ్ఞాపకాలకు అంకురార్పణ ఈ కార్యాలయమే అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్య పండితులు, కార్యాలయ పూర్వ ఉద్యోగి బ్రహ్మశ్రీ అదిరాజు శ్రీనివాస ఫణీంద్ర ఉగాది ప్రవచనం చేశారు. ఉగాది సంచికలో రచనలు చేసిన రచయితలకు, కవులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీ ఆఫీసు పూర్వ ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్ ఎల్‌వీ సుధీర్ కుమార్, రంజని అధ్యక్షులు నందిరాజు పద్మలత జయరాం, ఉపాధ్యక్షులు అద్దెపల్లి రాధాకృష్ణ, మట్టిగుంట వెంకటరమణ, కృష్ణంరాజు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

వెంగళరావునగర్: మహిళ అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..కార్మికనగర్‌లో నివసించే దంబూర్ధర్ స్వైన్‌కు 9 ఏళ్ల కిందట మమత అనే మహిళతో వివాహమైంది. ఇద్దరూ కూలీ పని చేస్తున్నారు. ఈనెల 26న ఆమె అకౌంట్ నుంచి డబ్బులు విత్‌డ్రా చేయడానికి స్వైన్ ఏటీఎం వద్దకు వెళ్లాడు. అకౌంట్‌లో డబ్బులు లేవు. దీంతో ఆమె పని చేస్తున్న చోటకు వెళ్లి అడిగాడు. ఆమె శ్రీను అనే మరో కార్మికుడితో కలిసి ఇంటికి పరిగెత్తింది. సాయంత్రం ఇంటికి వచ్చి ఆమెను అడగాలని అనుకున్నాడు. అయితే అతను ఇంటికి వచ్చేలోగా ఆమె కనిపించలేదు. ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుంది. శ్రీను అనే వ్యక్తి కూడా కనిపించడం లేదు. అతను మాయమాటలు చెప్పి తన భార్యను తీసుకెళ్లాడనే అనుమానంతో దబూర్ధర్ స్వైన్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏప్రిల్ 13న షిర్డిసాయి–లక్ష్మీ మహాయజ్ఞం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరుణ్‌షిండే గైక్వాడ్ పాటిల్

బంజారాహిల్స్: ఏప్రిల్ 13న ఇందిరాపార్కు ఎన్టీఆర్ గ్రౌండ్ వద్ద 999 హోమగుండాలతో షిర్డిసాయి-లక్ష్మీ మహాయజ్ఞం-2025 నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ అరుణ్‌షిండే గైక్వాడ్ పాటిల్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన గురువారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని విశ్వసాయి మందిరంలో ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌నాయుడు, ప్రముఖ బిల్డర్ వాయి రెడ్డి కోటి సూర్యనారాయణ బాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..షిర్డిసాయి-లక్ష్మీ మహాయజ్ఞం తర్వాత మహాప్రసాద భోజనం ఉంటుందని, సాయంత్రం సాయి నామ జపం, భజన సంధ్య ఉంటాయన్నారు. శ్రీ సాయిభక్త లక్ష్మీబాయి షిండే ట్రస్ట్ షిర్డీ, అన్ని సాయిబాబా మందిరాల ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాయజ్ఞానికి తొమ్మిది గ్రాముల వెండి నాణెం, పూజా సామగ్రి, ఒక సాయి ఫొటోఫ్రేమ్ అందిస్తారన్నారు. ఇదిలా ఉండగా లక్ష్మీబాయి షిండేకు శ్రీ షిర్డిసాయి 1918 అక్టోబర్ 15న తన స్వహస్తాలతో ఇచ్చిన తొమ్మిది నాణేలు అత్యంత విశేషమైనవని, ఇవి నవవిధ భక్తి మార్గాలకు సూచికలుగా భావిస్తూ సాయి భక్తుల కోసం ఇక్కడ ప్రదర్శించినట్లు వెల్లడించారు.

అమెజాన్ లైసెన్స్‌ను కేంద్రం వెంటనే రద్దు చేయాలి

హిమాయత్‌నగర్: అమెజాన్ లైసెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బహుళజాతి సంస్థ అయిన అమెజాన్ దేశంలో ప్రవేశించిన కొద్ది కాలంలోనే ఆన్‌లైన్ వ్యాపారం ద్వారా ఇతర సంస్థల కన్నా ఎక్కువ వ్యాపారాన్ని ఆక్రమించిందని మండిపడ్డారు. అనేక బహుళజాతి సంస్థలకు ఉన్న మోస పూరిత లక్షణమే అమెజాన్‌కు కూడా ఉంటుందని ఇటీవల బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండెడ్స్) చేసిన దాడిలో బయటపడిందన్నారు. బహుళజాతి సంస్థలను దేశంలోని రిటైల్ వ్యాపారంలో అనుమతించరాదని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అనేక పోరాటాలు చేసినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి కార్పొరేట్ సంస్థలకు రిటైల్ వ్యాపారంలో అనుమతివ్వటమే ప్రస్తుత పరిస్థితికి కారణమని విమర్శించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

లిబర్టీ: అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజ్యాంగం రాసిన అంబేడ్కర్ విగ్రహానికి రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లజర్ల మండలం దుపచర్ల గాంధీ కాలంలో అంబేడ్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేసి అవమానపరిచారని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ అంబేడ్కర్ విగ్రహాలకు దుండగులు చెప్పుల దండలు వేసి అవమాన పరచడం పరిపాటిగా అయిందని దుండగులపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఐఐఎంసీ కళాశాలలో టాలెంట్ టెస్ట్

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, సెంచరీ ఐఏఎస్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో 13 రాష్ట్రాలు, 80 పట్టణాలకు చెందిన వివిధ కళాశాలలకు చెందిన 505 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఈ పరీక్షలో మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అంశాలపై 150 మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలతో గంట పాటు నిర్వహించారు. టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు.

కస్టమర్లుగా వచ్చి.. 54.89 గ్రాముల బంగారు గాజుల చోరీ

పంజగుట్ట: బంగారం దుకాణంలో కస్టమర్లుగా వచ్చిన ఇద్దరు మహిళలు బంగారు గాజులు దొంగిలించిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమాజిగూడలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో ఈ నెల 20న ఇద్దరు మహిళలు బంగారు గాజులు కొనేందుకు కస్టమర్ల రూపంలో వచ్చారు. అక్కడి సేల్స్‌మెన్ వీరికి బంగారు గాజులు చూపిస్తుండగా సేల్స్‌మెన్ వెనక్కి తిరిగి వేరే మోడల్స్ గాజులు తీసేలోపు ట్రేలో ఉన్న 54.89 గ్రాముల బరువు ఉన్న రెండు (22 క్యారెట్ల) బంగారు గాజులు తీసుకుని వాటి స్థానంలో రెండు నకిలీ గాజులు ఉంచారు. ఆఖరుకు ఎలాంటి కొనుగోలు చెయ్యకుండా తమకు డిజైన్‌లు నచ్చలేదని వెళ్లిపోయ్యారు. తనిఖీల్లో భాగంగా సిబ్బంది బంగారు ఆభరణాలు తనిఖీ చేస్తుండగా జోన్ 4లోని కౌంటర్‌లో డిస్ప్లేలో ఉన్న గాజులు నకిలీవిగా తేల్చారు. సీసీ కెమెరాలు అన్ని పరిశీలించగా 20న రాత్రి 9:15కు ఇద్దరు మహిళలు గాజులు మార్చినట్లు నిర్ధారించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం షోరూం డిప్యూటీ హెడ్ జిజేష్ కె.ఎమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌యూజే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

హిమాయత్‌నగర్: సెక్యులరిజం ప్రమాదంలో పడిన దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్‌యూజే) ఆధ్వర్యంలో గురువారం రాత్రి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ. ఫహీంతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం జర్నలిస్ట్ సోదరులకు కార్జుర ఫలాలు తినిపించి ఉపవాస దీక్ష విరమింపజేశారు. ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే రంజాన్ మాసం వారికి శుభం కలిగించాలని శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలని ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ.ఫహీం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ స్టీరింగ్ కమిటీ మెంబర్ దేవులపల్లి అమర్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు ఎం.ఏ.మాజీద్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే.విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, హెచ్‌యూజే అధ్యక్షులు శిగ శంకర్ గౌడ్, కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి దౌర్జన్యాలకు తెర.. తిరిగింది ఫ్యాన్ గిరగిర

ఉప ఎన్నిక జరిగిన స్థానాలు **50**

వైఎస్సార్‌సీపీ కైవసం **39**

వాయిదా: **7**

అధికార కూటమి అరాచకాలకు ఎదురొడ్డి నిలిచి విజయకేతనం

టీడీపీ ఆశలకు గండి కొడుతూ కడప జెడ్పీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

సాక్షి నెట్‌వర్క్: అధికార కూటమి ప్రభుత్వ బెదిరింపులు, దౌర్జన్యాలు, అడ్డంకుల మధ్య రాష్ట్ర వ్యాప్తంగా గురువారం జరిగిన 'స్థానిక' ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తన హవాను చాటుకుంది. మూడింట రెండొంతులకు పైగా స్థానాల్లో విజయకేతనం ఎగుర వేసింది. ఎక్కడికక్కడ అధికార కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నేతలు తీవ్ర బెదిరింపులకు పాల్పడినా చాలా చోట్ల వారి ఆటలు సాగలేదు. పలు చోట్ల ఎంతగా ఒత్తిడి ఎదురైనా ఎంపీటీసీ/జెడ్పీటీసీ/వార్డు సభ్యులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, మద్దతుదారుల పక్షానే నిలిచి ప్రభుత్వ పెద్దలకు బుద్ధి చెప్పారు. తీవ్ర ఉత్కంఠ మధ్య జరిగిన వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ముత్యాల రామగోవిందరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్‌తోపాటు ఖాళీ అయిన 28 మండలాల ఎంపీపీ (మండల అధ్యక్ష), 20 మండలాల వైస్ ఎంపీపీ (మండల ఉపాధ్యక్ష), 210 గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం ఎన్నికలు నిర్వహించింది. ఇందులో 24 మండలాల్లో ఎంపీపీ, 17 మండలాల్లో వైస్ ఎంపీపీ ఎన్నిక పూర్తయింది. నాలుగు మండలాల్లో ఎంపీపీ, ఆరు మండలాల్లో వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. 184 పంచాయతీల్లో ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తయింది. వార్డు సభ్యుల పదవి ఖాళీగా ఉండటం వల్ల 16 పంచాయతీల్లో ఉప సర్పంచ్ ఎన్నిక రద్దయింది. మరో పది పంచాయతీల్లో ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి, శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంటలో కోరం లేకపోవడం, అత్తిలి, రామగిరిలో ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరవ్వడంతో ఎంపీపీ ఎన్నికను వాయిదా వేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఏలూరు జిల్లా కైకలూరు, బాపట్ల జిల్లా నరసరావుపేట, నెల్లూరు జిల్లా దగదర్తిలో కోరం లేకపోవడం.. ఏలూరు, పల్నాడు జిల్లా కారంపూడి, పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరవ్వడంతో వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది.


వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ముత్యాల రామగోవిందరెడ్డి


తిరుపతి రూరల్‌లో విజయోత్సాహంతో టపాకాయలు కాల్చుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

త్రిపురాంతకంలో టీడీపీకి దిమ్మ తిరిగేలా షాక్

ప్రకాశం జిల్లాలో గురువారం రెండు ఎంపీపీలు, ఒక వైస్ ఎంపీపీ, కో–ఆప్షన్, నాలుగు ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరిగాయి. రెండు ఎంపీపీలతో పాటు వైస్ ఎంపీపీ, కో–ఆప్షన్ సభ్యుడిని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. మార్కాపురం ఎంపీపీగా బండి లక్ష్మీదేవి, త్రిపురాంతకం ఎంపీపీగా ఆళ్ల సుబ్బమ్మ, పుల్లలచెరువు వైస్ ఎంపీపీగా లింగంగుంట్ల రాములు, యర్రగొండపాలెం కో–ఆప్షన్ సభ్యునిగా సయ్యద్ సాధిక్‌లు వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికయ్యారు. త్రిపురాంతకంలో ఎంపీటీసీ సభ్యురాలు ఎం సృజనను భయపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసిన టీడీపీకి ఆమె దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. ఎంపీపీ ఉప ఎన్నికలో పాల్గొనేందుకు టీడీపీ మద్దతు వర్గంతో వచ్చిన ఆమె వైఎస్సార్‌సీపీ అభ్యర్థినిగా పోటీ చేసిన ఆళ్ల సుబ్బమ్మకు మద్దతుగా చేయి ఎత్తారు. దీంతో మాజీ ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి ఆమె చున్నీ పట్టుకుని లాగాడు. చేయిదించమని గట్టిగా అరుస్తూ గద్దించినా సృజన చలించలేదు. దీంతోపాటు మేడపి గ్రామానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇండిపెండెంట్ ఎంపీటీసీ సభ్యుడు పి.కృష్ణ నేరుగా వచ్చి సుబ్బమ్మకు మద్దతిచ్చారు. ఫలితంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆళ్ల సుబ్బమ్మ ఎంపీపీగా ఎన్నికై ంది. సృజన నిర్ణయంతో టీడీపీ సభ్యులకు దిమ్మ తిరిగిపోయింది. పుల్లలచెరువులో కూడా బలం లేకపోయినా టీడీపీ కుయుక్తులు పన్నింది. రెండు వర్గాలకు సమానంగా ఓట్లు రావడంతో లాటరీలో వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకుంది.


త్రిపురాంతకంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సృజన చున్నీ లాగుతున్న టీడీపీ నేత కోట్ల సుబ్బారెడ్డి

బెదిరింపులకు లొంగని నాగేంద్రమ్మ..: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం వైస్ ఎంపీపీ పదవికి గురువారం జరిగిన ఉప ఎన్నికలో టీడీపీకి ఓటు వేయాలని భర్త ఒత్తిడి తెచ్చినా, భార్య మాత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేసి అటు నుంచి అటే పల్నాడులోని పుట్టింటికి వెళ్లింది. పుల్లల చెరువు మండలం ముటుకుల విద్యుత్ సబ్ స్టేషన్‌లో పోలయ్య నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన భార్య వి.నాగేంద్రమ్మ గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున మర్రివేముల ఎంపీటీసీ సభ్యురాలిగా పోటీ చేసి విజయం సాధించారు. మండల వైస్ ఎంపీపీగా పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాలని ఆ పార్టీ నేతలు పోలయ్యపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. బెదిరింపులకు కూడా దిగారు. చేసేదిలేక పోలయ్య తన భార్య నాగేంద్రమ్మకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించాడు. ఆమె ససేమిరా అన్నారు. ఎలాగైనా తన భార్యతో ఓటు వేయిస్తానని పోలయ్య చెప్పడంతో టీడీపీ నేతలు నాగేంద్రమ్మను వైస్ ఎంపీపీ ఎన్నికకు పంపారు. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగానే ఆమె వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైస్ ఎంపీపీ పోటీలో ఉన్న రాములుకు మద్దతుగా చేయి ఎత్తారు. ఆ తర్వాత తన భర్తతో మాట పడాల్సి వస్తుందని అటునుంచి అటే పల్నాడు జిల్లా దాచేపల్లిలోని తన పుట్టింటికి వెళ్లారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'సాక్షి'పై భూమా అఖిల దండయాత్ర

భారీగా జనాలను పోగేసి కర్నూలు యూనిట్ ఆఫీసుపైకి దాడికి యత్నం

కోళ్ల వ్యర్థాలతో పాటు ఆళ్లగడ్డ నుంచి వాహనాల్లో రాళ్లు, సీసాలు తరలింపు

- దంపింగ్ యార్డు నుంచి చెత్త కూడా..
- పోలీసుల జోక్యంతో దాడి కాకుండా నిరసనకు పరిమితమైన ఎమ్మెల్యే దంపతులు
- సాక్షి కార్యాలయం ముందు కోళ్ల వ్యర్థాలు, చెత్త పడేసి ఆందోళన
- తనపై వార్తలు రాసే ప్రతీసారి ఇలాగే స్పందిస్తానని బెదిరింపు
- టీడీపీ కూటమి పాలనలో పత్రికా స్వేచ్ఛపై దాడికి ఇదే నిదర్శనమంటున్న రాజకీయ పరిశీలకులు


సాక్షి కార్యాలయం ముందు చికెన్ వ్యర్థాలను పడేసి నిరసన తెలుపుతున్న అఖిలప్రియ దంపతులు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఆళ్లగడ్డ టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్‌రామ్ గురువారం 'సాక్షి'పై దండయాత్రకు తెగబడ్డారు. నియోజకవర్గంలో అవినీతి, అరాచకాలు.. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు చేస్తున్న అక్రమాల గురించి 'సాక్షి' రాస్తున్న కథనాల నేపథ్యంలో వారు భారీగా అనుచరులను పోగేసి కర్నూలులోని 'సాక్షి' యూనిట్ కార్యాలయానికి తరలివచ్చారు. కోళ్ల వ్యర్థాలు, డంపింగ్ యార్డులోని చెత్తను ఆఫీసు ముందు పడేశారు. బతికిన కోళ్లను కూడా కొన్నింటిని వదిలారు. 'భూమా' అనుచరులు ప్లకార్డులు పట్టుకుని 'సాక్షి'కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో పత్రికా స్వేచ్ఛపై యథేచ్ఛగా దాడి జరుగుతోందనడానికి ఇదే నిదర్శనమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

రోజంతా అఖిలప్రియ హడావుడి..

అంతకుముందు.. 'సాక్షి' ఆఫీసుపై దాడికి ఎమ్మెల్యే అఖిలప్రియ పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యారు. ఉదయమే నియోజకవర్గంలోని గ్రామాలకు వాహనాలను పంపి జనాలు రావాలని చెప్పారు. భూమా ఆఫీసు నుంచి పల్లెలకు ఫోన్‌చేసి 'ఎమ్మెల్యే, భార్గవ్ చెప్పారు.. కర్నూలు సాక్షి ఆఫీసు వద్దకు వెళ్లాలి.. కారు పంపిస్తున్నాం.. రండి' అని ఫోన్లుచేశారు. అయితే, జనాల నుంచి పెద్దగా స్పందనలేదు. దీంతో 10 గంటలకు కర్నూలుకు రావాలనుకున్న అఖిల రాలేకపోయారు. మళ్లీ గ్రామాలకు ఫోన్లుచేసి జనాలను పోగేసి మ. 2.50 గంటలకు ఆళ్లగడ్డ నుంచి బయల్దేరారు. అఖిల విషయంపై 'సాక్షి' ప్రతినిధులు కర్నూలు పోలీసులకు సమాచారం అందించారు. వారు అప్రమత్తమై పాణ్యం, నన్నూరు టోల్‌గేట్ వద్ద నియంత్రించే ప్రయత్నం చేశారు. అయితే, సీఎం కార్యాలయ అధికారులకు అఖిల ఫోన్‌చేసి పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. సా.4.30కు 'సాక్షి' ఆఫీసుకు చేరుకున్నారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. నిరసన తెలిపి వెళ్లిపోతానని ఆమె చెప్పారు. మొదట ప్లకార్డులు పట్టుకుని 'సాక్షి'కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత ఆళ్లగడ్డ నుంచి ప్రత్యేక వాహనంలో తెచ్చిన కోళ్ల వ్యర్థాలను, డంపింగ్‌యార్డు నుంచి తీసుకొచ్చిన చెత్తను ఆఫీసు ముందు పడేశారు. ఒక్కసారిగా దుర్వాసన వెదజల్లడంతో పోలీసులతో పాటు వారి అనుచరులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇక పోలీసులు ఉండడంతో వాహనాల్లోని రాళ్లు, సీసాలను బయటకు తీయలేదు. ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'చికెన్‌షాపుల నుంచి మేం కిలోకు రూ.10 తీసుకుంటున్నట్లు, డబ్బులు ఇవ్వని వారి షాపులను మూయిస్తున్నట్లు 'సాక్షి'లో కథనం వచ్చింది. మేమలా డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే మా ఆస్తులు రాసిస్తాం. భవిష్యత్తులో నాపై ఇలాంటి కథనాలు రాస్తే నా స్పందన ఇలాగే ఉంటుంది' అని అన్నారు.

ఏప్రిల్ 2న బీసీల పోరుగర్జన

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఏప్రిల్ 2వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే బీసీల పోరు గర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు, విద్యా, వైద్యం, ఉపాధి రంగాల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీలో చట్టం చేసి పార్లమెంటుకు పంపడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అన్ని బీసీ, కుల సంఘాల ఆధ్వర్యంలో పోరు గర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే రోజు ఢిల్లీలో సర్వాయి పాపన్న 315వ వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మార్చి 31న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉదయం 7 గంటలకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని, బీసీలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమన్వయ కమిటీ వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్ కుమార్‌గౌడ్, బాలగౌని వెంకటేష్ గౌడ్, సుగూరి దుర్గయ్యగౌడ్, వి.నాగభూషణం, సింగం నాగేష్ గౌడ్, పోతగాని అయిలేని గౌడ్ పాల్గొన్నారు.

క్యాబ్‌లపై బెట్టింగ్ యాప్ ప్రకటనలా?

- 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఓ పౌరుడు

బంజారాహిల్స్: ఒకవైపు బెట్టింగ్, గేమింగ్ యాప్‌లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతూ, ప్రచారం చేస్తున్నవారిపై కొరఢా ఝుళిపిస్తుండగా మరోవైపు ఈ యాప్‌లపై ప్రకటనలు అలాగే ఉన్నాయని, ఇవి ఎంతమందిని ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేశారని హరీష్ డాగా అనే వ్యక్తి సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్‌కు, హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ చౌరస్తాలో ఓ క్యాబ్‌పై ఐఎక్స్ బెట్ అనే గేమింగ్ యాప్ ప్రకటనను ఆయన గమనించి దానిని ఫొటో తీసి ఎక్స్‌లో పోస్టు చేశారు. పట్టపగలు ఇంత దర్జాగా బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తూ కార్లపై ప్రకటనలు కనిపిస్తున్నా పోలీసులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వీటిని అరికట్టకపోతే రాబోయే రోజుల్లో యువత మరింతగా ఆకర్షితులై బలవుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.


బెట్టింగ్ యాప్ ప్రకటనను 'ఎక్స్'లో పోస్ట్ చేసిన పౌరుడు

ఏహెచ్‌పీ జాతీయ కమిషన్ సభ్యుడిగా శిరందాస్

లక్డీకాపూల్ : కేంద్ర ప్రభుత్వం వైద్య అనుబంధ వృత్తుల(ఏహెచ్‌పీ) జాతీయ కమిషన్ సభ్యుడిగా శిరందాస్ శ్రీనివాసులును నియమించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, వైద్య అనుబంధ వృత్తుల జాతీయ కమిషన్ కార్యదర్శి అరవింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న శ్రీనివాసులు ఈ చట్టం రూపకల్పనలో కూడా భాగస్వామ్యులయ్యారు. అంతే కాకుండా ఆయన చేసిన పలు సూచనలు బిల్లులో ఆమోదం పొందాయి. ఈ నియమాకం నిమ్స్ ఉద్యోగులకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుకు నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీనివాసులు నియామకం పట్ల డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా. శాంత్ వీర్, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకాడమిక్ డైరెక్టర్ దామోదర నాయుడు, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, నిమ్స్ లైజనింగ్ అధికార్లు డాక్టర్ మార్త రమేష్, రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. కాగా, మరో హైదరాబాదీ జీవీకే, ఈఎంఆర్‌ఐకి చెందిన సూర్ల రవికి కౌన్సిల్‌లోని ట్రామా, బర్న్ కేర్, సర్జికల్, అనస్థీషియా విభాగంలో సభ్యుడిగా చోటు దక్కింది.

నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్ రూ.1.20 కోట్ల విరాళం

- నిమ్స్, మహావీర్ ఆసుపత్రులకు అందజేత

మాదాపూర్: మహావీర్ ఆసుపత్రి, నిమ్స్‌లకు నోవాటెల్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ 1.20 కోట్ల విరాళం గురువారం అందజేసింది. 2024–25 సంవత్సరానికిగాను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్) కార్యక్రమంలో ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలను మెరుగుపరిచేందుకు వీటిని వినియోగించనున్నారు. ఇందులో రూ.60.80 లక్షలు మహావీర్ హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్‌లోని డయాగ్నోస్టిక్స్ లేబొరేటరీ పునఃనిర్మాణం, ఆధునీకరణకు, మరో రూ. 60 లక్షలు నిమ్స్‌లో ప్రత్యేక వైద్య పరికరాల కొనుగోలుకు వెచ్చించనున్నారు. కార్యక్రమంలో జాయింట్ వెంచర్ కంపెనీ బిజినెస్ హెడ్ ఎస్.మధుసూదన్‌రావు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప, మహావీర్ హాస్పిటల్ చైర్మన్ మహేంద్రకుమార్, హెచ్‌ఐసీసీ జనరల్ మేనేజర్ రూబిన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికం

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత సిల్క్‌ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణాలో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ప్రశ్నపత్రాల లీకేజీపై బీఆర్‌ఎస్‌వీ ఆందోళన

సుల్తాన్‌బజార్: పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు లీకవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పరీక్షా పత్రాల లీకేజీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎస్‌ఎస్‌సీ బోర్డు కార్యాలయాన్ని బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీకి ప్రైవేట్ ఇన్విజిలేటర్లే కారణమని, ప్రైవేటు విద్యాసంస్థలకు అధిక మార్కులు వచ్చే విధంగా ఈ వ్యవహారం సాగుతోందని ఆరోపించారు. ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్వీ ప్రతినిధులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

భావి చాంపియన్లను తీర్చిదిద్దడమే లక్ష్యం

- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గచ్చిబౌలి: భావి చాంపియన్లను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 4వ కియో జాతీయ కరాటే చాంపియన్‌షిప్–2025 పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలిపే కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోందన్నారు. ఒలింపిక్స్‌తో పాటు అనేక అంతర్జాతీయ పోటీల్లో చిన్న దేశాలు పతకాలు సాధిస్తుంటే 130 కోట్ల జనాభా ఉన్న భారతదేశం వెనుకబడి పోవడం బాధాకరమన్నారు. సీఎం ప్రోత్సాహంతో రాష్ట్రం మరిన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీలకు వేదిక కానుందని తెలిపారు. కార్యక్రమంలో కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు భరత్‌శర్మ, కార్యదర్శి సంజీవ్ జాంగ్రా, రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కీర్తన్ పాల్గొన్నారు.

నేడు సీఎం రాక.......

గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం జరిగే పోటీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని శివసేనారెడ్డి తెలిపారు. సీఎంతో పాటు ఎమ్మెల్సీ, తెలంగాణ కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఫైనార్ట్స్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు

విజయనగర్ కాలనీ: ఫైనార్ట్స్ విద్యార్థులకు సినిమా, టీవీ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.గంగాధర్ అన్నారు. ప్రత్యేక అభిరుచి కలవారు మాత్రమే ఈ కళల్లో రాణిస్తారని పేర్కొన్నారు. గురువారం మాసబ్ ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఎంఎఫ్‌ఏ పెయింటింగ్ విద్యార్థులు అన్ కన్వెన్షనల్ రూట్స్ పేరిట ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల జీవన విధానం, సేంద్రియ విత్తనాలు, పాడిపంటల ప్రాధాన్యతలను తెలుపుతూ కొలువైన ఆర్ట్ ఎగ్జిబిషన్ చూపరులను ఆలోచింపజేస్తోందన్నారు. గ్రామీణ మహిళలు చేసే కులవృత్తులు, పర్యావరణ పరిరక్షణ, సెలయేళ్లు, పక్షులు, దేశ నాయకుల చిత్రాలు, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతకు అద్దం పడుతున్నాయని అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.మధుకర్, ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎల్ ఆనంద్‌రావు, పెయింటింగ్ విభాగాధిపతి, డాక్టర్ ప్రీతి సంయుక్త, రాం శ్రీధర్ కుమార్, సుధాకర్, గుర్రం మల్లేశంలతోపాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్



సాక్షి, సిటీబ్యూరో: ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ మరోసారి నగరవాసుల ముందుకొచ్చింది. ఎక్స్‌పో ఆర్గనైజర్ శశి సహతా బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ కృష్ణాలో గురువారం ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈనెల 29 వరకూ అందుబాటులో ఉంటుంది.

దివ్యాంగ దరఖాస్తుదారులకు ప్రత్యేక హెల్ప్‌లైన్

చాదర్‌ఘాట్: నిరుద్యోగుల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం(ఆర్‌యూవీ) రుణాల పథకానికి దివ్యాంగుల కోసం వికలాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 155326ను ప్రవేశపెట్టింది. గురువారం మలకోపేట సంక్షేమ శాఖ అధికారి ఏడీ రాజేందర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నప్పుడు ఏదైనా సమస్య వస్తే ఫోన్ చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలోని సంక్షేమ శాఖ అధికారుల ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్‌కు కన్నీటి వీడ్కోలు

- వేలాది మంది క్రైస్తవుల నివాళులు
- సికింద్రాబాద్ క్లాక్‌టవర్ పరిసరాల్లో ఉద్రిక్తత.. భారీగా పోలీసుల మోహరింపు

రాంగోపాల్‌పేట్: రాజమండ్రి వద్ద అనుమానాస్పదంగా మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల భౌతికకాయానికి వేలాది మంది క్రైస్తవులు, క్రైస్తవ ప్రముఖులు కన్నీటి వీడ్కోలు పలికారు. రాజమండ్రి నుంచి గురువారం తెల్లవారు జామున ఆయన భౌతికకాయాన్ని సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చికి తీసుకు వచ్చారు. భౌతికకాయాన్ని సందర్శించేందుకు పెద్ద ఎత్తున క్రైస్తవులు తరలి వచ్చారు. ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్, మాజీ ఎంపీ మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, తదితరులు ప్రవీణ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వేలాది మంది క్రైస్తవులు వియ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ప్రవీణ్‌ను హత్య చేసినవారిని వెంటనే పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేస్తూ చర్చి నుంచి ప్రధాన రహదారి వరకు వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ అక్కడే ఉండి టాస్క్‌ఫోర్స్, ఉత్తర మండలంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీసులను మోహరించారు. ప్రవీణ్ భౌతికకాయాన్ని పరేడ్ గ్రౌండ్ ప్రాంతంలోని సెయింట్ జాన్సన్ సెమిట్రీకి క్రైస్తవులు, అభిమానులు అశ్రునయనాల మధ్య తరలించారు. సీఎస్‌ఐ మెదక్ డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తదితరులు ప్రవీణ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.


పాస్టర్ ప్రవీణ్ పగడాల అంతిమ యాత్ర

భారీగా ట్రాఫిక్ జామ్

ప్రవీణ్ భౌతికకాయాన్ని సందర్శించేందుకు వేలాది మంది రావడంతో చర్చి చుట్టుపక్కల, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అంతిమయాత్ర సందర్భంగా ఎస్డీరోడ్, ఎస్పీరోడ్, సెయింట్ మేరీస్ రోడ్, జేబీఎస్ రోడ్డులో వాహనాలు స్తంభించాయి. ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు నత్తనడకన వాహనాలు సాగుతుండటంతో వాహనదారులు నరకయాతన పడ్డారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

సుప్రీం కోర్టు దాకా వెళ్తా: కేఏ పాల్

పాస్టర్ ప్రవీణ్ ది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని, న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టు వరకు వెళ్తానని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ అన్నారు. ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ తనకు హానీ చేసిన వారిపై ఎప్పుడూ ప్రతీకారం తీర్చుకోవాలనుకునే వ్యక్తి కాదని ఆయన సతీమణి జెస్సికా అన్నారు. 'నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. నీవు జాగ్రత్తగా ఉండాలి' అని ప్రవీణ్ పగడాల చెప్పేవాడని ఆయన పీఏ స్వర్ణలత చెప్పారు. ప్రవీణ్ మృతిపై ఆస్ట్రేలియా క్రైస్తవ తెలుగు సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శుక్రవారం, 28, మార్చి, 2025



మతాలకతీతంగా ప్రతి నగర వాసి సంప్రదాయ ఆహార సంస్కృతిలో మమేకమై పోయే సమయం రంజాన్. పాతబస్తీని అంతగా పట్టించుకోని ఐటీ నిపుణులు సైతం అసలు సిసలు హైదరాబాద్ అనుభవం కోసం ఓల్డ్ సిటీకి రౌండ్స్ కొట్టే సీజన్ ఇది. ఓ రకంగా దీన్ని లోకల్ టూరిజం అని పేర్కొనవచ్చు. రంజాన్ సీజన్‌లో ఈ లోకల్ టూరిస్టులు ఆస్వాదించే వాటిలో హలీమ్, ఇఫ్తార్‌లు మాత్రమే కాదు సెహ్రీ కూడా ఒకటి.

- సాక్షి, సిటీబ్యూరో

గుడ్‌మార్నింగ్.. సెహ్రీ..





రంజాన్ మాసంలో మాత్రమే అందుబాటులో

తెల్లవారే ముందు.. వంటకాల విందు..

అచ్చమైన హైదరాబాద్ రుచులు వడ్డిస్తున్న రెస్టారెంట్స్

ఇఫ్తార్ లానే సెహ్రీ టైమ్‌లోనూ ఆహార ప్రియుల సందడి

రోజా రకరకాల కారణాలతో.. రంజాన్ సమయంలో నగరం సెహ్రీ ప్రత్యేక మెనూల కోసం మేల్కొంటోంది. ఇది ముస్లింలు తమ రోజాను (ఉదయం నుంచి సాయంత్రం వరకూ చేసే ఉపవాసం) పునఃప్రారంభించే ముందుగా.. సూర్యోదయానికి ముందు తినే ఉదయపు భోజనం. అయితే ఈ సమయం సాధారణంగా ముస్లిమేతరులు ఎవరికీ అనుభవంలో లేని తెల్లవారుజామున ఆస్వాదించే వైవిధ్యభరిత అనుభూతి. సమయం మాత్రమే కాదు ఆ సమయానికి రెస్టారెంట్స్ వడ్డించే వంటకాలు కూడా ప్రత్యేక అనుభూతే.

వైవిధ్యభరిత అనుభూతి..

సెహ్రీ కోసం బయటకు వెళ్లడం సంప్రదాయ పద్ధతి కానప్పటికీ, లేట్‌నైట్ షిఫ్టుల్లో పని చేసే వారి సంఖ్య పెరగడంతో పాటు, వంటగదిలోకి అడుగు పెట్టకుండానే రంజాన్ సమయంలో రిలాక్స్‌డ్ ఫుడ్‌ని ఇష్టపడే వారూ పెరగడం వల్ల కొత్తగా సెహ్రీ ఇంటి బయట ఊపందుకుంటోంది. రెస్టారెంట్లలో సెహ్రీ భోజనం సాధారణంగా తెల్లవారుజామున 1.30 గంటలకు ప్రారంభమవుతుంది.



సిసలైన సిటీ రుచుల సెహ్రీ..



సాధారణ బిర్యానీ లేదా హలీమ్‌లా కాకుండా, సెహ్రీలో కిచిడీ ఖట్టా-ఖీమా, నిహారీ విత్ నాన్, దమ్ కా కీమా కబాబ్‌లతో సహా అనేక రకాల సంప్రదాయ వంటకాలు సెహ్రీలో వడ్డిస్తారు. వీటిని రెస్టారెంట్లు ఈ సమయంలో ప్రత్యేకంగా అందిస్తాయి. కబాబ్‌లు వగైరా కూడా ఇందులో ఉన్నాయి, కానీ పూర్తిగా కొత్త మెనూను ఈ సందర్భంగా చాలా మంది రుచి చూస్తారు. సిటీలోని అనేక రెస్టారెంట్లు, హోటళ్లు, రోడ్‌సైడ్ కేఫ్స్ సైతం ప్రత్యేక సెహ్రీ మెనూ ప్లేటర్‌ను అందిస్తున్నాయి. ఈ ప్లేటర్లు లేదా కాంబోలు కనీసం నలుగురికి సరిపోయేంత పెద్దవిగా ఉండడం విశేషం. ఎక్కువగా ఈ సెహ్రీ కాంబోల్లో కబాబ్‌లు, రోటీలు, అన్నం, పప్పులతో పాటు మాంసాహార స్టార్టర్‌ల మిశ్రమం ఉంటుంది. దీంతో పాటు వివిధ రకాల కబాబ్‌లు, నయాబ్ హోటల్‌లో పాపులర్ డిష్ ఓ ఆఫాల్ ఫ్రై, రోటీ పే బోటీ, కబాబ్స్‌తో రోగ్ని రోటీ వంటివి సెహ్రీ స్పెషల్స్‌గా పేరొందాయి.

ఎక్కడెక్కడ రుచి చూడొచ్చు అంటే..

ఓల్డ్ సిటీ, టోలిచౌకి, విమానాశ్రయ రహదారి (అరామ్‌ఘర్) వంటి ప్రాంతాల్లోని రెస్టారెంట్లు సెహ్రీ మెనులను అందిస్తాయి. అలాగే -టోలిచౌకి వంటి ప్రాంతాల్లో కూడా తాత్కాలిక ఆహార దుకాణాలు కనిపిస్తాయి. పాతబస్తీలోని నయాబ్ హోటల్ వంటి కొన్ని రెస్టారెంట్లు తమ సెహ్రీ మెనులను ఉదయం 1 గంట నుంచే అందిస్తాయి. అపరిమిత సెహ్రీ బఫేలను అందించేవి కూడా ఉన్నాయి. 'గత సంవత్సరం ఇంటి బయట 'సెహ్రీ' కోసం అనేక మంది ఆసక్తిని కనబరిచారు, అందువల్ల మేం అనేక కొత్త రుచులను జోడించాం. ఉదయం 1 నుంచి 5 గంటల వరకూ స్పెషల్ మెనూలు అందిస్తున్నాం' అని చార్మినార్ సమీపంలోని హోటల్ నయాబ్‌కు చెందిన జునైద్ అంటున్నారు. కొత్త మెనూలో 'ఆచారి' మటన్/చికెన్, నయాబ్ స్పెషల్ చికెన్, 'కిచ్డీకి', 'దమ్ కా ఖీమా' వంటి రుచికరమైన వంటకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం సెహ్రీ నగర నిజానికి ఒక భారీ ఆకర్షణగా మారుతోంది. మేం మా 'సెహ్రీ' మెనులో మటన్ 'తహరీ' అనే ప్రత్యేక వంటకం అందిస్తున్నాం' అని లకడికాపూల్‌లోని పెషావర్ రెస్టారెంట్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ మోయిద్ చెబుతున్నారు.



- మైనారిటీ మహిళల నైపుణ్యాల వేదిక
- మహిళా వ్యాపారవేత్తల కోసం ఫ్రీ ఇంక్యుబేషన్ ప్రాజెక్ట్
- వీ హబ్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ పూర్తి

జాగో ఉజాగర్..

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రంలోని మైనారిటీ మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం రూపొందించిన ప్రాజెక్ట్ ఉజాగర్ విజయవంతంగా పూర్తయ్యింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 56 మంది మహిళలు తమ వ్యాపారాలను ఫార్మలైజ్ చేసుకోవడం, డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో మార్కెట్ అవకాశాలను అన్వేషించడం సాధ్యమైందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ సంధ్య తెలిపారు. దేశంలోనే మొదటి రాష్ట్ర ప్రభుత్వ నోడల్ సంస్థ విమెన్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ హబ్ (వీ హబ్) ఆధ్వర్యంలో మైనారిటీ మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం వినూత్నంగా ప్రారంభించిన ప్రాజెక్ట్ ఉజాగర్ గ్రాడ్యుయేషన్ వేడుకను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు నెలల ఫ్రీ- ప్రోగ్రామ్ పూర్తి చేసిన 56 మంది మహిళలు ఎమ్ఎస్ఎమ్ఈ ఉద్యమ్, గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ సందర్భంగా తమ వ్యాపారాల్లో అధునాతన సాంకేతికతను భాగం చేస్తూ, భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్న మహిళలను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ సంధ్య అభినందించారు.

90 శాతం వ్యాపారాల వృద్ధి..


తమ వ్యాపారాలను ఫార్మలైజ్ చేసుకోవడం, డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం కోసం ఉజాగర్ ప్రాజెక్టుకు 73 మంది మహిళా పారిశ్రామిక వేత్తలు నమోదు చేసుకోగా.. 56 మంది మహిళలు తమ శిక్షణను పూర్తి చేసుకున్నారు. 89.29 శాతం మహిళలు తమ వ్యాపార ఆలోచనలను ధ్రువీకరించుకోగలిగారు. దీంతో మార్కెట్ అవగాహన పెంచుకొని, సమర్థవంతమైన వ్యాపార ప్రణాళికలను రూపొందించుకున్నారు. మహిళలు ఎమ్ఎస్ఎమ్ఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్, ఎఫ్ఎస్ఎస్ఏఐ, జీఎస్‌టీ వంటి వ్యాపార అనుమతులు పొందారు. ఇది వారి వ్యాపార ప్రామాణికతను పెంపొందించేందుకు తోడ్పడింది. ఈ శిక్షణలో భాగంగా వ్యాపారాల స్థాపన, ఆర్థిక విజ్ఞానం, బ్రాండింగ్, ప్యాకేజింగ్, డిజిటల్ మార్కెటింగ్ వంటి అంశాల పై అవగాహన పొందారు. హైదరాబాద్ ఆర్చిడియోసెస్ సోషల్ సర్వీస్ సొసైటీ భాగస్వామ్యంతో నిర్వహించనున్న ట్రాన్స్ ఉమెన్, స్టూడెంట్ ప్రోగ్రామ్స్ ప్రకటించాం.

– పల్లవొల్ల, వీ హబ్ సీఈఓ

మెట్రోస్టేషన్‌లో ఉగాది ఉత్సవం



ఈ నెల 29 వరకు మూడు రోజుల పాటు నిర్వహణ



సనత్‌నగర్: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో ముందస్తుగా ప్రారంభించారు. ఎల్ అండ్ టీ ఎంఆర్‌హెచ్ఎల్ ఆధ్వర్యంలో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా మెట్రోస్టేషన్‌ను తీర్చిదిద్దారు. తెలుగు సంప్రదాయం ప్రతిబింబించే రీతిలో మెట్రోస్టేషన్‌లోని కాన్‌కోర్ ప్రాంగణాన్ని ముస్తాబు చేసి ప్రయాణికులకు పండుగ అనుభూతిని అందిస్తున్నారు. విభిన్న రకాల వస్తువులు విక్రయించే దుకాణాలు, చేతి వృత్తుల స్టాల్స్ ఏర్పాటుచేశారు. సంగీతం, నృత్య ప్రదర్శనలు హోరెత్తాయి. 29 వరకూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో నాటికలు, పప్పెట్ షో, పంచాంగ శ్రవణం వంటి కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. మెట్రోరైల్ సీఓఓ సుధీర్ చిప్లంకర్, చీఫ్ స్ట్రాటజికల్ అధికారి మురళి పాల్గొన్నారు.



హ్యాపీ ఐస్‌క్రీమ్ డే..

సాక్షి, సిటీబ్యూరో: చుర్రుమనే ఎండలో డ్యూటీ చేస్తున్న పోలీస్‌ను చల్లగా పలకరించింది.. నిరుపేద చిన్నారులకు తియ్యని కబుర్లు పంచింది.. ప్రముఖ ఐస్‌క్రీమ్ బ్రాండ్ స్కూప్స్ ఆధ్వర్యంలో ఐస్‌క్రీమ్ డేని పురస్కరించుకుని గురువారం ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి, అనాథ చిన్నారులకు ఉచితంగా ఐస్‌క్రీమ్‌లను పంపిణీ చేశారు. కోటి ఎక్స్ రోడ్స్ నుంచి ప్రారంభమైన డ్రైవ్ దారిలోని ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి రిఫ్రెష్ ఐస్ క్రీమ్‌లను అందించారు. అనంతరం స్థానిక అనాథాశ్రమాన్ని సందర్శించి అక్కడి పిల్లలకు డిసర్ట్స్, ఐస్‌క్రీమ్స్ అందించారు.

ఆకట్టుకుంటున్న బర్డ్స్ ఐ



- ఈనెల 30 వరకు చిత్రప్రదర్శన కొనసాగింపు
- అందుబాటులో 40 మంది కళాకారులు వేసిన 100 వర్క్‌లు

మాదాపూర్ : కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని పలువురు సందర్శకులు కొనియాడారు. బర్డ్స్ ఐ పేరిట మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను పలువురు కళాకారులు గురువారం సందర్శించారు. ఈనెల 30 వరకూ నిర్వహించనున్న ప్రదర్శనలో 40 మంది కళాకారులు వేసిన 100 చిత్రాలు, స్కల్ప్చర్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో కళాకారులు తోటవైకుంఠం, అంజుపొద్దార్, పార్వతీరెడ్డి, చిప్పాసుధాకర్ పాల్గొన్నారు.







నగరంలో కొత్త క్లబ్..

పుంజుకుంటున్న పార్టీ కల్చర్‌కు తగ్గట్టే సరికొత్త వేదికలూ పుట్టుకొస్తున్నాయి. నగరంలోని గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో బిగ్ బుల్ క్లబ్ అండ్ మోయి రెస్టారెంట్ ఏర్పాటైంది. దీనిని గురువారం నుంచి నగరవాసులకు అందుబాటులోకి తెస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన పార్టీనైట్‌లో నటి ముమైత్ ఖాన్ సహా, వితిక షేరు, వరుణ్ సందేశ్, వీజే సన్నీ, నవ్య స్వామి, రాశి సింగ్, అక్షర గౌడ, అలేఖ్య హారిక, నేహా దేశ్ పాండే, ప్రిన్స్ వంటి పలువురు నటీనటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిగ్ బుల్ క్లబ్ నిర్వాహకులు రామరాజు, శశిధర్, సాయి సూరేపల్లి మాట్లాడారు. అత్యాధునిక నైట్‌క్లబ్‌లో మునుపెన్నడూ చూడని స్థాయి సంగీతం అందించేందుకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫంక్షన్ వన్‌లైన్ అర్రే సౌండ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



షడ్రుచుల సమ్మేళనం..



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గాజుల రామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్‌లో 'సాక్షి' ఆధ్వర్యంలో శ్రీ ఎస్‌పిఆర్ గ్లోబల్ స్కూల్ వేదికగా వేడుకలు నిర్వహించారు. శ్రీ క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, విశ్వావసునామ సంవత్సరానికి స్వాగతం పలికారు. సంప్రదాయ దుస్తులు ధరించి విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. దీంతో స్కూల్లో పల్లెటూరి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నూతన సంవత్సర పంచాంగాన్ని వివరించారు. అనంతరం స్కూల్ ఆవరణలో షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని పంచిపెట్టారు.

- కుత్బుల్లాపూర్





● ఇంగ్లీష్ ఇడియమ్స్

ఐ విల్ ఈట్ మై హ్యాట్

ఏదైనా విషయాన్ని బలంగా నమ్మకపోవడానికి సంబంధించి వాడే మాట...
'ఐ విల్ ఈట్ మై హ్యాట్'

ఉదా: ఇఫ్ యూ ఆర్ రియల్లీ ఏబుల్ టు క్లైంబ్ దట్ 8 ఫీట్ వాల్ బై యువర్ సెల్ఫ్ దెన్ ఐ విల్ ఈట్ మై హ్యాట్.

యువర్స్

● గేమింగ్

సవాలుకు సై అంటూ....



ఆ రాజ్యానికి అనుకోని కష్టం వచ్చి పడింది. శ్వేతజాతి శత్రుమూకలు ఫిరంగులతో దాడి చేస్తున్నాయి.వారి అత్యాధునిక ఆయుధ సంపత్తి ముందు జపాన్ యోధులు నిలబడ తారా? నిలబడ్డారు. ఆయుధానికి ఆత్మవిశ్వాసం జోడించి 'షేప్ యువర్ ఫ్యూచర్' అంటూ వేలకాం తులతో మెరిశారు.

యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్... రైజ్ ఆఫ్ ది రొనిన్. 19వ శతాబ్దంలో జపాన్‌లో బకుమసు కాలానికి చెందిన కథతో గేమ్ రూపొందించారు. మిషన్‌లలో భాగం కావడానికి ప్లేయర్స్ రక రకాల మ్యాప్స్‌ను ఎక్స్‌ప్లోర్ చేయాల్సి ఉంటుంది. ప్రిన్సెస్ అసుకో, సోజీ ఒకిట, దయూ, టకసుగి, సనా చిబా, కోగోరో కసుర... మొదలైన బెస్ట్ క్యారెక్టర్లు గేమ్‌లో ఉన్నాయి.

'కస్టమ్ క్యారెక్టర్'ను క్రియేట్ చేసే అవకాశం ఈ గేమ్ ప్లేయర్స్‌కు ఇస్తుంది **ఇంజిన్:** కటన ఇంజిన్ **జానర్స్:** యాక్షన్ రోల్-ప్లేయింగ్ **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 5, విండోస్ **మోడ్స్:** సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్



● ధోరణి

జెన్-జడ్ రెబల్స్

జెన్-జడ్ అనగానే 'డైనమిక్ నేచర్' అంటారు. అంతమాత్రాన అంతా సవ్యంగా ఉన్నట్లు కాదు. జెన్-జడ్ ఉద్యోగులు సరిచేసుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. జెన్-జడ్‌లో ప్రొఫెషనలిజం లేకపోవడం ఆందోళన కలిగిస్తుందని, ప్రొఫెషనల్ స్కిల్స్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది అంటున్నారు నిపుణులు...



క్వాయిట్ క్విట్టింగ్

యువ ఉద్యోగులకు సంబంధించి నిశ్శబ్ద నిష్క్రమణ (క్వాయిట్ క్విట్టింగ్) భారతీయ పరిశ్రమలలో వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఇది పరిశ్రమ నిర్వాహకులలో ఆందోళనను పెంచుతుంది.

'ఉద్యోగం అంటే కాలేజీకి ఎక్స్‌టెన్షన్ కాదు. ప్రొఫెషనలిజం అవసరమని చాలామందికి అర్థం కావడం లేదు. వివిధ రంగాల డైనమిక్స్‌పై కూడా అవగాహన కొరవడింది. ప్రతి రంగానికి ఒకే రకమైన పని అవసరాలు ఉంటాయని వారు భావిస్తున్నారు. జెన్-జడ్ ఉద్యోగుల ప్రవర్తనను కూడా నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది' అంటున్నారు టీమ్‌లీజ్ డిజిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నీతి శర్మ.



జెన్ జడ్ అలా కాదు...

పాత తరం ఉద్యోగులు, జెన్-జడ్ ఉద్యోగులకు మధ్య ఉన్న తేడా ఏమిటి?

ఒకప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురైనా 'మౌనమే మంచిది' అన్నట్లుగా ఉండేవాళ్లు. జెన్-జడ్ అలా కాదు...తమ అసమ్మతిని బహిరంగంగా చెప్పడానికి వెనకాడడం లేదు. పని ప్రమాణాలు, అవసరాల విషయంలో యువతరానికి, పాతతరానికి ఎంతో తేడా ఉంది. 'పని మాత్రమే జీవితం అని యువతరం అనుకోవడం లేదు. పనికి మించిన జీవితం ఉందనే విషయం వారికి తెలుసు. అయితే దీన్ని పాతతరం అంగీకరించం కష్టం' అంటుంది ఢిల్లీకి చెందిన సైకోథెరపిస్ట్ దివిజా బాసిన్. ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ అయిన దివిజకు 2.6 లక్షలకు పైగా ఫాలోవర్‌లు ఉన్నారు. 'హార్డ్ వర్క్'ను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉంది అంటారు ఆమె.

అయితే ఇది చిత్రానికి ఒక వైపు మాత్రమే. మరోవైపు యువతలోని ప్రతికూలతలు కనిపిస్తున్నాయి.

స్కిల్ గ్యాప్

ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ట్రేడ్ బాడీ నాస్కామ్ నివేదిక ప్రకారం టెక్ రంగంలో ఆరు లక్షల మంది నిపుణుల కొరత ఉంది. ప్రస్తుతం ఉన్న 'స్కిల్ గ్యాప్' సమస్యకు సులువైన పరిష్కార మార్గాలు లేకపోయినప్పటికీ యువత కార్పొరేట్ వాతావరణానికి అలవాటు పడటానికి సహాయపడే సాఫ్ట్ స్కిల్స్‌పై పరిశ్రమలు మరింత దృష్టి పెట్టే అవసరం ఉంది. రిక్రూట్‌మెంట్‌కు వచ్చే కంపెనీలు విద్యార్థుల్లో సాఫ్ట్ స్కిల్స్‌కు సంబంధించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నాయని ఢిల్లీకి చెందిన ఒక టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ హెడ్ చెప్పారు.



కష్టమే సుమీ!

అమెరికాకు చెందిన రెజ్యూమ్ బిల్డర్.కామ్ నిర్వహించిన సర్వేలో 74 శాతం మంది మేనేజర్‌లు, బిజినెస్ లీడర్లు జెన్ జడ్‌తో పనిచేయడం కష్టమని చెప్పారు. స్కిల్ అసెస్మెంట్ సంస్థ వీబాక్స్ ఇండియా స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం భారతీయ గ్రాడ్యుయేట్లలో 51 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారు. నేషనల్ ఎంప్లాయిబిలిటీ రిపోర్ట్ ఫర్ ఇంజినీరింగ్ ప్రకారం 80 శాతం మంది భారతీయ ఇంజనీర్‌లకు అవసరమైన నైపుణ్యాలు లేవు. అందుబాటులో ఉన్న ప్రతిభావంతులను నియమించుకోవడం తప్ప కంపెనీలకు మరో మార్గం కనిపించడం లేదు.



● కైండ్-హార్ట్

తేజ్...మేమున్నాం!

పిల్లలు అంటే ఆటల పాటల ప్రపంచమే కాదు... దయా హృదయం కలిగిన వారు, ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడానికి ముందుకు కదిలేవారు... అని మరోసారి నిరూపించారు తొండాకూర్ స్కూల్ విద్యార్థులు...



నిర్విన్ తేజ్

'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులే మిన్న' అనే మంచి మాటను క్లాస్‌రూమ్‌లో ఎన్నోసార్లు విన్నారు ఆ విద్యార్థులు. ఆ మాట ప్రభావంతో ఆపదలోఉన్న స్నేహితుడిని కాపాడుకునేందుకు ముందుకు కదిలారు. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం గంగాసముందర్‌కు చెందిన పదేళ్ల బాలుడు నిర్విన్ తేజ్ బ్లడ్ క్యాన్సర్ (లుకేమియ)తో బాధపడుతున్నాడు. తొండాకూర్‌లో తేజ్ నాలుగో తరగతి చదువుతున్నాడు. తోటి పాఠశాల విద్యార్థులు, స్కూల్ యాజమాన్యం ముందుకు వచ్చి రెండు లక్షల వరకు విరాళాలు సేకరించి ఇచ్చారు. మరోవైపు ఎంతో మంది యువకులు తేజ్‌కు అవసరమైనప్పుడల్లా రక్తదానం చేస్తున్నారు.

నిర్విన్ తేజ్‌ది పేద కుటుంబం. బ్లడ్ క్యాన్సర్‌ను నయం చేయడానికి ఇరవై లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో తేజ్ కుటుంబ సభ్యులకు కాళ్లు చేతులు ఆడడం లేదు. దిక్కు తోచని స్థితిలో ఉన్న తేజ్ తల్లిదండ్రులకు స్కూల్ పిల్లలు, ఎంతో మంది యువకులు అండగా ఉంటున్నారు.

తేజ్ గురించి ఎప్పటికప్పుడూ తెలుసుకుంటున్నారు.

'తేజ్ తొందరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించాం' అంటున్నారు తేజ్ ఫ్రెండ్స్. వారి ప్రార్థన ఫలించాలని కోరుకుందాం.

– తూమాటి భద్రారెడ్డి, సాక్షి, నిజామాబాద్

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ ఏ56



డిస్‌ప్లే: 6.70 అంగుళాలు **రిఫ్రెష్‌రేట్:** 120 హెచ్‌జడ్ **రిజల్యూషన్:** 1080×2340 పిక్సెల్స్ **ఫ్రంట్ కెమెరా:** 12 ఎంపీ **మెమోరీ:** 128జీబి 8జీబి ర్యామ్/256జీబి 8జీబి ర్యామ్/ 256 జీబి 12జీబి ర్యామ్ **బ్యాటరీ:** 5000 ఎంఏహెచ్ **బరువు:** 198 గ్రా.

ఇన్‌స్టా మోషన్ ఫొటోస్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఒక కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ యూజర్‌లను (చాట్స్, గ్రూప్ చాట్స్, చానెల్స్) మోషన్ ఫొటోలు షేర్ చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ ఫీచర్ శాంసంగ్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లాంటి సెలెక్ట్ ఆండ్రాయిడ్ డివైజ్‌లలో అందుబాటులో ఉంది. వీటిలో 'మోషన్ ఫొటో' అని, గూగుల్ పిక్సెల్స్ డివైజ్‌లలో 'టాప్ షాట్' 'మోషన్ ఫొటోస్' అని వ్యవహరిస్తారు. ఐఫోన్‌లలో 'లైవ్ ఫొటోస్' అనే ఫీచర్‌ని యాపిల్ అందిస్తోంది.

హానర్ ప్యాడ్ ఎక్స్9 ఎ



డిస్‌ప్లే: 11.5 అంగుళాలు **వోఎస్:** ఆండ్రాయిడ్ 15 **రిజల్యూషన్:** 1504×2508 పిక్సెల్స్ **మెమోరీ:** 128జీబి 8జీబి ర్యామ్ **బరువు:** 475 గ్రా. **కలర్:** గ్రే

సాక్షి సినిమా

రామ్‌చరణ్ పెద్ది



రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'పెద్ది' అనే టైటిల్ ఖరారైంది. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ పీరియాడికల్ మల్టీ స్పోర్ట్స్ డ్రామాలో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

గురువారం (మార్చి 27) రామ్‌చరణ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'పెద్ది' సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించి, ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను రిలీజ్ చేశారు. డిఫరెంట్ హెయిర్ స్టయిల్‌తో రగ్గ్ గెడ్డంతో, నోస్ రింగ్‌తో ఈ సినిమా కోసం మేకోవర్ అయ్యారు రామ్‌చరణ్. ఇక క్రికెట్, కబడ్డీ, కుస్తీ... ఇలా మల్టీస్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో 'పెద్ది' కథనం రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుందన్న ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: ఆర్ రత్నవేలు.

ఎన్టీఆర్‌కి స్వీట్ షాక్ ఇచ్చిన జపనీస్ ఫ్యాన్



● అభిమానితో ఎన్టీఆర్

''నేను జపాన్‌కి వచ్చినప్పుడల్లా అందమైన జ్ఞాపకాలే గుర్తొస్తాయి. అయితే ఈసారి కాస్త భిన్నమైన అనుభూతి కలిగింది. మా 'ఆర్ఆర్ఆర్' సినిమా చూసిన తర్వాత తాను తెలుగు నేర్చుకున్నానని ఒక జపనీస్ ఫ్యాన్ చెప్పడం నిజంగా నన్ను కదిలించింది'' అని హీరో ఎన్టీఆర్ తెలిపారు. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జోడీగా నటించిన చిత్రం 'దేవర: పార్ట్ 1'. మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ, నందమూరి కల్యాణ్ రామ్ నిర్మించిన ఈ సినిమా 2024 సెప్టెంబర్ 27న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. కాగా 'ఆర్ఆర్ఆర్' మూవీ తర్వాత ఎన్టీఆర్‌కి జపాన్‌లో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దీంతో అక్కడి ఫ్యాన్స్‌ని అలరించేందుకు 'దేవర: పార్ట్ 1' మూవీని జపాన్‌లో నేడు విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జపాన్ వెళ్లిన ఎన్టీఆర్ అక్కడి మీడియా, ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. ఈ క్రమంలో జపాన్‌కి చెందిన ఓ లేడీ ఫ్యాన్ ఎన్టీఆర్‌తో తెలుగులో మాట్లాడి, స్వీట్ షాక్ ఇచ్చారు. దీనిపై ఎన్టీఆర్ స్పందిస్తూ– ''సంస్కృతుల మధ్య వారధిగా ఉండటానికి సినిమా అనేది ఓ శక్తిలా ఉంటుంది. తెలుగు నేర్చుకోవడానికి 'ఆర్ఆర్ఆర్' సినిమా తనను ప్రోత్సహించిందని ఓ ఫ్యాన్ చెప్పడం ఎప్పటికీ మర్చిపోలేను. ఇలాంటి వాటి కోసమే మన ఇండియన్ సినిమాను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లేందుకు ట్రై చేస్తున్నాం'' అని పేర్కొన్నారు.

మ్యాడ్ లాంటి సినిమాలు ఆరోగ్యానికి మంచిది

– అక్కినేని నాగచైతన్య



● నార్నే నితిన్, రామ్ నితిన్, నాగచైతన్య, సంగీత్ శోభన్, నాగవంశీ, హారిక

రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజ్ అవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన అక్కినేని నాగచైతన్య మాట్లాడుతూ– ''మ్యాడ్ స్క్వేర్' లాంటి సినిమాలు ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి సరదాగా గడిపేలా చేస్తాయి. ఫ్రెండ్‌షిప్‌ని స్ట్రాంగ్ చేస్తాయి. కొత్త ఫ్రెండ్స్‌ని పరిచయం చేస్తాయి.

'మ్యాడ్ స్క్వేర్' మూవీ ట్రైలర్ బాగుంది. నేను 'మ్యాడ్' సినిమాలోని కామెడీ సీన్స్ చూస్తూ ఒత్తిడిని దూరం చేసుకుంటుంటాను. ఇలాంటి సినిమాలు ఆరోగ్యానికి చాలా మంచిది. డల్‌గా ఉన్నప్పుడు 'మ్యాడ్' లాంటి సినిమా చూడమని డాక్టర్లు కూడా సూచించాలనేది నా అభిప్రాయం'' అని హీరో అక్కినేని నాగచైతన్య చెప్పారు. నార్నే నితిన్, సంగీత్ శోభన్, కామెడీ చేయడం అనేది చాలా కష్టం. నార్నే నితిన్, రామ్, సంగీత్‌లలో ఆ టాలెంట్ ఉంది కాబట్టే ఇంత నవ్వించగలిగారు. నాగవంశీ, నా ప్రయాణం 'ప్రేమమ్' సినిమాతో మొదలైంది. దర్శకులకు, నటులకు ఎంతో ధైర్యాన్నిస్తూ వరుస విజయాలు అందుకుంటున్నారు వంశీ. ఈ మూవీ బ్లాక్ బస్టర్ అవుతుంది. 'మ్యాడ్ 2' మాత్రమే కాదు.. 'మ్యాడ్ 100' కూడా రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

రౌడీతో జోడీ?



'రౌడీ జనార్ధన'తో జోడీ కట్టనున్నారట కీర్తీ సురేష్. విజయ్ దేవరకొండ హీరోగా 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన' అనే మూవీ తెరకెక్కనుంది. 'దిల్' రాజు ఈ సినిమాను నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మేలో రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుందని తెలిసింది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు కీర్తీ సురేష్‌ను సంప్రదించారట. కథ నచ్చడంతో కీర్తీ సురేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. మరి... విజయ్ దేవరకొండ-కీర్తీ సురేష్‌ల జోడీ సెట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

● కీర్తీ సురేష్

వెండితెరకు డొక్కా సీతమ్మ జీవితం

అన్నపూర్ణగా, అన్నదాతగా చరిత్రలో నిలిచిపోయిన డొక్కా సీతమ్మ జీవితం వెండితెరకు రానుంది. 'డొక్కా సీతమ్మ' పేరుతో ఈ సినిమాని రామకృష్ణ దర్శకత్వంలో వి. ప్రభాకర్ గౌడ్ నిర్మించనున్నారు. అయితే ఈ సినిమాని మరొకరు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు. ఈ వివాదం గురించి రామకృష్ణ, ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ– ''2016 లోనే 'డొక్కా సీతమ్మ' సినిమా స్క్రిప్ట్‌ని హైదరాబాద్‌లోని తెలుగు సినీ రచయితల సంఘంలో రిజిస్టర్ చేశాం. మా రచనను కాపీ కొడుతూ వేరొక సంస్థ వారు డొక్కా సీతమ్మపై సినిమా తీయడానికి పూనుకోవడంతో ఈ వివాదం కోర్టుకు చేరింది. కాపీ రైట్ యాక్ట్ మాకు ఉన్నప్పటికీ కోర్టులో వివాదం ఉండటంతో మేం ముందుకెళ్లలేదు. వేరొక సంస్థ ఈ సినిమాను తీసేందుకు సన్నాహాలు చేస్తే కోర్టు ధిక్కారం అవుతుంది'' అన్నారు. 'డొక్కా సీతమ్మ' చరిత్ర తొలి రచయిత వంశీయులు మిర్తిపాటి రామచయనులు, దర్శకుడు సాయికృష్ణ, కెమేరామేన్ వాసువర్మ ఈ సమావేశంలో పాల్గొన్నారు



● డొక్కా సీతమ్మ (ఫైల్ ఫొటో)

మేఘాలు చెప్పిన ప్రేమ

నరేశ్ అగస్త్య హీరోగా రబియా ఖాతూన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమకథ'. విపిన్ దర్శకత్వంలో సునేత్ర ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై ఉమాదేవి కోట ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను గురువారం విడుదల చేశారు. 'లవ్, డ్రీమ్, మ్యూజిక్ వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. షూటింగ్ పూర్తయింది. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్.




● రబియా, నరేశ్ అగస్త్య

ఓటీటీ ఇది చూడొచ్చు

సక్సెస్‌ఫుల్ ఫెయిల్డ్ పోకిరీ కథ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం డ్రాగన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



తప్పు చేసినవాళ్లు రెండు రకాలుగా ఉంటారు. తాము చేసిన తప్పు వల్ల దొరికిపోకుండా తప్పించుకుని తిరిగే వాళ్లు, ఎక్కడ తమ తప్పు దొరికిపోతుందో అని ముందుగానే బయటపడేవాళ్లు. కానీ అసలు విషయం ఏంటంటే చేసిన తప్పు అనేది ఎప్పటికైనా బయటపడేదే. ఈ పంథాలో అల్లుకున్న సినిమా 'డ్రాగన్'. ముఖ్యంగా ఈ సినిమా దొడ్డిదారిన ఐటీ ఉద్యోగం సంపాదించిన ప్రబుద్ధులకో గుణపాఠం. పాయింట్ పాతదే అయినా దర్శకుడు మారిముత్తు తన స్క్రీన్‌ప్లేతో సినిమాను సరదా సరదాగా తీసుకువెళ్లారు. సినిమా ఇంత సరదాగా సాగడానికి మరో కారణం కథానాయకుడు. ప్రముఖ నటుడు ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాలో హీరోగా నటించి సినిమా మొత్తాన్ని తన నటనతో మరో మెట్టుకు తీసుకువెళ్లారు. సినిమా ఎక్కడా బోర్ కొట్టిన ఫీల్ కలగదు. అంతలా ఏముందీ సినిమాలో చూద్దాం. ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న డి. రాఘవన్ కాలేజీ మొత్తానికి డిస్టింక్షన్‌తో పాసవుతాడు. ఫ్రెండ్స్, టీచర్స్ అందరూ అభినందిస్తారు. కానీ రాఘవన్ ఇష్టపడుతున్న అమ్మాయి మాత్రం తనకు బ్యాడ్ బాయ్స్ ఇష్టమని చెప్పి క్లాసులో ఫెయిల్ అయి, సప్లిమెంట్స్‌తో ఉన్న అబ్బాయిని ఇష్టపడుతుంది. ఇక అక్కడ నుండి తాను కూడా బ్యాడ్ బాయ్ అనిపించుకోవాలని తన పేరును డి. రాఘవన్ నుండి డ్రాగన్‌లా మార్చుకుని, అల్లరి చిల్లరిగా తయారవుతాడు. ఇంజనీరింగ్ చదువు కోసం వేరే కాలేజీలో చేరగానే అక్కడ కీర్తి అనే అమ్మాయితో ప్రేమలో పడతాడు. కీర్తి తమ ప్రేమ కోసం డ్రాగన్‌కి నచ్చచెబుతూ సప్లిమెంట్స్ క్లియర్ చేయమని అడుగుతుంది. అయినా డ్రాగన్ వినకపోయేసరికి తన తల్లిదండ్రులు తెచ్చిన సంబంధానికి ఓకే చెప్పి,పెళ్లి చేసుకుంటుంది. కీర్తి కాబోయే వరుడు లక్షా ఇరవై వేల రూపాయల జీతం కలవాడు. ఇది తెలుసుకున్న డ్రాగన్ తానెలాగైనా సరే లక్షా ఇరవై వేల ఒక్క రూపాయి అయినా జీతం తీసుకోవాలని అడ్డమైన ప్లాన్‌లు వేసి ఐటీ ఉద్యోగం సంపాదిస్తాడు. అలాగే ఆ ఉద్యోగంలో బాగా స్థిరపడి, మంచి పెళ్లి సంబంధం కూడా కుదిరి ఉద్యోగపరంగా విదేశాలకు వెళ్లే టైమ్‌లో తను చేసిన తప్పు తన మెడకు చుట్టుకుంటుంది. మరి డ్రాగన్ చేసిన ఆ తప్పేంటి? దాన్నుండి అతనెలా తప్పించుకున్నాడనేది నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'డ్రాగన్'లో చూసేయండి. ఈ సినిమాలో చదువు విలువ, తప్పుకు తప్పని ప్రాయశ్చిత్తం లాంటి రెండు బలమైన పాయింట్లను అద్భుతంగా చూపించారు దర్శకుడు. ఈ సక్సెస్‌ఫుల్ ఫెయిల్డ్ పోకిరీ స్టోరీ మస్ట్ వాచ్ ఫర్ ది వీకెండ్.

– ఇంటూరు హరికృష్ణ

పేరెంటింగ్

ఐఏఎస్ అధికారిణి, ఇద్దరు పిల్లల తల్లి అయిన దివ్య మిట్టల్
ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేసింది.
'నేను ఒక ఐఏఎస్ అధికారిణి ని.
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీలో,
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) బెంగళూరులో చదివాను.
వీటిని సాధించడానికి చాలా కష్టపడ్డాను.
కానీ, నా ఇద్దరు చిన్నారి కూతుళ్లను పెంచే క్రమంలో
సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదీ నన్ను సిద్ధం చేయలేదు..'
అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది.
ఇటీవల కాలంలో ఉద్యోగం చేసే అమ్మల శాతం పెరుగుతోంది.
అదే సమయంలో పిల్లల పెంపకం పట్ల సరైన జాగ్రత్తలు
తీసుకుంటున్నామా అనే ఆందోళనా పెరుగుతోంది.
కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను
నేటి తల్లులు ఎలా సమతుల్యతను సాధించాలో నిపుణులు సూచిస్తున్నారు.



ఆఫీసులో అమ్మ... ఇంట్లో బిడ్డ

వయస్సుతో సంబంధం లేకుండా కష్టాల్లో ఉన్నప్పుడు మనం 'అమ్మా' అని పిలుస్తాం.

ఈ పిలుపు తల్లీ బిడ్డ జీవితాంతం పంచుకునే అనుబంధానికి స్పష్టమైన సూచన. ప్రాచీన కాలం నుండి సమాజంలో మహిళలు పిల్లల సంరక్షకులుగా పరిగణించబడ్డారు. వారి విధి ఇంటికి, ఇంట్లోని వారిని జాగ్రత్తగా చూసుకోవడానికి మాత్రమే పరిమితమయ్యింది. దీంతో తల్లులు ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలనే ఈ భావన పిల్లలను వారి జీవితాల్లో, అభివృద్ధిలో సురక్షితంగా ఉంచింది. నేడు సమాజంలో తల్లులు ఇంటి పనుల నిర్వహణలోనూ, పిల్లల సంరక్షణలోనూ రెండు పాత్రలను పోషిస్తున్నారు. పిల్లల సంరక్షణలో తండ్రుల వాటా పెరిగినప్పటికీ మహిళలు ఇప్పటికీ వారి ఇంట్లో మొదటి సంరక్షకులుగా ఉంటున్నారు.

విజయవంతమైన మార్పు

ప్రపంచవ్యాప్తంగా వర్కింగ్ ఉమెన్ గురించి చేసిన అధ్యయనాల్లో దాదాపు 73 శాతం మంది మహిళలు 30 ఏళ్ల వయసులో తమ పిల్లలను చూసుకోవడానికి తమ ఉద్యోగాలను విడిచిపెట్టారని, 27 శాతం మంది కొంతకాలం తర్వాత తిరిగి వచ్చారని గమనించారు. వారిలో దాదాపు 16 శాతం మంది తమ వృత్తిపరమైన పని జీవితంలో అధికారులుగా ఉన్నారు. కాబట్టి తల్లులుగా ఉన్న మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను విజయవంతంగా మార్చుకుంటున్నారని కూడా స్పష్టమైంది. 'ఉద్యోగినిగా డబ్బు సంపాదిస్తూ పిల్లలకు కావల్సినవి సమకూర్చగలుగుతున్నాను. కానీ, వారిని సక్రమంగా పెంచగలుగుతున్నానా..' అనుకునే తల్లులకు సాంకేతికత వరంగా మారింది. సమయానుకూలంగా వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఎంచుకోవచ్చు.

సానుకూల ప్రభావాలు

- ఉద్యోగ తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో రెండు పని చక్రాలతో తమ జీవితాలు సజావుగా నడుస్తున్నట్టు చూస్తారు. ఉన్నత విద్యను పొందగల సామర్థ్యం, భౌతిక, సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగల సామర్థ్యం కారణంగా వారు మరింత సంతృప్తికరమైన జీవితాలను గడుపుతారు. ఇప్పుడు ఉద్యోగాల్లోకి వెళ్లే మహిళలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, కెరీర్ అవకాశాలను సరైన ప్యాకేజీలతో అందుకుంటున్నారు.
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ అధ్యయనం ప్రకారం పనిచేసే తల్లుల కుమార్తెలు వారి తల్లులకంటే 23శాతం ఎక్కువ సంపాదిస్తారని తెలిసింది. మరోవైపు పనిచేసే తల్లుల కుమారులు బాధ్యతాయుతమైన పెద్దలుగా ఎదుగుతారు. వారి ఆఫీసుల్లో లింగ సమానత్వాన్ని ఇష్టపడతారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను గౌరవిస్తారు. వారు భవిష్యత్తులో తమ కుమార్తెలకు అద్భుతమైన తండ్రులుగా కూడా పెరుగుతారు.
- తమ తల్లి జీవితంలోని దుఃఖకరమైన రోజులనూ చూసి ఉంటారు. అంతేకాదు తమ తల్లి పట్టుదల, దృఢ సంకల్పం వారు మానసికంగా, ఆర్థికంగా తమ సామర్థ్యాల మేరకు తమను తాము ముందుకు తీసుకెళ్లేలా చేస్తాయి. అన్నింటికంటే వారు హీరోలలో తమ తల్లిని ఒక షీ-రో గా చూస్తారు.

హద్దులు అవసరం

పని, కుటుంబంతో పాటు వ్యక్తిగత అవసరాలకూ ప్రాముఖ్యం ఇవ్వండి. శారీరక, భావోద్వేగ శ్రేయస్సు కోసం స్వీయ సంరక్షణ అవసరం అనేది గుర్తుంచుకోవాలి. రోజులో పిల్లలకోసమే అన్నట్టుగా కొంత సమయం గడపండి. ఆ సమయంలో ఏదైనా పని నైపుణ్యాలు నేర్పించాలా, చదువు పట్ల దృష్టి పెట్టాలా, ఆనందంగా ఉంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలా.. ఇలా దేనికది బేరీజు వేసుకోవాలి. సహాయకులుగా ఉండేవారి మద్దతు ఎలా అందుతుందో చెక్ చేసుకోండి. వృత్తిపరమైన వృద్ధికి, తల్లి పాత్రకు విలువనిచ్చేవారిని సహాయకులుగా ఉండేలా చూసుకోండి. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి. ప్రతి ఒక్కరూ పనులు చేసేలా, బాధ్యత తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి.

– ప్రొ. పి.జ్యోతిరాజ, సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ నిపుణులు



మెరుగైన సమయ నిర్వహణ

- పనిచేసే తల్లులు ప్రతిరోజూ తమ పిల్లలతో కనీసం ఒకటి లేదా రెండు గంటలు గడపగలిగేలా సమయాన్ని ప్లాన్‌చేసుకోవాలి. ఇది ఒక దినచర్యగా అనుసరించాలి. వేర్వేరు పనులను షెడ్యూల్ చేయడం, వాటిని సమయానికి పూర్తి చేయడం అనే మీ అలవాటు మీ పిల్లలు అదే అడుగు జాడల్లో నడవడానికి ఒక ఉదాహరణగా ఉపయోగపడుతుంది.
- పిల్లలు టైమ్‌టేబుల్‌కు కట్టుబడి ఉండటానికి కూడా ప్రోత్సహిస్తుంది. పిల్లలు మీ పనిని పూర్తి చేయడంలో సహకరిస్తున్నందుకు మీకు సంతోషాన్ని కలిగిస్తుంది.
- కాలక్రమంలో పిల్లల సమయ నిర్వహణ నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఇది వారి మెరుగైన జీవితానికి సహాయపడుతుంది. అంతేకాదు, పిల్లలతో మరింత నాణ్యమైన సమయాన్ని గడపడానికి సహాయపడుతుంది.



దివ్య మిట్టల్

అమ్మా, నువ్వే నా హీరో..


నా పెద్ద కూతురికి 8 ఏళ్లు. ప్రపంచం గురించి ఇప్పటికే భిన్నమైన ఆలోచనలను చేస్తుంటుంది. ఎదిగే క్రమంలో ఆమె ఆలోచనల కాంతిని మసకబారనివ్వం. కొన్నిసార్లు పని ఒత్తిడిలో చాలా అలసిపోయినట్టుగా ఉంటుంది. ఆ అలసటలో ఏడుపు వచ్చేస్తుంటుంది కూడా. అలాంటప్పుడు నా కూతురు నన్ను కౌగిలించుకుని, 'నువ్వు నా హీరోవి' అని చెబుతుంది. అంటే, పిల్లలు మనల్ని గమనిస్తారు. వారు మన వైఫల్యాల నుండి దృఢంగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. పడిపోవడం సహజమే అని ఆమెకు చూపించండి, ఆపై లేవండి. నా ఉద్యోగం నాకు ఇది నేర్పింది. ఏది జరిగినా నువ్వు స్థిరంగా ఉంటావని చూపించండి. మాతృత్వంలో తమకు తాము వేసుకునే ప్రశ్నల్లో కొంత అపరాధ భావనతో నిండి ఉంటాయి. నేను పిల్లలకు సరైనదే ఇస్తున్నానా, ఏమైనా తప్పులు చేస్తే.. ఇలాంటివి తలెత్తుతుంటాయి. కానీ, తెలుసుకోవాల్సింది ఏంటంటే మీరు మీ సొంత మార్గంలో ప్రయాణిస్తూ ఆమె దేనినైనా వెంబడించగల ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని గుర్తించాలి. తనను తాను క్షమించుకుంటూ ముందుకు సాగడం కూడా చాలా ముఖ్యం. మీకు ఒకరి కంటే పిల్లలు ఎక్కువమంది ఉంటే ఆ బాధ్యత పది రెట్లు పెరుగుతూనే ఉంటుంది. అందుకని, పిల్లలను ప్రేమించడం కంటే కూడా న్యాయంగా ఉండడటం ముఖ్యం.

– దివ్యా మిట్టల్

రోజువారీ జీవన విధానంలో ముఖ్యమైన వాటికి సమయం ఇస్తూ, తమ పనిని బ్యాలెన్స్ చేసుకుంటూ, చేస్తున్న పని గురించి పిల్లలకు క్లారిటీ ఇవ్వడం వల్ల మెరుగైన ప్రయోజనాలను పొందుతారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

యుక్త వయసు



తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతుంటారు.
పిల్లలు చదువులతో కష్టపడాలి వాస్తవంగా.
కాని వారికి సోషల్ మీడియాలోని
చెత్తా చెదారం, తప్పుడు సమాచారం,
ఉద్రిక్త ఆకర్షణలు, హింసాత్మక భావజాలాలు...
ఇవి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి.
ఇటీవల వచ్చిన 'అడోలసెన్స్' వెబ్‌సిరీస్
మీద సర్వత్రా చర్చ జరుగుతున్నది.
ఇది హెచ్చరిక అంటున్నారు.
ఈ సిరీస్ మనల్ని ఎలా నిద్ర లేపుతున్నది?

డిజిటల్ లోయల్లో టీనేజ్ పిల్లలు

మీ పిల్లలు మీతో ఇంట్లో మాట్లాడే భాష మీకు తెలుసు. వాళ్లు సోషల్ మీడియాలో మాట్లాడే భాష మీకు తెలుసా? వాళ్లు ఉపయోగించే 'ఎమోజీ'ల అర్థాలు తెలుసా? మాటలు లేకుండా ఎమోజీలతో గాయపరిచే వీలు ఉంటుందని తెలుసా? కిడ్నీ బీన్స్, రెడ్ పిల్, బ్లూ పిల్, డైనమైట్, రెడ్ హార్ట్, పర్పుల్ హార్ట్, ఎల్లో హార్ట్.... ఈ ఎమోజీల అర్థం ప్రతి దానికీ మారుతుంది. అవి ఎందుకు ఉపయోగిస్తున్నారు. ఇంట్లో మన ఎదురుగా పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసు. సోషల్ మీడియాలో ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసా?

ముఖ్యంగా వారి వయసు 12– 14 సంవత్సరాల మధ్య ఉంటే వారికి తెలిసింది ఎంత... తెలియంది ఎంత... తెలిసీ తెలియంది అంత.

జాగ్రత్త సుమా... అని హెచ్చరించడానికి వచ్చింది 'అడోలసెన్స్' అనే వెబ్ సిరీస్.

నాలుగు ఎపిసోడ్స్‌ల సిరీస్

'అడోలసెన్స్' అనేది నాలుగు ఎపిసోడ్ల మినీ వెబ్ సిరీస్. బ్రిటిష్ క్రైమ్ డ్రామా. బ్రిటన్‌లో టీనేజ్ పిల్లల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తిని గమనించి ఈ సిరీస్‌ను తీశారు. జాక్ థోర్న్ స్క్రిప్ట్ రాస్తే, ఫిలిప్ బరాన్‌టిని దర్శకత్వం వహించాడు. ఒక్కో ఎపిసోడ్ ఒక గంట ఉంటుంది. విశేషం ఏమిటంటే ప్రతి ఎపిసోడ్ సింగిల్ షాట్. అంటే మధ్యలో కట్ లేకుండా కెమెరా కదులుతూ దృశ్యాలను చూపుతూ వెళుతుంది. ఈ మేకింగ్‌లో వినూత్నత వల్ల కూడా ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది.

ఆ పసివాడి సంఘర్షణ

ఈ సిరీస్ మొదలు కావడమే 'జెమీ మిల్లర్' అనే 13 ఏళ్ల పిల్లవాడి అరెస్టుతో మొదలవుతుంది. ముందు రోజు రాత్రి స్కూల్లో తన క్లాస్‌మేట్ అమ్మాయి కేటీని కత్తితో ఏడుసార్లు పొడిచి చంపాడని అభియోగం. తండ్రి, తల్లి, సోదరి హడలిపోతాడు. జెమీ మిల్లర్ అయితే పోలీసులను చూసి ప్యాంట్ తడుపుకుంటాడు. ఆ తర్వాత జెమీనే కేటీని చంపాడని ఇందుకు ఒక స్నేహితుడు కూడా పురిగొల్పాడని విచారణలో ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. అయితే ఇందులో ఎవరి తప్పు ఎంత? దీనికి బాధ్యులు ఎవరెవరు? శిక్ష మాత్రం ఒక్కడికే పడబోతోందా?

ఎవరు నిందితులు?

సోషల్ మీడియాను, ఎమోజీలను కనిపెట్టిన వారా? వాటిని ఫోన్లకు అనుసంధానం చేసిన వారా? పిల్లలకు ఫోన్లు కొనిచ్చిన తల్లిదండ్రులా? వాళ్లు ఏ మీడియాను ఉపయోగిస్తున్నారో చూడని తల్లిదండ్రుల నిర్బాధ్యతా? వారితో గడపలేని బిజీతో ఉన్న తల్లిదండ్రుల నిర్లక్ష్యమా? సరిగా పెంచని, సరిగా విద్యాబుద్ధులు చెప్పని వారంతా ఇందుకు బాధ్యులు కాదా? సమాజంలో పేరుకున్న హింసా ప్రవృత్తిని దూరం చేయలేని పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, పౌర వ్యవస్థలో ఉన్న వీరంతా కాదా బాధ్యులు.

ఇన్‌స్టా గొడవ

జెమీ వయసు 13 ఏళ్లే అయినా అతనికి ఇన్‌స్టా అకౌంట్ ఉంది. అందమైన ఫిమేల్‌మోడల్స్ బొమ్మలను అప్పుడప్పుడు షేర్ చేస్తుంటాడు. అతని పోస్టులకు కేటీ కామెంట్స్ పెడుతూ ఉంటుంది. వాటికి రకరకాల ఎమోజీలు వాడుతుంటుంది. అవి జెమీని బాధ పెట్టాయని మనకు తెలుస్తుంది. జెమీ తన వయసులో అపరిపక్వత వల్ల తను ఆకర్షణీయంగా లేడని తనను ఎవరూ ఇష్టపడరని న్యూనతతో ఉంటాడు. కేటీ కామెంట్స్ ఇందుకు ఆజ్యం పోస్తాయి. అంతే కాదు సాటి మనిషి పట్ల, ఆడపిల్లల పట్ల సెన్సిటివ్‌గా ఉండాలనే భావజాలం కాకుండా వాళ్లను ఏమైనా అనొచ్చు ఎలాగైనా ఉండొచ్చు అనే ఆధిపత్య భావజాలమే ఎక్కువగా జెమీకి పరిచయం అవుతుంటుంది. వీటన్నింటి దరిమిలా అతడు కేటీ ప్రాణం తీసేవరకూ వెళతాడు.

టీనేజ్ పిల్లలు ఎంతో సున్నితమైన దశలో ఉండే సీతాకోక చిలుకలు. వారిని గురించి అందరికీ బాధ్యత ఉండాలని చెబుతోంది ఈ సిరీస్. ఇందులోని ముఖ్య పాత్రను ఒవెన్ కూపర్ అనే బాల నటుడు అద్భుతంగా పోషించాడు. దిన పత్రికల వార్తలు కూడా మనకు రోజూ టీనేజ్ పిల్లల సమస్యలు, కుటుంబాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ లోపం పట్టి ఇస్తున్నాయి. తల్లిదండ్రులు ఈ సిరీస్ చూడటం మంచిదంటున్నారు అభిరుచి ఉన్న ప్రేక్షకులు. కొందరైతే టీనేజ్ పిల్లలతో పాటుగా తల్లిదండ్రులూ చూడాలని సూచిస్తునారు. ముందు పెద్దలు చూడండి. ఆ తర్వాత మీకు సబబని అనిపిస్తే పిల్లలకు చూపించండి. కానీ ఆలోచించండి.

బ్యూటీ

నిర్లక్ష్యమే అసలైన సమస్య

అందంగా ఉండటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందనేది అందరూ అంగీకరించాల్సిందే. యవ్వనంగా కనిపించాలనే తాపత్రయంతోనే జీవనం నాణ్యంగా గడపడానికీ ప్రయత్నించాలి. అందుకు బ్యూటీ చికిత్సలకు ఎక్కువ ఖర్చు పెట్టనవసరం లేదు. నేటి రోజుల్లో కాలుష్యం, సమతుల ఆహార లోపం, స్ట్రెస్ .. వీటన్నింటి ప్రభావం చర్మంపై పడుతుంది. అందుకని సమస్య ఎక్కడ ఉన్నదో దానిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి.

చాలా మంది ఎదుర్కొనేవి...

యవ్వనంలో ఉన్నవాళ్లైతే యాక్నె, మంగు మచ్చలు, కాస్మొటిక్స్ వాడకం వల్ల ఏర్పడే మచ్చల సమస్య ఉంటుంది. వీటికి ఇంట్లోనే సొంత చికిత్సలు తీసుకోవడం వల్ల మరికొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు.. మొటిమలకు వెల్లుల్లి, టూత్‌పేస్ట్ వంటివి వాడుతుంటారు. మంగు మచ్చలకు తమకు తామే స్టెరాయిడ్స్ వాడుతుంటారు. ఇక శిరోజాల విషయంలో అయితే ఐరనింగ్, స్ట్రెయిటనింగ్, స్టయిలింగ్.. వంటి హెయిర్‌స్టైల్స్ ఎక్కువైపోయాయి. వీటివల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. జుట్టు ఊడిపోవడం పెరుగుతుంది.



బట్టల వల్ల అలెర్జీ

టైట్‌గా ఉండే బట్టలు వేసుకుంటుంటారు. ఫ్యాబ్రిక్ వల్ల దురద సమస్యలు వస్తుంటాయి. అవి, నిర్లక్ష్యం చేస్తే కుటుంబంలో మిగతా వారికీ ఆ ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుంది. పులిపిర్లు ప్రైవేట్ పార్ట్స్‌లో వస్తుంటాయి. వాటినీ నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్మొటిక్ ప్రయోగాలు అయితే చెప్పలేం. అవి తమ చర్మానికి సరిపడతాయో లేదో కూడా చూడరు. దీని వల్ల చర్మం రంగు మారుతుంది.

ఫేషియల్స్

ఫెషియల్స్ చేయించుకుంటుంటారు. ఫ్రూట్ ఫేషియల్స్ సాధారణ కాంతికి పనిచేస్తాయి. హైడ్రా ఫేషియల్, డెర్మాఫేషియల్స్, కెమికల్ పీల్.. వంటి ఫేషియల్స్ నిపుణుల పర్యవేక్షణలోనే చేయించుకోవాలి. హెయిర్‌కి, స్కిన్‌కి పీఆర్‌పీ చేయించుకుంటారు. ఇవి చేయించుకున్నంత మాత్రాన అంతా బాగయిపోదు. సరైన మెయింటెనెన్స్ అవసరం.

చెయిన్లతో మెడపై నలుపు

ఆడవాళ్లలో చాలా వరకు మెడపైన నల్లగా అవుతుంది. ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, శుభ్రత పాటించకపోవడం, అధికబరువు వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అండర్ ఆర్మ్స్ డార్క్‌గా ఉన్నప్పుడు నిపుణుల సూచనలు తీసుకోవాలి. అధికబరువుకు లైపోసక్షన్ వంటివి చికిత్సలు తీసుకుంటారు. బరువు తగ్గినప్పుడు ఎలాంటి ఫిట్‌నెస్ సూచనలు పాటించాలో కూడా నిపుణుల సూచనలు తీసుకోవాలి.

స్ట్రెచ్ మార్క్స్

మహిళలకు ప్రసవం తర్వాత స్ట్రెచ్ మార్క్స్ పెద్ద సమస్య. ప్రసవం తర్వాత మూడవ నెల వరకు క్రీములు వాడుతూ ఉండాలి. అన్ని డెలివరీలు పూర్తయ్యాక స్ట్రెచ్ మార్క్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. మరో సమస్య పాదాల పగుళ్లు. క్రీమ్ వాడితే దాని మీద దుమ్ము పేరుకుంటుంది. అందుకని, రాత్రి పడుకునేముందు పాదాలను శుభ్రం చేసి, క్రీమ్ రాసి, సాక్సులు ధరించాలి.

డిటర్జెంట్స్ వల్ల ఎగ్జిమా!

చేతులకు ఎగ్జిమా వస్తుంది. డిటర్జంట్స్ వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అందుకని ఇంటి క్లీనింగ్‌లో చేతులకు గ్లౌజ్స్ మోచేతుల వరకు ఉండేవి మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని ఉపయోగించాలి.

పర్మనెంట్స్ చేయించుకుంటున్నారా..!

బ్యూటీ చికిత్సలలో పర్మనెంట్ మెథడ్స్‌కి ఇటీవల డిమాండ్ పెరిగింది. వాటిలో బొటాక్స్, ఫిల్లర్స్, స్కిన్ బూస్టర్స్, లిప్ కరెక్షన్, స్కిన్ టైటెనింగ్, గ్లోయింగ్ కోసం తీసుకునే ఇంజక్షన్స్.. ఈ కాస్మొటిక్స్ చికిత్సలన్నీ వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. రెగ్యులర్ మేకప్ చేసుకునేవారు కాస్మొటిక్స్ తమ చర్మతత్వానికి సరిపడేవి ఎంచుకోవాలి. తిరిగి శుభ్రం చేసుకోవడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.



– డా.స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్

ఫ్యాషన్

పచ్చని తోరణాలు.. షడ్రుచుల ఆస్వాదన.. సంప్రదాయ వస్త్రధారణ
ఉగాదికి స్వాగతం పలుకుతూ
కొత్త ఉత్సాహాన్ని మదికి మోసుకువస్తాయి.
చేనేత చీరలు, ఎంబ్రాయిడరీ సొగసులు వాటి రంగుల హంగులు
ప్రకృతి పరవశించేలా పండగకు మరింత శోభను తీసుకువస్తాయి.
ముఖ్యంగా పసుపు, ఆరెంజ్, ఆకుపచ్చ, ఎరుపు రంగులు
పండగ కళను రెట్టింపుగా మన కళ్లకు కడతాయి.

ప్రకృతి పరవశం



డిజైన్లు

చెక్స్, లైన్స్‌తో ఉన్న డిజైన్లు, మెరుపులు లేకుండా థ్రెడ్ ఎంబ్రాయిడరీ వర్క్, సహజంగా అనిపించే పెయింటింగ్స్ ఈ పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

చేనేత కళ

పండగ నాడు కళను రెట్టింపు చేసే అలంకరణకు ప్రాముఖ్యత ఇస్తుంటారు. అయితే, అందుకు పెద్ద హడావిడి లేకుండా మనవైన చేనేతలలో కాంతిమంతమైన రంగులున్న చీరలను ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో కంచిపట్టు చీరల నుంచి కలనేత వరకు అన్నీ పండగను వెలిగించేవే.

సహజమైన రంగులు

ప్రకృతి నేపథ్యంగా ఉగాది జరుపుకుంటారు కాబట్టి పసుపు, ఆకుపచ్చ, నారింజ, ఎరుపు రంగుల కాటన్, తెలుపు, ఎరుపు కాంబినేషన్, పింక్ కలర్ టస్సర్, సిల్క్ చీరలు ప్రత్యేక ఆకర్షణతో ఆకట్టుకుంటాయి.

ఇతర అలంకరణలు..

- చీరలకు లాంగ్ స్లీవ్స్ బ్లౌజులు, టెంపుల్ జ్యువెలరీ లేదా థ్రెడ్, టెర్రకోట జ్యువెలరీ బాగుంటాయి.
- పసుపు, ఎరుపు కాంబినేషన్ ప్లెయిన్ గాజులు, సహజంగా అనిపించేలా తక్కువ మేకప్ ప్రత్యేకతను చూపుతుంది.
- శిరోజాల అలంకరణలో జడ, కొప్పులు, పువ్వులకు ప్రాధాన్యమిస్తే పండగ ప్రకృతి కళతో ఆకట్టుకుంటుంది.





సాక్షి బిజినెస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
318	105
77,606	23,592

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	17,825	▽	74
డోజోన్స్	42,253	▽	202
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,666	▽	23
డాక్స్	22,679	▽	160
షాంఘై	3,373	▲	5
నికాయ్	37,800	▽	227

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	88,417	▲	626
బంగారం (99.5 స్వచ్ఛత)	88,063	▲	624
వెండి (కిలో)	99,775	▲	981

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎంతం	85.50	86.52
£	బ్రిటన్ పౌండ్	ఎంతం	109.60	112.47
€	యూరో	ఎంతం	91.36	94.01
¥	జపాన్ ఎన్ (100)	ఎంతం	56.56	58.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎంతం	53.16	55.36
S$	సింగపూర్ డాలర్	ధరావనీక	61.69	66.38
SAR	సౌదీ రియాల్	ధరావనీక	21.97	23.53
UAE D	యూఏఈ దిర్హామ్	ధరావనీక	22.46	24.25
¥	చైనా యువాన్	ధరావనీక	10.93	12.75

ఆసియా కుబేరుడిగా

మళ్లీ అంబానీయే

రూ.8.6 లక్షల కోట్ల సంపదతో నంబర్ వన్

- రూ.8.4 లక్షల కోట్లతో రెండో స్థానంలో గౌతమ్ అదానీ
- దేశంలో 284 మంది బిలియనీర్లు; ఉమ్మడి సంపద రూ.98 లక్షల కోట్లు
- దేశ జీడీపీలో మూడింట ఒక వంతు వీరిదే...



ముంబై: ఆసియా కుబేరుడిగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ మరోసారి గుర్తింపు తెచ్చుకున్నారు. గడిచిన ఏడాది కాలంలో ఆయన సంపద రూ.లక్ష కోట్ల మేర తరిగిపోయినప్పటికీ.. రూ.8.6 లక్షల కోట్ల నికర సంపదతో మొదటి స్థానాన్ని కాపాడుకున్నారు. కానీ, ప్రపంచ టాప్–10లో స్థానాన్ని కోల్పోయారు. ఇదే కాలంలో అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ సంపద 13 శాతం పెరిగి (రూ.లక్ష కోట్లు) 8.4 లక్షల కోట్లకు చేరుకోవడంతో ముకేశ్ తర్వాత రెండో స్థానంలో నిలిచారు. అంతేకాదు ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది కాలంలో సంపదను ఎక్కువగా పెంచుకున్నది అదానీయే కావడం గమనార్హం. గత ఏడాది కాలంలో 13 మంది బిలియనీర్లు దేశంలో కొత్తగా పుట్టుకొచ్చారు. మొత్తం బిలియనీర్లు (బిలియన్ డాలర్లు అంతకంటే ఎక్కువ సంపద) 284 మంది కాగా, వీరి ఉమ్మడి సంపద ఏడాది కాలంలో 10 శాతం పెరిగి రూ.98 లక్షల కోట్లకు చేరుకుంది. దేశ జీడీపీలో వీరి సంపద మూడింట ఒక వంతుగా ఉంది. ఈ వివరాలతో హురూన్ గ్లోబల్ రిచ్ లిస్ట్ (కుబేరుల జాబితా) 2025 విడుదలైంది. వీరి సంపద లెక్కింపునకు ఈ ఏడాది జనవరి 15ను కటాఫ్ తేదీగా హురూన్ పరిగణనలోకి తీసుకుంది.

- హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ రూ.3.5 లక్షల కోట్ల సంపదతో ప్రపంచ కుబేరుల జాబితాలోకి తొలిసారి వచ్చి చేరారు. కంపెనీలో 47 శాతం వాటాను ఆమె పేరిట తండ్రి శివ్ నాడార్ బదిలీ చేయడం ఇందుకు దారితీసింది. ప్రపంచంలో టాప్–10 మహిళా కుబేరుల్లో 5వ స్థానం సొంతం చేసుకుని, ఈ గుర్తింపు సాధించిన తొలి భారత మహిళగా నిలిచారు.
- రేజర్‌పే సహ వ్యవస్థాపకులైన శశాంక్ కుమార్ (34), హర్షిల్ మాథుర్ (34) చెరో రూ.8,463 కోట్ల నెట్‌వర్త్‌తో భారత్‌లోనే యువ బిలియనీర్లుగా ఈ జాబితాకెక్కారు.
- సంపద అంతా కొద్ది మంది చేతుల్లోనే బందీ అవుతోందన్న ఆందోళనలు ఉన్నప్పటికీ.. ఒక్కో బిలియనీర్ సగటు సంపద (రూ.34,514 కోట్లతో) విషయంలో భారత్ ప్రపంచంలో ముందుంది. రెండో స్థానంలో ఉన్న చైనాలో ఒక్కో బిలియనీర్ సగటు సంపద విలువ రూ.29,027 కోట్లు.
- గడిచిన ఏడాది కాలంలో 175 మంది భారతీయ బిలియనీర్ల సంపద నికరంగా పెరగ్గా.. 109 మంది సంపద అంతకు ముందు ఏడాదితో పోల్చితే తగ్గింది.
- అత్యధికంగా 90 మందితో దేశంలో బిలియనీర్ల రాజధానిగా ముంబై నిలిచింది. కానీ, 92 మంది బిలియనీర్లతో ఆసియాలో బిలియనీర్ల రాజధానిగా షాంఘై నిలిచింది. 129 మంది బిలియనీర్లతో ప్రపంచ రాజధానిగా న్యూయార్క్ వరుసగా రెండో ఏడాది తన స్థానాన్ని కాపాడుకుంది.
- టెస్లా సీఈవో ఎలాన్‌మస్క్ 420 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుడిగా నిలిచారు.
- అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ 266 బిలియన్ డాలర్లతో, మెటా చీఫ్ జుకెర్‌బర్గ్ 242 బి.డాలర్లతో ప్రపంచంలో 2,3 స్థానాల్లో ఉన్నారు.
- ఈ ఏడాది హురూన్ ప్రపంచ కుబేరుల జాబితాలో ముకేశ్‌కు 18వ ర్యాంక్ లభిస్తే, అదానీ 27వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు.
- 870 మంది బిలియనీర్లతో అమెరికా ప్రపంచ కుబేరుల కేంద్రంగా నిలిస్తే, 823 మందితో చైనా రెండో స్థానంలో ఉంది.
- మొత్తం 9 మంది భారత మహిళలకు ప్రవేశం లభించగా, వీరి ఉమ్మడి సంపద రూ.9 లక్షల కోట్లు.

టాప్ 10 కుబేరులు

పేరు	సంపద విలువ (రూ.లక్షల కోట్లలో)	ఏడాదిలో వృద్ధి/క్షీణత (శాతంలో)	కంపెనీ
ముకేశ్ అంబానీ, కుటుంబం	8.6	-13	రిలయన్స్ ఇండస్ట్రీస్
గౌతమ్ అదానీ, కుటుంబం	8.4	13	అదానీ గ్రూప్
రోష్నీ నాడార్, కుటుంబం	3.5	-	హెచ్‌సీఎల్ టెక్
దిలీప్ సంఘ్వీ, కుటుంబం	2.5	21	సన్‌ఫార్మా
అజీమ్ ప్రేమ్‌జీ, కుటుంబం	2.2	-	విప్రో
కేఎం బిర్లా, కుటుంబం	2.0	28	ఆదిత్య బిర్లా
సైరస్ పూనావాలా, కుటుంబం	2.0	-8	సీరమ్ ఇన్‌స్టిట్యూట్
నీరజ్ బజాజ్, కుటుంబం	1.6	12	బజాజ్ ఆటో
రవి జైపూరియా, కుటుంబం	1.4	7	ఆర్‌జే కార్ప్
రాధాకిషన్ దమానీ, కుటుంబం	1.4	-11	డీమార్ట్

‘ఆటో’ టారిఫ్‌ల

ప్రభావం అంతంతే..



- అమెరికాకు ఎగుమతులు తక్కువగానే ఉండటం కారణం
- దేశీ ఎగుమతిదార్లకు సదవకాశం...
- జీటీఆర్ఐ అంచనా

న్యూఢిల్లీ: వచ్చే నెల నుంచి వాహనాలు, ఆటో విడిభాగాలపై అమెరికా విధించబోయే 25 శాతం దిగుమతి సుంకాల ప్రభావం భారతీయ సంస్థలపై అంతంత మాత్రంగానే ఉండొచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. మరోవైపు దేశీ ఎగుమతిదారులకు దీనివల్ల వ్యాపార అవకాశాలు మరింతగా పెరగడానికి కూడా ఆస్కారం ఉందని పేర్కొన్నారు. 2024 సంవత్సరంలో భారతీయ ఆటో, ఆటో విడిభాగాల ఎగుమతులను విశ్లేషించిన మీదట ఈ మేరకు అంచనా వేస్తున్నట్లు వివరించారు. ఏప్రిల్ 3 నుంచి కంప్లీట్లీ బిల్ట్ వెహికల్స్ (సీబీయూలు), ఆటో విడిభాగాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో జీటీఆర్ఐ అంచనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2024 గణాంకాల ప్రకారం భారత్ సుమారు 8.9 మిలియన్ డాలర్ల విలువ చేసే వాహనాలను అమెరికాకు ఎగుమతి చేసింది. ఇది మొత్తం 6.98 బిలియన్ డాలర్ల వాహన ఎగుమతుల్లో 0.13 శాతమే. అలాగే, మొత్తం ట్రక్కుల ఎగుమతుల్లో అమెరికా మార్కెట్ వాటా 0.89 శాతమే. ఇలా అమెరికాకు వాహనాల ఎగుమతులు నామమాత్రమే కాబట్టి, మనపై టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని శ్రీవాస్తవ వివరించారు.

ఆందోళనలో విడిభాగాల సంస్థలు

టారిఫ్‌ల ప్రభావం వాహన తయారీ సంస్థల కన్నా విడిభాగాల తయారీ సంస్థలపైనే ఎక్కువగా ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. అమెరికాకు భారత్ నుంచి విడిభాగాల ఎగుమతులు గణనీయంగా ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఎక్కువగా ఇంజిన్ విడిభాగాలు, పవర్ ట్రెయిన్‌లు మొదలైన వాటిని అమెరికాకు భారత్ ఎగుమతి చేస్తోంది. పరిశ్రమ వర్గాల ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో ఆ దేశానికి ఆటో విడిభాగాల ఎగుమతులు 6.79 బిలియన్ డాలర్లుగా ఉండగా, దిగుమతులు 1.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మన దిగుమతులపై అమెరికాలో సుంకాలేమీ లేకపోయినప్పటికీ అక్కడి నుంచి వచ్చే ఉత్పత్తులపై భారత్‌లో 15 శాతం సుంకాలు అమలవుతున్నాయి.

బంగారం మళ్లీ జిగేల్


- ఢిల్లీ మార్కెట్లో ధర రూ.91,050
- అంతర్జాతీయంగా కొత్త ఆల్‌టైం హై..3,100 డాలర్లు



న్యూఢిల్లీ: పసిడి మళ్లీ పుంజుకుంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.365 లాభపడి రూ.91,050కు చేరుకుంది. 99.5% స్వచ్ఛత బంగారం సైతం ఇంతే మేర లాభపడి రూ.90,600 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా బలమైన ట్రెండ్ పసిడి లాభాలకు దారితీసినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. వెండి కిలో రూ.200 పెరిగి రూ.1,01,700కు చేరింది. అమెరికా కామెక్స్ మార్కెట్లో బంగారం ఔన్స్‌కు 50 డాలర్లు ఎగసి 3,102 డాలర్ల సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి దూసుకెళ్లింది.

నష్టాల్లోంచి లాభాల్లోకి మార్కెట్

- అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ కొనుగోళ్లు



ముంబై: ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ రోజున ఇన్వెస్టర్లు అధిక వెయిటేజీ షేర్ల కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో స్టాక్ సూచీలు గురువారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 318 పాయింట్లు పెరిగి 77,606 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 105 పాయింట్లు బలపడి 23,592 వద్ద నిలిచింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 1%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.50%, ఎల్అండ్‌టీ 2%, బజాజ్ ఫైనాన్స్ ఒకశాతం రాణించి సూచీలను నష్టాల ఊబి నుంచి గట్టెక్కించాయి. విదేశీ ఇన్వెస్టర్లు వరుస అయిదు ట్రేడింగ్ సెషన్లలో రూ.21 వేల కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఒక దశలో సెన్సెక్స్ 459 పాయింట్లు బలపడి 77,747 వద్ద, నిఫ్టీ 159 పాయింట్లు ఎగసి 23,646 వద్ద గరిష్టాన్ని అందుకున్నాయి.

అదానీ షేర్లు అదరగొట్టాయ్: అదానీ గ్రూప్‌లో పదికిగానూ తొమ్మిది కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 9% ఎగసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 5%, అదానీ పవర్ 4% పెరిగా యి. గ్రూప్ మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.12.61 లక్షల కోట్లకు చేరింది.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..

హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ డౌన్ | రూ. 8 లక్షల కోట్ల సమీకరణలో కేంద్రం

ఆటో షేర్లకు టారిఫ్ బ్రేక్స్

ఆటో దిగుమతులపై 25 శాతం ప్రతీకార సుంకాలను విధింపుతో దేశీ ఆటో విడిభాగాల పరిశ్రమలో అనిశ్చితి తలెత్తింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల దిగ్గజం జేఎల్ఆర్ విలాసవంత మోడల్ కార్లు అమెరికా మార్కెట్లో అత్యధికంగా అమ్ముడవుతున్న కారణంగా దేశీ మాతృ సంస్థ టాటా మోటార్స్‌కు సైతం సెగ తగులుతోంది. దీంతో టాటా మోటార్స్ షేరు తాజాగా 5.5 శాతం పతనమైంది. రూ. 669 వద్ద ముగిసింది. కార్లతో పోలిస్తే యూఎస్‌కు భారత్ నుంచి ఆటో విడిభాగాలు అధికంగా ఎగుమతి అవుతున్నాయి. దీంతో ఎన్ఎస్ఈలో సోనా కామ్‌స్టార్ షేరు 6.2 శాతం క్షీణించి రూ. 466 వద్ద నిలవగా.. సంవర్ధన మదర్‌సన్ 2.6 శాతం నీరసించి రూ. 131 వద్ద, అశోక్ లేలాండ్ 2.7 శాతం నష్టంతో రూ. 209 వద్ద, భారత్ ఫోర్జ్ 2.3 శాతం క్షీణించి రూ. 1,155 వద్ద ముగిశాయి.

సాక్షి స్పోర్ట్స్



రజతం నెగ్గిన రీతిక

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో గురువారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. రీతిక హుడా (76 కేజీలు) రజత పతకం సొంతం చేసుకోగా... మాన్సి లాథెర్ (68 కేజీలు), ముస్కాన్ (59 కేజీలు) కాంస్య పతకాలను సాధించారు. 76 కేజీల విభాగం ఫైనల్లో రీతిక 6–7 పాయింట్ల తేడాతో ఐపెరి మెడెత్ కిజీ (కిర్గిస్తాన్) చేతిలో ఓడిపోయింది. ఒకదశలో 6–2తో ఆధిక్యంలో నిలిచిన రీతిక చివరి పది సెకన్లలో ఐదు పాయింట్లు కోల్పోయి రజతంతో సంతృప్తి పడింది. 22 ఏళ్ల రీతిక ఫైనల్ చేరే క్రమంలో 10–0తో సెయోన్ జియోంగ్ (దక్షిణ కొరియా)పై, 10–0తో నొడోకా యామమోటో (జపాన్)పై ఏకపక్ష విజయాలు సాధించింది. రెండేళ్ల క్రితం కజకిస్తాన్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో రీతిక కాంస్య పతకాన్ని సాధించింది. ఇతర కాంస్య పతక బౌట్‌లలో మాన్సి 12–2 తో ఇరీనా కజిలినా (కజకిస్తాన్)పై, ముస్కాన్ 4–0తో అల్తిజిన్ టొగ్‌టోక్ (మంగోలియా)పై గెలుపొందారు.

జెయింట్స్ సూపర్ విక్టరీ



శార్దుల్ ఠాకూర్

సన్‌రైజర్స్ అనూహ్య పరాజయం

- 5 వికెట్లతో గెలిచిన లక్నో
- చెలరేగిన పూరన్, మార్ష్
- శార్దుల్ ఠాకూర్‌కు 4 వికెట్లు

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు సొంతగడ్డపై తొలి పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (28 బంతుల్లో 47; 5 ఫోర్లు,3 సిక్స్‌లు), అనికేత్ వర్మ (13 బంతుల్లో 36; 5 సిక్స్‌లు), నితీశ్ కుమార్ రెడ్డి (28 బంతుల్లో 32; 2 ఫోర్లు) జట్టు ఇన్నింగ్స్‌లో కీలక పరుగులు సాధించారు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ శార్దుల్ ఠాకూర్ 34 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్నో 16.1 ఓవర్లలో 5 వికెట్లకు 193 పరుగులు చేసి గెలిచింది. నికోలస్ పూరన్ (26 బంతుల్లో 70; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (31 బంతుల్లో 52; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కలిసి జట్టును గెలిపించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 43 బంతుల్లోనే 116 పరుగులు జోడించారు.

అభిషేక్, ఇషాన్ విఫలం

సన్‌రైజర్స్‌కు ఈసారి సరైన ఆరంభం లభించలేదు. శార్దుల్ వరుస బంతుల్లో అభిషేక్ శర్మ (6), గత మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్ కిషన్ (0)లను వెనక్కి పంపడంతో 15 పరుగులకే జట్టు 2 వికెట్లు కోల్పోయింది. అయితే హెడ్ మాత్రం తన జోరు తగ్గించలేదు. అవేశ్ ఓవర్లో అతను 2 సిక్స్‌లు, ఫోర్‌తో చెలరేగాడు. రవి బిష్ణోయ్ ఓవర్లో 35 పరుగుల వద్ద హెడ్ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను పూరన్ వదిలేశాడు. అదే ఓవర్లో బిష్ణోయ్ కూడా కఠినమైన మరో రిటర్న్ క్యాచ్‌ను అందుకోలేకపోయాడు. అయితే దాని వల్ల ఎక్కువ నష్టం జరగలేదు. మరో 12 పరుగులు జోడించిన హెడ్‌ను ప్రిన్స్ యాదవ్ అద్భుత బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ప్రిన్స్‌కు ఐపీఎల్‌లో ఇది తొలి వికెట్ కావడం విశేషం. మరో ఎండ్‌లో బాగా తడబడిన నితీశ్ ధాటిగా ఆడటంలో విఫలమయ్యాడు. క్రీజ్‌లో ఉన్నంత సేపు దూకుడు ప్రదర్శించిన క్లాసెన్ (17 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్) దురదృష్టవశాత్తూ రనౌటయ్యాడు. అయితే అనికేత్, ప్యాట్ కమిన్స్ (4 బంతుల్లో 18; 3 సిక్స్‌లు) సిక్సర్లు స్కోరును 200 పరుగులకు చేరువగా తెచ్చారు. బిష్ణోయ్ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లు బాదిన అనికేత్...రాఠీ ఓవర్లోనూ వరుసగా రెండు సిక్సర్లతో చెలరేగాడు. అయితే తర్వాతి బంతికీ ఇదే ప్రయత్నంలో క్యాచ్ ఇచ్చి అతను వెనుదిరిగాడు. చివరి 2 ఓవర్లలో కలిపి 10 పరుగులే చేయగలిగిన హైదరాబాద్ ఆఖరి 16 బంతుల్లో ఒక్క బౌండరీ కూడా లేకపోవడం గమనార్హం.

మెరుపు భాగస్వామ్యం...

షమీ తన తొలి ఓవర్లో మార్‌క్రమ్ (1)ను అవుట్ చేసిన ఆనందం రైజర్స్ శిబిరంలో ఎంతోసేపు నిలవలేదు. అక్కడి నుంచి మార్ష్, పూరన్ కలిసి రైజర్స్ బౌలర్ల భరతం పట్టారు. సిమర్జీత్ ఓవర్లో పూరన్ ఫోర్, 2 సిక్స్‌లు బాదగా, షమీ ఓవర్లో మార్ష్ 2 సిక్స్‌లు కొట్టాడు. అభిషేక్ ఓవర్లో కూడా పూరన్ 2 సిక్స్‌లు కొట్టడంతో పవర్‌ప్లేలో లక్నో స్కోరు 77 పరుగులకు చేరింది. ఆ తర్వాత పూరన్ మరింత చెలరేగిపోయాడు. 18 బంతుల్లోనే ఈ సీజన్‌లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పూరన్ అవుటైన తర్వాత 29 బంతుల్లో మార్ష్ అర్ధ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాత తక్కువ వ్యవధిలో బదోని (6), పంత్ (15) అవుటైనా... మిల్లర్ (13 నాటౌట్), సమద్ (8 బంతుల్లో 22 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కలిసి విజయాన్ని పూర్తి చేశారు.

మూడు బంతులు, మూడు సిక్సర్లు...

సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ బ్యాటింగ్ ఆసక్తికరంగా సాగింది. తాను ఎదుర్కొన్న తొలి 3 బంతులను అతను సిక్సర్లుగా మలిచాడు. శార్దుల్ ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టిన అతను, అవేశ్ ఓవర్లో తొలి బంతిని సిక్సర్ కొట్టి తర్వాతి బంతికే వెనుదిరిగాడు.

ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి



హెడ్ క్లీన్‌బౌల్డ్

ఉప్పల్ స్టేడియంలో మళ్లీ పరుగులు వరద పారింది. దాదాపు 400 పరుగులు కూడా నమోదయ్యాయి. కానీ ఫలితం మాత్రం పూర్తి భిన్నంగా వచ్చింది. ప్రతీసారి విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతూ ప్రత్యర్థిని ఊపిరాడకుండా చేసే సన్‌రైజర్స్ ఈసారి ఓటమి పక్షాన నిలిచింది. బలహీన బౌలింగ్‌గా అనిపించిన లక్నో పట్టుదలగా ఆడి రైజర్స్‌ను 200 గీత దాటకుండా చేస్తే... ఆపై లక్నో బ్యాటర్లు పూరన్, మిచెల్ మార్ష్‌లు సన్‌రైజర్స్‌కు వారి బ్యాటింగ్ దెబ్బనే రుచి చూపించారు. ఫలితంగా హైదరాబాద్‌కు అనూహ్య ఓటమి ఎదురుకాగా... లక్నో గెలుపు బోణీ చేసింది. ఏడాది క్రితం ఇదే మైదానంలో ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్న లక్నో టీమ్ ఇప్పుడు బదులు తీర్చుకుంది.

అనూహ్య రనౌట్...



టాప్–3 బ్యాటర్లు వెనుదిరిగిన తర్వాత రైజర్స్ ఆశలన్నీ క్లాసెన్‌పైనే ఉన్నాయి. అతనూ అప్పటికే చక్కటి షాట్లతో ధాటిని ప్రదర్శిస్తున్నాడు. అయితే ప్రిన్స్ యాదవ్ ఓవర్లో అతను రనౌట్ కావడం జట్టు తుది స్కోరుపై ప్రభావం చూపించింది. ప్రిన్స్ వేసిన బంతిని నితీశ్ బలంగా బాదగా బౌలర్ దానిని క్యాచ్ అందుకునే ప్రయత్నం చేశాడు. అయితే అది విఫలం కాగా, బంతి చేతులను తాకి నాన్ స్ట్రయికింగ్ స్టంప్స్ వైపు వెళ్లింది. అప్పటికే పరుగు కోసం క్రీజ్ దాటిన క్లాసెన్ రనౌటవక తప్పలేదు.



పూరన్, మార్ష్

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
బెంగళూరు	1	1	0	2	2.137
లక్నో	2	1	1	2	0.963
పంజాబ్	1	1	0	2	0.550
చెన్నై	1	1	0	2	0.493
ఢిల్లీ	1	1	0	2	0.371
హైదరాబాద్	2	1	1	2	-0.128
కోల్‌కతా	2	1	1	2	-0.308
ముంబై	1	0	1	0	-0.493
గుజరాత్	1	0	1	0	-0.550
రాజస్తాన్	2	0	2	0	-1.882

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై X బెంగళూరు
వేదిక: చెన్నై

రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఎవరీ అనికేత్ వర్మ...?



ఐదు సిక్సర్లతో సన్‌రైజర్స్ అభిమానులను ఆకట్టుకున్న అనికేత్ వర్మ గత మ్యాచ్‌తోనే ఐపీఎల్‌లోకి అడుగు పెట్టాడు. రాజస్తాన్‌తో పోరులో తన రెండో బంతికే అతను సిక్స్ కొట్టాడు. ఐపీఎల్‌కు ముందు అతను సీనియర్ స్థాయిలో ఒకే ఒక టి20 మ్యాచ్ ఆడాడు. మధ్యప్రదేశ్ తరఫున బరిలోకి దిగిన అనికేత్ హైదరాబాద్‌తో జరిగిన ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లో తొలి బంతికే డకౌటయ్యాడు. అయితే అండర్-23 స్థాయి తన దూకుడైన ప్రదర్శనతో అతను అందరి దృష్టిలో పడ్డాడు. దేశవాళీ అండర్-23 వన్డే టోర్నీలో 7 మ్యాచ్‌లలో 16 సిక్సర్లు బాదాడు. మధ్యప్రదేశ్ ప్రీమియర్ లీగ్‌లో కూడా చెలరేగిన తీరును చూసి సన్‌రైజర్స్ వేలంలో కనీస విలువ రూ. 30 లక్షలకు అనికేత్‌ను తీసుకుంది. పుట్టింది ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలోనే అయినా మెరుగైన అవకాశాల కోసం సరిహద్దు రాష్ట్రం మధ్యప్రదేశ్ చేరుకొని అక్కడే ఆటను మొదలు పెట్టాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (బి) ప్రిన్స్ 47; అభిషేక్ (సి) పూరన్ (బి) శార్దుల్ 6; ఇషాన్ కిషన్ (సి) పంత్ (బి) శార్దుల్ 0; నితీశ్ రెడ్డి (బి) రవి బిష్ణోయ్ 32; క్లాసెన్ (రనౌట్) 26; అనికేత్ (సి) మిల్లర్ (బి) రాఠీ 36; అభినవ్ మనోహర్ (సి) సమద్ (బి) శార్దుల్ 2; కమిన్స్ (సి) రాఠీ (బి) అవేశ్ 18; హర్షల్ (నాటౌట్) 12; షమీ (సి) బదోని (బి) శార్దుల్ 1; సిమర్జీత్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 190. వికెట్ల పతనం:** 1–15, 2–15, 3–76, 4–110, 5–128, 6–156, 7–156, 8–176, 9–181. **బౌలింగ్:** శార్దుల్ ఠాకూర్ 4–0–34–4, అవేశ్ ఖాన్ 4–0–45–1, దిగ్వేశ్ రాఠీ 4–0–40–1, రవి బిష్ణోయ్ 4–0–42–1, ప్రిన్స్ యాదవ్ 4–0–29–1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి) నితీశ్ రెడ్డి (బి) కమిన్స్ 52; మార్‌క్రమ్ (సి) కమిన్స్ (బి) షమీ 1; పూరన్ (ఎల్బీ) (బి) కమిన్స్ 70; పంత్ (సి) షమీ (బి) హర్షల్ 15; బదోని (సి) హర్షల్ (బి) జంపా 6; మిల్లర్ (నాటౌట్) 13; సమద్ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (16.1 ఓవర్లలో 5 వికెట్లకు) 193. వికెట్ల పతనం:** 1–4, 2–120, 3–138, 4–154, 5–164. **బౌలింగ్:** అభిషేక్ శర్మ 2–0–20–0, షమీ 3–0–37–1, సిమర్జీత్ సింగ్ 2–0–28–0, కమిన్స్ 3–0–29–2, ఆడమ్ జంపా 4–0–46–1, హర్షల్ పటేల్ 2–0–28–1, ఇషాన్ కిషన్ 0.1–0–4–0.

గోర్ బోలీ భాషను రాజ్యాంగంలో చేర్చాలి

8వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ శాసనసభ తీర్మానం



సీఎం రేవంత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు బాలు నాయక్, రాంచంద్రు నాయక్, రాందాస్ నాయక్, జయవీర్, లక్ష్మారెడ్డి, అనిల్, సామెల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణతోపాటు దేశంలోని 11 రాష్ట్రాల్లో గణనీయ సంఖ్యలో ఉన్న లంబాడా జాతి ప్రజల మాతృభాష గోర్ బోలీ భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర శాసనసభ తీర్మానించింది. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సభలో దీనికి సంబంధించిన తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం సభ దానిని ఏకగ్రీవంగా ఆమోదించింది. లంబాడా జాతి ప్రజల మూలాలు రాజస్తాన్‌లోని మేవాడ్ ప్రాంతంలో ఉన్నాయని, అక్కడి నుంచి వారు వలసల ద్వారా దేశమంతటా విస్తరించినట్లు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. రాజస్తాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలలో ఈ బంజార జాతి ప్రజలు గణనీయ సంఖ్యలో నివసిస్తున్నారన్నారు. వీరు తమ మాతృభాషను మరచిపోకుండా.. ఒకవైపు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రభాషని మాట్లాడుతూ, మరొక వైపు తమ ఇళ్లల్లో మాతృభాషలోనే మాట్లాడుతున్నారని వివరించారు. ఇప్పటివరకు పలు భారతీయ భాషలను రాజ్యాంగ సవరణ ద్వారా 8వ షెడ్యూల్లో చేర్చారని, అదే తరహాలో లంబాడా ప్రజల గోర్ బోలి భాషను కూడా చేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఆ భాష పరిరక్షణ, ప్రగతి, ఆచరణ, వ్యాప్తి జరుగుతుందని తెలిపారు. అలాగే విద్యా సంస్థలలో ఒక భాషగా చేర్చే వీలు కూడా కలుగుతుందన్నారు. దీనికి లిపి లేకపోయినా ఆ జాతి ప్రజలు కాపాడుకుంటూ వస్తున్నారని వివరించారు.

సీఎంకు గిరిజన ఎమ్మెల్యేల ధన్యవాదాలు

గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ శాసనసభలో తీర్మానం చేసిన నేపథ్యంలో గిరిజన ఎమ్మెల్యేలు బాలు నాయక్, రాంచంద్రు నాయక్, రాందాస్ నాయక్‌లు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం అసెంబ్లీలోని చాంబర్‌లో వారు ముఖ్యమంత్రిని కలసి ధన్యవాదాలు తెలియజేశారు.

సే నో టూ ప్లాస్టిక్

- ఈ నినాదాన్ని విస్తృతంగా చాటుదాం: మంత్రి సురేఖ
- సీఎం తదితరులతో కలిసి 'ప్లాస్టిక్ వినియోగం ప్రమాద ఘంటికలు'పుస్తకం ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎవరూ ప్లాస్టిక్‌వాడొద్దని, పర్యావరణానికి నష్టం కలిగించొద్దని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు 'సే నో టూ ప్లాస్టిక్' నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గురువారం శాసనమండలి చైర్మన్‌గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్‌గడ్డం ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చేతుల మీదుగా 'ప్లాస్టిక్ వినియోగం ప్రమాద ఘంటికలు'పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జూట్ బ్యాగు, పుస్తకం, కాపర్‌బాటిల్, స్టీల్‌టిఫిన్ బాక్సు, బట్ట సంచులను మంత్రి కొండా సురేఖ అందజేశారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ... ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాలు 630 కోట్ల టన్నులని, వీటిలో తొమ్మిది శాతం మాత్రమే రీసైకిల్ చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ బయోడిగ్రేడబుల్ వస్తువులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతి కుమారి, టీపీసీబీ మెంబర్‌సెక్రటరీ గుగులోత్‌రవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా ఫార్మాసిటీ

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫార్మా కంపెనీలు వదిలే కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలకు అనారోగ్యం వస్తుందనే గతంలో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాడామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం శాసనసభలో తెలిపారు. కాలుష్య రహిత గ్రీన్ ఫార్మా సిటీ ఏర్పాటు చేస్తున్న తమ ప్రభుత్వాన్ని అభినందించాలన్నారు. హైడ్రాపై విపక్షం చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు. ఎన్ కన్వెన్షన్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని గతంలో బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారితో కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. హైడ్రాతో హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, కాలువలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. హైడ్రా వల్ల నష్టపోయిన పేదలకు పరిహారం ఇస్తున్నామని, ఇతర చోట్ల ఇల్లు కేటాయిస్తున్నామని తెలిపారు.


పెట్టుబడులు తెచ్చే సత్తా మాకుంది: శ్రీధర్‌బాబు

ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫార్మా సిటీ అంతర్భాగమని, ఇందులో సంస్థలను ఏర్పాటు చేసేందుకు అనేక కంపెనీలు ముందుకొస్తున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కంపెనీలు బయట రాష్ట్రాలకు వెళ్తున్నాయన్న విపక్షాల విమర్శలు సత్యదూరమన్నారు. ఒకవేళ కంపెనీలు వెళ్లిపోయినా అంతకు రెట్టింపు సంస్థలను తీసుకొచ్చే సత్తా తమకు ఉందన్నారు. లగచర్ల భూసేకరణలో విపక్షాలు రైతులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. అధికారులను చంపేయమని పురమాయించడం ఏం న్యాయమని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న తర్వాతే 2028లో ఎన్నికలకు వెళ్తామని మంత్రి స్పష్టం చేశారు.

రెండు బీర్లు.. ఒక క్వార్టర్

- మద్యం దుకాణంలో చోరీ
- డబ్బు దొరక్క మద్యం ఎత్తుకెళ్లిన దొంగ


శంకరపట్నం: మద్యం దుకాణంలో రోజుకు రూ.లక్షల్లో గిరాకీ.. కౌంటర్లో డబ్బు బాగానే ఉంటుందని భావించిన ఓ దొంగ.. దుకాణం మూశాక చోరీకి దిగాలని భావించాడు. అర్ధరాత్రి వచ్చి కష్టపడి పైకప్పు రేకు కోసి, లోపలికి దిగాడు. ఆశగా కౌంటర్ తెరిస్తే రూపాయి కూడా లేకపోవడంతో నిరాశ చెందాడు. ఖాళీ చేతులతో వెళ్లడం ఎందుకని ఒక క్వార్టర్, రెండు బీర్లను తీసుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ క్రాస్‌రోడ్డు సమీపంలోని మద్యం దుకాణంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై వైన్స్ యజమాని, పోలీసుల కథనం ప్రకారం.. మొలంగూర్ క్రాస్ రోడ్డు సమీపంలోని మద్యం దుకాణంలో బుధవారం రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయించారు. సమయం ముగిశాక సిబ్బంది కౌంటర్‌లోని డబ్బులు తీసుకుని వైన్స్‌కు తాళం వేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగ దుకాణం పైకప్పు రేకులను కోసి దుకాణంలోకి చొరబడ్డాడు. కౌంటర్‌లో డబ్బు లేకపోవడంతో రెండు బీర్లు, క్వార్టర్ సీసా, సీసీ ఫుటేజీ హార్డ్‌డిస్క్ తీసుకెళ్లాడు. గురువారం వైన్స్ తెరవగా.. పైకప్పు కోసి ఉండడాన్ని గమనించి వ్యాపారి శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌ఐ రవి, క్లూస్‌టీం వివరాలు సేకరించారు. ఈ వైన్స్‌లో గతంలోనూ దొంగలు పైకప్పు తొలగించి చోరీకి దిగారని, దీంతో ఇనుపరాడ్లు వేశానని, అయినా రేకు కోసి దొంగ లోపలకు దిగాడని యజమాని వాపోయాడు.



2030... కండక్టర్ ఉద్యోగానికీ ఏఐ!

- ఆ టెక్నాలజీ తెలుసుకుని ఉండటం అవసరం
- రైతన్నకూ ఏఐ అవసరం పడుతుంది..
- ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్–2025 నివేదికలో వెల్లడి
- ఏఐతో కొన్ని ఉద్యోగాలు పెరుగుతాయి.. మరికొన్ని తగ్గుతాయని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆర్థిక వేదిక ఇటీవల విడుదల చేసిన 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్–2025'ఉద్యోగాలకు సంబంధించి పలు ఆసక్తికరమైన వివరాలు వెల్లడించింది. కిందిస్థాయి ఉద్యోగాల్లోకి సైతం ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చొరబడుతోందని, ఫలితంగా 2030 నాటికి కొన్ని రంగాల్లో ఉద్యోగాలు పెరుగుతాయని, మరికొన్ని రంగాల్లో ఉద్యోగాలు క్రమంగా కనుమరుగయ్యే అవకాశం ఉందని పేర్కొంది. 2030 నాటికి బస్ కండక్టర్ వంటి ఉద్యోగానికి కూడా ఏఐ టెక్నాలజీ తెలుసుకుని ఉండటం అవసరమని, ఆఖరుకు వ్యవసాయం చేసే వాళ్ళకూ ఏఐ టెక్నాలజీ అవసరం ఏర్పడుతుందని ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ (ఉద్యోగాల భవిష్యత్తు) రిపోర్టు పేర్కొంది. జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు పెంచాలని, విద్యార్థుల్లో ఆ మేరకు నైపుణ్యం పెంచాలని సూచించింది. 2023లో సేకరించిన లెక్కల ప్రకారం భారత్‌లో 4.16 లక్షల మంది మాత్రమే ఏఐ నిపుణులు ఉన్నారు. కాగా 2025 చివరి నాటికి 6.29 లక్షలు 2026 నాటికి 10 లక్షల ఏఐ నిపుణులు అవసరమని పేర్కొంది. ఈ మేరకు కంప్యూటర్ కోర్సుల్లో సిలబస్‌ను మార్చాలని ఏఐ ఆధారిత పరిశ్రమల తోడ్పాటుతో సిలబస్‌కు రూపకల్పన చేయాలని సూచిస్తోంది. అంతర్జాతీయ యూనివర్శిటీలు ఇప్పటికే ఈ బాటలో పయనిస్తున్నాయి. అమెరికా స్కూల్ స్థాయి నుంచే ఏఐపై బోధన చేస్తోంది. భారత్ కూడా ఈ దిశగా పయనించాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు.



2030 నాటికి ఏఐ ద్వారా పెరిగే ఉద్యోగాలు (శాతాల్లో)

ఉద్యోగం	పెరిగే శాతం
డేటా స్పెషలిస్టులు	110
ఫిన్‌టెక్ ఇంజనీర్లు	95
ఏఐ మెషిన్ లెర్నింగ్ నిపుణులు	80
సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ డెవలపర్స్	60
సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ నిపుణులు	57
డేటా వేర్ హౌసింగ్ నిపుణులు	48
ఎలక్ట్రికల్ వెహికిల్ స్పెషలిస్టులు	45
యూఐ అండ్ యూఎక్స్ డిజైనర్స్	43
డెలివరీ సర్వీస్ డ్రైవర్స్	42
ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ స్పెషలిస్టులు	41
డేటా అనలిస్టు నిపుణులు	40
ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు	39
ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్టులు	38
డెవాప్స్ ఇంజనీర్లు	37
రెన్యూవబుల్ ఎనర్జీ ఇంజనీర్లు	38

అవయవ దానాన్ని ప్రోత్సహిస్తాం

- దీనిపై పర్యవేక్షణకు అడ్వయిజరీ కమిటీ
- అక్రమాలకు పాల్పడితే రూ.కోటి జరిమానా, పదేళ్ల జైలు : మంత్రి దామోదర
- అవయవ దానానికి సిద్ధమని ప్రకటించిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అవయవ దానాన్ని ప్రోత్సహించడంతోపాటు.. అవయవ దాతల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన పాలసీని రూపొందిస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. అవయవ దానం, మార్పిడిపై పర్యవేక్షణకు ప్రభుత్వ స్థాయిలో అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు అవుతుందన్నారు. గురువారం శాసనసభలో 'తెలంగాణ మానవ అవయాల మార్పిడి (రద్దు) బిల్లు –2025'ఆమోదం సందర్భంగా మంత్రి దామోదర ప్రసంగించారు. అక్రమంగా అవయవ మార్పిడి చేసే వారికి కొత్త నిబంధనల ప్రకారం గరిష్టంగా రూ.కోటి జరిమానా, పదేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఏర్పడుతుందన్నారు. 1994 నాటి కేంద్ర ప్రభుత్వ మానవ అవయవ మార్పిడి చట్టం (తోహ) ప్రకారం బ్రెయిన్ డెడ్‌ను ప్రకటించే నిబంధనలను తాజాగా సవరిస్తూ ఫిజీషియన్లు, అనస్థీషియా, ఇంటెన్సివిస్టులను కూడా అర్హులుగా ప్రకటించారు. తద్వారా బ్రెయిన్‌డెడ్ కేసుల్లో అవయవాల వృథాను అరికట్టడంతోపాటు రోగుల ప్రాణాలు కాపాడేందుకు కొత్త నిబంధనలు ఉపయోగపడతాయన్నారు. కేంద్ర, ఇతర రాష్ట్రాల్లోని అవయవ మార్పిడి వ్యవస్థలతో (సోటో) జీవన్‌దాన్ కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. తద్వారా ఇతర రాష్ట్రాల్లో బ్రెయిన్ డెడ్ డోనర్ల నుంచి సేకరించిన అవయవాలను, తెలంగాణలోని రోగులకు అమర్చేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు 'అవయవాలు, కణజాల సేకరణ కేంద్రాలు, స్టోరేజీ కేంద్రాలు'ఏర్పాటు చేస్తామన్నారు.

అవయవ దాతలను ప్రోత్సహించండి : హరీశ్‌రావు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అవయవ దానం బిల్లుతో 3,724 మంది దరఖాస్తుదారులకు ఉపయోగపడుతుందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. అవయవదానం చేసేవారిని ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించాలని కోరారు. ఈ బిల్లు ద్వారా గ్రాండ్ పేరెంట్స్, గ్రాండ్ చిల్డ్రన్‌కు అవయవ దానం చేసే అవకాశం కలుగుతుందన్నారు. స్వాప్ పద్ధతిలో రక్తసంబంధీకులు కానివారు కూడా పరస్పరం అవయవ దానం చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. దేశంలో అత్యధిక అవయవ దానాలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణను నిలిపామన్నారు. అవయవ దానం చేసిన డెడ్‌బాడీకి ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని, సంబంధిత కుటుంబీలకు ఇందిరమ్మ ఇల్లు, గురుకుల పాఠశాలలో విద్య, ఉచిత ఆరోగ్యబీమా కల్పించాలని కోరారు. బిల్లుపై జరిగిన చర్చలో కేటీఆర్, డాక్టర్ సంజయ్ (బీఆర్‌ఎస్), డాక్టర్ పాల్వాయి హరీశ్ (బీజేపీ), కవ్వంపల్లి సత్యనారాయణ, రామచంద్రు నాయక్, రాజేశ్‌రెడ్డి (కాంగ్రెస్), మాజిద్ హుస్సేన్ (ఎంఐఎం) ప్రసంగించారు.

అందరికంటే ముందు నేనే సంతకం చేస్తా: కేటీఆర్

తాను అవయవదానం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రకటించారు. ఈ విషయంలో లక్షలాదిమంది ప్రజలకు ప్రతినిధులుగా ఎమ్మెల్యేలు అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. అవయవ దానం పట్ల సానుకూలంగా ఉన్న ఎమ్మెల్యేలు ముందుకొస్తే శాసన సభ ప్రాంగణంలోనే సంతకాల సేకరణ చేపడదామని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అందరి కంటే ముందు తానే సంతకం చేస్తానని, అవయవ దానం అనేది గొప్ప మానవీయ చర్యని, ఇది మరింత మందికి జీవితాన్ని ప్రసాదిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

ఆ రిటైర్డ్ ఉద్యోగులందరూ ఇంటికే

ఈనెల 31 లోగా తొలగించాల్సిందే అంటూ అన్ని శాఖలకు సీఎస్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలోని వివిధ విభాగాలు, కార్పొరేషన్లు, బోర్డులు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులందరినీ ఈనెల 31లోగా తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. తొలగించాల్సిన వారి జాబితాను ఆయా ప్రభుత్వ శాఖలకు పంపించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈనెల 25న అన్ని శాఖలకు లేఖ రాశారు. రిటైర్డ్ అయ్యాక పునర్నియామకం లేదా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన వారందరిని తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరైనా రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల సేవలు ఇంకా అవసరమని భావిస్తే ఎందుకు అవసరమో వివరిస్తూ మళ్లీ తాజాగా నియామకానికి అనుమతులు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పొదుపు చర్యలు భాగంగా రిటైర్డ్ అధికారులను తొలగించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ ఉత్తర్వుల మేరకు పురపాలక శాఖలోని పలు డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న దాదాపు 177 మందిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నాలుగేళ్ల సర్వీస్ పూర్తికాగానే ఎఫెక్టివ్ డేట్

కలెక్టర్లకు పీఆర్ ఆర్‌డీ డైరెక్టర్ మెమో

సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ సెక్రటరీల (జేపీఎస్) నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన వెంటనే అదేరోజు నుంచి వారి ఉద్యోగ క్రమబద్ధీకరణ (ఎఫెక్టివ్ డేట్) చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. జేపీఎస్‌లుగా కన్వర్ట్ అయిన సెక్రటరీల నాలుగేళ్ల సర్వీస్ ముగియగానే పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్–4గా నియమించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. పంచాయతీ సెక్రటరీల గ్రేడ్–4 జిల్లా పోస్ట్ కాబట్టి కలెక్టర్లకు ఈ మేరకు వెసులుబాటు కల్పించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ మేరకు గురువారం పీఆర్ ఆర్‌డీశాఖ డైరెక్టర్ జి.సృజన ఓ మెమోను జారీచేశారు. జేపీఎస్‌లకు సంబంధించిన రూల్స్–30 టు 37 ఆఫ్ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్–1996, ఇతర ఉత్తర్వులను సవరించేలా కలెక్టర్లకు వెసులుబాటు కల్పిస్తూ ఆదేశాలు జారీచేయడం పట్ల పీఆర్ మంత్రి సీతక్క, కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, పీఆర్ డైరెక్టర్ సృజనలకు తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. ఈ మెమో కార్యరూపం దాల్చేందుకు తమ సంఘం కృషి చేసినట్టు టీపీఎస్ఏ నేతలు ఓ ప్రకటనలో వెల్లడించారు.



సీఎం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హుజూర్‌నగర్‌లో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

హుజూర్‌నగర్: రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం తలపెట్టడం దేశంలోనే చరిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 30న హుజూర్‌నగర్‌లో జరగనున్న సీఎం సభ ఏర్పాట్లను మంత్రి గురువారం పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దాదాపు రూ.8 వేల కోట్లు ఖర్చుపెట్టి రేషన్ కార్డుదారులకు ప్రస్తుతం పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యం నాసిరకంగా ఉండడంతో అవి పక్కదారి పడుతున్నాయన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మాట్లాడి సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఒక విప్లవాత్మక మార్పు తీసుకొస్తోందని, ఈ పథకంతో రాష్ట్రంలోని 2.81 కోట్ల మంది ప్రజలకు లబ్ధిచేకూరుతుందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరికీ నెలకు 6 కేజీల సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించేందుకు ఉగాది రోజు సీఎం రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్‌కు వస్తున్నట్లు తెలిపారు. సీఎం పర్యటనను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

తెలంగాణ సచివాలయ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా యాదగిరి

ప్రధాన కార్యదర్శిగాశ్రీకాంత్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయ బీసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షునిగా టి.శేఖర్, అధ్యక్షునిగా తిరందాస్ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా దీటి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా నవీన్‌కుమార్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లును ఆమోదించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వానికి సంఘీభావంగా నిలుస్తామని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో తమవంతు కృషి చేస్తామని, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని సభ్యులంతా తీర్మానించారు.

ముందే ప్లానేద్దాం.. సమ్మర్‌లో టూరేద్దాం!

వేసవిలో వెకేషన్‌కు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న భారతీయులు..

దేశీయ పర్యాటకులకు ఫేవరేట్ గమ్యస్థానాలు.. కశ్మీర్, హిమాచల్, కేరళ, ఈశాన్య రాష్ట్రాలు

టాప్ ఇంటర్నేషనల్ సమ్మర్ డెస్టినేషన్స్‌గా ఐరోపా, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్ తదితర దేశాలు

వీసా ఫ్రీ దేశాలైన నేపాల్, భూటాన్, థాయ్‌లాండ్, మాల్దీవులు, మారిషస్‌లకు పెరుగుతున్న డిమాండ్



సాక్షి, హైదరాబాద్: సమ్మర్ వెకేషన్‌కు ఇప్పటినుంచే మనవారు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఏటేటా పెరుగుతున్న పర్యాటకుల డిమాండ్‌కు తగ్గట్టుగానే...దేశవ్యాప్తంగా హోటళ్లు (హోటల్ రూమ్‌లు), ఇతర ప్రత్యామ్నాయ విడిదుల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ వేసవిలో వివాహాలకు కూడా ముహూర్తాలు ఉండటంతో హోటళ్లకు కూడా డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. గత ఏడాదితో పోల్చితే ఇప్పటికే లగ్జరీ, మిడ్–స్కేల్, బడ్జెట్ సెగ్మెంట్‌లలో హోటల్ గదుల రేట్లు 10 నుంచి 12 శాతం పెరిగినట్టుగా ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఇన్ ఇండియన్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ వర్గాలు చెబుతున్నాయి. తమతమ కుటుంబ బడ్జెట్, వేసవి విడిదులకు సంబంధించి ఖర్చు చేయగలిగే స్తోమతను బట్టి దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, విదేశాల్లోని ప్రముఖ సందర్శన ప్రదేశాలు, మరికొందరు వీసా ఫ్రీ దేశాల్లో వేసవి పర్యటనలకు సిద్ధమవుతున్నారు.

కశ్మీర్, గోవా, హిమాచల్, కేరళలకు వెళ్లేందుకు క్రేజ్

దేశీయంగా చూస్తే.. కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, గోవా, రాజస్తాన్‌లతోపాటు ఈశాన్య రాష్ట్రాలు వేసవి సెలవులకు గమ్యస్థానాలుగా అగ్రభాగాన నిలుస్తున్నాయి. వీటితోపాటు హిల్‌స్టేషన్లుగా పేరుగాంచిన ముస్సోరి, మనాలి, రుషికేశ్ తదితర ప్రాంతాల్లోని హోటళ్ల గదులకు డిమాండ్ అత్యధికంగా ఉన్నట్టుగా వెల్లడైంది. కూర్గ్, మహబలేశ్వర్ వంటి టూరిస్ట్ డెస్టినేషన్లకు కూడా క్రమంగా పర్యాటకులు పెరుగుతున్నట్టుగా వివిధ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యేకంగా మహబలేశ్వర్‌లోని బీచ్‌కు ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నట్టుగా తెలుస్తోంది. ఉదయ్‌పూర్, జైపూర్‌లు కూడా ఈ విషయంలో ఏమాత్రం వెనుకబడి లేవు. రుషికేశ్, కాసోల్, హంపి, ముక్తేశ్వర్ వంటి పర్యాటక ప్రదేశాల్లో హాస్టళ్లకు డిమాండ్ పెరుగుతున్నట్టుగా జో వరల్డ్ సంస్థ వెల్లడించింది.

టాప్ ఇంటర్నేషనల్ సమ్మర్ డెస్టినేషన్స్ ఇవే..

ఇంటర్నేషనల్ సమ్మర్ డెస్టినేషన్స్‌గా స్విట్జర్లాండ్, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, హంగేరీ, ఆస్ట్రియా, చెక్ రిపబ్లిక్, ఇతర ఐరోపా దేశాలు ముందు వరుసలో నిలుస్తున్నాయి. వీటితోపాటు దుబాయ్, ఈజిప్ట్, జపాన్, సింగపూర్, వియత్నాం, ఇండోనేసియాలకు ఏటా డిమాండ్ పెరుగుతోందని అట్లీస్ సంస్థ వెల్లడించింది. ఇక ఈ వేసవి సీజన్‌లో యూఏఈ, యూఎస్‌ఏలకు అత్యధికంగా బుక్సింగ్ జరిగినట్టు ఈ సంస్థ తెలిపింది. ఈ దేశాల్లో పర్యటించేందుకు ముందుగానే పర్యాటకులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ఆ సంస్థ అంచనా వేసింది.

→ అంటార్కిటికాలో ఐస్‌బ్రేకర్ క్రూయిజ్‌లు, ఫిన్‌లాండ్లో నార్తర్న్ లైట్స్ అనుభవాలు, గాజు గోపుర ఇగ్లూలు, ఆర్కిటిక్ సూట్‌లు మరియు ఆర్కిటిక్ ట్రీహౌస్‌లలో బస వంటి ప్రీమియం అనుభవాలను కూడా ప్రయాణికులు కోరుకుంటున్నారు. సౌత్ ఆఫ్రికా వైన్ యార్డ్‌లలో కన్వర్టిబుల్ కార్లు లేదా హార్లే–డేవిడ్సన్‌లతో సెల్ఫ్–డ్రైవ్ సాహసాలు కూడా ప్రజాదరణ పొందుతున్నాయి.

→ తొలిసారి విదేశీ పర్యటనలకు వెళుతున్న వారిలో ఎక్కువగా కాంబోడియా, శ్రీలంక, అజర్‌బైజాన్‌లను ఇష్టపడుతున్నారు. ఈ దేశాల సందర్శనకు సులభంగా వీసా ప్రక్రియ ఉండటంతోపాటు ఆయా సమ్మర్ ట్రిప్‌లకు అయ్యే ఖర్చు కూడా తక్కువగా ఉండడమే అందుకు కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

వీసా అవసరం లేని ప్రాంతాలకు ఆదరణ...

→ ఇక వీసా అవసరం లేని వివిధ పర్యాటక దేశాలు భారత టూరిస్ట్‌లకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయితే వీసా ఫ్రీ దేశాలు అయిన నేపాల్, భూటాన్, థాయ్‌లాండ్, మాల్దీవులు, మారిషస్ వంటి వాటికి భారత్ టూరిస్టుల నుంచి భారీగా డిమాండ్ పెరిగినట్టు హాలిడే, టూరిజం నిర్వాహకులు చెబుతున్నారు. ఈ దేశాలు వీసా రహిత సులభ ప్రవేశ కారణంగా గణనీయమైన వృద్ధిని సాధిస్తున్నాయి. ఎస్‌ఓటీసీ ట్రావెల్ హాలిడేస్, కార్పొరేట్ టూర్స్ విభాగం నివేదిక ప్రకారం.. వీసా రహిత గమ్యస్థానాలు ప్రయాణికులకు ఖర్చులను ఆదా చేసే అవకాశాన్ని అందిస్తున్నాయని, దీనిని వారు లగ్జరీ అనుభవాల కోసం ఉపయోగిస్తున్నారని పేర్కొంది.

→ ఉదాహరణకు థాయ్‌లాండ్‌లో ముయే థాయ్ (కిక్‌బాక్సింగ్) నేర్చుకోవడం, లగ్జరీ రిసార్ట్‌లలో డిటాక్స్ కార్యక్రమాలు, మారిషస్‌లో స్నార్కెలింగ్ లేదా మాల్దీవ్స్‌లో మిషెలిన్–స్టార్ అండర్‌వాటర్ డైనింగ్ వంటివి ఉన్నాయి. అదే సమయంలో ఫినామినన్–ఆధారిత ప్రయాణం ఒక కీలక ధోరణిగా ఉద్భవించిందని ఈ నివేదిక తెలిపింది.

ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025 టైంటేబుల్ విడుదల

- ఏప్రిల్ 25, 26, 27ల్లో నిర్వహణ
- ఏప్రిల్ 20 నుంచి హాల్ టికెట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025 టైంటేబుల్‌ను గురువారం ప్రకటించారు. ఏప్రిల్ 25, 26, 27లలో జరిగే ప్రవేశ పరీక్షలకు.. వచ్చే నెల 20 నుంచి హాల్‌టికెట్‌ను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్ష సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి 1.30 గంటలు ముందుగా హాలులోకి ప్రవేశించవచ్చు. రోజూ 3 సెషన్స్‌గా పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు, మూడో సెషన్ 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నట్లు వివరించారు. మొత్తం 49 సబ్జెక్టులకు జరిగే ఎంట్రన్స్ టెస్ట్‌కు 9747 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్లో చూడాలని సూచించారు.

30న రవీంద్రభారతిలో పంచాంగ శ్రవణం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 30న ఉదయం 10గంటలకు రవీంద్రభారతిలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్ గురువారం తెలిపారు. కార్యక్రమానికి బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగకర్తగా వ్యవహరిస్తారన్నారు.

ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఫీజుల లొల్లి

పెంచిన ఫీజు చెల్లించాలని పీజీ విద్యార్థులపై యాజమాన్యాల తీవ్ర ఒత్తిడి

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాకముందే ఫీజులు ఎలా చెల్లిస్తామంటున్న విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో పీజీ విద్యార్థులకు సంబంధించి అదనపు ఫీజుల లొల్లి నడుస్తోంది. ఫీజులు చెల్లించిన విద్యార్థులనే తరగతులు, వైద్యసేవలకు అనుమతిస్తామని కాలేజీ యాజమాన్యాలు తేల్చిచెబుతున్నాయి. సాధారణంగా పీజీ వైద్య విద్యార్థులకు తరగతి గదిలో కంటే ఓపీ(అవుట్ పేషెంట్), ఐపీ(ఇన్ పేషెంట్) విభాగాల్లోనే ఎక్కువగా విధులుంటాయి.

60 శాతం ఫీజులు చెల్లించినా...

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో పీజీ వైద్య విద్యార్థులకు వేర్వేరుగా ఫీజులున్నాయి. మూడేళ్ల క్రితం ఫీజుల పెంపుతో కేటగిరీ 'ఏ'లో సీటు సాధించిన విద్యార్థి రూ.7 లక్షలు, , కేటగిరీ 'బి'లో సీటు సాధించిన విద్యార్థి రూ.24 లక్షల చొప్పున ఫీజులను ఖరారు చేశారు. అయితే ఆ ఫీజుల పెంపును సవాలు చేస్తూ పలువురు విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశాలను సారం కేటగిరీ'ఏ'విద్యార్థులు 60 శాతం చొప్పున, కేటగిరీ 'బి'విద్యార్థులు 70 శాతం చొప్పున ఫీజులు చెల్లిస్తున్నారు.



తాజాగా న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల గడువు ముగిసిన నేపథ్యంలో పూర్తిస్థాయి ఫీజులు చెల్లించాలని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయి.

హాజరు లేదు... డ్యూటీలు లేవు...

అదనపు ఫీజులు చెల్లించని పీజీ వైద్య విద్యార్థులను పలు ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు తరగతులకు అనుమతించడం లేదు. సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు రెండో సంవత్సరం పీజీ చదువుతున్న వైద్య విద్యార్థులకు ఈనెల 15వ తేదీ నుంచి డ్యూటీలు రద్దు చేశారు. తాజాగా ఆయా విద్యార్థులకు బయోమెట్రిక్ హాజరు సైతం స్వీకరించడం లేదు. మరోవైపు తరగతులకు సైతం హాజరు కావొద్దని స్పష్టం చేయడంతో ఆయా విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఫీజు నిధులు ఇవ్వకపోవడంతో...

→ కన్వీనర్ కోటాలో సీటు సాధించిన పీజీ వైద్య విద్యార్థికి ఏటా రూ.3.5 లక్షల వరకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో ఇస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుండగా, బీసీలకు మాత్రం సీలింగ్ పద్ధతిలో రూ.3.5లక్షలు చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తుంది. ప్రస్తుతం పీజీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఫస్టియర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటికీ విడుదల కాలేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని, ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తర్వాత తిరిగి చెక్కుల రూపంలో వెనక్కి తీసుకోవాలని విద్యార్థులకు చెబుతున్నాయి.

సిట్‌లోకి సజ్జనార్?

సీఎంతో జరిగిన కీలక సమావేశానికి హాజరైన ఆర్టీసీ ఎండీ



సాక్షి, హైదరాబాద్: కేవలం ప్రమోటర్లు, ఇన్‌ఫ్లూయెన్సర్ల దగ్గరే ఆగకుండా బెట్టింగ్ యాప్స్ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సైతం కీలక పాత్ర పోషించనున్నారని తెలుస్తోంది. సిట్ ఏర్పాటుపై బుధవారం అసెంబ్లీలో ప్రకటన చేయడానికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఓ కీలక సమావేశం నిర్వహించారు. శాసనసభ ప్రాంగణంలోని ఆయన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్‌లతోపాటు సజ్జనార్ సైతం పాల్గొన్నారు.

కీలక కేసులు పర్యవేక్షించిన అనుభవం

సజ్జనార్ సీఐడీ ఎస్పీగా ఉన్నప్పుడు మల్టీ లెవల్ మార్కెటింగ్‌పై పోరు ప్రకటించారు. వివిధ సంస్థల కార్యకలాపాలను బహిర్గతం చేయడంతో పాటు ప్రత్యేక చట్టం రావడానికీ కారణమయ్యారు.

→ సైబరాబాద్ సీపీగా పనిచేసిన రోజుల్లోనూ అనేక బెట్టింగ్ యాప్స్‌పై కేసులు నమోదు చేయించడంతోపాటు వాటి దర్యాప్తుల్ని పర్యవేక్షించారు.

→ ఇటీవల ఆయన సోషల్‌మీడియా వేదికగా చేపట్టిన 'హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్'క్యాంపెయినింగ్ వైరల్‌గా మారింది. దీని కారణంగానే ఆయా యాప్స్, సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఫిర్యాదులు, కేసుల నమోదు తదితర పరిణామాలు చోటు చేసుకున్నాయి.

→ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించి ఏర్పాటు చేసే సిట్‌లో సజ్జనార్‌కు స్థానం కల్పించాలని యోచిస్తున్నట్టు తెలిసింది. నేరుగా సిట్‌లోకి తీసుకోవడమా? ప్రస్తుతం ఆయనకు ఉన్న బాధ్యతల నేపథ్యంలో సూచనలు, సలహాలతో సిట్ ఏర్పాటు, దర్యాప్తు చేయించడమా? అనేది ఒకట్రెండు రోజుల్లో తేలనుంది.

తాటి, ఈత కల్లుతో వైన్, ఆరక్ పరిశ్రమ

సౌకర్యాల కల్పనకు జర్మన్ ప్రతినిధి స్టీఫెన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తాటి, ఈత చెట్ల నుండి వచ్చే కల్లుతో వైన్, ఆరక్ తదితర అనుబంధ పదార్థాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు తగిన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి జర్మన్ ప్రతినిధి స్టీఫెన్ విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం అసెంబ్లీ ఆవరణలోని సీఎం చాంబర్‌లో రేవంత్ రెడ్డితో, అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పారిశ్రామికవేత్త రోహిత్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూరప్‌కు తెలంగాణ కల్లు ఎగుమతి.. స్థానికంగా కల్లు దుకాణాల ఏర్పాటు.. గీత కార్మికులకు కనీసం ఆదాయం పెంపొందించేలా సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపారు. ఇందులో భాగంగా.. ఇతర రాష్ట్రాలు, దేశాలకు మార్కెటింగ్ విస్తరణతో పాటు రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం ఏర్పాటుకు సంసిద్ధమని తెలిపారు. తాటి, ఈత మొక్కలు త్వరగా పెరిగి అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాల తయారీకి కూడా సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. గతంలో కాంబోడియా స్టడీ టూర్ వెళ్లినపుడు ఈ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించాలని స్టీఫెన్‌కు మంత్రి పొన్నం, పీసీసీ అధ్యక్షుడు మహేశ్, ప్రొఫెసర్ జానయ్య విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో కల్లు ఆధారిత పరిశ్రమల్లో భాగంగా.. తాటి ఈత చెట్ల నుండి వైన్, ఆరక్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయ నున్నట్లు సీఎంకు స్టీఫెన్ తెలియజేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో గీత కార్మికులు వృత్తిపరమైన ఆర్థికాభివృద్ధిని పొందడమే కాకుండా, వాల్యూ అడిషన్, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

ఉద్యోగినులతోనే బాలికల విద్యాసంస్థలు

టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి వర్షిణి

సాక్షి, హైదరాబాద్: బాలికల విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో మహిళా అధికారులు, మహిళా ఉద్యోగులే ఉండాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 1274 ప్రకారం ఈ నిబంధనను పక్కాగా అమలు చేయాలన్నారు. ఈమేరకు జనరల్ విద్యా సంస్థలు, బాలికల విద్యా సంస్థలకు ప్రత్యేక రోస్టర్ అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని స్పష్టం చేస్తూ గురువారం ఆమె ప్రత్యేకంగా మెమో జారీ చేశారు. మల్టీ జోనల్ అధికారులు, జోనల్ అధికారులు, జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు ఈ నిబంధనను కచ్చితంగా పాటించాలన్నారు.

యూకే అండ్ కో తో రెపోస్ మ్యాట్రెస్ భాగస్వామ్యం

సాక్షి, హైదరాబాద్: మిడ్–టు–ప్రీమియం మ్యాట్రెస్ పరిశ్రమలో పేరెన్నికగన్న రెపోస్ మ్యాట్రెస్, తన వ్యాపారాన్ని మరింత మెరుగుపరుచుకోవడంలో భాగంగా ప్రఖ్యాత వ్యాపార కన్సల్టింగ్ సంస్థ అయిన యూకే అండ్ కోతో భాగస్వామ్యమైంది. ఈ భాగస్వామ్యంలో యూకే అండ్ కో వ్యవస్థాపకులు, వ్యాపార సలహాదారు లు ఉల్లాస్ కామత్ కీలకంగా వ్యవహరించనున్నారు. యూకే అండ్ కో ఉత్పత్తి సాంకేతికత, అమ్మకాలు, మార్కెటింగ్, పంపిణీ, ఆర్థిక ప్రణాళికలో వ్యూహాత్మక వ్యవహారాలతో ఉల్లాస్ కామత్ వ్యాపారాభివృద్ధికి మార్గనిర్దేశనం చేస్తారని సంస్థ తెలిపింది. యూకో అండ్ కోతో భాగస్వామ్యం కావడం, ఉల్లాస్ కామత్ సేవలను ఉపయోగించుకోవడం పట్ల రెపోస్ మ్యాట్రెస్ ఎండీ బాలచందర్ ఆనందం వ్యక్తం చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22+4 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 5

శుక్రవారం 28-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


LuLu
ఈద్
మరియు
ఉగాది
డీల్స్
28 మార్చి - 1 ఏప్రిల్
2025 వరకు
LuLu HYPERMARKET
LULU MALL, HYDERABAD
ఈద్ మరియు ఉగాది పండుగలను
సరికొత్త ఆఫర్లతో జరుపుకోండి,
ప్రత్యేకమైన డిస్కౌంట్లు మరియు పండుగ ప్రత్యేకతలను ఆస్వాదించండి.
MILK
*T&C APPLY
పండ్లు & కూరగాయలు
దానిమ్మ రెడ్ 1 కిలో ₹229
అరటిపండు రోబస్టా పసుపు 1 కిలో ₹36
మామిడి బంగినపల్లి 1 కిలో ₹169
బంగాళాదుంప 1 కిలో ₹28
టమాటో 1 కిలో ₹15
సొరకాయ 1 కిలో ₹24
UPTO 50% OFF
దావత్/ఇండియా గేట్/ పంసారి బాస్మతి బియ్యం 1 కిలో ఎంట్రీ ప్రారంభ ధర ₹120
20% OFF
ఆశీర్వాద్ వేయించిన సూజి రవ్వ 1 కిలో ₹86 ₹68
హలో లైఫ్/ సన్ ప్యూర్/ విజయ రిఫైన్ సన్ ఫ్లవర్ ఆయిల్ 1 లీటర్ ₹139/PC
Heritage COW GHEE
హెరిటేజ్ ఆవు నెయ్యి 1 కిలో ₹685 ₹559
20% OFF
Roasted VERMICELLI
బ్యాంబినో రోస్టెడ్ సేమియా 400 గ్రా. ₹70 ₹56
Milkmaid
నెస్లే మిల్క్‌మేడ్ 210 గ్రా. ₹89 ₹82
ఫెర్రెరో రోచర్ చాక్లెట్ T16 200 గ్రా. ₹589 ₹499
ఫెర్రెరో రోచర్ చాక్లెట్ T24 300 గ్రా. ₹950 ₹815
క్యాడ్‌బెర్రీ డైరీ మిల్క్ సిల్క్ (విస్తృత శ్రేణి) 15% OFF ఎంట్రీ ప్రారంభ ధర ₹230
గెలాక్సీ బార్ (విస్తృత శ్రేణి) 20% OFF ఎంట్రీ ప్రారంభ ధర ₹185
ఎండబెట్టిన కివి 1 కిలో ₹625 ₹525
అంజీర్ రోస్లెస్ 1 కిలో ₹1,199
పిస్తా ఇరానీ 500గ్రా. ₹725 ₹499.50
బెల్లం 1 కిలో ₹75 ₹59
BEST PRICE
ఇడ్లీ బియ్యం 1 కిలో ₹49
BEST PRICE
ఇడ్లీ రవ్వ 1 కిలో ₹35
BEST PRICE
మినప పప్పు 1 కిలో ₹107
BEST PRICE
పెసర పప్పు 1 కిలో ₹102
30% OFF
Chakki Fresh Atta
పిల్స్‌బరీ గోధుమ పిండి 5 కిలోలు ₹346 ₹239
15% OFF
Chakra Gold
టాటా చక్ర గోల్డ్ టీ పొడి 500గ్రా. ₹430 ₹365
30% OFF
SUPER VALUE PACK BOOST
బూస్ట్ ఎనర్జీ డ్రింక్ 750 గ్రా. ₹469 ₹319
67% OFF
పాస్తా బెల్లా (విస్తృత శ్రేణి) 500గ్రా. ₹399 ₹129
50% OFF
Muesli
క్వాలిటీ మ్యూస్లి ఫ్రూట్ ఎన్ నట్/మ్యూస్లి జార్ 1 కిలో ₹699 ₹349
మన్న రోల్డ్ ఓట్స్ 1 కిలో ₹579 ₹289
50% OFF
ROLLED OATS
QUINOA
మన్న రోల్డ్ క్వినోవా ఓట్స్ 1.5 కిలో ₹1,299 ₹649
నిస్సిన్ జీకీ కప్ కొరియన్ కిమ్చి/ వెజ్/ చికెన్ 70 గ్రా. ₹89 ₹75
50% OFF
పార్లే/ యూనిబిక్/ సన్ ఫీస్ట్ కుకీస్ & క్రీం ఫిల్లిడ్ బిస్కట్స్ (విస్తృత శ్రేణి)
ఆలో ఫ్రూట్/ రా ప్రెస్సరీ బాటిల్డ్ ఫ్రూట్ జ్యూస్ (విస్తృత శ్రేణి) 50% OFF
ట్రోపికన ఫ్రూట్ జ్యూస్ టెట్రా (విస్తృత శ్రేణి) 1 లీటర్ 30% OFF
Tropicana
25% OFF
7up/కోకా కోలా/మౌంటెన్ డ్యూ/ పెప్సీ/స్ప్రైట్ 750ml
గ్రిల్డ్ చికెన్ మలబార్ స్పైసీ 1 కిలో ₹450 ₹399
హైదరాబాద్ చికెన్ బిర్యానీ 1 కిలో ₹340 ₹299
కునాఫా క్రీం 250 గ్రా. ₹150
ఫ్రూట్ కేక్ స్లైస్ 400 గ్రా. ₹125 ₹119
ఫ్రెష్ పనీర్ 250 గ్రా. ₹112
ఎండు రొయ్యల పచ్చడి 250 గ్రా. ₹120 ₹99
వెల్లుల్లి పచ్చడి 250 గ్రా. ₹113 ₹99
IDLY & DOSA BATTER
ఇడ్లీ & దోస పిండి 1 కిలో ₹95 ₹79
50% OFF
CHEESE SLICES
డి లెక్టా చీజ్ స్లైసెస్ 200 గ్రా. ₹180 ₹90
Heritage Total Curd
హెరిటేజ్ పెరుగు 1 కిలో టబ్ ₹110 ₹99
Offers valid from 28th Mar to 1st Apr 2025 or till stocks lasts. Images shown in the offer booklet is only indicative and actual products may vary. Prices are subject to change. Lulu holds the exclusive rights to make any modifications or withdraw the offers at any point of time.The images shown are for illustration purposes only and may not be an exact representation of the product. *T&C Apply.
SCAN THIS QR
TO VIEW EXCLUSIVE OFFERS
LuLu HYPERMARKET
LuLu FASHION STORE
MEN / WOMEN / KIDS
LuLu CONNECT
DIGITAL & ELECTRONICS MEGASTORE
Survey No. 1050, Lulu Mall, Balanagar Mandal, Rd Number 3, Kukatpally Housing Board Colony, Kukatpally, Hyderabad, Telangana 500072


LuLu Where the world comes to shop
★ LULU EID AND UGADI DEALS ★
50% OFF డెలిషియస్ చికెన్ నగ్గెట్స్ 1 కిలో ₹650 ₹325
50% OFF యమ్మీజ్ చికెన్ పాప్ కార్న్ 1 కిలో ₹660 ₹330
21% OFF స్విట్జ్ సమోసా షీట్స్ 500 గ్రా. ₹120 ₹99
31% OFF యార్డ్లీ మెన్ పెర్ఫ్యూమ్ 100మి.లీ/ విమెన్ పెర్ఫ్యూమ్ 50మి.లీ (విస్తృత శ్రేణి)
హ్యాపీ లైఫ్ ఎమోజి అడిక్ట్/ డాన్ మార్టిన్/ ప్రేమమ్ 50 మి.లీ 50% OFF ₹1,499 ₹749
క్రియేషన్ లామిస్ మెన్ EDP ప్యూర్ బ్లాక్ 100మి.లీ + డియో 200మి.లీ ₹1,200 ₹600
నివియా బాడీ లోషన్ 600 మి.లీ 50% OFF ₹699 ₹349
డవ్ ఆల్మండ్/రెన్యూ బాడీ వాష్ 1 లీటర్ ₹849 ₹424
25% OFF ఫియామా డి విల్స్ సోప్ హక్కైడో మిల్క్ బార్ సెలబ్రేషన్ ప్యాక్ 125gx5 ₹505 ₹378
57% OFF VLCC జెల్ క్రీమ్ మ్యాట్ SPF 30 టిన్టెడ్ 100గ్రా. ₹395 ₹169
53% OFF గ్రేస్‌మార్క్ క్యాండిడ్ డియో టాల్క్ రెన్యూ 100గ్రా. ₹139 ₹64
45% OFF జెన్ గార్డెన్ షవర్ క్రీమ్ (విస్తృత శ్రేణి) 1 లీటర్ ₹499 ₹274
న్యూవా అల్ట్రా సేఫ్ ప్యాడ్ హెవీ/మీడియం ఫ్లో 12 ప్యాక్ ₹239 ₹199
34% OFF మోర్‌లైట్ లిక్విడ్ డిటర్జెంట్ పౌచ్ 5 లీటర్లు ₹525 ₹349
56% OFF సన్ ప్లస్ డిటర్జెంట్ పౌడర్ రోజ్ 4 కిలోలు ₹520 ₹229
39% OFF ఇన్ కార్ట్ డిష్ వాష్ 2 లీటర్లు ₹389 ₹239
సానిఫ్రెష్ టాయిలెట్ క్లీనర్ 1లీటర్ 50% OFF ₹225 ₹112
టి స్టైర్ పెర్ఫ్యూమ్డ్ ఫ్లోర్ క్లీనర్ (విస్తృత శ్రేణి) 5 లీటర్లు 55% OFF ₹489 ₹219
50% OFF ఒరిగామి కిచెన్ టవల్స్ 60 పుల్స్ x 4 ₹375 ₹187
50% OFF విన్ ప్లస్ సీవింగ్ కిట్ ₹250 ₹125
30% OFF ఫాబెర్ క్యాస్టెల్ ఆర్ట్ & క్రాఫ్ట్ కిట్ ₹350 ₹245
44% OFF చెఫ్లైన్ కుకింగ్ పాట్ 10 సెట్ ₹3,575 ₹1,999
63% OFF నోట్రా గ్రానైట్ 4 సెట్ ₹4,300 ₹1,591
40% OFF పిజెన్ ఇనాక్స్ ప్లస్ ప్రెజర్ కుకర్ 5 లీటర్ ₹3,149 ₹1,889
56% OFF చెఫ్లైన్ డిన్నర్ సెట్ 21 పీస్ ₹3,595 ₹1,581
60% OFF వండర్‌షెఫ్ గోల్డ్ క్యాస్రోల్ 3 సెట్ ₹4,500 ₹1,799
55% OFF బెర్గ్నర్ కుక్వేర్ 4 పీస్ సెట్ ₹5,999 ₹2,699
40% OFF హోమ్ గ్లాస్ జగ్ ₹650 ₹359
57% OFF చెఫ్లైన్ బిర్యానీ పాట్ 10 లీటర్ ₹3,250 ₹1,397
40% OFF హోమ్‌వెల్ పాలిస్టర్ ప్రేయర్ మ్యాట్ ₹1,299 ₹779
64% OFF హోంవెల్ డోహర్ డబుల్/ఎం పీస్ ₹2,499 ₹899
64% OFF హోంవెల్ డబుల్ కంఫర్టర్ ₹2,499 ₹899
79% OFF హోంవెల్ బెడ్ షీట్ క్వీన్ ₹1,199 ₹249
మాంసం & చేపలు
మటన్ కర్రీ కట్స్ 1 కిలో ₹850 ₹779
స్కిన్ లెస్ చికెన్ డ్రమ్ స్టిక్ 1 కిలో ₹320 ₹279
నాటు కోడి 1 కిలో ₹450 ₹389
శుభ్రం చేసిన రొయ్యలు (చిన్నవి) 1 కిలో ₹900 ₹759
పింక్ పర్చ్ చేప 1 కిలో ₹450 ₹399
వైట్ పాంఫ్రెట్ పెద్దవి 1 కిలో ₹1,600 ₹1,499
ELEVATE YOUR SHOPPING EXPERIENCE WITH IRRESISTIBLE BANK OFFERS FROM LULU.
HDFC BANK
ICICI Bank
SBI card
amazon pay
PhonePe
BANK | DISCOUNT | OFFER VALID
ICICI BANK | UPTO 10% | 25th Mar - 25th Apr 2025
HDFC BANK | UP TO ₹10,000 | 01st Mar - 31st Mar 2025
PHONEPE | UP TO ₹500 | Valid Till 06th April 2025
SBI CREDIT CARD | UP TO ₹7,500 | 08th Mar - 31st Mar 2025
AMAZON PAY | FLAT 5% | 01st Mar - 31st Mar 2025
UP TO 10,000 INSTANT DISCOUNT
*T&C Apply
LuLu HYPERMARKET
LuLu MELON FEST
28th MARCH - 06th APRIL 2025
This Summer Quench your Thirst with Melon Melody
LuLu ARABIC SWEETS
A TASTE OF TRADITION, ONLY AT LULU!
LuLu
www.luluhypermarket.in
SHOP ONLINE
From Lulu To Your Home
UP TO 50% OFF
EID SPECIALS
BEST DEAL
MEAT & FISH
LOW PRICE
FRUITS & VEGETABLES
UP TO 60% OFF
KITCHEN APPLIANCES
UP TO 50% OFF
PRAYER ESSENTIALS
UP TO 65% OFF
KITCHENWARE



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

బీమా బోలెడు.. ప్రీమియం మూరెడు

నామమాత్రపు ప్రీమియంతో భారీ ప్రయోజనం • ఖతర్‌లోని భారతీయ కార్మికులకు మేలు

ఇతర గల్ఫ్ దేశాల్లోని వలస కార్మికులకు అందించాలని వలస కార్మిక సంఘాల వినతి

మోర్తాడ్(బాల్కొండ): నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం ధర్మోరాకు చెందిన పత్రి రాజేశ్వర్ అనే వలస కార్మికుడు గత ఏడాది ఖతర్‌లో అనారోగ్యంతో మరణించాడు. అతను తెలంగాణ గల్ఫ్ సమితిలో సభ్యునిగా ఉంటూ డప్పు కళాకారునిగా అలరించాడు. రాజేశ్వర్ జీతం తక్కువగా ఉండటంతో.. అతనిపై భారం ఏర్పడకూడదనే ఉద్దేశంతో తెలంగాణ గల్ఫ్ సమితి ఇండియన్ కమ్యూనిటీ బెనోవలెంట్ ఫోరమ్ (ఐసీబీఎఫ్) ద్వారా బీమా పాలసీ చేయించారు. ఏటా ప్రీమియం మన కరెన్సీలో రూ.3 వేలు చెల్లించారు. అతనిది సాధారణ మరణమే అయినా.. అక్కడి బీమా కంపెనీ తీసుకున్న సానుకూల నిర్ణయంతో మృతుని కుటుంబానికి రూ.23.80 లక్షల పరిహారం లభించింది. ఇటీవలే బీమా సొమ్మును రాజేశ్వర్ భార్య ఖాతాలో ఐసీబీఎఫ్, తెలంగాణ గల్ఫ్ సమితి నాయకులు జమ చేయించారు. ఇది ఒక్క రాజేశ్వర్ కుటుంబానికి జరిగిన ఆర్థిక ప్రయోజనమే కాదు. ఎంతో మంది భారతీయ వలస కార్మికులకు కలుగుతున్న లబ్ధి. తక్కువ ప్రీమియంతో ఎలాంటి మరణానికైనా బీమా క్లెయిమ్ చేయడానికి ఖతర్‌లోని బీమా సంస్థలు అంగీకరించడం వలస కార్మికులకు వరంగా మారింది.



ఖతర్ బీమా సంస్థ ద్వారా లబ్ధి పొందిన కుటుంబ సభ్యులతో గల్ఫ్ జేఏసీ నాయకులు

కార్మిక సంఘాల చొరవతో..

ఖతర్‌లోని భారతీయ వలస కార్మికులకు అండగా ఉన్న సంఘాల నాయకుల చొరవతో బీమా సంస్థలు అత్యంత ఆకర్షణీయమైన పాలసీలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఏడేళ్లకు పూర్వం ఎలాంటి బీమా ప్రయోజనాలు లేకపోవడంతో వలస కార్మిక సంఘాల నాయకులు ఆలోచన చేశారు. ఖతర్‌లోని మన విదేశాంగ శాఖ కార్యాలయం అధికారుల సహకారం తీసుకుని కార్మిక సంఘాల నాయకులు బీమా సంస్థలతో చర్చలు జరిపారు. ఖతర్‌లో భారతీయ వలస కార్మికులు పది లక్షల మంది ఉన్నారని వెల్లడించారు. మెజార్టీ వలస కార్మికులు పేద, మధ్య తరగతి కుటుంబాల వారే ఉండటంతో.. వీరి ఆర్థిక నేపథ్యాన్ని బీమా సంస్థల దృష్టికి తీసుకు వెళ్లారు. వలస కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు ఆర్థిక చేదోడు లేదని.. మానవతా దృక్పథంతో బీమా పాలసీలలో మార్పులు చేయాలని విన్నవించారు. ఎలాంటి మరణానికైనా క్లెయిమ్ వర్తించేలా అంగీకరించిన బీమా సంస్థలు.. తక్కువ ప్రీమియంకే పాలసీలను అందించడం ఆరంభించాయి.

ఇతర గల్ఫ్ దేశాల్లోనూ అమలు చేస్తే..

ఖతర్‌లోని బీమా సంస్థలు తక్కువ ప్రీమియంకు క్లెయిమ్‌లను అందించే విధానాన్ని ఇతర గల్ఫ్ దేశాల్లోని బీమా సంస్థలు అమలు చేస్తే భారతీయ వలస కార్మికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, ఒమాన్, కువైట్, ఇరాక్ దేశాల్లోనూ వలస కార్మికులు లక్షలాది మంది ఉన్నారు. ఈ అన్ని గల్ఫ్ దేశాల్లో తెలంగాణ జిల్లాలకు చెందిన వలస కార్మికులు 15 లక్షల మంది వరకూ ఉంటే.. భారతీయుల సంఖ్య కోటిన్నర వరకు ఉంటుందని అంచనా. కేంద్ర ప్రభుత్వం ప్రవాస వలస కార్మికులకు బీమా ప్రయోజనాలు అందిస్తున్నా కేవలం ప్రమాద మరణాలకే వర్తింపజేస్తోంది. సాధారణ మరణాలకు బీమా వర్తింపజేస్తే ఎంతోమంది గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలకు మేలు జరుగుతుంది. అలా కాకుండా ఖతర్‌లోని బీమా సంస్థలు అందిస్తున్న పాలసీల మాదిరిగానే ఇతర గల్ఫ్ దేశాల బీమా సంస్థలు అమలు చేసేలా విదేశాంగ శాఖ చొరవ తీసుకోవాలని వలస కార్మికులు కోరుతున్నారు.

ఖతర్ విధానం విస్తృతం కావాలి




ఖతర్‌లోని బీమా సంస్థలు అమలు చేస్తున్న పాలసీలను ఇతర గల్ఫ్ దేశాలకు విస్తరించాలి. వలస కార్మికులు ఏ కారణంతో మరణించినా.. క్లెయిమ్ చేస్తే వలస కార్మికుల కుటుంబాలకు ఎంతో ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. మా వినతికి ఖతర్‌లోని బీమా సంస్థలు సానుకూలంగా స్పందించడంతో.. ఎన్నో కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనాలు దక్కాయి.

– సుందరగిరి శంకర్‌గౌడ్, ఐసీబీఎఫ్ సభ్యుడు, ఖతర్

గుట్టల బేగంపేట్ భూములపై స్టేటస్‌కో

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ గుట్టల బేగంపేట (మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వెనుక) సర్వే నంబర్ 63లోని 52.00 ఎకరాల భూములపై హైకోర్టు యథాతథ స్థితి (స్టేటస్‌కో) విధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది. ఈ భూమిపై ఇప్పటికే రెండు ప్రైవేట్ పార్టీలు హక్కులున్నాయని వాదిస్తూ కోర్టును ఆశ్రయించగా, అది సర్కార్ భూమి అంటూ ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేసింది. రికార్డుల్లో ఈ భూమిని కంచా తకరారీగా పేర్కొన్నారని స్పష్టం చేస్తూ, నిషేధిత జాబితాలో చేర్చింది. ఈ క్రమంలోనే 2022లో అప్పటి కలెక్టర్ అమోయ్ కుమార్ నిషేధిత జాబితా నుంచి భూములను డీ-నోటిఫై చేయాలని సిఫార్సు చేశారు. ఈ వివాదం హైకోర్టుకు చేరడంతో పంచనామాలు, ఇతర పత్రాలను పరిశీలించిన సింగిల్ జడ్జి.. ఆ భూముల్లో జోక్యం చేసుకోవద్దని సర్కార్‌కు తేల్చిచెప్పారు. అమోయ్‌కుమార్ సిఫార్సులను పక్కనపెట్టారు. ప్రైవేట్ పార్టీ తీరును తప్పుబడుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ ప్రైవేట్ పార్టీలు అప్పీల్ దాఖలు చేశాయి. ఈ అప్పీల్‌పై తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. భూమి స్థితిని మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని భావిస్తూ, స్టేటస్‌కో ఆదేశాలు జారీ చేసింది.

కేబినెట్‌లో చోటివ్వండి

ఖర్గేను కోరిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కలిశారు. గురువారం ఢిల్లీలో ఖర్గేను ఆయన నివాసంలో కలిసిన మాధవరెడ్డి, తెలంగాణ మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఖర్గేతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకోసం పనిచేసిన తనకు మంత్రిగా అవకాశం ఇవ్వాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలను అధిష్టాన పెద్దలకు వివరించారు.

ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, సంజయ్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఢిల్లీలో కుస్తీ చేస్తూ.. గల్లీలో దోస్తీ చేస్తున్నాయని బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్యే సంజయ్ ఎద్దేవా చేశారు. వారు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలో పడినప్పుడు.. వారికి బీజేపీ స్క్రిప్ట్ ఇచ్చి బీఆర్ఎస్‌పై దాడి చేయిస్తోందని ధ్వజమెత్తారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ రాసిచ్చిన స్క్రిప్ట్‌నే సభలో బీజేపీ ఎమ్మెల్యేలు, బయట కేంద్ర మంత్రులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రాష్ట్ర బీజేపీ నేతలు తప్పు పట్టడం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ భాష మాట్లాడేకన్నా.. ఆ పార్టీలో విలీనమైతే మంచిదని హితవు పలికారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని, ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడండని సభలో కేటీఆర్‌ను ఉద్దేశించి భట్టి చేసిన వ్యాఖ్యలు సబబు కావన్నారు. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని.. ఏ మొహం పెట్టుకుని సభకు వచ్చారని భట్టి అవమానించారని ధ్వజమెత్తారు.

ప్రతీ జిల్లాలో బెట్టింగ్ దందా: ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో ఐపీఎల్ బెట్టింగ్ దందా సాగుతోందని బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఆరోపించారు. బెట్టింగ్‌ను ఆపడానికి డీజీపీ, కమిషనర్లు, ఇతర పోలీసు అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. క్రికెట్ బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయి ఎంతోమంది విద్యార్థులు, యువకులు డబ్బు కోల్పోతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. రాష్ట్రం నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లి ఆన్‌లైన్ బెట్టింగ్ దందా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయం పోలీసు అధికారులకు తెలిసినా చూసీ చూడనట్టు వదిలేస్తున్నారని ఆరోపించారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే వారి కాంటాక్ట్ నంబర్లతో సహా పోలీసుల వద్ద ఆధారాలున్నా.. వారిని ఎందుకు విడిచిపెడుతున్నారో అర్థం కావడం లేదని రాజాసింగ్ సందేహం వ్యక్తం చేశారు.

రుణమాఫీపై ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు

నిర్మలా సీతారామన్‌పై ఎంపీ చామల ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో రుణమాఫీపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో రూ.21 వేల కోట్ల మేర రైతు రుణాలను ఏక కాలంలో మాఫీ చేశామని, ఆ వివరాలు కావాలంటే కేంద్ర ఆర్థిక మంత్రిగా తెప్పించుకోవచ్చని సూచించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరుల తో మాట్లాడుతూ.. తెలంగాణలో రుణమాఫీపై పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆమె కాంగ్రెస్ పార్టీని టార్గెట్‌గా చేసుకునే పార్లమెంట్‌లో మాట్లాడారని ఆరోపించారు. కాంగ్రెస్ చేసే మంచి బీజేపీ, బీఆర్ఎస్‌లకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు.

కేటీఆర్ మంచోడు కాదు.. ముంచేటోడు: ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ మంచోడు కాదని.. ముంచేటోడనే విషయం అందరికీ తెలుసని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్, ఆయన టీం చెడిపోవుడే కాకుండా తెలంగాణ సంస్కృతిని చెడగొడుతున్నారని ఆరోపించారు. గతంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వైట్ చాలెంజ్ విసిరితే కేటీఆర్ భయపడి గన్‌పార్క్‌కు రాకుండా పారిపోయారని విమర్శించారు. కేటీఆర్ ఎందుకు డ్రగ్స్ టెస్ట్ చేయించుకోలేదో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలోకి డ్రగ్స్, లిక్కర్, చివరకు కోళ్ల పందేలు కూడా కేటీఆరే తెచ్చారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా జీతభత్యాలు తీసుకుంటున్నప్పటికీ కేసీఆర్ తన బాధ్యతను నిర్వహించకుండా ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని మండిపడ్డారు. పార్టీ ప్లీనరీకి వెళ్లడానికి కేసీఆర్‌కు సమయం ఉంటుంది కానీ అసెంబ్లీకి రావడానికి మాత్రం టైమ్ లేదా అని ప్రశ్నించారు.

వధువు కావలెను

- అంతటా పెళ్లి కూతుళ్ల కొరత
- మ్యారేజ్ బ్యూరోల్లో పెరుగుతున్న అబ్బాయిల జాబితా
- సామాజిక మాధ్యమాల వేదికగా వెతుకులాట
- ఎదురుకట్నానికీ సరేనంటున్న అబ్బాయిలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పెళ్లి కూతుళ్లకు కొరత ఏర్పడింది. అవును.. మీరు చదువుతున్నది నిజం. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అమ్మాయి దొరకడం లేదనే మాట వినిపిస్తోంది. ఆస్తిపాస్తులు, ఉద్యోగం ఉండి కూడా అమ్మాయిల కోసం వెతుకులాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి కారణం ఆడపిల్లల జనాభా తగ్గడమేనన్నది వాస్తవం. సంప్రదాయ పెళ్లిళ్లన్నీ కులాల ప్రాతిపదికనే నడుస్తాయి. ప్రేమ వివాహాల దగ్గర మాత్రమే కుల ప్రస్తావన కనిపించదు. అయితే కొన్ని కులాల్లో ఆడపిల్లల కొరతతో చాలామంది పెళ్లి కాని ప్రసాద్‌లుగా మిగిలిపోతున్నారు. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో ఏ కులం అమ్మాయి అయినా సరే అంటున్నారు. మరికొందరు పెళ్లి ఖర్చు భరిస్తామని, అవసరమైతే అమ్మాయి తరఫు వారికి అయ్యే ఖర్చులు కూడా ఇస్తామని ముందుకొస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పెళ్లి సంబంధాల కోసం బంధువులు, తెలిసిన వారి చెవుల్లో వేస్తున్నారు. ఓ అమ్మాయిని వెతికి పెట్టండని మొర పెట్టుకుంటున్నారు. పురుషులకు దీటుగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా.. వివక్ష మాత్రం తగ్గడం లేదు. ఆడపిల్లను ఇప్పటికీ భారంగా భావిస్తున్న వారెందరో ఉన్నారు. కొందరైతే కడుపులో పెరుగుతున్నది ఆడో, మగో తెలుసుకుని.. ఆడపిల్ల అయితే కడుపులోనే తుంచేస్తున్నారు. రెండు మూడు దశాబ్దాలుగా లింగ నిష్పత్తిలో తేడా పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా పెళ్లీడుకొచ్చిన అబ్బాయిలు, వారి తల్లిదండ్రులకు అమ్మాయిల కోసం వెతుకులాట తప్పడం లేదు. తెలంగాణ ఎట్ ఏ గ్లాన్స్–2024 నివేదికలో.. 2011 జనాభా ఆధారంగా రాష్ట్రంలో 2021 ప్రాజెక్టెడ్ పాపులేషన్ రికార్డులను పరిశీలిస్తే ఆడపిల్లల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నట్టు స్పష్టమవుతోంది. పదిహేనేళ్ల నుంచి 19 ఏళ్ల లోపు జనాభాలో.. మగవారి కన్నా ఆడవాళ్లు 96 వేల మేర తక్కువగా ఉన్నారు. అలాగే 20 ఏళ్ల నుంచి 24 ఏళ్ల లోపు ఆడపిల్లలు లక్షా 6 వేల మంది తక్కువగా ఉన్నారు. పాతికేళ్ల నుంచి 29 ఏళ్ల లోపు వారు 78 వేల మంది ఆడపిల్లలు తక్కువగా ఉన్నట్టు నివేదిక స్పష్టం చేస్తోంది. పెళ్లి వయసు వచ్చిన మగవారి కన్నా.. ఆడపిల్లలు దాదాపు 2 లక్షల నుంచి 2.50 లక్షల మంది తక్కువగా ఉన్నట్టు స్పష్టమవుతోంది.

2021లో ప్రాజెక్టెడ్ పాపులేషన్ (లక్షల్లో)

వయసు	మొత్తం	పురుషులు	మహిళలు
15–19 ఏళ్లు	31.24	16.10	15.14
20–24 ఏళ్లు	33.94	17.50	16.44
25–29 ఏళ్లు	34.94	17.47	16.69

మ్యారేజ్ బ్యూరోలకు చేతినిండా పని...

పెళ్లికూతుళ్ల కొరత మ్యారేజ్ బ్యూరోలకు చేతినిండా పని కల్పిస్తోంది. అబ్బాయి తరపువారు అమ్మాయిల కోసం బ్యూరోలను ఆశ్రయిస్తున్నారు. తెలిసిన వారికల్లా తమ కొడుక్కి ఓ మంచి సంబంధం చూడమంటూనే మరోవైపు బ్యూరోలకు బయోడేటా, ఫొటోలు ఇస్తున్నారు. బ్యూరోల నిర్వాహకులతో ఎప్పటికప్పుడు ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. గతంలో ఒకటి రెండు కులాల్లో వివాహ వేదికలు ఉండేవి. ఇప్పుడు అన్ని కులాల్లో వివాహ సంబంధాలు వెతికే బ్యూరోలు వెలిశాయంటే.. అమ్మాయిల కొరత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇంటర్నెట్‌లోనూ పెళ్లి సంబంధాలు..

వివాహ సంబంధాలకు మ్యారేజ్‌బ్యూరోలు ఇంటర్నెట్‌లో వెబ్‌సైట్లు తెరిచాయి. దీంతో అబ్బాయిలు తమకు ఎలాంటి అమ్మాయి కావాలో వారి అభిప్రాయాలు, చదువు, ఉద్యోగం, కుటుంబ నేపథ్యాలను వెబ్‌సైట్లలో ఉంచుతున్నారు. పలు వివాహ వేదికలు నిర్వహిస్తున్న వెబ్‌సైట్లలో వందలు, వేలల్లో పెళ్లి సంబంధాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో వివాహ పరిచయ వేదికలకు గిరాకీ పెరిగింది. వివిధ కులాలకు చెందిన పెళ్లి సంబంధాలను పరిచయ వేదికల ద్వారా వెతికే పని చేపట్టారు. ఈ వేదికలపై ఎన్నో పెళ్లి సంబంధాలు ఖాయం అవుతుండడంతో ఆదరణ పెరుగుతోంది.

ఎదురు కట్నానికి సిద్ధం

వరకట్నం సమస్య అమ్మాయిల జనాభా తగ్గడానికి కారణమైన పరిస్థితుల్లో.. ఎదురు కట్నం ఇవ్వడానికి కూడా అబ్బాయిలు సిద్ధమవుతున్నారు. అమ్మాయి దొరికితే చాలు.. అంటూ అమ్మాయి తరఫు వారికి ఎదురుకట్నం ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు. కొన్ని కులాల్లో ఎదురుకట్నం ఇచ్చే సంప్రదాయం మొదలైంది. కొందరు పెళ్లి ఖర్చు భరిస్తున్నారు. అమ్మాయిల కొరతతో ఎందరో అబ్బాయిలు.. పెళ్లికాని ప్రసాద్‌లుగా మిగులుతుండడం ఆందోళన కలిగించే అంశం.

పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల ప్రశ్నోత్తరాలు

జోగులాంబ దేవాలయ అభివృద్ధికి


రూ.33.07 కోట్లు విడుదల చేశాం • కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్



సాక్షి, న్యూఢిల్లీ: అలంపూర్‌లోని జోగులాంబ దేవాలయ అభివృద్ధికి 2021–22 నుంచి 2024–25 మార్చి 21 వరకు రూ.33.07 కోట్లు విడుదల చేయగా... రూ.23.34 కోట్లు ఖర్చు చేశారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. అదే సమయంలో రామప్ప గుడికి రూ.32.73 కోట్లు విడుదల చేయగా, రూ.12.65 కోట్లు ఖర్చు చేశారన్నారు. అంతేగాక భద్రాచలం దేవాలయ అభివృద్ధికి రూ.8.43 కోట్లు విడుదల చేయగా, రూ.2.12 కోట్లు ఖర్చు చేసినట్లు బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాజ్యసభలో గురువారం సమాధానం ఇచ్చారు.

మెట్రో ప్రతిపాదనలను తెలంగాణ సమర్పించింది

కేంద్ర మంత్రి మనోహర్‌లాల్



హైదరాబాద్‌లో ఐదు కారిడార్‌లకు సంబంధించిన మెట్రో ఫేజ్–2 ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం సమర్పించిందని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ తెలిపారు. అయితే ఈ ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో సమీక్షలు అవసరమని.. ఆ తర్వాతే ప్రాజెక్టు ఆమోదం లభిస్తుందని కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లోక్‌సభలో సమాధానం ఇచ్చారు.

మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్‌ఐటీని ఏర్పాటు చేయండి

లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన బీజేపీ ఎంపీ డీకే అరుణ



సాక్షి, న్యూఢిల్లీ: మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ట్రిపుల్ ఐటీలో చదవడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతో పాటు వారిని మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా తయారు చేసేందుకు వీలవుతుందన్నారు. గురువారం లోక్‌సభలో ప్రత్యేక ప్రస్తావనపై ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు ఉన్నందున ట్రిపుల్‌ఐటీని ఏర్పాటు చేస్తే స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఐఐఐటీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ మంజూరు చేయండి

లోక్‌సభలో బీజేపీ ఎంపీ గోడం నగేశ్



సాక్షి, న్యూఢిల్లీ: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎయిర్‌పోర్ట్‌ను మంజూరు చేయాలని బీజేపీ ఎంపీ గోడం నగేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ప్రత్యేక ప్రస్తావనపై ఎంపీ నగేశ్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ ప్రాంతం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లకు సమీపంలో ఉన్న కారణంగా ఎయిర్‌పోర్ట్‌కు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని గతంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి చేసిన ప్రకటనను లోక్‌సభ దృష్టికి తెచ్చారు. ఇప్పటికే ప్రీ ఫీజిబిలిటీ నివేదిక సమర్పించాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిందని, కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని తెలంగాణ ప్రభుత్వం నుంచి రిపోర్ట్‌ను తెప్పించుకొని ఎయిర్‌పోర్టును మంజూరు చేయాలని ఎంపీ కోరారు.



శాసనమండలిలో పదవీకాలం పూర్తయిన ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, ఎం.ఎస్. ప్రభాకర్‌రావు, శేరి సుభాష్‌రెడ్డి, రియాజుల్ హసన్ అఫెండీ, ఎ. నర్సిరెడ్డి, కూర రఘోత్తంరెడ్డి, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, ఎగ్గె మల్లేశంలను గురువారం సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



జీవన పోరాటం

జానెడు పొట్ట కోసం గీత కార్మికుడు రోజూ జీవన పోరాటం సాగిస్తూనే ఉంటాడు. అంతెత్తున్న తాడిని లాఘవంగా ఎక్కి కల్లు సేకరిస్తాడు. ఇలా రోజులో ఎన్నో చెట్లు ఎక్కితే కానీ కుటుంబానికి బుక్కెడు తిండిపెట్టే పరిస్థితి ఉండదు. విశాఖ శివారులో సముద్ర తీరాన ఓ గీత కార్మికుడు కల్లు సేకరించేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



నీటికోసం ఆరాటం

వేసవి మండిపోతుండటంతో కొండలు, గుట్టల్లో తిరిగే వానరాలు ఆహారం, నీరు కోసం పిల్లల్ని తీసుకుని రహదారులు, నివాస ప్రాంతాలకు వస్తున్నాయి. రోడ్డు పక్కన, కాలువ గట్టున ఉండే చెట్లకు కాయో పండో ఉంటే తింటున్నాయి. విజయవాడ సమీపంలోని ఉండవల్లి వద్ద ఈ వానరాల గుంపు రోడ్డుపై తిరుగుతుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వేట ముగిసింది..

తూరుపు తెల్లారకముందే బోటు వేసుకుని సముద్రపై వేటకు పోయిన మత్స్యకారుడు అలల మాటున తన అదృష్టాన్ని పరీక్షించుకుంటాడు. వేట సంతృప్తిగా సాగితే తీరానికి చేరిన తరువాత ఇలా బుట్టల్లో చేపలు నింపుకుని సంతోషంతో ఇంటిబాట పడతారు. విశాఖలో ఓ మత్స్యకారుడు వేట ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తిరుపతి రహదారి సమస్యలకు పరిష్కారం చూపండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఎంపీ గురుమూర్తి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రహదారుల పనుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. ఆయన గురువారం గడ్కరీని కలిసి తన నియోజకవర్గ పరిధిలోని రహదారుల సమస్యలను వివరించారు. నాయుడుపేట, తూర్పు కనుపూరు జాతీయ రహదారి-71లో ప్యాకేజ్-4, వరగలి క్రాస్, తూర్పు కనుపూరు జాతీయ రహదారి-516 డబ్ల్యూ ప్యాకేజ్-2లో సర్వీస్ రోడ్లు, వెహికల్ అండర్ పాస్‌లు మంజూరు చేసి సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రైతులు రహదారికి ఒక వైపు నుంచి మరో వైపునకు తమ వ్యవసాయ ఉత్పత్తులు, సామగ్రిని తరలించేందుకు అనువుగా సర్వీస్ రోడ్లు, వెహికల్ అండర్ పాస్‌లు అవసరమని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో రైతులు చేపట్టిన ఆందోళనల గురించి కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సర్వీసు రోడ్లు, అండర్ పాస్‌లు కావాలని రైతులు తనకు అందించిన వినతిపత్రాలతోపాటుగా సమగ్రమైన వివరాలను వినతిపత్రం రూపంలో కేంద్ర మంత్రికి ఎంపీ అందజేశారు. తిరుపతి ఇంట్రా మోడల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ప్రత్యేకంగా కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి.. డిజైన్‌లలో స్వల్ప మార్పుల కారణంగా ఆలస్యమైందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

లులూకు కాదు.. ప్రజా ప్రయోజనాలకు కేటాయించండి

ప్రభుత్వానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ బహిరంగ లేఖ

సాక్షి, విశాఖపట్నం: వేల కోట్ల రూపాయిల విలువైన హార్బర్ భూముల్ని ప్రజా ప్రయోజనాలకు కాకుండా.. లులూ సంస్థకు కేటాయించడం సరికాదని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఆక్షేపించారు. విశాఖలోని ఆర్కే బీచ్‌లో రూ.1,300 కోట్లకు పైగా విలువైన 13.43 ఎకరాల భూముల్ని తిరిగి లులూకు కట్టబెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చెయ్యడాన్ని ఖండిస్తూ ప్రభుత్వానికి గురువారం బహిరంగ లేఖ రాశారు. సీఆర్‌జెడ్ నిషేధిత ప్రాంతంలోని ఈ భూముల్లో బోర్‌వెల్స్ తవ్వకాలు నిషేధమనే కఠిన ఆంక్షలున్నాయన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే వారు నిబంధనలు ఉల్లంఘిస్తారని పేర్కొన్నారు. కేవలం ప్రైవేట్ కంపెనీల్ని, పెద్దల్ని ప్రసన్నం చేసుకునేందుకు ఈ తరహా కేటాయింపులు చెయ్యడం తగదన్నారు. ఈ విధమైన భూ కేటాయింపులపై హైకోర్టు, సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో ప్రభుత్వాలకు చీవాట్లు పెట్టిన విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఇలాంటి చర్యలతో కోర్టులతో పాటు ప్రజాగ్రహానికి గురవ్వక తప్పదని హెచ్చరించారు.



కంచేడి పూలు... అందంగా కనిపించే వీటిని గిరిజనులు లొట్టలేసుకుని మరీ తింటారు... వాటితో ఘుమఘుమలాడే కూరలు చేసుకుని ఇష్టంగా లాగించేస్తారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో లభించే వీటికి అల్లూరి జిల్లాలో మంచి డిమాండ్ ఉంది. ఏజెన్సీ వాసులే కాకుండా ఇప్పుడు మైదాన ప్రాంతవాసులు కూడా వీటిని తినేందుకు అలవాటు పడ్డారు.



కంచేడి చెట్టుకు పూసిన పూలు

పూలతో ఘుమఘుమలు

- కంచేడి పువ్వులతో చవులూరించే కూరలు
- లొట్టలేసుకుని తింటున్న గిరిజనులు
- ఔషధ గుణాలు పుష్కలం
- సంతల్లో అమ్మకాలు జోరు
- సర్వరోగ నివారిణిగా వినియోగం
- పూర్వం నుంచి గిరిజన ఆచార వంటకంగా ఆదరణ



కంచేడిపూలతో వండిన ఇగురు కూర

సాక్షి,పాడేరు: అడవుల్లోను, గ్రామాల సమీపంలోను కంచేడి చెట్లకు మార్చి, ఏప్రిల్ నెలల్లో పూలు పూస్తాయి. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న వీటిని సర్వరోగ నివారిణిగా గిరిజనులు భావిస్తారు. ఈ పూలను ఈ సీజన్‌లో రోజువారీ కూరగా వండుకుని ఇంటిల్లాపాదీ తింటారు. మైదాన ప్రాంత ప్రజలు కూడా కంచేడి పూల కూర తినడానికి అలవాటుపడ్డారు. అల్లూరి జిల్లాలోని వారపు సంతల్లో ఈ పూల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. శ్రీరాముడు వనవాసం చేసే సమయంలో వీటిని ఉడకబెట్టి తిన్నాడన్న పురాణగాథ కూడా ప్రచారంలో ఉంది.

ఈ విరులు.. ఆరోగ్య సిరులు

ఈ పూల కూర మంచి రుచికరంగా ఉండడంతో పాటు, ఔషధగుణాలు కలిగిఉండడంతో గిరిజనులు ఇష్టంగా తింటారు. రక్తహీనత, కీళ్ల సమస్య, నొప్పులు, అజీర్ణం, కంటిచూపు మందగించడం వంటి రుగ్మతలు ఉన్న వారు ఈ కూరను తింటే మంచిదని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. మహిళల్లో పలు శారీరక రుగ్మతలను నయం చేస్తుందని గిరిజనుల నమ్మకం. వీటితో వేపుడు, ఇగురు కూరలను వండుకుని తింటున్నారు. కొంతమంది ఎండుచేప, ఎండు రొయ్యలను కూడా కలిపి ఇగురు కూరగా తయారు చేస్తారు.

మరి కొంత మంది గిరిజనులు ఈపూలను బాగా ఎండబెట్టి వరిగెలు తయారు చేసుకుని, భద్రపరుచుకుని ఏడాది పొడవునా వండుకుని తింటారు. బుట్ట కంచేడిపూలు రూ.600 నుంచి రూ.800 ధరతో అమ్ముతున్నారు. సంతల్లో చిన్న పోగులుగా వేసి వాటాను రూ.50తో అమ్మకాలు విక్రయిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ పూలు లభిస్తాయి.





కంచేడి మొగ్గలు, పాడేరులో బుట్టలతో కంచేడిపూలు, మొగ్గలను అమ్ముతున్న గిరిజన మహిళ

అనారోగ్య సమస్యలు దూరం



కంచేడిపూలను వండుకుని తింటే మంచి ఆరోగ్యం లభిస్తుంది. ఏడాదిలో రెండు నెలల మాత్రమే పూసే కంచేడి పూలను పూర్వం నుంచి తింటున్నాం. ఈకూర రుచికరంగా ఉండడంతో పాటు శరీరంలోని అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. కంచేడి పూలను మహిళలు అధికంగా తింటారు.

– చిట్టిబాబు, అయుర్వేద వైద్యుడు,కుజ్జెలి గ్రామం, పాడేరు మండలం

సచివాలయాలపై సర్కారు కత్తి

గ్రామ, వార్డు సచివాలయాలను నిర్వీర్యం చేస్తున్న కూటమి సర్కారు

ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగుల తగ్గింపునకు కసరత్తు

- మెప్మాకు డెప్యుటేషన్‌పై 402 మంది సచివాలయాల సిబ్బంది
- పలు శాఖల్లో ఉద్యోగులు అవసరమైన చోటా వీరినే వాడుకొనే యత్నం
- తాజాగా పోలవరం నిర్వాసితుల పనులకు 20 మంది
- ఈమేరకు ఆదేశాలు జారీ చేసిన చింతూరు ఐటీడీఏ పీవో

సాక్షి, అమరావతి : పేద ప్రజలు ప్రభుత్వ సేవలకు ఊరు దాటి వెళ్లకుండా గ్రామంలోనే అన్ని సేవలందించేలా మహోన్నతమైన ఆశయంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను కూటమి ప్రభుత్వం పనికట్టుకొని నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో సచివాలయాల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించేసి, మిగులు ఉద్యోగులంటూ కొందరిని ఇతర శాఖలకు పంపే ప్రయత్నం చేస్తోంది. మరో పక్క సచివాలయాల ఉద్యోగులను వారికి సంబంధం లేని ఇతర పనులకూ వినియోగిస్తోంది. ఇటీవల పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో కమ్యూనిటీ ఆర్గనైజేషన్స్, సుయోగ్ సెంటర్లలో ఖాళీగా ఉన్న 402 పోస్టుల్లో వార్డు సచివాలయాల ఉద్యోగులను డిప్యూటేషన్‌పై నియమించేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఇంకా పలు శాఖల్లో ఖాళీ పోస్టుల్లో, ఉద్యోగులు అవసరమైన చోట గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను వినియోగించుకునేలా ఆయా శాఖల మధ్య, జిల్లా పరిధిలోనూ అధికారుల మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతున్నట్టు ఉద్యోగ సంఘ నేతలు చెబుతున్నారు. తాజాగా పోలవరం భూసేకరణ, పునరావాస కార్యక్రమ పనులకు కూడా సచివాలయాల ఉద్యోగులను ఉపయోగించుకోవడానికి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రాజెక్టు నిర్వాసితులకు భూమికి భూమి ఇచ్చే కార్యక్రమం, వారిని పునరావాస కాలనీలకు తరలించే పనుల కోసం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని 20 మంది గ్రామ సచివాలయాల సిబ్బందిని వినియోగించుకొనేలా చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ సచివాలయాల్లో పనిచేసే పది మంది డిజిటల్ అసిస్టెంట్లు, ఏడుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఒక విలేజ్ సర్వేయర్, ఒక విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఒక గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీసు)ని పోలవరం నిర్వాసితుల పనుల్లో నియమించారు.

సచివాలయాల వ్యవస్థ లక్ష్యమే నీరుగారేలా..

పేద ప్రజలు ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా గతంలో మండల లేదా జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులు దయతలిస్తే ఎప్పటికో ఆ పని అయ్యేది. ఈ ఇబ్బందుల నుంచి ప్రజలను బయటపడేసి, ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకెళ్లే ఉన్నత లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసినదే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ. నగరాలు, కుగ్రామాలు అన్న తేడా లేకుండా అన్ని చోట్లా ప్రజలు ప్రభుత్వాఫీసుల్లో పనుల కోసం వేరే ఊళ్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వైఎస్ జగన్ 2019లో గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. వీటిలో కొత్తగా 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను మంజూరు చేసి, కేవలం నాలుగు నెలల్లోనే లక్ష మందికి పైగా ఉద్యోగులను నియమించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ప్రభుత్వాఫీసుల్లో పనుల కోసం ఊరు, వార్డు దాటి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ సచివాలయాల్లోనే పనులు చేయించుకొనే వారు. వీటి ద్వారా దాదాపు 11 కోట్ల వినతులు పరిష్కారమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉన్న ఈ వ్యవస్థపై కత్తి కట్టింది. ఉద్యోగులను తగ్గిస్తూ, వారికి సంబంధం లేని పనుల్లోనూ వాడుకొంటోంది. ఈ వ్యవస్థనే ప్రజలకు దూరం చేస్తోంది.

దక్షిణ మధ్య రైల్వే 'ఆదాయ' యుద్ధం!

- తూర్పు కోస్తా రైల్వే జోన్‌పై ఆధిపత్యానికి ప్రయత్నం
- ఆదాయార్జనలో నంబర్ వన్‌గా నిలిచేందుకు కుయుక్తులు
- వైజాగ్ నుంచి చర్లపల్లికి స్పెషల్ ట్రైన్ రద్దుకు హుకుం
- ప్రయాణికుల ఆగ్రహావేశాలు

సాక్షి, విశాఖపట్నం: ఆదాయార్జనలో నంబర్ వన్‌గా నిలిచేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రయత్నం చేస్తోంది. ఇదే లక్ష్యంగా తూర్పు కోస్తా రైల్వే జోన్‌పై ఆధిపత్యం చూపించేందుకు నిరంతరం కుయుక్తులు పన్నుతోంది. ఈ దిశలో తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి.

ప్రత్యేక రైలు ప్రకటనతో 'ఘర్షణ'

ఉగాది నేపథ్యంలో బస్సులు, రైళ్లు అన్నీ రెండు నెలల ముందే నిండిపోయాయి. ఈ నేపథ్యంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు.. ఈ నెల 30న 08579/80 నంబర్‌తో విశాఖపట్నం- చర్లపల్లి మధ్య రెండు రోజుల పాటు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ప్రకటించింది. 28 సాయంత్రం 5.30 గంటలకు విశాఖలో బయల్దేరి 29వ తేదీ ఉదయం 6.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. 29న ఉదయం 8 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి అదేరోజు రాత్రి 8 గంటలకు విశాఖ చేరుకునేలా ఈ సర్వీసుని కేటాయించారు. అదేవిధంగా ఈ రైలు తిరుగు ప్రయాణం కోసం 1న విశాఖ నుంచి 2న చర్లపల్లి నుంచి బయలుదేరేలా షెడ్యూల్ ఫిక్స్ చేసి.. టికెట్స్ బుక్ చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

ఎవర్ని అడిగి రైలు నడుపుతున్నారు.?

సౌత్ సెంట్రల్ అధికారులు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రైన్ సర్వీసు ఎలా నడుపుతారంటూ సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్‌కు మెయిల్ పంపించారు. ఈ సర్వీసు నడిపేందుకు అనుమతి లేదనీ.. తక్షణమే దీన్ని క్యాన్సిల్ చెయ్యాలంటూ సౌత్‌సెంట్రల్ హుకుం జారీ చేసింది.

ఆర్థిక ప్రయోజనాలే ధ్యేయం...

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆదాయం కోసమే సౌత్‌సెంట్రల్ ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతుందని ఈస్ట్‌కోస్ట్ అధికారులు ఆరోపిస్తున్నారు. ఒక వైపు టికెట్స్ బుక్ చేసుకుంటున్న సమయంలో ట్రైన్ సర్వీసుని ఎలా రద్దు చెయ్యగలమని ప్రశ్నిస్తున్నా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈస్ట్ కోస్ట్ ఈ స్పెషల్ ట్రైన్‌ని రద్దు చేసిన వెంటనే.. సికింద్రాబాద్ నుంచి వైజాగ్‌కు స్పెషల్ రైలు ప్రకటించేందుకు సౌత్ సెంట్రల్ సిద్ధమవుతోందని వార్తలు వెలువడుతున్నాయి. కేవలం ఆదాయం కోసం ప్రయాణికులతో చెలగాటమాడుతుండటంపై దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. వైజాగ్ చర్లపల్లి రైలు సర్వీసు రద్దు చెయ్యొద్దంటూ ప్రయాణికులు కోరుతున్నారు.

ఎంటీఎస్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి

సాక్షి, అమరావతి: 1998, 2008 డీఎస్సీల ద్వారా ఎంపికై నియామక విధానంలోని తప్పిదాలతో నష్టపోయిన ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 62 సంవత్సరాల ఉద్యోగ విరమణ వయసు కల్పించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుమారు 1000 మందికి 60 ఏళ్లు నిండడంతో ఉద్యోగ విరమణ చేశారని, వీరి సర్వీసును మరో రెండేళ్లు పెంచి ఒక రోజు గ్యాప్ (11 నెలల 29 రోజులు)తో రెన్యూవల్ చేయాలని కోరారు.

14 నెలలుగా వేతనాలు అందని ఉపాధ్యాయులు

బాపట్ల జిల్లా పర్చూరు మండలం చెరుకూరు ఎయిడెడ్ ఆంధ్ర కేసరి మెమోరియల్ ఉన్నత పాఠశాలలో సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.పద్మావతమ్మకు 14 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా యాజమాన్యం వేధిస్తోందని, ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ టీచర్స్ గిల్డ్ ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. వలంటరీ రిటైర్‌మెంట్ ఇవ్వనందుకు జీతభత్యాలు నిలిపివేసిందని గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

మినీ డెయిరీ పథకం అమలుకు కమిటీ

సాక్షి, అమరావతి: బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు ఆర్థిక సహాయ పథకాల కింద మినీ డెయిరీ పథకం అమలుకు అవసరమైన కార్యాచరణ మార్గదర్శకాలు, సేకరణ విధానాల ఖరారు కోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ చైర్మన్‌గా, ఈబీసీ కార్పొరేషన్ ఎండీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పశు సంవర్ధక శాఖ డైరెక్టర్, ఆర్య వైశ్య, కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీలు సభ్యులుగా ఉంటారు.

'ఏటీఎల్ మెంటార్‌షిప్ ప్రోగ్రామ్'ను బలోపేతం చేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్ ల(ఏటీఎల్) మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌ను మరింత విస్తృతం చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం సమగ్ర శిక్షణ రాష్ట్ర కార్యాలయంలో ఏపీఎస్‌సీహెచ్‌ఈ సెక్రటరీ, సీఈవో ఎంఎల్‌ఎస్ దేవ కుమార్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్, ఫ్యాకల్టీ మెంటార్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలం: పీఆర్టీయూ

పదో తరగతి పరీక్షల నిర్వహణలో జాగ్రత్తలు పాటించకుండా, ఆపై తప్పు చేశారంటూ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం సరికాదని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ-ఏపీ) ఓ ప్రకటనలో పేర్కొంది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి ఏపీ మోడల్ స్కూల్లో మాస్ కాపీయింగ్ నేపథ్యంలో.. 14 మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని, దీన్ని రద్దు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య పాఠశాల విద్య డైరెక్టర్ విజయ రామరాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ నెల 21న కుప్పిలిలో కాపీయింగ్‌పై సమాచారంతో డీఈవో తన బృందంతో దాడి చేశారన్నారు. ప్రశాంతంగా పరీక్ష రాస్తున్న 375 మంది విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను రద్దు చేసి, ఐదుగురు విద్యార్థులు మళ్లీ పరీక్షలు రాసేందుకు అనుమతివ్వాలని డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

డీవైఈవో మెయిన్స్‌కు 94.60 శాతం హాజరు

సాక్షి, అమరావతి: డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈవో) మెయిన్స్ పరీక్షకు 94.60 శాతం మంది హాజరైనట్లు ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో పేర్కొంది. 3,959 మంది అభ్యర్థులకు గాను 3,573 మంది బుధ, గురువారాల్లో పరీక్ష రాశారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీలో అసిస్టెంట్ లైబ్రేరియన్ పరీక్షకు 107 మందికి 56, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు హాల్ టికెట్లు తీసుకున్న 5,802 మందికి గాను 4,232 మంది హాజరయ్యారు. కాలుష్య నియంత్రణ మండలిలోని గ్రేడ్-2 అనలిస్టుల పరీక్షకు 5,173 మందికి 3,759 మంది హాజరయ్యారని సర్వీస్ కమిషన్ కార్యదర్శి నరసింహమూర్తి తెలిపారు.

జగన్‌పై దుష్ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోండి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి తదితరులు

తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

తాడేపల్లి రూరల్ : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అవమానించేలా అసత్య ప్రచారాలు చేయడం, ఫొటోలు మార్ఫింగ్ చేయడం తదితర అంశాలపై ఇచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని కేసులు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు అంకిరెడ్డి నాగ నారాయణమూర్తి కోరారు. సోషల్ మీడియాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై ఆయన పార్టీ నేతలతో కలిసి గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీకి చెందిన ఇతర నాయకులు, మహిళలపై కొందరు అదేపనిగా ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని.. వైఎస్సార్‌సీపీ మహిళలపై చెప్పడానికి వీల్లేకుండా పోస్టులు పెడుతున్నారని.. ఇలాంటి వారిపై పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా ముందు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై ఎన్నో కేసులు పెట్టిన పోలీసులు.. ఇలాంటి అసత్య ప్రచారాలు, అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో బదులివ్వాలన్నారు. తమ ఫిర్యాదులపై కేసులు నమోదుచేసి విచారణ చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు ఇప్పించి ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు.



అందుకే అట్లీతో సినిమా ఆగిపోయింది

- సల్మాన్ ఖాన్

● అట్లీ

హీరో సల్మాన్ ఖాన్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఓ సినిమా రానుందనే టాక్ బాలీవుడ్ సర్కిల్స్‌లో బలంగా వినిపించింది. సల్మాన్ ఖాన్ కోసం అట్లీ రెడీ చేసిన కథలో మరో స్టార్ హీరోకి కూడా అవకాశం ఉందని, ఈ పాత్రలో రజనీకాంత్ లేదా కమల్‌హాసన్ నటిస్తారనే ప్రచారం కూడా సాగింది. కానీ చివరి నిమిషంలో ఈ సినిమా సెట్స్‌కు వెళ్లకుండా ఆగిపోయింది. ఈ సినిమా ఆగిపోవడం పట్ల సల్మాన్ ఖాన్ స్పందించారు. ఓ మీడియా చిట్‌చాట్‌లో పాల్గొన్న సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ– ''అట్లీ ఓ భారీ స్థాయి కథను సిద్ధం చేశారు. ఆ సినిమాలో నాతో పాటుగా రజనీకాంత్ నటించేవారా? లేక కమల్‌హాసన్ నటించేవారా? అనే విషయం నాకు తెలియదు. అయితే బడ్జెట్ కారణాల వల్ల ఈ సినిమా వాయిదా పడింది'' అని పేర్కొన్నారు. ఇంకా సంజయ్ దత్‌తో తానొక యాక్షన్ ఫిల్మ్ చేయబోతున్నానని, దర్శకుడు ఇంకా ఫైనలైజ్ కాలేదని, త్వరలోనే ఈ సినిమా గురించి చెబుతానని సల్మాన్ ఖాన్ తెలిపారు. ఇక సల్మాన్ ఖాన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో 'సికందర్' అనే యాక్షన్ మూవీ రూపొందింది. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సత్యరాజ్, కాజల్ అగర్వాల్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. సాజిద్ నడియాద్‌వాలా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది.

నా సినిమాలకు నంబర్స్ రావు

- సల్మాన్ ఖాన్

ఇంకా బాలీవుడ్ హీరోలు దక్షిణాది ప్రేక్షకులను మెప్పించడంలో ఎందుకు విఫలమవుతున్నారు? అనే ప్రశ్నకు సమాధానంగా సల్మాన్ ఖాన్ స్పందించారు. ''నేను హీరోగా నటించిన సినిమాలకు దక్షిణాదిలో పెద్దగా నంబర్స్ (కలెక్షన్స్) రావు. ఎందుకంటే అక్కడి నటీనటులకు స్ట్రాంగ్ ఫ్యాన్ బేస్ ఉంది. నేను వీధుల్లో కనిపిస్తే వారు నన్ను భాయ్ భాయ్ అని పిలుస్తారు. కానీ నా సినిమాలను థియేటర్స్‌లో చూడరు. అయితే రజనీకాంత్, చిరంజీవిగార్లు, సూర్య, రామ్‌చరణ్ వంటి వాళ్లు చేసిన సినిమాలను మనం ఇక్కడ (బాలీవుడ్) ఆదరిస్తున్నాం. కానీ వాళ్ల ఫ్యాన్స్ మన సినిమాలను పెద్దగా చూడరు'' అని పేర్కొన్నారు సల్మాన్ ఖాన్.



ది ఇండియా హౌస్

'ఆర్ఆర్ఆర్' సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు హీరో రామ్‌చరణ్. ఓ వైపు కథానాయకుడిగా క్రేజీ ప్రాజెక్ట్స్ చేస్తున్న ఆయన మరోవైపు నిర్మాతగా కూడా కొనసాగుతున్నారు. ఇప్పటికే కొణిదెల ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించిన ఆయన 'ఖైదీ నంబర్ 150, సైరా నరసింహారెడ్డి, ఆచార్య, గాడ్‌ఫాదర్' లాంటి సినిమాలను నిర్మించారు. ఇక్కడ పేర్కొన్న సినిమాలన్నిటిలో చిరంజీవి హీరో ('ఆచార్య'లో రామ్‌చరణ్ కూడా నటించారు). కాగా రామ్ చరణ్ స్నేహితుడు విక్రమ్ రెడ్డి ఇటీవలే వి మెగా పిక్చర్స్ పేరుతో కొత్త బ్యానర్‌ని ప్రారంభించారు. అందులో తొలి సినిమాగా నిఖిల్ హీరోగా 'ది ఇండియా హౌస్' అనే పాన్ ఇండియా మూవీని నిర్మిస్తున్నారు మేకర్స్. ఈ సినిమాని రామ్‌చరణ్ సమర్పిస్తుండటం విశేషం. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్ బ్యానర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ ద్వారా రామ్ వంశీ కృష్ణ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ మూవీలో నిఖిల్‌కి జోడీగా సయీ మంజ్రేకర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. 1905లో లండన్‌లో స్వాతంత్ర్యం రాక ముందు ఏం జరిగింది? అనే కథాంశానికి ప్రేమ, విప్లవం అంశాలను జోడించి తెరకెక్కిస్తున్నారట దర్శకుడు. రామ్‌చరణ్ తొలిసారి ఓ బయటి హీరో సినిమాకి నిర్మాతగా వ్యవహరిస్తుండటంతో 'ది ఇండియా హౌస్'పై క్రేజ్ నెలకొంది. చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుందని టాక్.



పాన్ ఇండియా కన్నప్ప

విష్ణు మంచు అటు హీరో ఇటు నిర్మాతగా బిజీగా ఉన్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై 'కరెంట్ తీగ, సింగం 123, మామ మంచు అల్లుడు కంచు, సన్నాఫ్ ఇండియా' వంటి సినిమాలు నిర్మించారు విష్ణు. అదే విధంగా అవా ఎంటర్‌టైన్మెంట్స్ అనే మరో బ్యానర్‌ని స్థాపించారాయన. తాజాగా ఆయన హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ వంటి వారు ఇతర కీలక పాత్రలు పోషించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందింది. మహా శివభక్తుడు కన్నప్ప జీవిత కథ ఆధారంగా రూపొందిన 'కన్నప్ప' చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

నిర్మాతలుగా హీరోలు



● రామ్ చరణ్
● విష్ణు
● నాని
● కల్యాణ్ రామ్
● రానా
● రూపేష్

తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోలు నిర్మాతలుగా మారడం కొత్తేమీ కాదు. నిర్మాతలైన తండ్రుల వారసత్వాన్ని కొనసాగించాలని కొందరు... తమ అభిరుచికి తగ్గ సినిమాలు నిర్మాంచాలని మరి కొందరు, కొత్త దర్శకులకు అవకాశాలు ఇవ్వాలని ఇంకొందరు.. ఇలా పలువురు కథానాయకులు నిర్మాతలుగా మారుతున్నారు. తమ సొంత బ్యానర్స్‌తో పాటు ఇతర నిర్మాణ సంస్థలతో కలిసి సినిమాలు నిర్మిస్తున్నారు. కొందరు తమ సొంత సినిమాలని నిర్మిస్తుండగా మరికొందరు తమ కుటుంబ సభ్యులతో తీస్తున్నారు. ఇంకొందరు బయటి నటులతో ప్రాజెక్ట్స్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్, నాని, విష్ణు మంచు, కల్యాణ్ రామ్, రానా వంటి పలువురు హీరోలు నిర్మిస్తున్న సినిమాల గురించి ఓ లుక్కేద్దాం.




ఫుల్ స్వింగ్

నాని ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. హీరోగా వరుస సినిమాలతో జోరు మీదున్న ఆయన నిర్మాతగానూ జోరు చూపిస్తున్నారు. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌ని నెలకొల్పిన ఆయన ప్రతిభావంతులైన కొత్తవారికి అవకాశాలు ఇస్తూ, ప్రోత్సహిస్తున్నారు. వాల్ పోస్టర్ సినిమాపై ఇప్పటికే 'డి ఫర్ దోపిడీ, అ!, హిట్, హిట్ 2' వంటి సినిమాలు నిర్మించి.. అభిరుచి గల నిర్మాతగానూ విజయాలు అందుకున్నారు నాని. తాజాగా ఆయన నిర్మించిన మరో చిత్రం 'కోర్ట్'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రోషన్, శ్రీదేవి ఇతర పాత్రల్లో నటించారు. ఈ సినిమా ద్వారా రామ్ జగదీష్ దర్శకునిగా పరిచయమయ్యారు. ఈ నెల 14న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఇక తాజాగా ఆయన హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న మూవీ 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శ్రీనిధీ శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ మూవీలో అర్జున్ సర్కార్‌గా పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించనున్నారు నాని. 'హిట్' సిరీస్‌లో మూడవ భాగంగా ఈ చిత్రం రానుంది. ఈ సినిమా వేసవి కానుకగా మే 1న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... తెలుగు స్టార్ హీరోల్లో ఒకరైన చిరంజీవి హీరోగానూ ఓ సినిమా నిర్మించనున్నారు నాని. తనకు 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ ఇచ్చిన డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో 'ది ప్యారడైజ్' అనే మరో చిత్రం చేస్తున్నారాయన. ఈ సినిమా తర్వాత శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరంజీవి హీరోగా సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్నే నాని నిర్మించనున్నారు.

బిజీ బిజీగా...

వైవిధ్యమైన పాత్రలు, కథలతో హీరోగా ప్రేక్షకులను అలరిస్తున్నారు కల్యాణ్ రామ్. మరోవైపు ఆయన నిర్మాతగానూ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తన తాత, దివంగత నటుడు నందమూరి తారక రామారావు పేరున ప్రారంభించిన ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై సినిమాలు నిర్మిస్తున్నారు కల్యాణ్ రామ్. 2005లో విడుదలైన 'అతనొక్కడే' సినిమాతో నిర్మాతగా మారారాయన. ఆ చిత్రంలో హీరో కూడా ఆయనే. ఆ తర్వాత తాను హీరోగా ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై 'హరే రామ్, జయీభవ, కల్యాణ్ రామ్ కత్తి, ఓం, పటాస్, ఇజం, బింబిసార' వంటి సినిమాలు నిర్మించారు కల్యాణ్ రామ్. అలాగే రవితేజ హీరోగా 'కిక్ 2' (2015) మూవీ తీశారాయన. అదే విధంగా తన తమ్ముడు ఎన్టీఆర్‌తో 'జై లవకుశ', 'దేవర పార్ట్ 1' వంటి చిత్రాలు నిర్మించిన ఆయన ముచ్చటగా మూడో సినిమా 'ఎన్టీఆర్ నీల్' రూపొందిస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి వరుస విజయాల తర్వాత హీరో ఎన్టీఆర్, 'కేజీఎఫ్, సలార్' చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్) అనే పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోంది. ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రీ మూవీ మేకర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 జనవరి 9న ఈ సినిమా విడుదలకానుంది. ఇదిలా ఉంటే... 'బింబిసార' ప్రీక్వెల్‌తో పాటు 'దేవర పార్ట్ 2' సినిమాలు కూడా ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై కల్యాణ్ రామ్ నిర్మించనున్నారు. కాగా ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, అశోక క్రియేషన్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ మూవీ త్వరలో విడుదల కానుంది. ఇలా ఒకవైపు హీరోగా సినిమాలు చేస్తూ, నిర్మాతగా సినిమాలు నిర్మిస్తూ బిజీ బిజీగా ఉన్నారు కల్యాణ్ రామ్.



● ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్



● శ్రుతీహాసన్
● కమల్‌హాసన్

నాన్న నుంచి స్ఫూర్తి పొందాను

- శ్రుతీహాసన్

''ఫిట్‌నెస్ అంటే కేవలం మన శరీరాన్ని చక్కని ఆకృతిలో ఉంచుకోవడం కోసం మాత్రమే చేసేది కాదు. వ్యాయామంతో మన జీవన విధానం కూడా ముడిపడి ఉంటుంది'' అంటున్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఈ విషయం గురించి శ్రుతీహాసన్ ఇంకా మాట్లాడుతూ– ''మా నాన్న (నటుడు, దర్శక–నిర్మాత కమల్‌హాసన్) సినిమాలను చూస్తూ పెరిగాను నేను. ఆయన ఫిట్‌నెస్ కోసం ఎంతో శ్రమిస్తారు. ఓ సినిమా కోసం ట్రాన్స్‌ఫార్మ్ అయ్యేందుకు ఎంతో కష్టపడతారు. ఆయన్ను చూసి స్ఫూర్తి పొందాను'' అని పేర్కొన్నారు. ఇంకా చెబుతూ– ''ఫిట్‌నెస్ అనేది మన శరీరాకృతి కోసం మాత్రమే కాదు.. వ్యాయామం చేస్తూ, ఫిట్‌గా ఉండటం వల్ల మన హార్మోన్స్ కూడా బ్యాలెన్స్ అవుతాయి. చెప్పాలంటే... నేను ఆహారం తినడాన్ని ఆస్వాదిస్తాను. సాంబార్ సాదమ్ నా కంఫర్ట్ మీల్. వారంలో రెండుసార్లైనా రైస్ తింటాను. ఇలా ఫుడ్‌ను, వర్కౌట్స్‌ను బ్యాలెన్స్ చేయడం వల్ల నేను కంఫర్ట్ ఫీలవుతున్నాను'' అని పేర్కొన్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే... రజనీకాంత్ 'కూలీ', విజయ్ సేతుపతి 'ట్రైన్' సినిమాల్లో నటించారు శ్రుతీహాసన్. ఈ రెండు సినిమాలు విడుదలకు రెడీ అవుతున్నాయి. అలాగే శ్రుతి నటించిన అంతర్జాతీయ ఇంగ్లిష్ మూవీ 'ది ఐ' విడుదలకు సిద్ధంగా ఉంది. ఇంకా ప్రభాస్ 'సలార్' సినిమాలో హీరోయిన్‌గా శ్రుతీహాసన్ నటించారు. దీంతో 'సలార్ 2' సినిమాలోనూ ఆమె కంటిన్యూ అవుతారని ఊహించవచ్చు.

జోరుగా హుషారుగా...

'లీడర్' (2010) సినిమాతో హీరోగా పరిచయమయ్యారు రానా దగ్గుబాటి. ఆ తర్వాత అటు హీరోగా ఇటు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, నెగటివ్ క్యారెక్టర్స్ చేస్తూ వెర్సటైల్ యాక్టర్‌గా పేరు తెచ్చుకున్నారాయన. అలాగే పలు బుల్లితెర షోలకు, పలు ప్రతిష్ఠాత్మక అవార్డుల వేడుకలకి హోస్ట్‌గానూ తనదైన ముద్ర వేశారు రానా. అంతేకాదు... స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ అనే బ్యానర్‌ని నెలకొల్పిన ఆయన నిర్మాతగానూ జోరుగా హుషారుగా సినిమాలు చేస్తున్నారు. అంతేకాదు... కథ, కంటెంట్ నచ్చిన చిన్న సినిమాలకు సమర్పకుడిగానూ వ్యవహరిస్తూ సపోర్ట్‌గా నిలుస్తున్నారు రానా. 2004లో వచ్చిన బాలల చిత్రం 'బొమ్మలాట'కి రానా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా జాతీయ అవార్డులు అందుకుంది. రానా, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'విరాట పర్వం' (2022) సినిమాకి రానా ఓ నిర్మాత. 'కేరాఫ్ కంచరపాలెం, కృష్ణ అండ్ హిజ్ లీల, 777 చార్లీ, గార్గీ, పరేశాన్, కీడా కోలా, 35 చిన్న కథ కాదు, జిగ్రా' వంటి పలు సినిమాలకు సమర్పకుడిగా వ్యవహరించారు రానా. ప్రస్తుతం ఆయన సమర్పణలో మూడు సినిమాలు రూపొందుతున్నాయి. వాటిలో దుల్కర్ సల్మాన్ 'కాంత', ప్రియదర్శి 'ప్రేమంటే?', విశ్వదేవ్ రాచకొండ 'డార్క్ చాక్లెట్' వంటి సినిమాలు రానా సమర్పణలో తెరకెక్కుతున్నాయి.





షష్టిపూర్తితో నిర్మాతగా...

రూపేష్ హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్‌పై రూపొందుతోన్న ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, ఆకాంక్షా సింగ్ హీరోయిన్. షష్టిపూర్తి నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ మూవీకి ఇళయరాజా సంగీతం అందించడం ఓ విశేషం అయితే.. సంగీత దర్శకుడు, ఆస్కార్ పురస్కార గ్రహీత ఎంఎం కీరవాణి ఈ చిత్రం కోసం 'ఏదో ఏ జన్మలోదో...' అంటూ సాగే పాటని రాయడం విశేషం. ఈ పాటని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఇటీవల విడుదల చేశారు మేకర్స్. మరి 'షష్టిపూర్తి' సినిమాతో రూపేష్ అటు హీరోగా, ఇటు నిర్మాతగా ఏ స్థాయి విజయం సాధిస్తారో వేచి చూడాలి.

- దేరంగుల జగన్ మోహన్

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో గోద్రెజ్ ప్రాపర్టీస్ రూ. 1,000 కోట్ల విక్రయాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇటీవల హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో ప్రారంభించిన తమ తొలి ప్రాజెక్టు 'గోద్రెజ్ మాడిసన్ ఎవెన్యూ'లో రూ. 1,000 కోట్ల విలువ చేసే 300 గృహాలను విక్రయించినట్లు గోద్రెజ్ ప్రాపర్టీస్ వెల్లడించింది. జనవరిలో ప్రాజెక్టును ప్రారంభించిన కొద్ది వారాల వ్యవధిలోనే ఈ కీలక మైలురాయిని దాటినట్లు తెలిపింది. ఇదే స్ఫూర్తితో త్వరలోనే రెండో ప్రాజెక్టును ఇక్కడ మొదలుపెట్టనున్నట్లు సంస్థ ఎండీ గౌరవ్ పాండే తెలిపారు. దక్షిణాదిలో తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని ఆయన చెప్పారు.

న్యూట్రోజెనాకు ప్రచారకర్తగా శ్రద్ధా కపూర్



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ ఉత్పత్తుల సంస్థ కెన్‌వ్యూ తమ స్కిన్‌కేర్ బ్రాండ్ న్యూట్రోజెనా కింద కొత్తగా హైడ్రో బూస్ట్ సన్‌స్క్రీన్ ఎస్‌పీఎఫ్ 50 ఉత్పత్తిని ఆవిష్కరించింది. శక్తివంతమైన ఫలితాలను అందించేందుకు అధునాతన ఫార్ములేషన్స్‌తో దీన్ని రూపొందించినట్లు కెన్‌వ్యూ మార్కెటింగ్ వీపీ మనోజ్ గాడ్గిల్ తెలిపారు. తమ కొత్త ప్రచారకర్తగా బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్‌ని నియమించుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ సందర్భంగా బ్యూటీ విత్ నో కాంప్రమైజ్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది.

'అక్షయ పాత్ర'కు తొమ్మిది ఫుడ్‌డెలివరీ వాహనాలు



హైదరాబాద్: వాఘ్‌బక్రీ టీ గ్రూప్ ఫౌండేషన్ ప్రత్యేకంగా తయారు చేయించిన తొమ్మిది ఫుడ్ డెలివరీ వాహనాలను అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు విరాళంగా అందజేసింది. వీటి ద్వారా హైదరాబాద్, నెల్లూరు ప్రాంతాల్లో 205కి పైగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లోని 10,500 మంది విద్యార్థులకు భోజనాన్ని అందించనున్నారు. వీటి ప్రారంభోత్సవంలో యాంకర్ సుమ, వాఘ్‌బక్రీ టీ గ్రూప్ సీఈవో సంజయ్ సింఘాల్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యోగేష్ షిండే, అక్షయ పాత్ర ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ యగ్నేశ్వరదాస్‌లు పాల్గొన్నారు. నాణ్యమైన టీని మాత్రమే కాకుండా సమాజహితం కోరే వాఘ్ బక్రీ గ్రూప్‌నకు ప్రచారకర్తగా వ్యవహరిస్తుండడం సంతోషంగా ఉందన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-3-2025

విశాఖ	420-00
చిత్తూరు	480-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	3,760.00	3.13
BAJAJFINSV	1,999.00	2.86
INDUSINDBK	673.5	2.78
NTPC	364	2.64
BPCL	279	2.19

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	669.5	-5.47
SUNPHARMA	1,734.35	-1.4
EICHERMOT	5,347.00	-1.04
APOLLOHOSP	6,470.00	-0.76
BHARTIARTL	1,726.00	-0.72

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,609
ఎన్ఎస్ఈ	1,49,837
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,48,943
ఎఫ్ఐఐ	+ 11,111
డీఐఐ	+ 2,518

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.82	$ 69.95
బ్రెంట్	73.22	$ 73.06

హైదరాబాద్‌లో ఆఫీస్ లీజింగ్ డౌన్..

జనవరి-మార్చి మధ్య 41 శాతం తగ్గుదల
- ఏడు నగరాల్లో ఆఫీస్ వసతులకు డిమాండ్
- కొలియర్స్ ఇండియా నివేదిక విడుదల



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా టాప్-7 నగరాల్లో ఈ ఏడాది తొలి మూడు నెలల కాలంలో ఆఫీస్ వసతుల లీజింగ్ మెరుగైన వృద్ధిని చూడగా.. హైదరాబాద్, కోల్‌కతా పట్టణాల్లో క్షీణించింది. జనవరి-మార్చి త్రైమాసికంలో ఇప్పటి వరకు నమోదైన లావాదేవీల ఆధారంగా రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ 'కొలియర్స్ ఇండియా' ఒక నివేదికను విడుదల చేసింది. టాప్-7 నగరాల్లో స్థూలంగా 159 లక్షల చదరపు అడుగుల మేర (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ లీజింగ్ లావాదేవీలు జరిగాయి. క్రితం ఏడాది మొదటి మూడు నెలల కాలంలోని లీజింగ్ 138 లక్షల ఎస్ఎఫ్‌టీతో పోల్చి చూస్తే 15 శాతం వృద్ధి నమోదైంది. దేశ, విదేశీ కంపెనీల నుంచి బలమైన డిమాండ్ కనిపించింది.

పట్టణాల వారీగా లీజింగ్..

- హైదరాబాద్‌లో 17 లక్షల చదరపు అడుగుల లీజింగ్ లావాదేవీలు జరిగాయి. క్రితం ఏడాది మొదటి మూడు నెలల్లో లీజింగ్ 29 లక్షలతో పోల్చి చూస్తే 41 శాతం తగ్గినట్టు తెలుస్తోంది.
- కోల్‌కతాలోనూ క్రితం ఏడాది మొదటి త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 50 శాతం తక్కువగా లక్ష ఎస్ఎఫ్‌టీ లీజింగ్ లావాదేవీలే జరిగాయి.
- బెంగళూరులో స్థూల లీజింగ్ ఈ ఏడాది తొలి త్రైమాసికంలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 13 శాతం వృద్ధితో 45 లక్షల ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- చెన్నై మార్కెట్లో ఆఫీస్ లీజింగ్ ఏకంగా 93 శాతం పెరిగింది. 29 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాలను కంపెనీలు లీజుకు తీసుకున్నాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 32 శాతం అధికంగా 33 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజింగ్ నమోదైంది. క్రితం ఏడాది తొలి క్వార్టర్‌లో లీజింగ్ 25 లక్షల చదరపు అడుగులుగా ఉంది.
- పుణెలో 12 లక్షల చదరపు అడుగుల లీజింగ్ నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 8 లక్షల ఎస్ఎఫ్‌టీతో పోల్చితే 50 శాతం పెరగడం గమనార్హం.
- ఏడు నగరాల్లో మొత్తం 159 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజింగ్‌లో 137 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాలను కార్పొరేట్ కంపెనీలు తీసుకున్నాయి. ఇందులోనూ 75 శాతం మేర టెక్నాలజీ కంపెనీలు, బీఎఫ్ఎస్ఐ సంస్థలు, ఇంజనీరింగ్, తయారీ రంగ కంపెనీలు తీసుకున్నవే.
- మిగిలిన 22 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలాలను కోవర్కింగ్ ఆపరేటర్లు లీజుకు తీసుకున్నారు. వీరు తిరిగి చిన్న కంపెనీలకు సబ్ లీజింగ్‌కు ఇస్తుంటారు.

2025లో బలమైన డిమాండ్..

''కీలక మార్కెట్లో గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ లీజింగ్ బలంగా ఉంది. కార్పొరేట్ కంపెనీల విస్తరణతో పాటు దేశీయ వృద్ధి ఆశావహంగా ఉండడంతో వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెరుగుతున్నాయి''అని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పిత్ మెహరోత్రా తెలిపారు. ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ 2025 అంతటా కొనసాగుతుందని అంచనా వేశారు. టెక్నాలజీ, ఇంజనీరింగ్, తయారీ, బీఎఫ్ఎస్ఐ రంగాల్లో కంపెనీల విస్తరణ ప్రణాళికలు ఇందుకు మద్దతుగా నిలుస్తాయని అంచనా వేశారు.

ఇళ్ల మార్కెట్ డీలా

- హైదరాబాద్‌లో జనవరి-మార్చి మధ్య 49 శాతం తగ్గిన విక్రయాలు
- ఏడు నగరాల్లో 28 శాతం క్షీణించిన ఇళ్ల అమ్మకాలు
- పెరిగిపోయిన ధరలు, ప్రతికూల పరిణామాల ప్రభావం
- రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో ఈ ఏడాది తొలి మూడు నెల ల్లో ఇళ్ల అమ్మకాలు బలహీనతను ఎదుర్కొన్నాయి. క్రితం ఏడాది తొలి త్రైమాసికంతో పోల్చి చూస్తే 28 శాతం తక్కువగా 93,280 యూనిట్ల అమ్మకాలే నమోదవుతాయన్నది ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ అనరాక్ అంచనా వేసింది. క్రితం ఏడాది తొలి క్వార్టర్‌లో (క్యూ1)లో ఈ నగరాల్లో అమ్మకాలు 1,30,170 యూనిట్లుగా ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలి మూడు నెలల్లో ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 49 శాతం తగ్గి 10,100 యూనిట్లుగా ఉంటాయన్నది అంచనా. 2024 మొదటి క్వార్టర్‌లో 19,660 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం. ''ఇళ్ల ధరలు గణనీయంగా పెరిగిపోవడం, అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు భారత హౌసింగ్ మార్కెట్ బుల్ ర్యాలీని 2025 క్యూ1లో నిదానించేలా చేశాయి''అని అనరాక్ తన నివేదికలో పేర్కొంది.

పట్టణాల వారీగా విక్రయ అంచనాలు

- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో జనవరి-మార్చి మధ్య అమ్మకాలు 20 శాతం తక్కువగా 12,520 యూనిట్లకు పరిమితం కావొచ్చు. క్రితం ఏడాది తొలి క్వార్టర్‌లో ఇక్కడ 15,650 యూనిట్ల అమ్మకాలు జరిగాయి.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో విక్రయాలు 26 శాతం క్షీణించి 31,610 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- బెంగళూరులో అమ్మకాలు 16% తక్కువగా 15,000 యూనిట్లకు పరిమితం కావొచ్చు.
- పుణెలోనూ క్రితం ఏడాది క్యూ1తో పోల్చి చూస్తే 30 శాతం తగ్గి 16,100 యూనిట్లుగా ఉంటాయన్నది అంచనా.
- చెన్నైలో అమ్మకాలు 26 శాతం క్షీణించి 4,050 యూనిట్లుగా ఉంటాయి.
- కోల్‌కతా మార్కెట్లోనూ 31 శాతం తక్కువగా 3,900 యూనిట్ల అమ్మకాలు నమోదు కావొచ్చు. క్రితం ఏడాది తొలి క్వార్టర్‌లో అమ్మకాలు 5,650 యూనిట్లుగా ఉన్నాయి.

ప్రతికూల పరిస్థితుల వల్లే..

''దేశ ఆర్థిక పరిస్థితులు సానుకూలంగానే ఉన్నాయి. అంతర్జాతీయంగా చూస్తే దేశ జీడీపీ అత్యధిక వృద్ధి రేటును సాధించగా, ద్రవ్యోల్బణం కూడా నియంత్రణలోనే ఉంది. అదే సమయంలో ఇళ్ల ధరలు పెరిగిపోవడం, అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితులు దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్ లావాదేవీలపై ప్రభావం చూపించాయి. ఈ పరిణామాలన్నీ కలసి క్యూ1లో దేశ హౌసింగ్ మార్కెట్‌ను నిదానించేలా చేశాయి''అని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి తెలిపారు.

అనిశ్చితులున్నా ఎగుమతుల్లో వృద్ధి

విదేశీ వాణిజ్య అధికారి సంతోష్ కుమార్



న్యూఢిల్లీ: ప్రపంచ వాణిజ్యం, టారిఫ్‌లపై అనిశ్చితులున్నప్పటికీ రానున్న కాలంలో భారత్ నుంచి ఎగుమతులు వృద్ధి పథంలోనే సాగనున్నట్లు విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ సంతోష్ కుమార్ సారంగి పేర్కొన్నారు. అయితే ఇందుకు ఎగుమతిదారులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని వ్యూహాత్మకంగా విచక్షణతో వ్యవహరించవలసి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత వాతావరణం భారత్‌కు బంగారంలాంటి అవకాశాలను కల్పిస్తున్నదని తెలియజేశారు. తయారీలో పోటీతత్వాన్ని పెంచుకోవడంతోపాటు.. ఎగుమతులు పుంజుకునేందుకు వైవిధ్యాన్ని చూపవలసి ఉంటుందని దేశీ ఎగుమతి సంస్థల సమాఖ్య(ఎఫ్ఐఈవో) ఏర్పాటు చేసిన సోర్సెక్స్ ఇండియా 2025 షోలో సంతోష్ వివరించారు. చైనా తదితర దేశాలపై యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార టారిఫ్‌లకు తెరతీసిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 2 నుంచి వీటిని భారత్‌కు సైతం వర్తింపచేయనున్నారు. భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న అమెరికా టారిఫ్‌ల విధింపు నేపథ్యంలో కొన్ని ఎగుమతి సంస్థలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. యూఎస్‌కు ప్రధానంగా ఇంజినీరింగ్, ఫార్మా ఎగుమతులు దెబ్బతిన వచ్చని భావిస్తున్నాయి. ప్రస్తుత ఏడాదిలో భారత్ వస్తు, సేవల ఎగుమతులు 800 బిలియన్ డాలర్లను దాటనున్నట్లు సంతోష్ పేర్కొన్నారు. గతేడాది ఇవి 778 బిలియన్ డాలర్లుగా నమోదైనట్లు తెలియజేశారు. ఇటీవల కొద్ది నెలలుగా ఎగుమతుల్లో మందగమనం నెలకొన్నప్పటికీ దీర్ఘకాలంలో పుంజుకోగలవని అభిప్రాయపడ్డారు. ఆర్డర్లపై పెరుగుతున్న విచారణలు సానుకూల అంచనాలకు దారి చూపుతున్నట్లు తెలియజేశారు. వెరసి భవిష్యత్‌లో ఎగుమతులు వృద్ధి బాటలో సాగగలవని విశ్వసిస్తున్నట్లు చెప్పారు.

గత మూడేళ్లలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు రెట్టింపు

- నెలకు సగటున రూ. 25,432 స్టైఫండ్
- ఇండీడ్ నివేదిక



న్యూఢిల్లీ: పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల్లో యువ ప్రొఫెషనల్స్‌కు శిక్షణ కల్పించడంపై కంపెనీలు ప్రధానంగా దృష్టి పెడుతుండటంతో గత మూడేళ్లలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు రెట్టింపు అయినట్లు గ్లోబల్ జాబ్‌సైట్ ఇండీడ్ ఒక నివేదికలో వెల్లడించింది. తమ ప్లాట్‌ఫామ్‌లోని డేటా ప్రకారం 2022 ఫిబ్రవరి నుంచి 2025 ఫిబ్రవరి మధ్య కాలంలో దేశీయంగా ఇంటర్న్‌షిప్ పోస్టింగ్స్ 103 శాతం పెరిగినట్లు తెలిపింది. ఏఐ, డేటా అనలిటిక్స్, డిజిటలీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యక్షంగా ఉద్యోగ విధుల నిర్వహణపరమైన అనుభవాన్ని అందించడంతో పాటు ప్రతిభావంతులను గుర్తించి, వారికి ముందు నుంచే శిక్షణ కల్పించేందుకు కంపెనీలు ఇంటర్న్‌షిప్‌లను ఉపయోగించుకుంటున్నాయి. ఇంటర్న్‌షిప్ సెర్చ్‌లో ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉన్నాయి. మొత్తం సెర్చ్‌లలో వీటి వాటా వరుసగా 7.2 శాతం, 6.8 శాతం, 6.2 శాతంగా ఉంది. దేశీయంగా సగటున ఇంటర్న్‌షిప్ స్టైఫండ్ నెలకు రూ. 25,432గా ఉంది. అయితే, హైదరాబాద్, బెంగళూరు, ముంబై, పుణె, గుర్గావ్ వంటి నగరాల్లో సంస్థలు జాతీయ సగటును మించి స్టైఫండ్‌లు అందిస్తున్నాయి. ఈ విషయంలో చెన్నై, కోల్‌కతా తదితర నగరాలు చివరి వరుసలో ఉన్నాయి.

తగ్గుముఖం పట్టిన గృహ రుణాలు

- డిసెంబర్ త్రైమాసికంలో 9 శాతం డౌన్
- విలువ పరంగా చూస్తే 3 శాతం తక్కువ
- ట్రాన్స్‌యూనియన్ సిబిల్ నివేదిక
- వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల్లోనూ ఇదే తీరు



ముంబై: గృహ రుణాలు డిసెంబర్ త్రైమాసికంలో సంఖ్యా పరంగా చూస్తే 9 శాతం తగ్గాయి. విలువ పరంగా చూస్తే 3 శాతం క్షీణించినట్టు క్రెడిట్ బ్యూరో సంస్థ ట్రాన్స్ యూనియన్ సిబిల్ వెల్లడించింది. అధిక రిస్క్‌తో కూడిన వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల్లోనూ రుణాల సంఖ్య తగ్గినట్టు తన తాజా నివేదికలో పేర్కొంది. అన్ సెక్యూర్డ్ రుణాల విషయంలో దూకుడు తగ్గించి, నిదానంగా వెళ్లాలంటూ ఆర్‌బీఐ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను కొన్ని త్రైమాసికాలుగా సూచించడాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది. అదే సమయంలో సెక్యూర్డ్ రుణ విభాగం, ఆర్థిక వ్యవస్థలో ముఖ్య పాత్ర పోషిస్తూ, బ్యాంక్‌లకు కీలకంగా ఉన్న గృహరుణాల్లోనూ స్తబ్దత నెలకొనడాన్ని ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. గృహ రుణాల్లో బాకీలు (మొత్తంగా జారీ అయి, తిరిగి వసూలు కావాల్సిన మొత్తం) క్రితం ఏడాది ఇదే త్రైమాసికానికి 15 శాతంగా ఉంటే, అవి 2024 డిసెంబర్ త్రైమాసికం చివరికి 13 శాతానికి తగ్గినట్టు తెలిపింది. రుణ వితరణ పరంగా 2024 అక్టోబర్-డిసెంబర్ కాలం రెండేళ్లలోనే అతి తక్కువ డిమాండ్‌ను చూసినట్టు పేర్కొంది. మెట్రోల్లో రుణ విచారణలు తగ్గాయి. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పెరిగాయి. మొదటిసారి రుణ గ్రహీతలు, ప్రధాన కస్టమర్ల (ఎన్‌టీసీ)కు రుణ వితరణ 2023 డిసెంబర్ త్రైమాసికంలో 21 శాతంగా ఉంటే, 2024 డిసెంబర్ చివరికి 17 శాతానికి తగ్గింది. ఎన్‌టీసీ రుణ గ్రహీతల్లో 41 శాతం మంది జెనరేషన్ జెడ్ వారు (1995 తర్వాత జన్మించిన వారు) కావడం గమనార్హం. క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రుణాలను వీరు ఎక్కువగా తీసుకున్నారు.

అరో ఇన్‌ఫ్రాకు కేంద్ర ప్రభుత్వ అవార్డు



హైదరాబాద్: అరో ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి త్వరితగతిన కార్యకలాపాలు ప్రారంభించిన (ఎర్లీ ఆపరేషనలైజేషన్) విభాగంలో అవార్డు దక్కించుకుంది. బొగ్గు మైనింగ్ నిర్వహణలో వేగవంతమైన కార్యచరణకు ఈ అవార్డు నిదర్శమని కంపెనీ తెలిపింది. బొగ్గు గనుల్లో ఉత్పత్తి కార్యకలాపాలు వేగంగా ప్రారంభమయ్యేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం 'ప్రాజెక్ట్ మానటరింగ్ యూనిట్' (పీఎంయూ) ప్రారంభించింది. మైనింగ్‌కు కావాల్సిన అన్ని అనుమతులు త్వరగా లభించేలా చూడటం పీఎంయూ బాధ్యత. బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలో సామర్థ్యాన్ని పెంచడం, వ్యాపార నిర్వహణ సులభతరం చేయడం ప్రభుత్వ చర్యల ఉద్దేశాలుగా ఉన్నాయి. ఆరో ఇన్‌ఫ్రాకు లభించిన అవార్డు ఈ రంగంలో మిగిలిన కంపెనీలకు ఆదర్శంగా నిలవనుంది.

ఐటీ కార్యాలయాలు 29-31 తేదీల్లో తెరిచే ఉంటాయ్

- ప్రకటించిన సీబీడీటీ




న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆదాయపన్ను శాఖ కార్యాలయాలు మార్చి 29 నుంచి 31వ తేదీ వరకు (సెలవు రోజుల్లోనూ) తెరిచే ఉంటాయని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం ముగింపు రోజుల్లో ఆదాయపన్నుకు సంబంధించి పెండింగ్ పనులను పూర్తి చేసుకునేందుకు వీలుగా కార్యాలయాలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. 30న ఉగాది, ఆదివారం కాగా, 31న రంజాన్ కారణంగా సెలవు కావడం తెలిసిందే. ఆదాయపన్ను శాఖకు సంబంధించి మిగిలిపోయిన పనులను పూర్తి చేసుకునేందుకు కార్యాలయాలను తెరిచి ఉంచుతున్నట్టు సీబీడీటీ తెలిపింది. ఆర్థిక సంవత్సరం చివరి రోజు అయిన మార్చి 31న ప్రభుత్వ చెల్లింపులను పూర్తి చేయాల్సి ఉంటుంది. 2023-24 అసెస్‌మెంట్ సంవత్సరం అప్‌డేటెడ్ ఐటీఆర్‌లు దాఖలు చేసే గడువు కూడా మార్చి 31తో ముగియనుంది. ప్రభుత్వ లావాదేవీలు నిర్వహించే అన్ని బ్యాంక్‌లు మార్చి 31న కార్యకలాపాలు నిర్వహించాలంటూ ఆర్‌బీఐ సైతం ఆదేశించడం గమనార్హం.

రూ. 8 లక్షల కోట్ల సమీకరణలో కేంద్రం

- ప్రథమార్థంలో బాండ్ల జారీ



న్యూఢిల్లీ: కొత్త ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో (ఏప్రిల్-సెప్టెంబర్) బాండ్ల జారీ ద్వారా రూ. 8 లక్షల కోట్లు సమీకరించనున్న ట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ద్రవ్య లోటు భర్తీ కోసం 2025-26లో స్థూలంగా రూ.14.82 లక్షల కోట్లు సమీకరించనుండగా, ఇందులో సుమారు 54 శాతాన్ని ప్రథమార్థంలో సమకూర్చుకోనున్నట్లు పే ర్కొంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసమైన ద్రవ్య లోటు, వచ్చే ఆర్థిక సంవత్సరపు స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) 4.4 శాతంగా ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది 4.8 శాతంగా ఉండనుంది. గణాంకాలపరంగా చూస్తే 2025-26లో ద్రవ్య లోటు రూ. 15,68,936 కోట్లుగా ఉండవచ్చని అంచనా. దీన్ని భర్తీ చేసుకునేందుకు బాండ్ల జారీ ద్వారా మార్కెట్ నుంచి కేంద్రం నికరంగా రూ. 11.54 లక్షల కోట్లు సమీకరించనుంది



ఉద్యోగం-జీవితం

సమతుల్యంపై అసంతృప్తి

- మెజారిటీ ఉద్యోగుల మనోగతం
- కొద్ది మందిలోనే సంతృప్త స్థాయి
- పనికి తగ్గ చెల్లింపుల్లేవన్న అసంతృప్తి
- జీనియస్ కన్సల్టెంట్స్ నివేదిక వెల్లడి

ముంబై: ఉద్యోగులు పనిని, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకునే విషయంలో సంతృప్తిగా లేనట్టు మానవ వనరుల పరిష్కారాలు అందించే జీనియస్‌కన్సల్టెంట్స్ నిర్వహించిన సర్వేలో తేలింది. పని వేళలు సౌకర్యంగా లేకపోవడంతో రెండింటిని సమతుల్యం చేసుకోలేకపోతున్నామని 52 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంతృప్తిని వ్యక్తం చేసిన ఉద్యోగులు 36 శాతమే ఉన్నారు. అంటే ప్రతి ముగ్గురిలో ఒక్కరే ఉద్యోగం-వ్యక్తిగత బాధ్యతల నిర్వహణ పట్ల సంతోషంగా ఉన్నట్టు తెలుస్తోంది. వివిధ రంగాల్లో పనిచేస్తున్న 2,763 మంది ఉద్యోగుల అభిప్రాయాలను తెలుసుకుని జీనియస్ కన్సల్టెంట్స్ ఈ నివేదికను విడుదల చేసింది.

ఉద్యోగుల మనోగతం..

- వ్యక్తిగత బాధ్యతల నిర్వహణకు వీలుగా సౌకర్యవంతమైన పనివేళలు/రిమోట్ వర్కింగ్‌కు (ఉన్నచోట నుంచే పనిచేయడం) యాజమాన్యాలు అనుమతించడం లేదని 40 శాతం మంది ఉద్యోగులు తెలిపారు.
- వ్యక్తిగత జీవితంపై ఉద్యోగ బాధ్యతల తాలూకు ఒత్తిడి ప్రతికూల ప్రభావం చూపిస్తున్నట్టు 79 శాతం మంది చెప్పారు. మెరుగైన విధానాలు, వ్యవస్థల ఏర్పాటు ద్వారా యాజమాన్యాలు పని ప్రదేశాల్లో ఒత్తిడిని పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోంది.
- ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో యాజమాన్యాలు తగినంత వెసులుబాటు ఇస్తున్నట్టు 50 శాతం మంది ఉద్యోగులు చెప్పగా.. 10 శాతం మంది ఏదీ చెప్పలేకున్నారు.
- కెరీర్‌లో పురోగతికి వీలుగా తాము పనిచేసే చోట తగిన అవకాశాల్లేవని 47 శాతం ఉద్యోగులు వెల్లడించారు.
- తమ మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకు కంపెనీలు ప్రాధాన్యం ఇస్తే మరింత సంతోషిస్తామని 89 శాతం ఉద్యోగులు చెప్పారు.
- ఉద్యోగం కోసం తాము వెచ్చిస్తున్న సమయం, కృషికి తగ్గ వేతనాలను కంపెనీలు చెల్లించడం లేదని 68 శాతం మంది భావిస్తున్నారు. ఇది పనిలో అసంతృప్తికి దారితీస్తుందని ఈ నివేదిక పేర్కొంది.

కంపెనీలు సమీక్షించుకోవాల్సిందే..

''ఉద్యోగులకు సౌకర్యవంతమైన పనివేళలు, కెరీర్‌లో పురోగతి, మానసిక ఆరోగ్యపరమైన మద్దతు విషయంలో కంపెనీలు తమ విధానాలను సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని ఈ సర్వే ఫలితాలు సూచిస్తున్నాయి. పని-ఉద్యోగుల వ్యక్తిగత జీవితానికి కంపెనీలు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఉద్యోగుల శ్రేయస్సుకే కాకుండా, దీర్ఘకాలంలో కంపెనీ వ్యాపార విజయానికి తోడ్పడుతుంది''అని జీనియస్ కన్సల్టెంట్స్ చైర్మన్, ఎండీ ఆర్‌పీ యాదవ్ తెలిపారు.

పోరాడి ఓడిన యూకీ జోడీ



ఫ్లోరిడా: కెరీర్‌లో ఆడిన రెండో ఏటీపీ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలోనూ భారత అగ్రశ్రేణి ఆటగాడు యూకీ బాంబ్రీ ఆకట్టుకున్నాడు. రెండు వారాల క్రితం ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన యూకీ... అదే

భారత డబుల్స్ నంబర్‌వన్‌గా ఖరారు

జోరును కొనసాగిస్తూ మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్ వరకు వచ్చాడు. అయితే క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అతను అధిగమించలేకపోయాడు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ విభాగం క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్)–నూనో బోర్జెస్ (పోర్చుగల్) ద్వయం 6–7 (1/7), 6–3, 8–10తో 'సూపర్ టైబ్రేక్'లో ఆరో సీడ్ లాయిడ్ గ్లాస్‌పూల్–జూలియన్ క్యాష్ (బ్రిటన్) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 90 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ–బోర్జెస్ నాలుగు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోకుండా రెండో సెట్‌లో ప్రత్యర్థి జంట సర్వీస్‌ను ఒక్కసారి బ్రేక్ చేశారు. మరోవైపు గ్లాస్‌పూల్–జూలియన్ క్యాష్ తొమ్మిది ఏస్‌లు సంధించడంతో పాటు నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో కీలకదశలో పాయింట్లు నెగ్గి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన యూకీ–బోర్జెస్ జోడీకి 65,000 డాలర్ల (రూ. 55 లక్షల 73 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 180 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ప్రదర్శనతో 33 ఏళ్ల యూకీ బాంబ్రీ వచ్చే సోమవారం విడుదల చేసే అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ 26వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు. అంతేకాకుండా 2019 నుంచి భారత నంబర్‌వన్‌గా కొనసాగుతున్న రోహన్ బోపన్నను దాటేసి యూకీ అధికారికంగా భారత డబుల్స్ కొత్త నంబర్‌వన్‌గా అవతరించనున్నాడు.

గ్రూప్ 'బి'లో భారత్‌కు చోటు



న్యూఢిల్లీ: ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ 'డ్రా' విడుదలైంది. భారత జట్టుకు గ్రూప్ 'బి'లో చోటు లభించింది. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో గురువారం 'డ్రా' కార్యక్రమం జరిగింది. ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో గ్రూప్ 'బి' మ్యాచ్‌లకు జూన్ 23 నుంచి జూలై 5 వరకు థాయ్‌లాండ్ ఆతిథ్యమిస్తుంది. భారత్‌తోపాటు థాయ్‌లాండ్, మంగోలియా, తిమోర్‌లెస్తె, ఇరాక్ జట్లు గ్రూప్ 'బి'లో ఉన్నాయి. గ్రూప్ విజేత వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే ఆసియా కప్ ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తుంది. మొత్తం 34 జట్లను ఎనిమిది గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'... గ్రూప్ 'బి'లలో ఐదు జట్ల చొప్పున ఉన్నాయి. మిగతా ఆరు గ్రూపుల్లో నాలుగు జట్ల చొప్పున ఉన్నాయి. మొత్తం ఎనిమిది గ్రూప్‌ల విజేత జట్లు ఆసియా కప్ ప్రధాన టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఆతిథ్య ఆస్ట్రేలియాతోపాటు 2022 ఆసియాకప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన చైనా, కొరియా, జపాన్ జట్లు ఇప్పటికే ఆసియా కప్–2026 టోర్నీకి నేరుగా అర్హత పొందాయి.

రిత్విక్ జోడీకి నిరాశ



సాక్షి, హైదరాబాద్: మొరెల్లా ఓపెన్ ఏటీపీ–125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ... తమిళనాడు ఆటగాడు శ్రీరామ్ బాలాజీ వేర్వేరు భాగస్వాములతో బరిలోకి దిగి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ రిత్విక్ (భారత్)–బరియెంతోస్ (కొలంబియా) ద్వయం 4–6, 3–6తో హ్యుస్లెర్ (స్విట్జర్లాండ్)–నపోలిటానో (ఇటలీ) జంట చేతిలో... టాప్ సీడ్ శ్రీరామ్ బాలాజీ (భారత్)–రేయస్ వరేలా (మెక్సికో) జోడీ 3–6, 4–6తో ఫికోవిచ్ (అర్జెంటీనా)–పచెకో (మెక్సికో) జంట చేతిలో ఓడిపోయాయి.



ఫిలిప్పీన్స్ టీనేజ్ టెన్నిస్ స్టార్ సంచలన ప్రదర్శన

- మయామి ఓపెన్‌లో సెమీఫైనల్లోకి
- క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ స్వియాటెక్‌పై విజయం
- 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగి 'వైల్డ్ ఫైర్'
- రెండో రౌండ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ మాజీ చాంపియన్ ఒస్టాపెంకోపై... మూడో రౌండ్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత మాడిసన్ కీస్‌పై గెలుపు

వారెవ్వా ఇయాలా

క్రీడాభిమానులకు ఫిలిప్పీన్స్ దేశం గుర్తుకు రాగానే ముందుగా వారి మదిలో మెదిలేది దిగ్గజ బాక్సర్ మ్యానీ పకియావ్ పేరు. రానున్న రోజుల్లో ఈ స్టార్ బాక్సర్ సరసన అభిమానులు మరో పేరు కూడా ప్రస్తావిస్తారంటే అతిశయోక్తి కాదు. ఖరీదైన టెన్నిస్ క్రీడలో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఒక్కసారిగా అందరి దృష్టిలో పడిన ఆ యువతార ఎవరో కాదు 19 ఏళ్ల అలెగ్జాండ్రా ఇయాలా... స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఈ ఫిలిప్పీన్స్ టీనేజర్ ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న మయామి ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 టోర్నీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగిన ఇయాలా సెమీఫైనల్ చేరుకునే క్రమంలో ముగ్గురు గ్రాండ్‌స్లామ్ చాంపియన్స్‌ను ఓడించడం విశేషం. జెస్సికా పెగూలాతో జరిగే సెమీఫైనల్లో ఇయాలా విజయం సాధిస్తే... నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన మయామి ఓపెన్‌లో 'వైల్డ్ కార్డు'తో అడుగు పెట్టి ఫైనల్ చేరిన తొలి క్రీడాకారిణిగా గుర్తింపు పొందుతుంది.



స్వియాటెక్

ఫ్లోరిడా: అనామకురాలిగా బరిలోకి దిగి రౌండ్ రౌండ్‌కూ సంచలన విజయాలు సాధిస్తున్న ఫిలిప్పీన్స్ టీనేజర్ అలెగ్జాండ్రా ఇయాలా...మయామి ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 ప్రీమియర్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 140వ ర్యాంకర్ ఇయాలా 6–2, 7–5తో ప్రపంచ రెండో ర్యాంకర్, ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన పోలాండ్ స్టార్ ప్లేయర్ ఇగా స్వియాటెక్‌ను బోల్తా కొట్టించింది. 1 గంట 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇయాలా ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిది సార్లు బ్రేక్ చేసి, తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయింది. 19 ఏళ్ల ఇయాలా గత ఏడేళ్లగా స్పెయిన్‌లోని రాఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది. ఈ టోర్నీలో 'వైల్డ్ కార్డు'తో అడుగు పెట్టిన ఇయాలా రెండో రౌండ్‌లో 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ జెలెనా ఒస్టాపెంకో (లాత్వియా)పై 7–6 (7/2), 7–5తో గెలుపొందగా... మూడో రౌండ్‌లో 6–4, 6–2తో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ఐదో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా)ను కంగుతినిపించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఇయాలాకు పదో సీడ్ పౌలా బదోసా (స్పెయిన్) నుంచి 'వాకోవర్' లభించింది. 'నమ్మశక్యంగా లేదు. నా సంతోషాన్ని మాటల్లో వర్ణించలేను. నా జీవితంలోనే ఇది గొప్ప విజయం' అని ఇయాలా వ్యాఖ్యానించింది. సెమీఫైనల్లో ఐదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా)తో ఆడనున్న ఇయాలా విజయం సాధిస్తే... మయామి ఓపెన్‌లో 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగి ఫైనల్ చేరుకున్న తొలి క్రీడాకారిణిగా గుర్తింపు పొందుతుంది. రెండో సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్)తో పావోలిని (ఇటలీ) తలపడుతుంది.

17 ఏళ్ల నిరీక్షణకు తెరదించేనా?

2008 తర్వాత చెన్నైలో మ్యాచ్ నెగ్గని రాయల్ చాలెంజర్స్ బెంగళూరు



శివమ్ దూబే

కోహ్లి

- నేడు చెన్నై సూపర్ కింగ్స్‌తో అమీతుమీ
- అటు ధోని, ఇటు కోహ్లిపై అందరి కళ్లు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

చెన్నై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో ఆసక్తికరమైన పోరుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం చెపాక్ స్టేడియం వేదికగా ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆడుతుంది. ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌ల్లో చెన్నై జట్టుదే స్పష్టమైన ఆధిక్యం కాగా... చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌పై బెంగళూరు జట్టు ఒకే ఒక్కసారి విజయం సాధించింది. అది కూడా 17 ఏళ్ల క్రితం. లీగ్ ఆరంభ సీజన్ (2008)లో చెన్నైలో బెంగళూరు జట్టు గెలుపొందింది. ఆ తర్వాత ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడినా అన్నింట్లో ఆర్‌సీబీకి పరాజయమే ఎదురైంది. ఓవరాల్‌గా ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు 33 మ్యాచ్‌లు జరగ్గా... అందులో చెన్నై 22 మ్యాచ్‌ల్లో గెలవగా... బెంగళూరు 11 మ్యాచ్‌ల్లో నెగ్గింది. చెన్నైకి ధోని అనుభవం... బెంగళూరుకు విరాట్ కోహ్లి దూకుడే ప్రధాన బలాలు. వీరిద్దరూ సారథులు కాకపోయినా... జట్టు జయాపజయాలు నిర్ణయించేది మాత్రం ఈ ఇద్దరు పాతకాపులే! చెన్నై పిచ్ స్పిన్‌కు అనుకూలించనున్న నేపథ్యంలో అశ్విన్, రవీంద్ర జడేజా, నూర్ అహ్మద్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంపైనే ఆర్‌సీబీ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

స్పిన్నే బలంగా...

బంతి నెమ్మదిగా వచ్చే చెన్నై పిచ్‌పై... స్పిన్నర్లు దట్టంగా ఉన్న సూపర్ కింగ్స్‌ను ఎదుర్కోవడం కష్టమైన పనే. ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లరకు తోడు రచిన్ రవీంద్ర కూడా ఉపయుక్తమైన ఆల్‌రౌండరే కావడం చెన్నైకి మరింత బలాన్నిస్తోంది. ఇక బ్యాటింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, రచిన్ రవీంద్ర, రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా, శివమ్ దూబే, స్యామ్ కరన్, జడేజా కీలకం కానున్నారు. గత మ్యాచ్ చివర్లో క్రీజులోకి దిగిన ధోని... పరుగులేమి చేయకపోయినా 'తలా' మైదానంలో అడుగు పెడుతున్న సమయంలో స్టేడియం 'మోత' మోగిపోయింది. మరి మహీ బ్యాట్ నుంచి ఆ మెరుపులు చూసే అవకాశం ఈ మ్యాచ్‌లో అయినా అభిమానులకు దక్కుతుందేమో చూడాలి. ముంబైతో ఆడిన తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన సూపర్ కింగ్స్... దాన్నే కొనసాగించాలని చూస్తోంది. బౌలింగ్‌లో మరోసారి నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ కీలకం కానున్నారు.

విరాట్‌పైనే భారం

సీజన్ ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)పై గెలిచి బోణీ కొట్టిన బెంగళూరు దాన్ని కొనసాగించాలని చూస్తోంది. అయితే చెన్నైలో మెరుగైన రికార్డు లేకపోవడం ఆర్‌సీబీని ఇబ్బంది పెడుతోంది. లీగ్ ఆరంభం నుంచి ఒకే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక ప్లేయర్‌గా చరిత్రకెక్కిన విరాట్ కోహ్లిపైనే బెంగళూరు జట్టు ఎక్కువ ఆధారపడుతోంది. ఫిల్ సాల్ట్‌తో కలిసి అతడిచ్చే ఆరంభం జట్టుకు ప్రధానం కానుంది. పడిక్కల్, రజత్ పాటీదార్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్ కృనాల్ పాండ్యా రూపంలో మిడిలార్డర్‌లో మెరుగైన ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగల కోహ్లి ప్రదర్శనపైనే ఆర్‌సీబీ జట్టు ఆశలు పెట్టుకుంది. బౌలింగ్‌లో హాజల్‌వుడ్, యశ్ దయాళ్ కీలకం కానుండగా... గత మ్యాచ్‌లో తిప్పేసిన కృనాల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి.

తుది జట్లు (అంచనా)

చెన్నై సూపర్ కింగ్స్: రుతురాజ్ (కెప్టెన్), రచిన్, రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా, శివమ్ దూబే, సామ్ కరన్, జడేజా, ధోని, అశ్విన్, ఎలీస్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), కోహ్లి, సాల్ట్, పడిక్కల్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్/స్వప్నిల్ సింగ్, హాజల్‌వుడ్, యశ్ దయాళ్, సుయశ్ శర్మ.

జైస్మీన్, పూజా రాణి

పసిడి పంచ్



జైస్మీన్

గ్రేటర్ నోయిడా: జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జైస్మీన్ లంబోరియా, పూజా రాణి పసిడి పతకాలతో మెరిశారు. ఓవరాల్‌గా 9 పతకాలు సాధించిన రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్‌ఎస్‌పీబీ) టీమ్ ట్రోఫీ కైవసం చేసుకుంది. మహిళల 57 కేజీల విభాగంగా సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ (ఎస్‌ఎస్‌సీబీ)కి ప్రాతినిధ్యం వహించిన జైస్మీన్ గురువారం జరిగిన ఫైనల్లో ప్రియా (హరియాణా)పై విజయం సాధించింది. కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత జైస్మీన్... టోర్నీ ఆసాంతం కనబర్చిన దూకుడును ఫైనల్లోనూ కొనసాగించింది. జాతీయ చాంపియన్‌గా నిలిచిన జైస్మీన్‌కు రూ. 50 వేల నగదు బహుమతి లభించింది. 'జాతీయ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడం సంతోషంగా ఉంది. గత కొన్ని రోజులుగా నా బలహీనతలపై దృష్టి పెట్టాను. వాటిని ఈ టోర్నీలో అధిగమించేందుకు ప్రయత్నించా. దానికి తగ్గట్లే ఫలితాలు వచ్చాయి' అని జైస్మీన్ పేర్కొంది.



పూజా రాణి

మరోవైపు మహిళల 80 కేజీల విభాగంలో ఆసియా క్రీడల పతక విజేత పూజారాణి ఫైనల్లో 4–3 తేడాతో ఆలిండియా పోలీస్‌కు చెందిన లాల్‌ఫాక్మావి రాల్టెపై గెలుపొందింది. 'ఇది నాకు తొమ్మిదో స్వర్ణ పతకం. జాతీయ చాంపియన్‌షిప్‌లో పసిడి నెగ్గడం ఏ భారత బాక్సర్‌కైనా గర్వకారణమే. టోర్నీ చాలా బాగా సాగింది. ఫైనల్లో ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదురైంది. అయినా ఆమెపై విజయం సాధించడం ఆనందంగా ఉంది' అని పూజా రాణి వెల్లడించింది. ఓవరాల్‌గా ఈ చాంపియన్‌షిప్‌లో రైల్వేస్ 5 స్వర్ణాలు, 4 కాంస్యాలు సాధించి అగ్రస్థానంలో నిలవగా... హరియాణా 6 పతకాల (2 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యం)తో రెండో స్థానం దక్కించుకుంది. ఆలిండియా పోలీస్ టీమ్ 1 స్వర్ణం, 4 రజతాలు, 2 కాంస్యాలు గెలుచుకుంది. రైల్వేస్‌కు చెందిన అనామిక 5–0తో తమన్నా (హరియాణా)పై గెలిచి టైటిల్ నిలబెట్టుకుంది. ఇతర బౌట్‌లలో రైల్వేస్ బాక్సర్ సనామచా చాను (70 కేజీలు) 5–2తో హరియాణాకు చెందిన సనేహ్‌పై గెలిచింది. రైల్వేస్‌కు చెందిన సోనియా లాథెర్ (60 కేజీలు), ముస్కాన్ (75 కేజీలు), నుపుర్ (80+కేజీలు) కూడా స్వర్ణాలు గెలిచారు. 65 కేజీల విభాగంలో హరియాణాకు చెందిన నీరజ్ ఫొగాట్ 4–3తో సిమ్రన్‌జీత్ కౌర్‌పై... ఆలిండియా పోలీస్ టీమ్‌కు చెందిన మీనాక్షి 5–0తో యసిక రాయ్ (సిక్కిం)పై గెలిచారు.

సహజ పరాజయం



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సాంటో డొమింగో డబ్ల్యూ50 మహిళల టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. డొమినికన్ రిపబ్లిక్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సహజ రెండో రౌండ్‌లో నిష్క్రమించింది. మూడో సీడ్ హనీ వాండెవింకెల్ (బెల్జియం)తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో సహజ 2–6, 2–6తో ఓడిపోయింది. అంతకుముందు తొలి రౌండ్‌లో సహజ 6–0, 6–2తో తారా మలిక్ (అమెరికా)పై విజయం సాధించింది. డబుల్స్‌లో తొలి రౌండ్‌లో సహజ (భారత్)–అయ్ ఇటో (జపాన్) జోడీ 6–1, 1–6, 7–10తో అరియానా (కెనడా)–మాడిసన్ సెగ్ (అమెరికా) జంట చేతిలో ఓడిపోయింది.

శిశు మరణాల తగ్గింపులో భారత్ భేష్

ఐరాస నివేదిక ప్రశంసలు
- 70 శాతం తగ్గిన మరణాలు
- 61 శాతం తగ్గిన నవజాత శిశు మరణాలు

ఐరాస: శిశు మరణాలను అరికట్టడంలో భారత్ ప్రయత్నాలు, పురోగతిని ఐక్యరాజ్య సమితి ప్రశంసించింది. ఐక్యరాజ్యసమితి ఇంటర్ ఏజెన్సీ గ్రూప్ ఫర్ చైల్డ్ మోర్టాలిటీ ఎస్టిమేషన్ ఇటీవల నివేదికను విడుదల చేసింది. శిశు మరణాలను తగ్గించిన ఐదు 'ఆదర్శవంతమైన దేశాల'ను, నివారించదగిన శిశు మరణాలను తగ్గించడంలో పురోగతి కోసం వాటి వ్యూహాలను ఉదాహరించింది. ''ప్రపంచవ్యాప్తంగా పలు అల్ప, మధ్య ఆదాయ దేశాలు ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలను 2000 నుంచి బాగా తగ్గించగలిగాయి. భారత్‌తో పాటు అంగోలా, భూటాన్, బొలీవియా, కాబో వెర్డే, మొరాకో, సెనెగల్, టాంజానియా, జాంబియా శిశు మరణాలను మూడింట రెండొంతులు తగ్గించగలిగాయి''అని నివేదిక పేర్కొంది.

వ్యూహాత్మక పెట్టుబడులతో

ఆరోగ్య వ్యవస్థపై వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా భారత్ ఇప్పటికే లక్షలాది శిశువుల ప్రాణాలను కాపాడిందని ఐరాస నివేదిక పేర్కొంది. 2000 నుంచి చూస్తే ఐదేళ్లలోపు శిశువుల మరణాల్లో 70 శాతం తగ్గింపును, నవజాత శిశు మరణాల్లో 61 శాతం తగ్గింపును సాధించిందని తెలిపింది. ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకమని కొనియాడింది. ''ఇందులో భాగంగా ప్రతి గర్భిణీ ఉచిత ప్రసవానికి అర్హురాలు. శిశు సంరక్షణ, ప్రజారోగ్య సంస్థల్లో ఉచిత రవాణా, మందులు, రోగ నిర్ధారణ, ఆహార మద్దతును అందిస్తున్నారు. సమగ్ర కవరేజీ, ఆరోగ్య సేవల అమలుకు ప్రసూతి వెయిటింగ్ హోమ్స్, మాతా శిశు ఆరోగ్య విభాగాలు, నవజాత శిశు స్థిరీకరణ యూనిట్లు, అనారోగ్యంతో ఉన్న నవజాత శిశువులకు సంరక్షణ యూనిట్లు, తల్లి సంరక్షణ యూనిట్లు, జనన లోపాల స్క్రీనింగ్కు ప్రత్యేక కార్యక్రమం, మౌలిక సదుపాయాల బలోపేతం తదితరాలు కూడా ప్రశంసనీయం. ఫలితంగా ఏటా లక్షలాది మందికి ఆరోగ్యకర గర్భధారణ సాధ్యమవుతోంది. బిడ్డలు ఆరోగ్యంగా పుడుతున్నారు. మాతాశిశు ఆరోగ్య సేవలకు మంత్రసానులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నియామకం, శిక్షణ పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. డేటా వ్యవస్థలు, మాతా, నవజాత శిశువు, శిశు ఆరోగ్య సూచికలను ఎప్పటికప్పుడు డిజిటైజ్ చేస్తున్నారు. భిన్న భౌగోళిక, ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్య వ్యవస్థ నిర్మాణాలున్నా భారత్ ఈ ఘనత సాధించింది''అని ప్రశంసించింది. ''భారత్‌లో 2000 నాటికి ఐదేళ్లలోపు శిశువుల్లో కేవలం 56 శాతం మందికే తట్టు టీకాలు వేసేవారు. దాంతో ఏకంగా 1,89,000 మంది శిశువులు తట్టుతో మరణించారు. 2023 నాటికి 93 శాతం శిశువులకు తట్టు టీకా వేశారు. దాంతో తట్టు మరణాలు 97 శాతం తగ్గి 5,200కు పరిమితమయ్యాయి. వ్యాక్సిన్లు, పోషకాహారం, సురక్షితమైన నీరు, ప్రాథమిక పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిబద్ధత వల్ల లక్షలాది మంది పిల్లల ప్రాణాలు నిలిచాయి''అని యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేథరిన్ రస్సెల్ ప్రశంసించారు. శిశు మరణాలను భారత్ రికార్డు స్థాయికి తగ్గించడం గొప్ప విషయమన్నారు.

అర్ధశతాబ్దం భూగర్భంలో..

నేడు కళ్లు చెదిరే ధరలో!

అవన్నీ అరుదైన నాణేలు. కొన్ని అయితే ఇంతవరకు ప్రపంచంలో ఎక్కడా వేలానికి రాలేదు. మరికొన్ని నాణేలను చరిత్రకారులు కూడా ఎన్నడూ చూడలేదు. ఇంతటి విశేషాలున్న పురాతన నాణేలు ఇప్పుడు వేలంపాటకు వచ్చాయి. వీటిని దక్కించుకోవాలంటే దాదాపు రూ.860 కోట్లు చెల్లించాల్సి రావొచ్చని చరిత్రకారులు చెబుతున్నారు. ఇంత రేటు పలుకుతున్న ఈ నాణేల కథాకమామిషు ఓసారి చూద్దాం.

వేలానికి సిద్ధమైన రూ. వందల కోట్ల విలువైన అరుదైన నాణేలు



ఒక ట్రావెలర్ కథ..

ప్రపంచంలోనే 100 వేర్వేరు ప్రాంతాలకు చెందిన అరుదైన నాణేలను మే 20వ తేదీన స్విట్జర్లాండ్‌లో వేలం వేయనున్నారు. అన్నింటినీ ఒకేసారిగా కాకుండా మూడేళ్లకాలంలో కొద్ది కొద్దిగా వేలంలో విక్రయించనున్నారు. దాదాపు 15,000 నాణేలను ఏకంగా 50 సంవత్సరాలపాటు ఎవరికీ దక్కకుండా భూగర్భంలో దాచేసి తర్వాత బయటకు తీయడంతో ఇప్పుడీ నాణేల గురించి చర్చ మొదలైంది. యూరప్‌కు చెందిన ఒక వ్యక్తి గతంలో అమెరికాలో స్థిరపడ్డాడు. అత్యంత దారుణమైన స్టాక్‌మార్కెట్ పతనంగా చరిత్రలో నిలిచిపోయిన '1929 వాల్‌స్ట్రీట్ క్రాష్' ఉదంతం తర్వాత మదుపరులు స్టాక్‌మార్కెట్‌పై నమ్మకం కోల్పోయారు. అంతా బంగారం కొనడంపై దృష్టిపెట్టారు. అదే సమయంలో ఇతను సైతం తొలుత బంగారు కొన్నాడు. తర్వాత పాత నాణేలను కొని వాటిని అధిక ధరలకు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. అలా తన బంగారు నాణేల కొనుగోలు ప్రస్థానానికి శ్రీకారం చుట్టాడు. 1930వ దశకంలో భార్యతో కలిసి ప్రపంచయాత్ర మొదలెట్టి ఎన్నో దేశాల్లో అరుదైన నాణేలను సేకరించడం మొదలెట్టాడు. ఎక్కువగా అమెరికా, యురప్ ప్రాంతాల నాణేలను సేకరించారు. ప్రతి నాణెం ప్రత్యేకత, విశిష్టతలను రాసిపెట్టుకున్నాడు. తర్వాత ఈ జంట యూరప్‌లో స్థిరపడింది. అయితే యూరప్‌ను అడాల్ఫ్ హిట్లర్ సారథ్యంలోని నాజీ పార్టీ దురాక్రమిస్తుండటంతో భయపడిపోయి తమ నాణేలను సురక్షితంగా దాచాలని భావించారు. 15,000 నాణేలను వేర్వేరుగా సిగార్ పెట్టెల్లో పెట్టి వాటిని అల్యూమినియం డబ్బాల్లో నింపి భూమిలో పాతిపెట్టారు. వాటిని దాచిన రహస్యప్రాంతం జాడను తమ కుటుంబసభ్యులకు మాత్రం చెప్పారు. అలా ఆ నాణేలు ఏకంగా 50 సంవత్సరాలపాటు భూమిలోనే ఉండిపోయాయి. ఇటీవల వాళ్ల వారసులు వాటిని బయటకు తీసి కొంతకాలం బ్యాంక్ లాకర్‌లో దాచారు. తాజాగా వేలం సంస్థకు అప్పగించారు. స్విట్జర్లాండ్‌లోని నమిస్మాటికా ఆర్స్ క్లాసికా వేలం సంస్థ వీటిని వేర్వేరు లాట్‌లుగా వేలంవేయనుంది.

ఎన్నెన్నో అరుదైన బంగారు నాణేలు

దాదాపు 80 సంవత్సరాలుగా ఎవ్వరూ చూడని అరుదైన బంగారు నాణేలు ఈ 'ట్రావెలర్ కలెక్షన్'లో ఉన్నాయి. 1629లో ముద్రించిన '100'డ్యూకాట్ ఫెర్డినాడ్-3 రాజు బంగారు నాణెం సైతం ఇందులో ఉంది. ఫెర్డినాడ్-3 రాజు చెక్ రాజ్యం, క్రొయేషియా, హంగేరీ, ఆస్ట్రియాలకు పాలించారు. స్వచ్ఛమైన బంగారంతో చేసిన ఈ నాణెం బరువు ఏకంగా 348.5 గ్రాములు. ఆనాడు యూరప్‌లో ముద్రించిన అతిబరువైన నాణేల్లో ఇదీ ఒకటి. ఇరాన్‌లో 18వ శతాబ్దం చివర్లో, ఆఘా మొహమ్మద్ ఖాన్ ఖాజర్ కాలంలో ఇస్ఫహాన్, టెహ్రాన్‌లలో ముద్రించిన టోమాన్ బంగారు నాణేలు సైతం ఈయన కలెక్షన్‌లో ఉన్నాయి. ''ఏమాత్రం పాడవకుండా కొత్తగా ఉన్న ఈ నాణేలు చరిత్రలోని ఎన్నో విశేషాలను మనకందిస్తాయి. మా వేలం సంస్థ కీర్తినీ పెంచుతాయి''అని వేలం సంస్థ డైరెక్టర్ ఆర్టురో రూసో అన్నారు. ''ఈ రకం డిజైన్ నాణేలను నేనెప్పుడూ చూడలేదు. ఇలాంటి నాణేలు గత 80 ఏళ్లలో ఎక్కడా వేలానికి రాలేదు'' అని కలెక్షన్ కన్సల్టెంట్ డేవిడ్ గెస్ట్ అన్నారు. ప్రమాదంలో అలనాటి ఏథెనా పార్థినోస్ బంగారు శిల్పం కరిగిపోగా వచ్చిన బంగారం నుంచి క్రీస్తుపూర్వం 296 ఏడాదిలో తయారుచేసిన నాణేన్ని సైతం వేలానికి ఉంచారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

లోక్‌సభ స్పీకర్‌కు విపక్షాల లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం పట్ల విపక్ష ఇండియా కూటమి నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, కేరళ కాంగ్రెస్, ఆర్జేడీ, ఐయూఎంఎల్, ఆర్ఎల్పీ, ఎండీఎంకే నేతలు గురువారం స్పీకర్‌ను కలిశారు. ఆర్ఎస్పీ, శివసేన(ఉద్ధవ్) సహా ఇండియా కూటమి పార్టీల నాయకులు సంతకాలు చేసిన లేఖను ఆయనకు అందజేశారు. సభలో మాట్లాడేందుకు ప్రతిపక్ష నేతకు అనుమతి ఇవ్వకపోవడం దారుణం అంటూ తమ నిరసనను లేఖలో తెలియజేశారు. అలాగే సభా సంప్రదాయాలు పాటించాలంటూ రాహుల్ గాంధీకి స్పీకర్ చేసిన హెచ్చరిక రాజకీయ రంగు పులుముకుందని ప్రస్తావించారు. లోక్‌సభలో అధికారపక్ష సభ్యులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోకుండా తమపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఏమిటని ప్రశ్నించారు. తమ నిరసన, అసంతృప్తిని లేఖ ద్వారా స్పీకర్ ఓం బిర్లాకు తెలియజేశామని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ చెప్పారు.

కర్నాటకలో ఎస్సీ అంతర్గత రిజర్వేషన్లపై సర్వే

బెంగళూరు: షెడ్యూల్డ్ కులా(ఎస్సీ)ల్లో అంతర్గత రిజర్వేషన్లను నిర్ణయించేందుకు అంతర్గత సర్వే చేపట్టాలని కర్నాటక ప్రభుత్వం నిర్ణయించింది. సాధ్యమైనంత త్వరగా దీనిని పూర్తి చేయనున్నట్లు కర్నాటక న్యాయ శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ చెప్పారు. గురువారం కేబినెట్ సమావేశం అనంతరం ఈ విషయం వెల్లడించారు. ఎస్సీల అంతర్గత రిజర్వేషన్లపై ఏర్పాటైన జస్టిస్ హెచ్ ఎన్ నాగమోహన్ దాస్ కమిషన్ సమర్పించిన మధ్యంతర నివేదికను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. నివేదిక సిఫార్సు చేసిన విధంగానే 101 షెడ్యూల్డ్ కులాల వారికి 17 శాతం రిజర్వేషన్ల పంపకాలు జరిపేందుకు గాను 40 రోజుల్లో సర్వే చేపట్టనున్నామన్నారు. ఈ నివేదిక ఆధారంగానే రిజర్వేషన్లను నిర్ణయిస్తామని, ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇందుకు వినియోగించుకుంటామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు కొన్ని ఉప కులాల వారికే అందుతున్నాయంటూ ఒక వర్గం ఎస్సీలు చేస్తున్న అభ్యంతరాలపై ప్రభుత్వం నాగమోహన్ దాస్ కమిటీ ఏర్పాటు చేసింది. ఎస్సీల్లో వెనుకబాటుకు గురైన వారికి అంతర్గ రిజర్వేషన్లను రాష్ట్రాలు నిర్ణయించుకోవచ్చంటూ గతేడాది ఆగస్టులో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించడం తెలిసిందే.

ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ మూలస్తంభం: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య వ్యవస్థకు పత్రికా స్వేచ్ఛ ఒక మూలస్తంభమని ఢిల్లీ హైకోర్టు స్పష్టంచేసింది. ఇంటర్నెట్ మేగజైన్‌లో ఓ మీడియా సంస్థ ప్రచురించిన ఆర్టికల్ తమ పరువుకు భంగం కలిగించేలా ఉందని, దాన్ని తొలగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు ఇటీవల విచారణ చేపట్టింది. పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఆర్టికల్ ప్రచురితమైన ఏడాది తర్వాత పిటిషనర్ కోర్టును ఆశ్రయించారని, అంటే వారికి అందులో అభ్యంతరకమైన అంశం వెంటనే కనిపించలేదని పేర్కొంది. కోర్టుకెక్కడం అత్యవసరం కాదని వారు భావించారని వెల్లడించింది. పాత్రికేయ కోణంలో చూస్తే ఆ ఆర్టికల్‌లో పరువుకు భంగం కలిగించే విషయమేదీ లేదని, కేవలం ఆ కంపెనీలో పని సంస్కృతి గురించి రాశారని తెలియజేసింది. చట్టపరమైన ప్రతీకార చర్యలకు భయపడకుండా జర్నలిస్టులు తాము న్యాయం అని భావించింది రాయడానికి కొంత స్వేచ్ఛ అవసరమని న్యాయస్థానం వెల్లడించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్ ఈ నెల 24న ఉత్తర్వులు జారీ చేశారు.

పాక్ జైల్లో భారతీయ మత్స్యకారుడు మృతి

కరాచీ: పాకిస్తాన్‌లోని కరాచీలో ఉన్న మలిర్ జైలులో 52 ఏళ్ల భారతీయ జాలరి ఒకరు ఆత్మహత్య చేసుకుని చనిపోయారని ఓ అధికారి గురువారం తెలిపారు. గౌరవ్ రాం ఆనంద్ అనే ఈ మత్స్యకారుడు మంగళవారం రాత్రి బ్యారెక్‌లోని వాష్‌రూంలో తాడుతో ఉరి వేసుకున్నాడని జైలు సూపరింటెండెంట్ అర్షద్ హుస్సేన్ చెప్పారు. ఉరికి వేలాడటం చూసిన సిబ్బంది అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారని, చికిత్స పొందుతూ చనిపోయాడని వివరించారు. అన్ని లాంఛనాలు పూర్తయ్యాక, పోస్టుమార్టం చేసిన మృతదేహాన్ని కుటుంబానికి అప్పగిస్తామని చెప్పారు. పాక్ ప్రాదేశిక జలాల్లో చేపలు పడుతున్నాడనే ఆరోపణలపై 2022 ఫిబ్రవరిలో ఆనంద్‌ను అదుపులోకి తీసుకుని, జైలులో ఉంచారు. మలిర్ జైలులో శిక్ష అనుభవిస్తున్న వారిలో చాలామంది గుజరాత్‌కు చెందిన వారేనని అర్షద్ చెప్పారు. ప్రస్తుతం పాకిస్తానీ జైళ్లలో 190 మంది వరకు భారతీయ మత్స్యకారులు ఉన్నట్లు అధికారుల అంచనా.

ఈజిప్టు తీరంలో మునిగిన సబ్‌మెరీన్

ఆరుగురు రష్యన్లు మృతి, 9 మందికి గాయాలు

కైరో: ఈజిప్టులోని ఎర్ర సముద్ర తీర పర్యాటక ప్రాంతం హర్ఘాడాలో విషాదం చోటుచేసుకుంది. రష్యాకు చెందిన పర్యాటకులతో కూడిన జలాంతర్గామి మునిగి అందులో ఉన్న ఆరుగురు చనిపోగా మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. హర్ఘాడాలోని సింద్‌బాద్ హోటల్‌కు చెందిన ఈ సబ్‌మెరీన్‌లోని 29 మందిని అత్యవసర సహాయక సిబ్బంది రక్షించినట్లు ఆ ప్రాంత గవర్నరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం ఉదయం 10 గంటలప్పుడు తీరానికి కిలోమీటర్ దూరంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో సబ్‌మెరీన్‌లో సిబ్బందితోపాటు చిన్నారులు సహా మొత్తం 44 మంది పర్యాటకులున్నారని, వీరు బీచ్ వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుందన్నారు. అందులోని సిబ్బంది సంఖ్య, ప్రమాదానికి కారణాలు వెంటనే తెలియరాలేదు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఈజిప్టు ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం ఎంతో కీలకమైంది. అయితే, ఈ ప్రాంతంలోని అస్థిర పరిస్థితుల కారణంగా చాలా పర్యాటక సంస్థలు ఎర్ర సముద్రంలో ప్రయాణాలను నిలిపివేయడమో లేక తగ్గించుకోవడమో చేస్తున్నాయి.

అమెరికాలో కాల్పులు.. నలుగురు మృతి

పెంబ్రోక్ పార్క్: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం దక్షిణ ప్రాంత పెంబ్రోక్ పార్క్ వద్ద బుధవారం రాత్రి జరిగిన తుపాకీ కాల్పుల్లో ఒక మహిళ, ముగ్గురు చిన్నారులు చనిపోగా బాలిక సహా ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలతోనే ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నామని చెప్పారు.

జననం నుంచి మరణం దాకా.. అన్నింటా పన్నులే

రాజ్యసభలో ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా ధ్వజం

న్యూఢిల్లీ: దేశంలో సామాన్య ప్రజలపై పన్నుల భారం విపరీతంగా పెరిగిపోతోందని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ రాఘవ్ చద్దా ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన గురువారం రాజ్యసభలో మాట్లాడారు. జనన నుంచి మరణం దాకా.. ప్రతి అడుగులోనూ పన్నులు చెల్లించాల్సి వస్తోందని అన్నారు. నాణ్యమైన సేవలు అందకున్నా పన్నుల భారం మాత్రం తప్పడం లేదన్నారు. ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా వారికి ఒరిగిదేమీ ఉండడం లేదని విమర్శించారు. బతకాలన్నా, చావాలన్నా పన్నులు కట్టాల్సిందేనా? అని ప్రశ్నించారు. శ్వాస పీల్చుకోవాలన్నా పన్ను కట్టే పరిస్థితి ఉందన్నారు. చిన్న పిల్లలు ఆడుకొనే బొమ్మలపై కూడా 12 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారని ఆక్షేపించారు. స్కూల్ బ్యాగ్‌లు, బూట్లు, పుస్తకాలు, పెన్సిళ్లను కూడా వదిలిపెట్టడం లేదని కేంద్ర ప్రభుత్వంపై రాఘవ్ చద్దా నిప్పులు చెరిగారు.

జస్టిస్ వర్మపై కేంద్రం ప్రకటన చేయాలి

లోక్‌సభలో ప్రతిపక్షాల డిమాండ్

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నోట్లు దొరికిన ఘటనను గురువారం లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తారు. ఈ వ్యవహారంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ వెంటనే ప్రకటన చేయాలని కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ డిమాండ్ చేశారు. నిజానిజాలు ప్రభుత్వం బహిర్గతం చేయాలని అన్నారు. న్యాయ వ్యవస్థలోనూ అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తుండడం దేశ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని చెప్పారు. న్యాయ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత పార్లమెంట్‌పై ఉందన్నారు.

అంతా అల్లా దయ: సల్మాన్

రాసిపెట్టినంత కాలం బతుకుతానని వ్యాఖ్యలు

ముంబై: గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ వరుస హత్య బెదిరింపులపై బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ తొలిసారి స్పందించారు. ఎంతకాలం రాసుంటే అంతకాలం బతుకుతానంటూ తాత్విక ధోరణిలో మాట్లాడారు. గురువారం సికందర్ సినిమా ప్రమోషన్ కార్యక్రమం సందర్భంగా మీడియా ప్రశ్నలకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. ''అంతా అల్లా దయ. అల్లా ఎంతకాలం రాశాడో అంతకాలం బతుకుతా. అంతే''అని చెప్పుకొచ్చారు. బెదిరింపులతో తన వ్యక్తిగత జీవితం ఎంతగానో ప్రభావితమైందని 59 ఏళ్ల సల్మాన్ అన్నారు. ''కాల్పులు, బెదిరింపుల తర్వాత నాకు కల్పించిన అధిక భద్రత సమస్యగానే ఉంది. కట్టుదిట్టమైన భద్రత మధ్య తిరగడం ఇబ్బందిగా ఉంది. షూటింగ్, ఇల్లు. అంతే. ఎక్కడికీ టూర్ల వంటివి కూడా లేవు. కానీ ఈ విషయంలో నేను చేయగలిగింది కూడా ఏమీ లేదు''అని వ్యాఖ్యానించారు. గతంలో ఆయన ఇంటి సమీపంలో సైక్లింగ్ వంటివి చేసేవారు. గత ఏప్రిల్‌లో ముంబైలో బాంద్రాలోని సల్మాన్ అపార్ట్‌మెంట్ బయట బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరపడం తెలిసిందే. ఆయన్ను భయపెట్టడానికి బిష్ణోయే ఈ పని చేయించినట్టు విచారణలో వెల్లడైంది. తర్వాత సల్మాన్ సన్నిహితుడైన రాజకీయ నాయకుడు బాబా సిద్దిఖీ హత్యకు గురయ్యాడు. దాంతో ఆయన సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేశారు. గత అక్టోబర్లో బిష్ణోయ్ సమాజం పవిత్రంగా భావించే కృష్ణ జింకలను వేటాడినందుకు సల్మాన్‌ను అంతం చేస్తానని లారెన్స్ కొన్నేళ్లుగా బెదిరిస్తున్నాడు.

మరో 3 వేల మంది జవాన్లు, ఆయుధాలు

రష్యాకు సాయంగా పంపిన ఉత్తరకొరియా

సియోల్: ఉక్రెయిన్‌తో జరుగుతున్న పోరులో రష్యాకు సాయపడేందుకు ఉత్తరకొరియా మరో 3 వేల మంది సైనికులను పంపినట్లు దక్షిణకొరియా అంచనా వేస్తోంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వీరిని రష్యాకు తరలించిందని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ తెలిపారు. క్షిపణులు, ఆర్టిలరీ పరికరాలతోపాటు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను సైతం పంపించిందని వివరించారు. ఇందులో తక్కువ శ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, 170 మి.మీ. సెల్ఫ్ ప్రొపెల్డ్ హొవిట్జర్లు, 220 యూనిట్ల 240 మి.మీ. మల్టిపుల్ రాకెట్ లాంఛర్లు ఉన్నాయని తెలిపారు.

రాజ్యసభ నుంచి విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో సమాజ్‌వాదీ పార్టీ రాజ్యసభ సభ్యుడు రామ్‌జీలాల్ సుమన్ ఇంటిపై కర్ణిసేన కార్యకర్తలు దాడి చేశారని, ఆయన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని విపక్ష ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై వెంటనే చర్చించాలని గురువారం రాజ్యసభలో డిమాండ్ చేశారు. కానీ, చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అందుకు అనుమతించలేదు. వేర్వేరు అంశాలపై చర్చించడానికి రూల్ 267 కింద ఏడు నోటీసులు అందాయని, వాటన్నింటినీ తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. దాంతో విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. చైర్మన్ నిర్ణయం పట్ల నిరసన వ్యక్తం చేశారు. విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు ప్రయత్నించగా, చైర్మన్ అనుతించలేదు. అధికార బీజేపీ సభ్యులు 'రాణా సంగా జిందాబాద్' అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో సమాజ్‌వాదీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆర్జేడీ తదితర పార్టీల ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. రాణా సంగాపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కర్ణి సేన కార్యకర్తలు బుధవారం ఆగ్రాలో రామ్‌జీలాల్ ఇంటిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. రాణా సంగా 1508 నుంచి 1528 వరకు మేవార్ రాజ్యాన్ని పరిపాలించిన రాజు. రాణా సంగా ఒక దేశ ద్రోహి అని, ఇబ్రహీం లోడీని ఓడించడానికి మొఘల్ రాజు బాబర్‌ను భారతదేశానికి రప్పించాడని రామ్‌జీలాల్ సుమన్ ఇటీవల ఆరోపించారు. దీనిపై కర్ణి సేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రజలు విధించే శిక్షను మోదీ అనుభవిస్తారా?: సాగరికా ఘోష్

నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలుచేసిన నోట్ల రద్దు నిర్ణయం దారుణంగా విఫలమైందని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ సాగరికా ఘోష్ విమర్శించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో పెద్ద ఎత్తున నగదు దొరకడమే అందుకు నిదర్శనమని అన్నారు. గురువారం రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు-2025పై సాగరికా ఘోష్ మాట్లాడారు. నోట్ల రద్దు విఫలమైతే ప్రజలు ఏ శిక్ష విధించినా అనుభవిస్తానని అప్పట్లో మోదీ చెప్పారని గుర్తుచేశారు.

ఎన్నికల్లో గెలిపించే బాధ్యత మీదే

డీసీసీ చీఫ్‌ల భేటీలో ఖర్గే, రాహుల్ వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. గురువారం 13 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల డీసీసీ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అడ్డుకోవాలంటే రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షులే కృషి చేయాలని కోరారు. రానున్న రాష్ట్రాల ఎన్నికల్లో విజయం సాధించేందుకు అవసరమైన దీర్ఘకాలిక వ్యూహంతో కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతం ఎంతో ముఖ్యమైందంటూ వారు..దేశంలో అధికారంలో లేకుండా సిద్ధాంతాలను అమలు చేయడం సాధ్యం కాదని నొక్కి చెప్పారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా పార్లమెంటు లోపల, వెలుపల మన పోరాటం కొనసాగుతుంది. ఈ పోరాటాన్ని వీధుల్లోకి తీసుకెళ్లాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను అవగాహన కల్పించాలి. ఇందులో డీసీసీల పాత్ర చాలా కీలకం. డీసీసీలు పార్టీ దూతలు మాత్రమే కాదు, పార్టీకి జనరల్స్ వంటి వారు. క్షేత్రస్థాయిలో ముందుండి నడిపిస్తున్నారు. పార్టీ భావజాలం బలంగా ఉంది, కానీ అధికారం లేకుండా దానిని అమలు చేయలేం. రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తేవాల్సిన బాధ్యత మీదే'అని దిశానిర్దేశం చేశారు. దేశ వ్యాప్తంగా సామాజిక న్యాయాన్ని పునరుద్ధరించడానికి కుల గణనను డిమాండ్ చేస్తోందన్నారు. పార్టీ చేస్తున్న పోరాటం చాలా తీవ్రమైందని, దృష్టంతా ప్రజా సమస్యలపై కేంద్రీకృతమై ఉండాలని, బీజేపీ దుష్ట పన్నాగాలను తిప్పికొట్టాలని సూచించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మరో 20, 30 సీట్లు గెలిచుంటే ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఉండేదని ఖర్గే చెప్పారు. 'ఎన్నికల్లో ఇండియా కూటమి కలిసికట్టుగా పనిచేసే ఎన్డీయేను 240 సీట్లకు పరిమితం చేసింది. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ-ఆర్ఎస్ఎస్ అజెండానే 'సేవ్ కాన్‌స్టిట్యూషన్'ప్రచారం బహిర్గతం చేసింది. బీజేపీ ప్రస్తుతం రెండు మిత్రపక్ష పార్టీలపై ఆధారపడి ఉంది. 400 సీట్లు తమవని అహంకారంతో చెప్పుకున్న ప్రధాని మోదీకి గట్టి దెబ్బ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి దాదాపు 100 సీట్లు వచ్చాయి. మనం మరింత కష్టపడి పనిచేసి ఉంటే 20, 30 సీట్లు ఎక్కువగా పొందేవాళ్లం. అదే జరిగితే దేశంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉండేది'అని ఖర్గే పేర్కొన్నారు.



కార్చిచ్చు నుంచి అడవిని కాచుకుంటూ..

ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో చూసినా అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు జర్మనీకి చెందిన డ్రైయాడ్ నెట్‌వర్క్స్ సంస్థ నడుం బిగించింది. కృత్రిమ మేథే ఆయుధంగా అడవి తల్లిని కాపాడుతామని ముందడుగువేసింది. దావాగ్ని మొత్తం అడవిని దహించివేసేలోపే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బంది, నీటి హెలికాప్టర్లు, విమానాలు రంగంలోకి దిగేలా కొత్త వ్యూహాన్ని కంపెనీ సిద్ధంచేసింది. తొలుత అడవిలో కార్చిచ్చుకు ఆస్కారముండే ప్రాంతాల్లో దూరం దూరంగా చెట్లకు ఒక సెన్సార్‌ను బిగిస్తారు. మంటలు అంటుకుంటే వెలువడే కార్బన్ మోనాక్సైడ్ తదితర వాయువుల జాడను తక్కున పసిగట్టి ఈ సెన్సార్ వెంటనే ఆన్‌లైన్‌లో స్పందన విభాగానికి సమాచారం పంపిస్తుంది. దావాగ్ని నిజమేనా కాదా ? అని నిర్ధారించుకునేందుకు వెంటనే డ్రోన్లు గాల్లోకి లేచి ఆ ప్రాంతం ఫొటోలను తీసి అగ్నిమాపక సిబ్బందికి తాజా సమాచారాన్ని చేరవేస్తాయి. వెంటనే నీటి హెలికాప్టర్లు, విమానాలు దూసుకొచ్చి మంటలను మరింత విస్తరించకుండా ఆపేస్తాయి. దీంతో అత్యంత విలువైన వృక్షజాలం కాలిబూడిదకాకుండా కాపాడుకోవచ్చు. - సాక్షి, నేషనల్ డెస్క్

డమ్మీ స్కూళ్ల విద్యార్థులను బోర్డు పరీక్షలు రాయనివ్వం

- రెగ్యులర్ స్కూళ్లలో కనీసం 75 శాతం హాజరు తప్పనిసరి
- వచ్చే విద్యాసంవత్సరం నుంచే నూతన నిబంధనలు
- వెల్లడించిన సీబీఎస్ అధికారులు

న్యూఢిల్లీ: రెగ్యులర్ స్కూళ్లకు హాజరుకాని సీబీఎస్ఈ విద్యార్థులను 12వ తరగతి బోర్డు పరీక్షలకు అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. డమ్మీ స్కూళ్లలో ప్రవేశం పొందితే ఆ తప్పు విద్యార్థులు, వారి తల్లిదండ్రులదేనని తేల్చి చెప్పారు. ఇంజనీరింగ్, మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు నామమాత్రంగా నడిచే స్కూళ్లలో జాయినవుతున్నారు. స్కూల్‌లో పేరున్నా, వీరు తరగతులకు మాత్రం వెళ్లరు. కోచింగ్ సెంటర్‌లోనే శిక్షణ పొందుతూ సమయానికి వచ్చి బోర్డు పరీక్షలు రాస్తుంటారు. ఇలా, క్లాసులకు హాజరుకాని విద్యార్థులకు బోర్డు పరీక్షలు రాసేలా అనుకూలంగా వ్యవహరించే స్కూళ్లనే డమ్మీ స్కూళ్లుగా పేర్కొంటున్నారు. ఇటువంటి విద్యార్థులు ఇకపై సీబీఎస్ఈ బోర్డు పరీక్షలకు బదులుగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)పరీక్ష రాయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. బోర్డు అధికారుల బృందాలు చేపట్టే ఆకస్మిక తనిఖీల్లో స్కూలుకు హాజరు కాని, కనిపించని విద్యార్థులను బోర్డు పరీక్షలకు అనుమతించేది లేదన్నారు. డమ్మీ సంస్కృతిని ప్రోత్సహిస్తూ తరగతులకు హాజరు కాకున్నా విద్యార్థులను పరీక్షకు అనుమతించే స్కూళ్ల గుర్తింపు రద్దు చేసేలా నిబంధనలను సవరించనున్నట్లు వివరించారు. వీటిని 2025-2026 విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని ఇటీవల జరిగిన గవర్నింగ్ బోర్డు సమావేశం నిర్ణయించిందని వెల్లడించారు. దీని ప్రకారం, ఇకపై కనీసం 75 శాతం హాజరు లేని విద్యార్థులు బోర్డు పరీక్షలు రాసే అర్హత కోల్పోతారని ఆ అధికారి చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వెళ్లిన, తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న, ఇతర అత్యవసర కారణాలున్న వారికి మాత్రం హాజరులో 25 శాతం వెసులుబాటు కల్పించాలని బోర్డు భావిస్తోందన్నారు. ఇవేవీ లేని వారు ఎన్ఐఓఎస్‌కు హాజరు కావచ్చన్నారు. వీరి కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి మార్గదర్శకాలను సిద్ధం చేస్తామని చెప్పారు.

మండల్ కమిషన్‌ను ఎప్పుడు నియమించారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ప్రాథమిక హక్కులు-వర్గీకరణ

సమానత్వ హక్కు (ప్రకరణ 14-18)

ప్రకరణ 14 ప్రకారం చట్టం దృష్టిలో అందరూ సమానులే. ఈ భావన బ్రిటిష్ రాజ్యాంగంలోని సమ న్యాయపాలన (Rule of law)కుఅనుగుణంగా పొందుపరిచారు. వ్యక్తి హోదా, గౌరవంతో సంబంధం లేకుండా హక్కులు కల్పిస్తారు.

సమన్యాయ పాలన భావాన్ని 'ఎ.వి. డైసీ'అనే రాజ్యాంగ నిపుణుడు ప్రతిపాదించాడు. చట్టం మూలంగా సమాన రక్షణ (Equal protection of law) అనేది అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. దేశంలో ఒకే చట్టం ఉన్నప్పటికీ, ఆ చట్టాన్ని అమలు చేసే సమయంలో ప్రజలను వర్గీకరించి అమలు చేయొచ్చు. అయితే వర్గ చట్టాలు చేయొద్దు (Classification of people but not class legislation). దీన్నే 'రక్షిత వివక్ష' అంటారు. దీంతో సామాజిక న్యాయం సాధ్యమవుతుంది.

ప్రకరణ 14 ప్రకారం, చట్టం ముందు అందరూ సమానులే. అయినప్పటికీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వొచ్చు. హేతుబద్ధ, శాస్త్రీయ వర్గీకరణ ద్వారా మినహాయింపులు ఇవ్వడం ప్రకరణ 14కు వ్యతిరేకం కాదు. భౌగోళిక ప్రాంతం, అక్షరాస్యత, పెద్ద, చిన్న పరిశ్రమలు, మైనర్, మేజర్, స్త్రీలు, పురుషులు మొదలైన ప్రాతిపదికలపైన మినహాయింపులు ఇవ్వొచ్చు.

ప్రత్యేక వివరణ

ప్రకరణ 39(బి), (సి)లోని ఆదేశికాలను అమలు చేయడానికి చర్యలు తీసుకుంటే అవి ప్రకరణ 14కు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించొద్దు. వీటిని అమలు చేయడానికి ప్రకరణ 14 అడ్డుకాదు.

మినహాయింపులు

- నిబంధన 14లో పేర్కొన్న 'అందరూ సమానులు' అనే సూత్రం రాష్ట్రపతి, గవర్నర్లకు వర్తించదు. వారు ఈ సూత్రానికి మినహాయింపు.
- ప్రకరణ 361 ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్ తమ అధికార విధుల నిర్వహణలో ఏ న్యాయస్థానానికీ జవాబుదారులు కారు. వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు పెట్టడానికి వీలులేదు. అయితే రెండు నెలల ముందస్తు నోటీసుతో సివిల్ కేసులు పెట్టొచ్చు.
- ప్రకరణ 105, ప్రకరణ 194 ప్రకారం, పార్లమెంట్, రాష్ట్ర శాసన సభల్లో సభ్యులు వ్యక్తీకరించిన అభిప్రాయాలకు వారు ఏ న్యాయస్థానానికీ బాధ్యులు కారు.
- విదేశీ సార్వభౌములకు, దౌత్యవేత్తలకు కూడా మినహాయింపుఉంటుంది.
- ఐక్యరాజ్యసమితి వివిధ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి కూడా ఈ మినహా యింపు వర్తిస్తుంది.

సుప్రీంకోర్టు ముఖ్య తీర్పులు

చిరంజిత్ లాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1950)

చట్టం ముందు అందరూ సమానులే అంటే సమానుల్లో మాత్రమే సమానత్వం అమలు చేస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. హేతుబద్ధమైన వర్గీకరణ చెల్లుబాటు అవుతుంది.

బెన్నెట్ కోల్‌మెన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1973)

పత్రికలను చిన్న, పెద్ద పత్రికలు అనే ప్రాతిపదికపై వర్గీకరించి న్యూస్ ప్రింట్ పంపిణీ చేయడం చెల్లుబాటు అవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అన్ని పత్రికలకు సమానంగా పంపిణీ చేయడం న్యాయసమ్మతం కాదని పేర్కొంది.

విశాఖ వర్సెస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్ (1997)

పనిచేసే ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల పట్ల అనుచిత ప్రవర్తన, లైంగిక వేధింపులు ప్రకరణ 14 లోని చట్టం ముందు అందరూ సమానులే అనే సూత్రానికి వ్యతిరేకం, స్త్రీల పట్ల వివక్ష అని, పురుషులతో సమానంగా వారు హక్కులను కలిగి ఉండే అధికారం ఉందని పేర్కొంది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నివారించడానికి సమగ్ర మార్గదర్శక సూత్రాలను సుప్రీంకోర్టు జారీ చేసింది.

ప్రకరణ 15

ప్రకరణ 15(1): మత, జాతి, కుల, లింగ, పుట్టుక అనే వివక్షను పాటించొద్దు.

ప్రకరణ 15(2): ప్రజా ప్రయోజనకర ప్రదేశాల్లోకి అందరికీ సమాన ప్రవేశం ఉండాలి. ఈ సౌకర్యాల విషయంలో వివక్ష చూపొద్దు. బావులు, చెరువులు, రోడ్లు, హోటళ్లు, వినోద ప్రదేశాలు, ఇతర ప్రజా సంబంధ ప్రదేశాల్లోకి అందరికీ సమాన అవకాశాలు ఉండాలి.

మినహాయింపులు

ప్రకరణ 15(3): దీని ప్రకారం మహిళలు, బాలలకు ప్రత్యేక మినహాయింపులు, సౌకర్యాలు కల్పించవచ్చు.

ప్రకరణ 15(4): సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక సౌకర్యాలు, మినహాంపులు ఇవ్వొచ్చు. ఈ క్లాజ్‌ను 1951లో 1వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 15(5): ప్రైవేట్, ప్రభుత్వ ధన సహాయం పొందిన విద్యాసంస్థల్లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి ప్రత్యేక మినహాయింపులు, సౌకర్యాలు కల్పించవచ్చు. అయితే ఇది ప్రకరణ 30లో పేర్కొన్న మైనారిటీ సంస్థలకు వర్తించదు. ప్రకరణ 15(5) క్లాజ్‌ను 2005లో 93వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 16

ప్రకరణ 16(1): ప్రభుత్వోద్యోగాల్లో పౌరులందరికీ సమాన అవకాశాలు.

ప్రకరణ 16(2):ప్రభుత్వోద్యోగాల్లో పౌరులను జాతి, మత, కుల, లింగ పుట్టుక వారసత్వ, స్థిర నివాస అనే ఏడు ప్రాతిపదికలపై వివక్ష చూపొద్దు.

ప్రకరణ 16(3): ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక మినహాయింపులు, సదుపాయాలు కల్పించవచ్చు.

ప్రకరణ 16(4ఎ): ప్రభుత్వోద్యోగాలు, ప్రమోషన్లలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించవచ్చు. ఈ అంశాన్ని 1995లో 77వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచారు.



ప్రకరణ 16(4బి): ఈ క్లాజును 81వ రాజ్యాంగ సవరణ ద్వారా 2000లో చేర్చారు. ఎస్సీ, ఎస్టీలకు ఒక ఏడాదిలో కేటాయించిన రిజర్వ్ కోటా భర్తీ కాకుంటే ఆ ఖాళీలను తర్వాత సంవత్సరంలో సంబంధిత రిజర్వేషన్ కోటాలో కలుపుతారు. అప్పుడు రిజర్వేషన్ల శాతం 50కి మించిందా లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి ఆ ఏడాది రిజర్వేషన్ కోటాలో కలిసిన గత సంవత్సరం కోటాను పరిగణనలోకి తీసుకోకుండా, మిగిలిన ఖాళీలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. దీని ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల విషయంలో క్యారీ ఫార్వర్డ్ అవకాశాన్ని కల్పించారు.

ప్రకరణ 16(5): ప్రభుత్వంలో ఏదైనా ఒక శాఖలో పూర్తిగా ఒక మత విశ్వాసానికి సంబంధించిన విషయం ఉంటే ఆ శాఖలో కేవలం ఆ మత విశ్వాసాలకు చెందిన వారిని మాత్రమే నియమించడానికి తగిన చట్టాలను ప్రభుత్వాలు రూపొందించుకోవచ్చు.

దేవాదాయ ధర్మాదాయ శాఖలో పనిచేయడానికి హిందువులు మాత్రమే అర్హులు. అలాగే వక్ఫ్‌బోర్డు ఇతర మత సంస్థల్లో నియామకాలకు సంబంధిత మత విశ్వాసం ఉన్నవారే అర్హులు.

అదేవిధంగా 2001లో 85వ రాజ్యాంగ సవరణ ప్రకారం, పదోన్నతుల్లో రిజర్వేషన్లు పొందిన ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగులకు తద్వారా లభించే సీనియారిటీ అర్హత కూడా లభిస్తుంది. ఈ సవరణ 1995 నుంచి వర్తిస్తుంది.

ప్రత్యేక వివరణ

81, 85వ రాజ్యాంగ సవరణల ద్వారా గతంలో సుప్రీంకోర్టు బాలాజీ వర్సెస్ మైసూరు (1963), ఇంద్ర సహాని వర్సెస్ భారత ప్రభుత్వం (1992) కేసుల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని చెప్పిన తీర్పులకు మినహాయింపు లభించింది.

మండల్ కమిషన్ నివేదిక

వెనుకబడిన తరగతులను వర్గీకరించి తగిన రాయితీలు కల్పించడానికి 1979లో నాటి జనతా ప్రభుత్వం బి.పి. మండల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు కేంద్ర సర్వీసుల్లో 27 శాతం రిజర్వేషన్లను కల్పించాలని 1980లో తన తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. 1989లో అధికారంలోకి వచ్చిన వి.పి.సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. తర్వాత పి.వి. నరసింహారావు ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికకు రెండు సవరణలు చేసింది.

ఎ) వెనుకబడిన తరగతులకు కేటాయించిన రిజర్వేషన్లను ఆర్థిక ప్రాతిపదికన అమలు చేయడం.

బి) అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం.

పై అంశాలు ఇంద్రా సహాని కేసులో సుప్రీం కోర్టులో చర్చకు వచ్చాయి.

ఇంద్రా సహాని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు) (1993)

- వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమే.
- వెనుకబడిన తరగతుల్లో క్రీమీలేయర్ (మెరుగైన వర్గాలు)ను గుర్తించి వారిని రిజర్వేషన్లకు అనర్హులుగా పరిగణించాలి.
- కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహా, అన్ని రకాల రిజర్వేషన్లు కలిపి 50 శాతం మించొద్దు.
- ఆర్థికపరమైన రిజర్వేషన్లు చెల్లవు. రాజ్యాంగంలో ఈ ప్రాతిపదికన మినహాయింపులు లేవని సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.

గమనిక: క్రీమీలేయర్ వర్గాలను గుర్తించడానికి 1993లో రామ్‌నందన్ ప్రసాద్ కమిటీని నియమించారు.

ప్రకరణ 17

ఈ ప్రకరణ ప్రకారం అస్పృశ్యతను నిషేధించారు. ఈ ప్రకరణ తనంతట తాను అమలులోకి రాదు. దీని అమలుకు సంబంధిత చట్టాలను రూపొందించాలి. అయితే అస్పృశ్యత అనే పదాన్ని రాజ్యాంగంలోగాని, చట్టంలోగానీ నిర్వచించలేదు. కులతత్వ నేపథ్యంలో అస్పృశ్యతను గమనించాలని కర్ణాటక హైకోర్టు అభిప్రాయపడింది. దీని అమలుకు సంబంధించి పార్లమెంట్ ఈ కింది చట్టాలను రూపొందించింది.

అస్పృశ్యత నిషేధ చట్టం (1955)

అస్పృశ్యతను నిషేధిస్తూ, దాన్ని నేరంగా పరిగణిస్తూ, పార్లమెంట్ 1955లో ఈ చట్టాన్ని రూపొందించింది. అయితే ఈ చట్టంలోని లొసుగులను తొలగించడానికి 1976లో ఈ చట్టాన్ని సమగ్రంగా సవరించి పౌరహక్కుల పరిరక్షణ చట్టంగా పేరు మార్చారు. ఈ చట్టం ప్రకారం నేరం రుజువైతే రెండేళ్ల వరకు జైలు, అలాగే ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటిస్తారు.

ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిషేధ చట్టం (1989)

ఈ చట్టం ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగలపై అకృత్యాలను సమగ్రంగా నిరోధిస్తూ కఠినమైన నియమ నిబంధనలను రూపొందించారు.

ప్రకరణ 18

18(1): సైనిక, విద్యాపరమైన గుర్తింపు మినహా మిగతా బిరుదుల రద్దు.

18(2): భారత పౌరులు విదేశీ బిరుదులను స్వీకరించొద్దు.

18(3): భారత పౌరులు కానప్పటికీ భారత ప్రభుత్వంలో లాభదాయక పదవుల్లో ఉన్నప్పుడు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బిరుదులు స్వీకరించొద్దు.

18(4): ప్రభుత్వంలో లాభదాయక పదవుల్లో ఉన్న వ్యక్తులు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బహుమతులను, భత్యాన్ని, ఉద్యోగాన్ని స్వీకరించొద్దు.

ఈ ప్రకరణలో కొన్ని రకాల బిరుదులను రద్దు చేశారు. ఉదాహరణకు, బ్రిటిష్ పాలనా కాలంలో సమాజంలోని వ్యక్తుల సామాజిక, ఆర్థిక ప్రాతిపదికలపై కల్పించిన ప్రత్యేక హోదాలైన రావ్ బహద్దూర్, రావ్ సాహబ్, రాజా విక్రమార్క, జాగిర్దార్, ఇనాందార్, జమిందార్ మొదలగు వాటిని రద్దు చేశారు. అయితే ఈ నిషేధం విద్యా, సైనిక, విశిష్ట యోగ్యతాపరమైన బిరుదులకు వర్తించదు. ఉదాహరణకు భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ. అదే విధంగా సైనిక హోదాలైన పరమ వీరచక్ర, అశోక చక్ర, శౌర్య చక్ర, మొదలగు వాటిని ఇవ్వవచ్చు.

ప్రత్యేక వివరణ

భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ లాంటివి ప్రత్యేక పౌర పురస్కారాలేకానీ బిరుదులు కావు. వీటిని పేరుకు ముందుకానీ, పేరుకు తర్వాతకానీవాడటం, వ్యాపార కార్యక్రమాలకు వినియోగించొద్దని బాలాజీ రాఘవన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1996)లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

సినీ నటులు మోహన్‌బాబు, బ్రహ్మానందం తమ పద్మశ్రీ గుర్తింపును వ్యాపారపరంగా ఉపయోగించారనే అభియోగంతో వాటిని రద్దు చేయాలని కోర్టు సూచించింది.

ప్రధాన మంత్రులు.. పదవీ కాలం

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

జవహర్‌లాల్ నెహ్రూ	1947 - 1964
గుల్జారీ లాల్ నందా	1964 మే-జూన్
లాల్ బహదూర్ శాస్త్రి	1964 - 1966
గుల్జారీ లాల్ నందా	1966 జనవరి 11- 24
ఇందిరా గాంధీ	1966 - 1977
మొరార్జీ దేశాయ్	1977 - 1979
చరణ్ సింగ్	1979 - 1980
ఇందిరా గాంధీ	1980 - 1984
రాజీవ్ గాంధీ	1984 - 1989
విశ్వనాథ్ ప్రతాప్ సింగ్	1989 - 1990
చంద్రశేఖర్	1990 - 1991
పీవీ నరసింహారావు	1991 - 1996
అటల్ బిహారీ వాజ్‌పేయి	1996 మే 16-28,
హెచ్‌డీ దేవెగౌడ	1996 - 1997
ఐ.కె. గుజ్రాల్	1997 ఏప్రిల్ 21 - 1998 మార్చి 18
అటల్ బిహారీ వాజ్‌పేయి	1998 మార్చి 19- 1999 అక్టోబర్ 13
అటల్ బిహారీ వాజ్‌పేయి	1999 అక్టోబర్ 13 - 2004 మే
డాక్టర్ మన్మోహన్ సింగ్	2004 మే 22 - 2009 ఏప్రిల్ 21
డాక్టర్ మన్మోహన్ సింగ్	2009 మే 22 - 2014 మే
నరేంద్ర మోదీ	2014 మే 26 నుంచి..

'కనుల కొలనులో దాగిన నీ రూపం'

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

కావ్య సరస్వతికి శోభను చేకూర్చేవి అలంకారాలు. 'అలం' శబ్దానికి 'కృ' ధాతువు చేరి 'అలంకారం' అనే రూపం సిద్ధించింది. అలంకారమంటే భూషణం అని అర్థం. ఇవి కావ్య సౌందర్యాన్ని పెంపొందించి, శోభను కలిగిస్తాయి. అలంకారకులు వీటిని ప్రధానంగా శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని రెండు రకాలుగా విభజించారు. భోజుడు 'సరస్వతీ కంఠాభరణం'లో మూడు విధాలుగా పేర్కొన్నాడు. శబ్ద, అర్థాలంకాలతో పాటు ఉభయాలంకారాలను (శబ్దార్థ మిశ్రమాలు) వివరించాడు. ఆ తర్వాత మమ్మటుడు, రుయ్యకుడు, విశ్వనాథుడు, విద్యానాథుడు లాంటివారు మిశ్రాలంకారాల గురించి ప్రస్తావించారు.

అలంకారాలు

అలంకారాల్లో ప్రధానమైనవి శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు.

శబ్దాలంకారాలు

శబ్ద వైచిత్రీ రామణీయకత వల్ల కావ్యానికి సౌందర్యాన్ని చేకూర్చేవి శబ్దాలంకారాలు. సంగీతానుగుణ్యమైన శ్రవణ పేయతతో పాఠకులకు ఆహ్లాదం కలిగించేవి శబ్దాలంకారాలు. ఇవి ఆరు రకాలు.

1. వృత్త్యనుప్రాసం 2. ఛేకానుప్రాసం
3. లాటాను ప్రాసం 4. యమకం
5. ముక్తపదగ్రస్తం 6. అంత్యానుప్రాసం

1. **వృత్త్యనుప్రాసం:** ఒకటి లేదా రెండు మూడు వర్ణాలు పునరుక్తాలై ఆహ్లాదం కలిగిస్తే అది వృత్త్యనుప్రాసం.
   ఉదా: 'హరిహరి సిరియురమున గలహరి'
   ఇందులో 'ర' కారం పునరుక్తమై ఆహ్లాదం కలిగిస్తోంది. అందువల్ల ఇది వృత్త్యనుప్రాసం.
2. **ఛేకానుప్రాసం:** అర్థ భేదం ఉన్న రెండేసి హల్లులు అవ్యవధానంగా పునరుక్తమై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది ఛేకానుప్రాసం. ఛేకులంటే పండితులు అని అర్థం. ఛేకులకు ఆహ్లాదం కలిగించే అనుప్రాసం ఛేకానుప్రాసం.
   ఉదా: 'కందర్పదర్పములగు సందర దరహాస రుచులు'. ఈ లక్ష్యంలో దర్ప–దర అనే రెండేసి హల్లులు అర్థభేదంతో పునరుక్తమయ్యాయి. కాబట్టి ఇది ఛేకానుప్రాసం.
3. **లాటాను ప్రాసం:** తాత్పర్య భేదం ఉన్న శబ్దాలు పునరుక్తాలై ఆహ్లాదాన్ని కలిగిస్తే అది లాటానుప్రాసం.
   ఉదా: 'కమలాక్షునర్చించు **కరములు కరములు** శ్రీనాథు వర్ణించు **జిహ్వ జిహ్వ**'
   'కరములు', 'జిహ్వ' శబ్దాలు తాత్పర్య భేదంతో పునరుక్తాలైనందువల్ల ఇది లాటానుప్రాసం.
4. **యమకం:** సమాన స్వరసహితాలైన వ్యంజనాలు అర్థభేదంతో అవ్యవహితంగా పునరుక్తాలైతే అది యమకం.
   ఉదా: 'మన సుభద్ర మనసుభద్రమయ్యె' సుభద్ర అనే అక్షరాలు అర్థభేదంతో అవ్యవహితంగా వచ్చాయి. కాబట్టి ఇది యమకం.
5. **ముక్తపదగ్రస్తం:** మొదటి పాదం చివరి పదం రెండో పాదంలో మొదటి పదంగా రావడాన్ని ముక్తపదగ్రస్తం అంటారు. అంటే విడిచిన పదాన్ని గ్రహించడం అని అర్థం.
   ఉదా: 'సుదతీ నూతన **మదనా**
   మదనా గతురంగ పూర్ణ మణిమయసదనా'
   మొదటి పాదం చివర ఉన్న 'మదనా' పదం రెండోపాదం మొదటిపదంగా వచ్చింది. అందువల్ల ఇది ముక్తపదగ్రస్తం.
6. **అంత్యానుప్రాసం:** ప్రతి పాదం చివరన ఒకే అక్షరం లేదా పదం రావడాన్ని అంత్యాను ప్రాసం అంటారు.
   ఉదా: కమనీయశుభగా**త్రు** – కంజాతదళనే**త్రు**
   వసుధాకళ**త్రు** – పావన చరి**త్రు** 'త్రు' అనే అక్షరం పాదాల చివర వచ్చినందువల్ల ఇది అంత్యానుప్రాసం.

అర్థాలంకారాలు

అర్థ సౌందర్యం వల్ల కావ్య శోభను ద్విగుణీకృతం చేసేవి అర్థాలంకారాలు. అర్థం లేని శబ్ద సౌందర్యం ఆహ్లాదకరం కాదు. అర్థ ప్రధానమైన అలంకారాలు అర్థాలం కారాలు. వీటిలో ప్రధానమైనవి..

1. **ఉపమాలంకారం:** ఉపమాన, ఉపమేయాలకు మనోహరమైన సాదృశ్యాన్ని చెప్పడాన్ని ఉపమాలంకారం అంటారు. ఇందులో ఉపమేయం (ప్రస్తుతం), ఉపమానం (అప్రస్తుతం), సమాన ధర్మం (ఉపమేయ, ఉపమానాల్లో సమానంగా ఉండేది), ఉపమావాచకం (ఉపమేయ, ఉపమానాలకు సమాన ధర్మాన్ని సూచించేది) ఉంటాయి. వలెన్, పోలెన్, ఎంతయున్, కైవడి, భంగి, అట్లు, అనంగ మొదలైనవి ఉపమావాచకాలు. పైన పేర్కొన్న నాలుగు అంశాలుంటే దాన్ని పూర్ణోపమాలంకారం అంటారు. ఏదైనా ఒక అంశం లోపిస్తే దాన్ని లుప్తోపమాలంకారం అంటారు.
   భరతుడు ఉపమాలంకారంలో ఐదు భేదాలను చెప్పాడు. మమ్మటుడు లాంటి ఆలంకారకులు 25 భేదాలను పేర్కొన్నారు. దండి 32 భేదాలను చెప్పాడు. చంద్రాలోకకర్త చెప్పిన ఏడు భేదాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.
   అలంకారాల్లో ప్రసిద్ధమైంది, ప్రాచీన మైంది ఉపమాలంకారం. దీన్ని ప్రయోగించని కవులు లేరు. కాళిదాసు లాంటి సంస్కృత కవులు విరివిగా ఉపయోగించారు. అందుకే 'ఉపమా కాళిదాసస్య' అనే నానుడి ప్రసిద్ధమైంది.
   లక్ష్యం:
   ఓ కృష్ణా! నీ కీర్తి హంసవలె ఆకాశ
   గంగయందు మునుగుచున్నది
   ఉపమేయం = కీర్తి, ఉపమానం = హంస,
   'ఆకాశగంగయందు మునుగుట' ఉపమేయ ఉపమానాలు రెండింటిలో ఉన్నందువల్ల ఇది సమాన ధర్మం. ఉపమావాచకంలా ఇందులో నాలుగు అంశాలున్నందువల్ల ఇది 'పూర్ణోపమ అలంకారం'.
2. **ఉత్ప్రేక్షాలంకారం:** జాతి, గుణ, ధర్మ సామ్యం వల్ల ఉపమేయాన్ని ఉపమానంగా ఊహిస్తే అది ఉత్ప్రేక్షాలంకారం. ఇందులో ఉపమేయ ఉపమానాలతోపాటు ఉత్ప్రేక్షా వాచకం ఉంటుంది. తలంచెదన్, ఎంచెదన్, భావించెదన్, ఊహించెదన్, అనన్ మొదలైనవి ఉత్ప్రేక్షా వాచకాలు.
   లక్ష్యం: "ఈ చీకటిని చక్రవాక విరహాగ్ని నుండి పుట్టిన ధూమమో అని తలంతును''
   ఇందులో చీకటి ఉపమేయం, ధూమం ఉపమానం. ధూమం నల్లనిది, దృష్టిని ఆపుచేసేది. ఈ గుణసామ్యం వల్ల ఉపమేయమైన చీకటిని ఉపమానమైన ధూమంగా ఊహించారు. కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం.
   రూపకాలంకారం: ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపించడం లేదా ఉపమేయ ఉపమానాలకు భేదం లేనట్లుగా వర్ణించడం రూపకాలంకారం. ఇందులో రూపక సమాసం కూడా ఉంటుంది.
   లక్ష్యం: రాజుపై **లతాలలనలు కుసుమాక్షతలు** చల్లిరి. ఇందులో ఉపమేయమైన లతల్లో ఉపమానమైన లలనల ధర్మం ఆరోపించారు. ఉపమేయమైన కుసుమాల్లో ఉపమానమైన అక్షతల ధర్మాన్ని ఆరోపించారు. కాబట్టి ఇది రూపకాలంకారం.
4. **అనన్వయాలంకారం:** ఒక వస్తువు సాటి లేనిది అని చెప్పడానికి అదే వస్తువుతో పోల్చడాన్ని అనన్వయాలంకారం అంటారు. ఇందులో ఉపమేయమే ఉపమానంగా ఉంటుంది.
   లక్ష్యం:
   'మేరునగానికి సాటి మేరునగమే
   సముద్రానికి సాటి సముద్రమే'
   ఇందులో ఉపమేయమైన మేరునగమే ఉపమానంగా ఉంది. ఉపమేయమైన సముద్రమే ఉపమానంగా ఉంది. అందువల్ల ఇది అనన్వయాలంకారం.
5. **స్వభావోక్తి:** జాతి, గుణక్రియాదులను సహజ సిద్ధంగా, మనోహరంగా వర్ణించడాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు.
   లక్ష్యం: ''ఉద్యానవనంలో జింకలు చెవులు రిక్కించి చంచల నేత్రాలతో సరోవరంలో నీళ్లు త్రాగుచున్నవి'' ఇందులో జింకల స్థితిని మనోహరంగా, సహజసిద్ధంగా వర్ణించారు. అందువల్ల ఇది స్వభావోక్తి.
6. **అర్థాంతరన్యాసాలంకారం:**
   విశేషాన్ని సామాన్యంతో లేదా సామాన్యాన్ని విశేషంతో సమర్థించి వర్ణిస్తే.. అది అర్థాంతరన్యాసాలంకారం.
   లక్ష్యం: 1
   ''ఆంజనేయుడు సముద్రాన్ని దాటాడు
   మహాత్ములకు అసాధ్యమైంది లేదు కదా!''
   ఆంజనేయుడు సముద్రాన్ని దాటడం విశేష విషయం. మహాత్ములకు సాధ్యం కానిది లేదు అనే సామాన్య విషయంతో సమర్థించినందువల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.
   లక్ష్యం: 2
   పూలతో కూడిన నారకు వాసన కలిగినట్లు
   సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి.
   పూలతో కూడిన నారకు వాసన కలగడం సామాన్య విషయం. సజ్జన సాంగత్యం వల్ల సర్వశ్రేయాలు కలుగుతాయి అనే విశేష విషయంతో దీన్ని సమర్థించడం వల్ల ఇది అర్థాంతరన్యాస అలంకారం.
7. **అతిశయోక్తి అలంకారం:** లోకస్థితిని మించి అతిశయించి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం.
   లక్ష్యం: ఆ పట్టణమందలి సౌధాలు చంద్ర మండలాన్ని తాకుచున్నవి. సహజస్థితిని మించి వర్ణించడం వల్ల ఇది అతిశయోక్తి.
8. **శ్లేషాలంకారం:** అనేక అర్థాలకు ఆశ్రయ మైంది శ్లేషాలంకారం. చమత్కారమైన పదాల విరుపులతో అనేక అర్థాల వల్ల అహ్లాదం కలిగించేది శ్లేష.
   లక్ష్యం: 'రాజు కువల యానందకరుడు'
   ఇందులో రాజు శబ్దానికి పాలకుడు, చంద్రుడు అని; 'కువలయం' పదానికి భూమి, కలువ అనే అర్థాలున్నాయి. రాజు భూ ప్రజలకు సుపరిపాలనతో ఆనందం కలిగించేవాడని ఒక అర్థం. చంద్రుడు కలువలను వికసింపజేసి ఆనందం కలిగించే వాడని మరో అర్థం ఉన్నందువల్ల ఇది శ్లేషాలంకారం.
9. **సమాసోక్తి అలంకారం:** ప్రస్తుత వర్ణన వల్ల అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి అలంకారం.
   లక్ష్యం: చంద్రుడు రక్తుడై ఐంద్రీముఖమును ముద్దిడుచున్నాడు. ప్రస్తుత వర్ణన వల్ల పరకాంతా చుంబనాభిలాషియైన కాముకుడు స్ఫురిస్తున్నందువల్ల ఇది సమాసోక్తి అలంకారం.
10. **దీపకాలంకారం:** ఉపమేయ ఉపమా నాలకు (ప్రకృత, అప్రకృతాలకు) సాధారణ ధర్మంతో ఒకే అన్వయాన్ని కలిగిస్తే అది దీపకాలంకారం.
    లక్ష్యం: ''బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం, పండిత వాక్యం వ్యర్థం కాబోవు''
    పండిత వాక్యం వ్యర్థం కాదు అనే ఉపమేయంతో బ్రహ్మ రాత, విష్ణు చక్రం, ఇంద్రుడి వజ్రాయుధం లాంటి ఉపమే యాలను అన్వయించి చెప్పారు. అందువల్ల ఇది దీపకాలంకారం.



మాదిరి ప్రశ్నలు

1. 'రక్షాదక్ష! విపక్ష శిక్షా' ఏ అలంకారం?
   1) ఛేకానుప్రాసం 2) వృత్త్యనుప్రాసం
   3) లాటానుప్రాసం 4) యమకం
2. 'మన సుభద్ర మనసుభద్రమయ్యె' ఇందులోని అలంకారం?
   1) ముక్తపదగ్రస్తం 2) లాటానుప్రాసం
   3) యమకం 4) అంత్యానుప్రాసం
3. 'శేషశాయికి మ్రొక్కు శిరముశిరము'లోని అలంకారం?
   1) లాటానుప్రాసం 2) యమకం
   3) ఛేకానుప్రాసం 4) వృత్త్యనుప్రాసం
4. 'కమనీయ శుభగాత్రు – కంజాత దళనేత్రు వసుధాకళత్రు – పావన చరిత్రు' లోని అలంకారం?
   1) వృత్త్యనుప్రాసం 2) లాటానుప్రాసం
   3) అంత్యానుప్రాసం 4) యమకం
5. యమకాలంకార లక్షణం?
   1) అచ్చులు మారతాయి, హల్లులు మారవు
   2) అచ్చులు మారవు, హల్లులు మారవు
   3) అచ్చులు మారకూడదు, హల్లులు మారతాయి
   4) అచ్చులు మారవచ్చు, హల్లులు మారవచ్చు
6. ఉభయాలంకారాలను మొదటగా పేర్కొన్న లాక్షణికుడు?
   1) మమ్మటుడు 2) విశ్వనాథుడు
   3) భోజుడు 4) విద్యానాథుడు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 3;
5) 2; 6) 3.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విశేషాంశం-సామాన్యం అనే రెండింటితో ప్రవర్తించే అలంకారం?
   1) రూపకం 2) వ్యాజస్తుతి
   3) ఉత్ప్రేక్ష 4) అర్థాంతరన్యాసం
2. 'రాజ బింబాస్య రుక్మిణి తేజరిల్లె సానబట్టిన మకరాంకు శస్త్రమనగ'లోని అలంకారం?
   1) ఉపమ 2) ఉత్ప్రేక్ష
   3) రూపకం 4) అర్థాంతరన్యాసం
3. 'కనుల కొలనులో దాగిన నీ రూపం' అనేది?
   1) యమకాలంకారం 2) అతిశయోక్తి
   3) రూపకాలంకారం 4) ఉత్ప్రేక్ష


సమాధానాలు: 1) 4; 2) 1; 3) 3.

జీవ వైవిధ్య ప్రాంతమైన 'సైలెంట్ వ్యాలీ' ఏ రాష్ట్రంలో ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ



మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో 'ట్రిపియన్ నైసర్గిక స్వరూపం'గా దేన్ని అభివర్ణిస్తారు?
   1) దక్కన్ పీఠభూమి
   2) ఉత్తర మైదానాలు
   3) పశ్చిమ కనుమలు
   4) తూర్పు కనుమలు
2. హరిశ్చంద్ర కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   1) మహారాష్ట్ర 2) గుజరాత్
   3) ఛత్తీస్‌గఢ్ 4) అస్సాం
3. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) అజంతా గుహలు - మహారాష్ట్ర
   2) బాబు బుడాన్ కొండలు - అస్సాం
   3) పళని కొండలు - తమిళనాడు
   4) వావుల్ మలై శిఖరం - కర్ణాటక
4. నీలగిరి కొండల్లో ఎత్తైన శిఖరం ఏది?
   1) అనైముడి 2) ఉదక మండలం
   3) దొడబెట్ట 4) కల్సూబాయ్
5. పశ్చిమ కనుమలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఇవి ఉత్తరాన తపతి నది నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్నాయి
   2) తూర్పు కనుమలతో పోలిస్తే వీటి ఎత్తు తక్కువ
   3) ఇవి పీఠభూమి వైపు కంటే అరేబియా సముద్రం వైపు అధికంగా వాలి ఉంటాయి
   4) ఇవి సుమారు 1600 కి.మీ. పొడవు విస్తరించి ఉన్నాయి
6. జీవ వైవిధ్య ప్రాంతమైన 'సైలెంట్ వ్యాలీ' ఏ రాష్ట్రంలో ఉంది?
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) పశ్చిమ బెంగాల్
7. దక్షిణ భారతదేశంలో అత్యంత ఎత్తైన రాష్ట్రం ఏది?
   1) మహారాష్ట్ర 2) తెలంగాణ
   3) గోవా 4) కర్ణాటక
8. 'దిల్వారా దేవాలయం' ఏ పర్వతాల్లో ఉంది?
   1) వింధ్య పర్వతాలు
   2) సాత్పూర పర్వతాలు
   3) సహ్యాద్రి పర్వతాలు
   4) ఆరావళి పర్వతాలు
9. పశ్చిమ కనుమల్లో, ద్వీపకల్ప పీఠభూమిలో అతి ఎత్తైన శిఖరం ఏది?
   1) గురుశిఖర్ 2) అనైముడి
   3) సారమతి 4) దూప్‌గఢ్
10. అనైముడి శిఖరం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) కర్ణాటక 2) కేరళ
    3) తమిళనాడు 4) మహారాష్ట్ర
11. పర్వతాలు, ఎత్తైన శిఖరాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    1) ఆరావళి పర్వతాలు - గురుశిఖర్
    2) అన్నామలై కొండలు - అనైముడి
    3) సాత్పూర శ్రేణులు - దూప్‌గఢ్
    4) రాజమహల్ కొండలు - సారమతి
12. సాత్పూర శ్రేణులు ఏయే నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
    1) నర్మద, సోన్ 2) నర్మద, తపతి
    3) నర్మద, చంబల్ 4) తపతి, చంబల్
13. 'గ్రానరీ ఆఫ్ కేరళ' అని పిలిచే కనుమ ఏది?
    1) బోర్ ఘాట్ 2) థాల్ ఘాట్
    3) బాల్ ఘాట్ 4) పాల్ ఘాట్
14. కొడైకెనాల్ వేసవి విడిది కేంద్రం ఏ కొండల్లో ఉంది?
    1) పళని కొండలు 2) నీలగిరి కొండలు
    3) అన్నామలై కొండలు
    4) ఇలైమలై కొండలు
15. వింధ్య పర్వతాలు, సాత్పూర పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
    1) తపతి 2) నర్మద
    3) సోన్ 4) చంబల్
16. సాత్పూర, అంజతా పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
    1) తపతి 2) నర్మద
    3) సబర్మతి 4) గోదావరి
17. మౌంట్ అబూ వేసవి విడిది కేంద్రం ఏ పర్వతాల్లో ఉంది?
    1) సాత్పూర పర్వతాలు
    2) వింధ్య పర్వతాలు
    3) సహ్యాద్రి పర్వతాలు
    4) ఆరావళి పర్వతాలు
18. 'రూఫ్ ఆఫ్ ది సౌత్' అని ఏ రాష్ట్రాన్ని పిలుస్తారు?
    1) తెలంగాణ 2) ఆంధ్రప్రదేశ్
    3) ఛత్తీస్‌గఢ్ 4) కర్ణాటక
19. భారతదేశాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించే పర్వత శ్రేణులు ఏవి?
    1) ఆరావళి పర్వతాలు
    2) పశ్చిమ కనుమలు
    3) వింధ్య, సాత్పూర పర్వతాలు
    4) సహ్యాద్రి పర్వతాలు
20. 'క్వీన్ ఆఫ్ హిల్ స్టేషన్స్' అని దేన్ని పిలుస్తారు?
    1) మౌంట్ అబూ 2) ఊటీ
    3) కొడైకెనాల్ 4) పచ్‌మరి
21. పచ్‌మరి వేసవి విడిది కేంద్రం ఏ కొండల్లో ఉంది?
    1) మహాదేవ్ కొండలు
    2) కైమోర్ శ్రేణులు
    3) రాజమహల్ కొండలు
    4) పళని కొండలు
22. పశ్చిమ కనుమలు, తూర్పు కనుమలు ఎక్కడ కలుసుకుంటాయి?
    1) కార్డయమ్ 2) షెవరాయ్
    3) పళని 4) నీలగిరి
23. మైకాల్ పర్వత శ్రేణి ఎక్కడ వ్యాపించి ఉంది?
    1) రాజస్థాన్ 2) తమిళనాడు
    3) హరియాణా 4) ఛత్తీస్‌గఢ్
24. భారత ద్వీపకల్పంలో 'సహ్యాద్రి పర్వత శ్రేణి' అని పిలిచే పర్వత శ్రేణి ఏది?
    1) పశ్చిమ కనుమలు
    2) నీలగిరి పర్వతాలు
    3) తూర్పు కనుమలు
    4) సాత్పూర పర్వతాలు
25. షెవరాయ్ పర్వతాలు ఏ రాష్ట్రంలో విస్తరించి ఉన్నాయి?
    1) కేరళ 2) కర్ణాటక
    3) తమిళనాడు 4) గుజరాత్
26. హిమాలయ పర్వత వ్యవస్థ ఏ యుగానికి చెందింది?
    1) పూర్వ కేంబ్రియన్
    2) పేలియోజోయిక్ 3) మీసోజోయిక్
    4) టెర్షియరీ
27. ఉత్కళ మైదానంలో ఉన్న ప్రముఖ డెల్టా ఏది?
    1) పెన్నా 2) కావేరి
    3) మహానది 4) గంగానది
28. జతపరచండి.


తీరం	రాష్ట్రం
i. సర్కార్ తీరం	a. పశ్చిమ బెంగాల్
ii. వంగ తీరం	b. ఒడిశా
iii. కోరమాండల్ తీరం	c.ఆంధ్రప్రదేశ్
vi. ఉత్కళ తీరం	d. తమిళనాడు

    1) 1-b, ii-c, iii-d, iv-a
    2) 1-c, ii-b, iii-d, iv-a
    3) 1-c, ii-a, iii-b, iv-d
    4) 1-c, ii-a, iii-d, iv-b
29. దివైర్, దేసూరి, పిప్లిఘాట్ తదితర కనుమలు ఏ పర్వత శ్రేణుల్లో ఉన్నాయి?
    1) పశ్చిమ కనుమలు
    2) తూర్పు కనుమలు
    3) ఆరావళి పర్వతాలు
    4) వింధ్య, సాత్పూర పర్వతాలు
30. థాల్‌ఘాట్, బోర్‌ఘాట్, పాల్‌ఘాట్ తదితర కనుమలు ఏ పర్వతాల్లో ఉన్నాయి?
    1) వింధ్య పర్వతాలు 2) సాత్పూర శ్రేణులు
    3) పశ్చిమ కనుమలు 4) తూర్పు కనుమలు
31. కల్సూబాయ్ శిఖరం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మహారాష్ట్ర 2) కేరళ
    3) కర్ణాటక 4) తమిళనాడు
32. కేరళలో నీలగిరి కొండల తర్వాత విస్తరించి ఉన్న పశ్చిమ కనుమలను ఏమంటారు?
    1) బాబు బుడాన్ కొండలు
    2) ఇలైమలై పర్వతాలు
    3) పంచమలై కొండలు
    4) కైమూర్ పర్వత శ్రేణి
33. కింది వాటిలో అతి పురాతన ముడుత పర్వతాలు ఏవి?
    1) హిమాలయాలు
    2) ఆరావళి పర్వతాలు
    3) పశ్చిమ కనుమలు
    4) వింధ్య పర్వతాలు
34. 'గౌరీ శంకర్' శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?
    1) హిమాలయాలు
    2) సహ్యాద్రి పర్వతాలు
    3) తూర్పు కనుమలు
    4) సాత్పూర పర్వతాలు
35. భారతదేశంలోనే ఎత్తైన జోగ్/జొరసొప్పా' జలపాతం ఏ నదిపై ఉంది?
    1) కావేరి నది 2) శివసముద్రం
    3) జోగ్ నది 4) శరావతి
36. తూర్పు కనుమలు ఏ శిలలతో ఏర్పడ్డాయి?
    1) బసాల్ట్, నీస్ 2) గ్రానైట్, బసాల్ట్
    3) ఖొండాలైట్, షిస్ట్
    4) ఖొండాలైట్, చార్నోకైట్
37. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) మెరీనా బీచ్ - తమిళనాడు
    2) కోవలం బీచ్ - కేరళ
    3) మైపాడు బీచ్ - ఆంధ్రప్రదేశ్
    4) గంగాసాగర్ బీచ్ - గుజరాత్
38. కింది వాటిలో తమిళనాడుకు చెందని కొండలు ఏవి?
    1) జవ్వాది కొండలు
    2) మైకాల పర్వతాలు
    3) గొండుమలై కొండలు
    4) పంచమలై కొండలు
39. కేరళలోని తీరాన్ని ఏమంటారు?
    1) కెనరా తీరం 2) కొంకణ్ తీరం
    3) మలబార్ తీరం 4) చోళ తీరం
40. అష్టముడి, వెంబనాడ్ సరస్సులు ఏ తీరంలో ఉన్నాయి?
    1) కోరమండల్ 2) కొంకణ్
    3) మలబార్ 4) వంగ
41. ఆటుపోటులకు ప్రసిద్ధి చెందిన మైదానం?
    1) ఉత్కళ మైదానం
    2) గుజరాత్ మైదానం
    3) కొంకణ్ మైదానం
    4) కేరళ మైదానం
42. మహారాష్ట్రలోని తీర మైదానాన్ని ఏమని పిలుస్తారు?
    1) మలబార్ మైదానం
    2) వంగ మైదానం 3) కొంకణ్ మైదానం
    4) రాణ్ ఆఫ్ కచ్ మైదానం
43. లాగూన్‌లు, కాయల్స్‌కు ప్రసిద్ధి చెందిన తీరం ఏది?
    1) మలబార్ తీరం 2) ఉత్కళ తీరం
    3) కొంకణ్ తీరం 4) వంగ తీరం
44. దక్కన్ పీఠభూమికి, కొంకణ్ మైదానానికి మధ్య ఉన్న ముఖ్యమైన దారులు ఏవి?
    1) థాల్‌ఘాట్, పాల్‌ఘాట్
    2) పాల్‌ఘాట్, షెన్‌కోట్టై ఖాళీ ప్రదేశం
    3) పాల్‌ఘాట్, బోర్‌ఘాట్
    4) బోర్‌ఘాట్, థాల్‌ఘాట్
45. మహారాష్ట్రలో అతి ఎత్తైన గిరి విహార స్థలం ఏది?
    1) పంచ్‌గని 2) మహాబలేశ్వర్
    3) మతేరాన్ 4) చికల్‌ధానా
46. మలబార్ తీరంలోని వెనక జలాలను ఏమని పిలుస్తారు?
    1) కార్స్ 2) ధరియన్
    3) కాయల్స్ 4) కోస్
47. కళింగ తీర మైదానం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
    1) పశ్చిమ బెంగాల్ 2) ఆంధ్ర ప్రదేశ్
    3) ఒడిశా 4) కర్ణాటక
48. కింది వాటిలో తూర్పు కనుమలకు చెందని కొండలు ఏవి?
    1) పంచమలై కొండలు
    2) షెవరాయ్ కొండలు
    3) పాల కొండలు 4) పళని కొండలు
49. 'నిమజ్జిత తీరం' అని దేన్ని పిలుస్తారు?
    1) రాణ్ ఆఫ్ కచ్ తీరం
    2) కోరమండల్ తీరం
    3) మలబార్ తీరం 4) కొంకణ్ తీరం
50. బసాల్ట్ నేలలకు ప్రసిద్ధి చెందిన తీర మైదానం ఏది?
    1) కొంకణ్ మైదానం 2) కెనరా మైదానం
    3) మలబార్ మైదానం 4) వంగ మైదానం
51. యాలకుల కొండలు ఏ రాష్ట్రంలో విస్తరించి ఉన్నాయి?
    1) కర్ణాటక 2) గోవా
    3) కేరళ 4) మహారాష్ట్ర
52. పశ్చిమ కనుమలు.. నీలగిరి కొండలను ఏ ప్రాంతంలో కలుస్తాయి?
    1) గూడూరు 2) గుడలూరు
    3) కొడైకెనాలు 4) కన్యాకుమారి
53. దక్కన్ పీఠభూమి ప్రాంతంలో లభించే ముఖ్యమైన మృత్తిక ఏది?
    1) జేగురు మృత్తికలు
    2) ఒండ్రు మృత్తికలు
    3) ఊబి మృత్తికలు
    4) నల్లరేగడి మృత్తికలు
54. ఎర్ర మృత్తికల్లో ఏ మూలకం ఉండటం వల్ల అవి ఎరుపు రంగులో కనిపిస్తాయి?
    1) పొటాషియం ఆక్సైడ్
    2) ఐరన్ ఆక్సైడ్
    3) మెగ్నీషియం ఆక్సైడ్
    4) నైట్రోజన్ ఆక్సైడ్
55. రూపాంతర ప్రాప్తి శిలలు శైథిల్యం చెందడం వల్ల ఏర్పడిన మృత్తికలు ఏవి?
    1) నల్లరేగడి మృత్తికలు
    2) ఒండ్రు మృత్తికలు 3) ఎర్ర మృత్తికలు
    4) లాటరైట్ మృత్తికలు
56. నదీలోయకు దూరంగా ఉండే పురాతన సారవంతమైన నేలలను ఏమని పిలుస్తారు?
    1) టెరాయి 2) భంగర్
    3) భాబర్ 4) కంకర్
57. పత్తి పంటకు ప్రసిద్ధి చెందిన మృత్తికలు ఏవి?
    1) ఎర్ర మృత్తికలు
    2) లాటరైట్ మృత్తికలు
    3) అటవీ మృత్తికలు
    4) నల్లరేగడి మృత్తికలు
58. లాటరైట్ మృత్తికలకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
    1) వీటిని జేగురు నేలలు అని కూడా పిలుస్తారు
    2) ఇవి అధిక ఉష్ణోగ్రత, అత్యధిక వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఏర్పడతాయి
    3) ఈ మృత్తికలు అల్యూమినియం, బసాల్ట్‌లు ఉన్న శిలలు శైథిల్యం చెందడం వల్ల ఏర్పడతాయి
    4) పైవన్నీ సరైనవే
59. బసాల్ట్ శిల విచ్ఛిన్నం చెందడం వల్ల ఏర్పడిన నేలలు ఏవి?
    1) నల్లరేగడి నేలలు 2) లాటరైట్ నేలలు
    3) ఎర్ర నేలలు 4) శుష్క నేలలు
60. భారతదేశంలోని 'నల్ల రేగడి భూమి' ఏ సముదాయానికి చెందింది?
    1) ఒండలి 2) లాటరైట్
    3) పోడ్జల్ 4) చెర్నోజెమ్
61. 'భారతదేశ ధాన్యాగారాలు' అని ఏ నేలలను పిలుస్తారు?
    1) నల్లరేగడి నేలలు
    2) ఒండ్రుమట్టి నేలలు
    3) జేగురు నేలలు 4) ఎర్ర నేలలు
62. ఎర్ర మృత్తికలకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలు ఏవి?
    ఎ) ఈ మృత్తికల్లో పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ ఆక్సైడ్‌లాంటి మూలకాలు అత్యధికంగా ఉంటాయి
    బి) ఇవి గాలి పారేటట్లుగా ఉంటాయి
    ఎ) ఈ మృత్తికల్లో నత్రజని, ఫాస్ఫారిక్ ఆమ్లం, సేంద్రియ పదార్థాలు తక్కువగా ఉంటాయి
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి

సమాధానాలు

1) 3 2) 1 3) 2 4) 3 5) 2
6) 1 7) 4 8) 4 9) 2 10) 2
11) 4 12) 2 13) 4 14) 1 15) 2
16) 1 17) 4 18) 4 19) 3 20) 2
21) 1 22) 4 23) 4 24) 1 25) 3
26) 4 27) 3 28) 4 29) 3 30) 3
31) 1 32) 2 33) 2 34) 1 35) 4
36) 4 37) 4 38) 2 39) 3 40) 3
41) 2 42) 3 43) 1 44) 4 45) 2
46) 3 47) 3 48) 4 49) 3 50) 1
51) 3 52) 2 53) 4 54) 2 55) 3
56) 2 57) 4 58) 4 59) 1 60) 4
61) 2 62) 4

Nilesh is from which country?



BANK EXAMS

Reasoning

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Following are the criteria for selection of an officer in ITC.

The candidate must:

i) Have passed HSC examination in first class with at least 60% marks.

ii) Have passed graduation degree in any discipline with at least 55% marks.

iii) Have completed a certificate / diploma / degree course in Computer Science.

iv) Be not less than 21 years or more than 30 years of age as on 01.07.2014

If a candidate satisfies all the above mentioned criteria

except-

(a) At (ii) above but is a postgraduate, the case may be referred to the Executive Director (ED).

(b) At (iii) above but studied Computer Science as one of the subjects of curriculum, the case may be referred to the Vice President (VP).

In each of the following question below, information of one candidate is given. You have to take one of the following five decisions based on the information provided and the criteria and conditions given above. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 01.07.2014. You have to indicate your decision by making to each question as follows: Give answer

1) If the case is to be referred to ED.
2) If the case is to be referred to VP.
3) If the candidate is to be selected.
4) If the candidate is not selected.
5) If the information is inadequate to take a decision.

1. Ruhi is B.Com graduate passed in second class with 56% marks. She had passed HSC in second class with 59% marks. She has also completed a Computer diploma with 56% marks. Her date of birth is 11.05.1988.
2. Rohit is Bsc with Computer science passed in second class with 58% marks. He had passed HSC examination in first class with 76% marks. He completed 25 years of age in December 2013.
3. Joseph has passed BMS degree examination in second class with 58% marks and HSC in first class with 65% marks. He has completed a diploma in Computer Science. He completed 25 years of age in November 2013.
4. Karthik is a BA passed with 63% marks. He had passed HSC examination with 69% marks. He has also completed a certificate course in Computer Science with 'A' grade. His date of birth is 23.09.1990.
5. Osheen is a science graduate passed in 2012 with 47% at the age of 22 years. She has scored 64% marks in HSC. She has also passed MSC with 58% marks. She has done a certificate course in Computers.

Directions (Q. No. 6-10): Study the given information carefully to answer the given questions:

Seven participants Amit, Arjun, Deepak, Hari, Gaurav, Nilesh and Pawan from seven different countries, viz. Algeria, Australia, Belize, Brazil, Bulgaria, Cuba and Fiji, but not necessary in the same order, participate in a dance competition. All of them perform seven different dance style, viz Chhau, Bush, Brukdown, Samba, Horo, Rumba and Gavotte.

The one who perform Brukdown does not belong to Bulgaria. Arjun is from Belize and does not perform Samba. The one who is from Brazil performs Chhau. The one who is from Australia performs neither Samba nor Horo. Amit is from Fiji. Gaurav is from Algeria and perform Rumba dance. Deepak performs Gavotte but he is neither from Cuba nor from Bulgaria. Hari perform Bush and Pawan performs Brukdown.

6. Who performs Samba?
   1) Nilesh 2) Pawan
   3) Gaurav 4) Amit
   5) Deepak
7. Which of the following combination is true?
   1) Algeria - Bush
   2) Bulgaria - Horo
   3) Cuba - Brukdown
   4) Cuba - Rumba
   5) Other than given options
8. Arjun performs which of the following dance?
   1) Samba 2) Chhau 3) Horo
   4) Rumba 5) Gavotte
9. Who is from Australia?
   1) Nilesh 2) Deepak 3) Amit
   4) Pawan 5) Hari
10. Nilesh is from which country?
    1) Algeria 2) Belize
    3) Fiji 4) Brazil
    5) Cannot be determined

Directions (Q. 11-16): Study the following information carefully and answer the question given below:

Eight people P, Q, R, S, T, U, V and W are sitting around a circular table, facing the centre. Each of them is drinking different beverages - Tea, Coffee, Juice, Mineral Water, Lemonade, Cola, Coconut Water and Milk, but not necessarily in the same order. Q is sitting second to the left of U. The person drinking milk is an immediate neighbour of U. Only one person sits between the person drinking mineral water and P. The person drinking coffee is on the immediate right of the person drinking mineral water. W is second to the right of U. S is drinking milk. R and T are immediate neighbours. Neither R nor T is drinking mineral water. The person drinking lemonade is on the immediate left of Q. The person drinking cola is second to the right of person drinking coffee. The person drinking coconut water is an immediate neighbour of the person drinking mineral water. R is second to the right of the person drinking tea.

11. Who is second to the right of P?
    1) Q 2) R 3) S 4) T 5) U
12. Who among the following is drinking coconut water?
    1) Q 2) V 3) W 4) U 5) T
13. What is the position of V with respect to the person drinking milk?
    1) Third to the left
    2) Second to the right
    3) Second to the left
    4) Third to the right
    5) Immediate right
14. Four of the following five are alike in a certain way based on the given arrangement and hence form a group. Which of the following does not belong to the group?
    1) Tea - S 2) Juice - W
    3) Mineral water - T
    4) Lemonade - V 5) Cola - U
15. Which of the following person is drinking tea?
    1) P 2) R 3) T 4) V 5) W
16. Which of the following statements is true according to the given arrangement?
    1) The person drinking cola is sitting second to the left of the person drinking Juice.
    2) P is an immediate neighbour of the person drinking Lemonade.
    3) S sits exactly between Q and R.
    4) Only four people sit between W and Q.
    5) All of the given statements are true.

Answers with Explanation:

(1-5)

Candidate	i	ii/a	iii/b	iv
Ruhi	×	√	√	√
Rohit	√	√	√	√
Joseph	√	√	√	√
Karthik	√	√	√	√
Osheen	√	(√)	√	√


1) 4; 2) 3; 3) 3; 4) 3; 5) 1.

(6-10)

Participant	Country	Dance Style
Hari	Bulgaria	Bush
Arjun	Belize	Horo
Nilesh	Brazil	Chhau
Gaurav	Algeria	Rumba
Pawan	Cuba	Brukdown
Amit	Fiji	Samba
Deepak	Australia	Gavotte

6) 4; 7) 3; 8) 3; 9) 2; 10) 4.

(11-16)



11) 2; 12) 4; 13) 2;
14) 3; 15) 1; 16) 1.